
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+4 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 302
మంగళవారం 23-1-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

వరుసగా నాలుగవ ఏడాది..

"వైఎస్సార్ ఆసరా"

వైఎస్సార్ ఆసరా మైలు రాళ్లు

మొదటి విడత – 11 సెప్టెంబర్ 2020
అందించిన లబ్ధి రూ. 6,318.76 కోట్లు
లబ్ధిదారుల సంఖ్య 77,87,295

రెండవ విడత – 7 అక్టోబర్ 2021
అందించిన లబ్ధి రూ. 6,439.52 కోట్లు
లబ్ధిదారుల సంఖ్య 78,75,539

మూడవ విడత – 25 మార్చి 2023
అందించిన లబ్ధి రూ. 6,417.69 కోట్లు
లబ్ధిదారుల సంఖ్య 78,94,169

నాల్గవ విడత – 23 జనవరి 2024
అందించిన లబ్ధి రూ. 6,394.83 కోట్లు
లబ్ధిదారుల సంఖ్య 78,94,169

వైఎస్సార్ ఆసరా ద్వారా 4 విడతల్లో అందించిన మొత్తం లబ్ధి రూ. 25,571 కోట్లు

గత 56 నెలల్లో మహిళా సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక చర్యలు..

జగనన్న అమ్మ ఒడి
...బతుకులు మార్చే గుడి

1 నుండి ఇంటర్ వరకు పిల్లలను బడికి పంపే ప్రతి పేద తల్లికి ఏటా రూ. 15,000 ఆర్థిక సాయం..

ఇప్పటి వరకు అందించిన లబ్ధి : రూ. 26,067 కోట్లు
లబ్ధిదారులు : 44,48,865

వైఎస్సార్ సంపూర్ణ పోషణ..
వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్

ఏటా రూ. 2,200 కోట్ల వ్యయంతో గర్భవతులు, బాలింతలు, 6 నెలల నుండి 6 ఏళ్ల వయస్సు పిల్లలకు సంపూర్ణ పౌష్టికాహారం.. గిరిజన ప్రాంతాల్లో సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా..

ఇప్పటి వరకు కేవలం అక్క చెల్లెమ్మలకు మాత్రమే అందించిన లబ్ధి : రూ. 2,992 కోట్లు
లబ్ధిదారులు : 15,35,390

"వైఎస్సార్ చేయూత"

45 నుండి 60 ఏళ్ల మధ్య వయస్సు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో అదే అక్కచెల్లెమ్మలకు రూ. 75,000 అందిస్తూ వారికి జీవనోపాధి అవకాశాలు కూడా కల్పించి వారి కాళ్లపై వారు నిలబడేలా తోడ్పాటు..

ఇప్పటి వరకు అందించిన లబ్ధి : రూ. 14,129 కోట్లు
లబ్ధిదారులు : 26,39,703

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు

పేద అక్కచెల్లెమ్మల సొంత ఇంటి కలను సాకారం చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 31.19 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఉచితంగా ఇళ్ల స్థలాల పంపిణీ, 22 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం.. అక్కచెల్లెమ్మలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా వారి పేరు మీదే ఇళ్ల పట్టాలు, ఇళ్లు..

ప్రతి అక్కచెల్లెమ్మకు ప్రాంతాన్ని బట్టి రూ. 5 లక్షల నుండి రూ. 15 లక్షల వరకు లబ్ధి.. అక్కచెల్లెమ్మల చేతుల్లో రూ. 2 లక్షల కోట్ల నుండి రూ. 3 లక్షల కోట్ల వరకు సంపద..



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

"వైఎస్సార్ ఆసరా"

పొదుపు సంఘాల్లోని అక్కచెల్లెమ్మలు 2019 ఎన్నికల నాటికి బ్యాంకులకు చెల్లించాల్సిన రూ. 25,571 కోట్ల రుణాన్ని తామే ఇస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన మాటను సంపూర్ణంగా నెరవేరుస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా 7,98,395 పొదుపు సంఘాల్లోని అక్కచెల్లెమ్మలకు

ఇప్పటి వరకు అందించిన లబ్ధి : రూ. 25,571 కోట్లు
లబ్ధిదారులు : 78,94,169

"వైఎస్సార్ కాపు నేస్తం"

45 నుండి 60 ఏళ్ల మధ్య వయస్సు గల కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల్లోని పేద అక్కచెల్లెమ్మలకు ఏటా రూ. 15,000 చొప్పున 5 ఏళ్ళలో రూ. 75,000 ఆర్థిక సాయం..

ఇప్పటి వరకు అందించిన లబ్ధి : రూ. 2,029 కోట్లు
లబ్ధిదారులు : 3,57,844

"వైఎస్సార్ సున్నా వడ్డీ"

పొదుపు సంఘాల ద్వారా బ్యాంకు రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించిన అక్కచెల్లెమ్మల మీద వడ్డీ భారం పడకుండా, వారి తరపున ఆ వడ్డీ భారాన్ని చిరునవ్వుతో స్వీకరించి "వైఎస్సార్ సున్నా వడ్డీ" క్రింద పూర్తి వడ్డీ రీయింబర్స్ చేస్తున్న జగనన్న ప్రభుత్వం..

ఇప్పటి వరకు అందించిన లబ్ధి : రూ. 4,969 కోట్లు
లబ్ధిదారులు : 1,05,13,365

"వైఎస్సార్ ఈబీసీ నేస్తం"

"వైఎస్సార్ ఈబీసీ నేస్తం" ద్వారా 45 నుండి 60 ఏళ్లలోపు ఉన్న రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమ లతో పాటు ఇతర ఓసీ వర్గాలకు చెందిన పేద అక్కచెల్లెమ్మలకు (ఈబీసీ) ఏటా రూ. 15,000 చొప్పున ఆర్థిక సాయం..

ఇప్పటి వరకు అందించిన లబ్ధి : రూ. 1,257 కోట్లు
లబ్ధిదారులు : 4,39,068

వైఎస్సార్ పెన్షన్ కానుక
రంచనగా పెన్షన్

వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా అక్కచెల్లెమ్మలకు, అవ్వలకు ప్రతి నెలా రంచన్ గా మొదటి తారీఖున రూ.3,000 పెన్షన్.. ఈ 56 నెలల కాలంలో పెన్షన్‌ల ద్వారా..

...కేవలం అక్కచెల్లెమ్మలు, అవ్వలకు మాత్రమే
అందించిన లబ్ధి 55,922 కోట్లు..
లబ్ధిదారులు: 43,78,930

వైఎస్సార్ కళ్యాణమస్తు / వైఎస్సార్ షాదీ తోఫా

పేద తల్లిదండ్రులు తమ పిల్లలను కనీసం 10వ తరగతి వరకు చదివించి, వారి వివాహాన్ని గౌరవ ప్రదంగా జరిపించేలా ఎస్సీ, ఎస్టీ, బి.సి. మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల ఆడపిల్లలకు "వైఎస్సార్ కళ్యాణమస్తు", ముస్లిం మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు "వైఎస్సార్ షాదీ తోఫా" ద్వారా ఆర్థిక సాయం..

ఇప్పటి వరకు అందించిన లబ్ధి : రూ. 349 కోట్లు
లబ్ధిదారులు : 46,062

అక్కచెల్లెమ్మలకు రాజకీయ సాధికారత

రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టులు, కాంట్రాక్టుల్లో ఏకంగా చట్టం చేసి మరీ 50 శాతం మహిళలకే కేటాయింపు.. నామినేటెడ్ కార్పొరేషన్ చైర్మన్ లుగా 51 శాతం మహిళలకే.. రాజకీయ నియామకాల్లో 50% పైగా పదవులు అక్కచెల్లెమ్మలకే.. రాష్ట్ర కేబినెట్‌లో నలుగురు మహిళలకు స్థానం.. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలు, దేవాలయాల బోర్డులలో చైర్ పర్సన్ లు, డైరెక్టర్లు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్స్, వైస్ చైర్ పర్సన్స్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, వార్డు మెంబర్, మున్సిపల్ చైర్ పర్సన్, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ పదవుల్లో 50% కు పైగా మహిళలకే..



దిశ యాప్

మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా దిశ యాప్ ను తీసుకురావడంతోపాటు దిశ పోలీస్ స్టేషన్లు, దిశ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల వ్యవస్థ నెలకొల్పిన జగనన్న ప్రభుత్వం.. ఇప్పటివరకు 1.46 కోట్ల మంది ఫోన్లలో దిశ యాప్ డౌన్ లోడ్. యువతులు, మహిళలు ఆపదలో ఉన్నామని సంకేతం ఇస్తే చాలు.. నిమిషాల్లో పోలీసులు ఆ ప్రదేశానికి చేరుకుని రక్షించేలా ఏర్పాటు.. వీటితోపాటు గ్రామ/వార్డు సచివాలయాల్లో దాదాపు 15,004 మంది మహిళా పోలీసుల్ని తీసుకువచ్చి మహిళల భద్రతకు భరోసా కల్పిస్తున్న జగనన్న ప్రభుత్వం..

రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మందికి పైగా విద్యార్థినులకు "స్వేచ్ఛ" ద్వారా ఏటా రూ.32 కోట్ల వ్యయంతో నెలకు 10 చొప్పున ఏడాదికి 120 నాణ్యమైన బ్రాండెడ్ శానిటరీ నాప్ కిన్లు ఉచితంగా పంపిణీ.. వీటితో పాటు జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న మిగిలిన వివిధ సంక్షేమ పథకాల్లో సింహ భాగం కూడా అక్కాచెల్లెమ్మలదే...

శ్రీ. ఆదిమూలపు సురేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి | జగనన్న ప్రభుత్వంలో మహిళలే.. మహారాణులు.. | శ్రీ. బూడి ముత్యాలనాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు అనంతపురం జిల్లా, ఉరవకొండలో 23 జనవరి, 2024 నాడు ఉదయం 11 గంటలకు "వైఎస్సార్ ఆసరా" నాలుగవ విడత ఆర్థిక సాయాన్ని అక్కచెల్లెమ్మల పొదుపు సంఘాల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు.. అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్ల లైవ్ లో వీక్షించవచ్చు...

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 302

మంగళవారం 23-1-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కోహ్లి దూరం

ఇంగ్లండ్‌తో జరిగే తొలి 2 టెస్టు మ్యాచ్‌ల నుంచి తప్పుకున్న కోహ్లి - స్పోర్ట్స్‌లో



జీ-సోనీ విలీన డీల్ రద్దు!

ఒప్పంద నిబంధనలు ఉల్లంఘించారంటూ జీ సంస్థకు సోనీ నోటీసు - బిజినెస్‌లో

మన రాముడొచ్చాడు

అయోధ్యలో కొలువైన బాలరాముడు

జగదానందకారకం.. దివ్యమంగళ స్వరూపం..
మందస్మిత వదనం.. చేత బంగారు ధనుస్సు, బాణం..
స్వర్ణవజ్రాభరణాలు, తులసీమాలల అలంకారం..
కార్యక్రమ ప్రధాన యజమాని (కర్త) హోదాలో ఐదేళ్ల బాలరాముడి విగ్రహానికి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రాణప్రతిష్ట జరిగింది.

సోమవారం గర్భాలయం లోపల నరేంద్ర మోదీ అభిజిత్ ముహూర్తంలో 84 సెకన్ల వ్యవధిలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. బాలరాముడి పాదాలకు నమస్కరించి, విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేసిన అనంతరం సాష్టాంగ ప్రణామం చేశారు.

ప్రాణప్రతిష్ట ముగిశాక 'మన రామయ్య అయోధ్య నగరానికి వచ్చేశాడం'టూ ప్రధాని అతిథుల హర్షధ్వానాల మధ్య ప్రకటించిన మరుక్షణమే దేశ విదేశాల్లో లక్షలాది మంది భక్తులు వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. రాత్రి తమ ఇళ్లలో రామజ్యోతి వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

ప్రాణప్రతిష్ట తర్వాత ప్రధాని మోదీ ఇదే ప్రాంగణంలో ఉన్న కుబేర తిల శివాలయాన్ని దర్శించుకొని, పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో జటాయువు పక్షి విగ్రహాన్ని ఆవిష్కరించారు. క్రతువు పూర్తికాగానే మోదీ 11 రోజుల అనుష్ఠాన దీక్షను విరమించారు.

అయోధ్య రామ మందిర నిర్మాణంలో భాగస్వాములైన కార్మికులను ప్రధాని మోదీ ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఆయన ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వేదికపై నుంచి ప్రసంగించారు.

వైభవోజ్వల ప్రాణప్రతిష్ట

ప్రధాన యజమాని నరేంద్రమోదీ చేతుల మీదుగా కమనీయ ఘట్టం 6లో

నేటి నుంచి భక్తులకు రామ్‌లల్లా దర్శనం

అయోధ్యలో ప్రధాని మోదీ పారవశ్యం

రాముడి ఆశీస్సులతో దేశం కోసం పనిచేద్దాం

వచ్చే వెయ్యేళ్ల భారతదేశ నిర్మాణంపై దృష్టి

రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట అనంతరం ప్రధాని పిలుపు

అయోధ్య పురవీధుల నిండా ప్రతిధ్వనించిన 'మంగళ ధ్వని'

ఆహూతులను ఆకట్టుకున్న నృత్య, సంగీత ప్రదర్శనలు

రామభక్తి పారవశ్యంలో ఓలలాడిన భారతావని

ప్రపంచ నలుమూలల్లోనూ ప్రాణప్రతిష్ట వేడుకలు

ప్రపంచంలోనే అదృష్టవంతుడిని: శిల్పి అరుణ్ యోగిరాజ్

జాతి మందిరమిది: యూపీ సీఎం యోగి

ప్రముఖుల సందడి

ప్రతిపక్ష నేతలు ఏం చేశారంటే...

- వివరాలు 6,7లో

"శతాబ్దాల ఎదురుచూపులు, ఎన్నో బలిదానాలు, లెక్కలేనన్ని త్యాగాలు, తపస్సుల తర్వాత ఎట్టకేలకు రాముడు మళ్లీ అయోధ్యకు చేరుకున్నాడు. మన రామ్‌లల్లా ఇకపై డేరాలో ఉండడు. దివ్య మందిరంలో ఆయనకు శాశ్వత స్థానం లభించింది. జనవరి 22 అనేది కేవలం ఒక తేదీ కాదు. కొత్త కాలచక్రానికి ప్రతీక, నవశకానికి నాంది. వెయ్యేళ్ల తర్వాత కూడా ఈ తేదీని ప్రజలు గుర్తు పెట్టుకుంటారు. 'వికసిత్ భారత్'కు ఈ రామ మందిరం సాక్షి. భవ్య మందిర నిర్మాణం పూర్తయింది. ఇక దేశ నిర్మాణంపై దృష్టి పెట్టాలి. ఇది భారతదేశ సమయం.

- ప్రధాని మోదీ



రామ్‌లల్లా విగ్రహానికి ప్రాణప్రతిష్ట పూజలు నిర్వహిస్తున్న ప్రధాని మోదీ



విద్యుద్దీప కాంతుల్లో అయోధ్య రామ మందిరం

సమ్మెకు తెర..

చర్చలు సఫలం.. నేటి నుంచి విధుల్లోకి అంగన్‌వాడీలు



అంగన్‌వాడీలతో చర్చలు జరుపుతున్న మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల

11 డిమాండ్లలో ఇప్పటికే 10 డిమాండ్ల అమలుకు కార్యాచరణ.. రిటైర్మెంట్ బెనిఫిట్స్ భారీగా పెంచిన ప్రభుత్వం

పదవీ విరమణ వయసు 60ఏళ్ల నుంచి 62ఏళ్లకు పొడిగింపు

చనిపోయిన వారి కుటుంబాలకు రూ.20వేల మట్టి ఖర్చులు

వేతనాల పెంపు జూలై నుంచి అమలు చేసేలా హామీ.. సమ్మెకాలంలో వేతనాలు, పోలీసు కేసులపై సానుకూల నిర్ణయం

ప్రభుత్వ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి బొత్స సత్యనారాయణ

4లో

పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.16,927 కోట్లు

- 2019 నుంచి ఇప్పటివరకు ఖర్చు చేసిన ప్రభుత్వం
- 31 లక్షల పేద అక్కచెల్లెమ్మలకు స్వగృహయోగం
- ఒక్కో యూనిట్‌కు రూ.1.80 లక్షలు
- వివిధ రూపాల్లో రూ.90 వేల అదనపు సాయం కూడా..
- లబ్ధిదారులకు చకచకా బిల్లుల చెల్లింపులు

4లో

ఇదండీ సంగతి




వాళ్ల దగ్గర ఎన్నికల టికెట్ ఊసెందుకెత్తార్సార్!!

ఓటర్లు 4.08 కోట్లు

ఈ దఫా పురుషులు **2.01** కోట్లు.. మహిళలు **2.07** కోట్లు

2019తో పోలిస్తే రాష్ట్రంలో 15 లక్షలు అదనంగా పెరిగిన ఓటర్లు




- అత్యధికంగా కర్నూలు జిల్లాలో 20.16 లక్షల ఓటర్లు..
- అల్లూరి జిల్లాలో అత్యల్పంగా 7.61 లక్షల ఓటర్లు
- 80 ఏళ్లు నిండినవారు, దివ్యాంగులు, కోవిడ్ బాధితులకు ఇంటి వద్దే ఓటు హక్కు
- 80 ఏళ్లు నిండిన ఓటర్లు 5,76,791.. దివ్యాంగులు 4,87,594 మంది
- ప్రతి 1,500 మందికి ఒక పోలింగ్ స్టేషన్.. మొత్తం 46,165కు స్టేషన్లు
- ప్రతి తొలగింపు, చేరికలను ఇంటింటి సర్వే చేసి పరిశీలించాం
- నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తులు సమర్పించిన 70 మందిపై ఎఫ్ఐఆర్‌లు
- 2024 తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా

14లో

చెప్పింది చెప్పినట్లుగా..

- నేడు రూ.6,394.83 కోట్ల నాలుగో విడత 'వైఎస్సార్ ఆసరా' పంపిణీ
- 79 లక్షల మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్ సర్కార్ భరోసా
- 2019 ఎన్నికల నాటికి పొదుపు సంఘాల మొత్తం అప్పు రూ.25,571 కోట్లు
- ఇందులో 3 విడతల్లో ఇప్పటికే రూ.19,175.97 కోట్లు చెల్లింపు

12లో



ప్రెస్టీజ్ న్యూ ఇయర్ బొనాంజా
ఈ న్యూ ఇయర్ కి
ప్రెస్టీజ్ వారి విప్లవాత్మక ప్రొడక్ట్స్‌ని
ఇంటికి తీసుకురండి.
*ఈ ఆఫర్ డిసెంబరు 23, 2023 నుండి జనవరి 28, 2024 వరకు మాత్రమే.
75 Years of Prestige
భారతదేశంలో మొట్ట మొదటి చిందటం
నివారించే ఫ్లిప్ ఆన్ ట్రై ప్లై ప్రెషర్ కుక్కర్
Prestige FLIP-ON
లాక్
అన్‌లాక్
ఏదైనా (3L అంతకంటే ఎక్కువ) ఫ్లిప్ ఆన్ ట్రై ప్లై ప్రెషర్ కుక్కర్ (1 యూనిట్) కొనుగోలు చెయ్యండి మరియు ₹2 150.00 విలువగల ఒమేగా డీలక్స్ గ్రానైట్ ట్విన్ ప్యాక్ (1 సెట్) ఉచితంగా పొందండి
(కాన్‌కేవ్ తవ 25 సె.మి (1 యూనిట్) మరియు ఫ్రై ప్యాన్ 20 సె.మి (1 యూనిట్))
ట్రై ప్లై కౌటర్ లిడ్ మరియు ఇన్నర్ లిడ్ సీరీస్ (3L అంతకన్నా ఎక్కువ) పై కూడా ఈ ఆఫర్ వర్తిస్తుంది.
భారతదేశంలో మొట్ట మొదటి ఆటోమేటిక్
విజిల్ కౌంటర్ ఇండక్షన్ కుక్‌టాప్ తో
మీ వంట మరింత పర్ఫెక్ట్ గా చెయ్యండి
Prestige
ఏదైనా విజిల్ లెక్కించే ఇండక్షన్ కుక్‌టాప్ (1 యూనిట్) కొనండి మరియు పాపులర్ స్వచ్ఛ్ స్టెయిన్‌లెస్ స్టీల్ ప్రెషర్ కుక్కర్ (5L) (1యూనిట్) MRP పై 15% డిస్కౌంట్ మరియు ₹500.00 తగ్గింపు పొందండి
14 విధాలుగా పనిచేసే
ఆల్ ఇన్ వన్
మిక్సర్ గ్రైండర్
POWERFUL 1000W MOTOR
5 YEAR WARRANTY ON MOTOR
14 Functionalities
ఎండ్యూరా ప్రో మిక్సర్ గ్రైండర్ (1 యూనిట్) కొనండి మరియు MRP పై 25% డిస్కౌంట్ పొందండి
అంతే కాదు ₹1 795.00 విలువగల సాండ్‌విచ్ మేకర్ (1 యూనిట్) ఉచితంగా పొందండి.
ఈ ఆఫర్ ఎండ్యూరా 3, 4, 6 జార్ మిక్సర్ గ్రైండర్ మరియు డిలైట్ ప్రో మిక్సర్ గ్రైండర్ పై కూడా వర్తిస్తుంది.
విప్లవాత్మక
ఈజీ క్లీన్ డిజైన్
ఎత్తండి
క్లీన్ చేయండి
ఏదైనా స్వచ్ఛ్™ గ్లాస్ టాప్ గ్యాస్ స్టవ్ (1 యూనిట్) కొనండి మరియు MRP పై 15% డిస్కౌంట్ పొందండి అంతే కాదు ₹2 895.00 విలువగల ఎక్స్‌ప్రెస్ ఇండక్షన్ కుక్‌టాప్ (1 యూనిట్) ఉచితంగా పొందండి.
ప్రవేశ పెడుతున్నాం
ఇండియాలోనే
మొట్ట మొదటి సేఫ్ సెన్స్
టెక్నాలజీ™ కలిగిన చిమ్నీ
ఆటోమేటిక్ పొగ మరియు గ్యాస్ లీక్ ని కనిపెడుతుంది.
SafeSense™ technology
Controlled through Mobile App - Prestige Smart Chef App
ఆస్కార్ సేఫ్ సెన్స్ చిమ్నీ (1 యూనిట్) కొనండి మరియు MRP పై 25% డిస్కౌంట్ పొందండి
అంతే కాదు ₹14 145.00 విలువగల రాయల్ ప్లస్ గ్లాస్ టాప్ గ్యాస్ స్టవ్ (4B) (1 యూనిట్) ఉచితంగా పొందండి
ఒమేగా డీలక్స్ గ్రానైట్ కుక్ వేర్ సెట్, ఇండియాలోనే మొట్ట మొదటి 5 - లేయర్స్ డ్యూరబల్ నాన్ స్టిక్
ఒమేగా డీలక్స్ గ్రానైట్ 4 పీస్ కుక్‌వేర్ (1 సెట్) కొనండి మరియు MRP పై 20% డిస్కౌంట్ పొందండి అంతే కాదు ₹1 780.00 విలువగల స్వచ్ఛ్ పాపులర్ ప్లస్ అల్యూమినియం ప్రెషర్ కుక్కర్ (3L) (1 యూనిట్) ఉచితంగా పొందండి
*నిబంధనలు వర్తించును. పైన ఇచ్చిన ధరలన్నీ ప్రోడక్ట్ యొక్క MRP (అన్ని టాక్స్ లు కలిపి). MRP పై మాత్రమే డిస్కౌంట్స్ వర్తిస్తాయి. ఏ రెండు ఆఫర్స్ కలపకూడదు. సెలెక్టెడ్ మోడల్స్ స్టాక్ ఉన్నంత వరకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఎంచుకోబడిన స్టోర్స్‌లో మాత్రమే ఆఫర్ వర్తిస్తుంది. ఒమేగా డీలక్స్ గ్రానైట్ 4 pc కుక్‌వేర్ (1 సెట్) లో ఫ్రై ప్యాన్ – 24cm (1 యూనిట్), గ్లాస్ లిడ్ కలిగిన కడాయి – 28cm (1 యూనిట్), ఓమ్ని తవా – 28cm (1 యూనిట్) మరియు గ్లాస్ లిడ్ కలిగిన మిల్క్ ప్యాన్ – 16cm (1 యూనిట్) ఉంటాయి. ఆఫర్ ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ లో మాత్రమే వర్తిస్తుంది. ప్రెస్టీజ్® లోగో ఇది ఇండియాలో టిటికె ప్రెస్టీజ్ లిమిటెడ్ వారి ట్రేడ్ మార్క్. నిబంధనలు మరియు షరతులకు సంబధించిన మరిన్ని వివరాలు కోసం మీ సమీపంలోని ప్రెస్టీజ్ ఎక్స్‌క్లూజివ్/డీలర్ అవుట్లెట్ కి విచ్చేయండి లేదా మా వెబ్ సైట్ https://shop.ttkprestige.com/new-year-offer-tc ను సందర్శించండి.
Prestige®
తనవాళ్ళ మీద ప్రేమ ఉన్నవారు ప్రెస్టీజ్‌ని ఎలా కాదనగలరు.
CUSTOMER CARE NO 080-6000 4411
Follow 'TTK Prestige' on
PRESTIGE XPERT 97423 34411
Shop Online on shop.ttkprestige.com
ttk
Prestige Xclusive
Vijayawada: Autonagar Gate, Ph: 08663562598, 7989820951; Benzcircle: Ph: 08662491766, 9390654466; Kanuru: Ph: 9618054555, 9052692111; Eluru Road: Ph: 08662435055, 9390654455; Gunadala: Ph: 0866-2457111, 9247565335; Gurunanak Colony: Ph: 8790942345; Ramavarapadu: Ph: 9866212121; Bhavanipuram: Ph: 08662414007, 9581221111; Penamaluru: Ph: 8121058866, 9618054555; Gudivada: Nehru Chowk Main Road, Ph: 9703602555.
Vijayawada: Lingeswara Steel Distributors, Ph: 2424245; Summit Smart Kitchen, Ph: 8790455584; Sri Bhavani Steel Corner, Ph: 2572255; Grand Modern Super Market, Ph: 6667720; Pai International, Ph: 9704066433; Smart E World: Ph: 8977079998; Sri Venkateswara Metal House, Ph: 2561546; Maaraj, Ph: 2439888; Gupta Enterprises, Ph: 9959520850; Ranga Brothers, Ph: 9440185844; Gudivada: G K Electronics, Ph: 7075663333; Srinivasa Electronics, Ph: 246554; Laxmi Tv Stores, Ph: 9491647025; Sri Venkateswara Steel, Ph: 9849465863; Balarka Steel, Ph: 9849664444; Hanuman Junction: Maruthi Electronics, Ph: 244466; Nandigam: Om Bhaskara Watch & Electronics, Ph: 257707; RI Electronics, Ph: 9652152121; Balaji Home Needs, Ph: 9603005888; Vuyyuru: Raja Rajeswari Fur & Elec, Ph: 8885684685; Nagasiva Electronics, Ph: 9573129145; Machilipatnam: S.V.K Emporium, Ph: 223040; New S V R & Co, Ph: 223567; Vamsi Electronics, Ph: 9966674444; Mylavaram: Kamadhenu Electronics, Ph: 9963660299; Tiruvur: Kamadhenu Electronics, Ph: 9494889012; Surya Sonovision, Ph: 7989610345; Udaysteel, Ph: 9951185422; Vissanapeta: Ganesh Radio, Ph: 9885070067; Swamy Enterprises, Ph: 9885691803; Sairam Enrerprises, Ph: 9908134660; Nuzividu: Himalaya Elec, Ph: 7013939584; Krishna Metal, Ph: 9989177737; Sri Vatsa Electronics, Ph: 9848023514; Dln Electronics, Ph: 9100011101. Regional Service Centre: Ph: 0866 2484377.

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఆర్థికంగా నిలదొక్కుకున్నాం



మాది పేద కుటుంబం. మాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త గిన్ని దేముడు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశాం. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. నా కుమారుడు కూడా కూలి పనులకు వెళ్తున్నాడు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు పడేవాళ్లం. నేను విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం గిన్నివానిపాలెంలో ఇంటి వద్ద చిన్న టిఫిన్ దుకాణం పెట్టాను. పెట్టుబడికి డబ్బులు లేకపోవడంతో వ్యాపారం అంతంత మాత్రంగానే ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక జగనన్న చేదోడు పథకం కింద మూడేళ్లలో రూ.30 వేలు సాయం అందింది. ఆ డబ్బులు వ్యాపారంలో పెట్టాం. వ్యాపారాన్ని అభివృద్ధి చేశాం. అప్పులు తీర్చుకుంటున్నాం. ఆర్థికంగా నిలబడ్డాం. నా భర్తకు 60 ఏళ్లు నిండడంతో ఏడాది నుంచి వృద్ధాప్య పెన్షన్ వస్తోంది. నా కుమారుడి కుమార్తెకు అమ్మఒడి కింద ఏటా రూ.15 వేలు వస్తోంది. ఈ ప్రభుత్వం మా కుటుంబంలో వెలుగులు నింపింది.

– గిన్ని రమణమ్మ, గిన్నివానిపాలెం
(ముప్పిడి శ్రీనివాసరావు, విలేకరి, పెదగంట్యాడ, విశాఖపట్నం)

వృద్ధాప్యంలో కొడుకులా ఆదుకున్నారు..



నేను లైట్లు, లాంతర్లు, బిందెలు, సిల్వర్ గిన్నెలకు మాట్లు వేస్తూ జీవనం సాగిస్తుంటాను. నేడు గ్యాస్ పొయ్యిలు, స్టీల్ గిన్నెలు వచ్చిన తర్వాత మాకు పని లేకుండా పోయింది. మాకు ఐదుగురు అమ్మాయిలు, ఒక అబ్బాయి. పిల్లలందరికీ పెళ్లిళ్లు చేసేసరికి ఓపిక నశించింది. నేను, నా భార్య మాత్రమే మిగిలాం. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని 17వ వార్డు పరిధిలో ఉంటున్నాం. జీవనం సాగించడానికి పనులు లేక చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఈ తరుణంలో నాకు పింఛన్ మంజూరైంది. నా భార్యకు వైఎస్సార్ చేయూత కింద ఇప్పటి వరకు రూ.56,250, వైఎస్సార్ ఆసరా పథకం కింద ఇప్పటి వరకు రూ.10,500 వచ్చింది. ప్రభుత్వం అందిస్తున్న పింఛను, నవరత్నాల పథకాలతో ప్రస్తుతం ఏ లోటూ లేకుండా మా జీవనం సాగుతోంది. రేషన్‌కార్డుపై బియ్యం, కంది పప్పు వంటివి అందిస్తున్నారు. ఈ వయసులోనూ పిల్లలపై ఆధార పడకుండా నా కాళ్లపై నేను నిలబడ్డాననే ఆత్మ సంతృప్తి కలుగుతోంది. జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరైంది. త్వరలో ఇంటి నిర్మాణం చేపడతాం. ఈ వృద్ధాప్యంలో కొడుకులా సీఎం జగన్ గారు మమ్మల్ని ఆదుకున్నారు.

– కంచు సత్యనారాయణ, పాలకొల్లు
(తోట రాంబాబు, విలేకరి, పాలకొల్లు సెంట్రల్)

ఉచితంగానే ఖరీదైన వైద్యం



నేను దుబాయిలో ప్రైవేటు కంపెనీలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. చిన్నప్పుడే నా బిడ్డలు కందుల సౌమ్య, స్టీఫెన్ ఇద్దరూ తలసేమియా వ్యాధిబారిన పడ్డారు. ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం చినమనగుండంలో అమ్మాయి సౌమ్య ఇంటర్, అబ్బాయి స్టీఫెన్ ఐదో తరగతి చదువుతున్నారు. వారికి ప్రతినెలా రక్తమార్పిడి, వైద్యం కోసం రూ.35 వేలు వరకు ఖర్చయ్యేది. వారికి వైద్యం చేయించేందుకు డబ్బులు లేక నానా ఇబ్బందులు పడ్డాను. గత ప్రభుత్వంలో ఎలాంటి సహకారం అందలేదు. వైఎస్ జగన్‌అధికారంలోకి రాగానే నా బిడ్డల లాంటి వారికి ప్రతి నెలా రూ.10 వేలు ఇచ్చి ఆదుకుంటానని మాటిచ్చారు. అన్నట్లుగానే ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.20 వేలు పింఛన్ మంజూరు చేశారు. ప్రతి నెలా నా బిడ్డలిద్దరికీ చికిత్స చేయిస్తున్నాను. ఇటీవల కుమారుడు స్టీఫెన్‌కు ఆపరేషన్ చేయించాను. కుమార్తె సౌమ్యకు ఆపరేషన్ అవసరమని, భారీగా ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. ఇటీవల మా ఇంటి వద్దకు వచ్చిన ఎమ్మెల్యే కె.పి.నాగార్జునరెడ్డికి మా సమస్య వివరించాం. తప్పకుండా ప్రభుత్వం నుంచి సహకారం అందేలా కృషి చేస్తానన్నారు.

–కందుల నయోమయ్య, చినమనగుండం
(నాగం వెంకటేశ్వర్లు, విలేకరి, కొనకనమిట్ల, ప్రకాశం జిల్లా)

చీరాలలో బడుగుల జాతర

ఘనంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర

- కదం తొక్కిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితేనే తమ జీవితాల్లో వెలుగులుంటాయని నినాదాలు
- బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు



చీరాలలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన జన సందోహంలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా చీరాల పట్టణంలో బడుగు, బలహీనవర్గాల సాధికార జాతర జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో తాము సాధించిన సామాజిక సాధికారతను చీరాల పట్టణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎలుగెత్తి చాటారు. సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కదం తొక్కారు. మళ్లీ జగన్ సీఎం అయితేనే తమ జీవితాల్లో వెలుగులు కొనసాగుతాయంటూ నినాదాలు చేశారు. ఆర్ అండ్ బీ అతిథి గృహం నుంచి ప్రారంభమైన యాత్రకు వీధి వీధిలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. యాత్ర అనంతరం నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ నేతృత్వంలో గడియారం సెంటర్‌లో జరిగిన బహిరంగ సభకు వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. వైఎస్ జగనే మళ్లీ సీఎం అంటూ స్లోగన్లతో సభా ప్రాంగణం దద్దరిల్లింది.

అంబేడ్కర్, పూలే ఆశయాల సాధకుడు సీఎం వైఎస్ జగన్: మంత్రి నాగార్జున

దేశ చరిత్రలో అంబేడ్కర్, పూలే, సాహూ మహరాజ్, పెరియార్, వంటి మహనీయుల ఆశయాలను సాకారం చేస్తున్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సీఎం జగన్ ఆంధ్ర రాష్ట్రంలో సామాజిక విప్లవం సాధించారని అన్నారు. చంద్రబాబు కులాలను అడ్డుపెట్టుకుని రాజకీయంగా ఎదిగారని, జగన్ మాత్రం అంబేడ్కర్ ఆశయాన్ని ముందుకు తీసుకొచ్చి పేద పిల్లలను ఇంగ్లిష్ మీడియం చదివించి, వారికి విదేశాల్లో చదివే అవకాశాలు కల్పించి ఉన్నత శిఖరాలు అధిరోహించేలా చేశారన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని చంద్రబాబు ముళ్లపొదల్లో పడేస్తే వైఎస్ జగన్ విజయవాడ నడిబొడ్డులో నిలబెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీలు తల ఎత్తుకునేలా చేశారన్నారు. తెలంగాణలో పార్టీని పెట్టి, ఏపీతో సంబంధం లేదని చెప్పిన షర్మిల.. ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి చంద్రబాబు కుట్రలో పావుగా మారారన్నారు. సీఎం జగన్ దళిత క్రైస్తవులను ఎస్సీలుగా చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తుచేశారు.

బడుగు, బలహీన వర్గాలను దోషులుగా చిత్రీకరించింది బాబే: ఎంపీ నందిగం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై అక్రమంగా కేసులు పెట్టి దొంగలుగా, దోషులుగా చిత్రీకరించి చిత్రహింసలకు గురిచేసింది చంద్రబాబేనని ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అనేక పదవులిచ్చి దొరలను చేస్తున్నారన్నారు. ఎంపీలను చేసి పార్లమెంటులో ప్రధాని పక్కన కూర్చోబెట్టారన్నారు.



ప్రసంగిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

బడుగు, బలహీన వర్గాలు జగనన్నతోనే: కరణం వెంకటేష్


చీరాల నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు సుపరిపాలన అందిస్తున్న జగనన్నతోనే ఉన్నాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. అర్హతే ప్రామాణికంగా బడుగు బలహీన వర్గాలకు సీఎం జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. చీరాలలో జరిగిన అభివృద్ధిని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత, అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నను సీఎంగా ఎందుకు చేయాలంటే..: మోపిదేవి

రాష్ట్రంలో సామాజిక న్యాయం, బడుగుల సాధికారత, పేదలకు పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ చెప్పారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఏనాడూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆలోచించలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు సామాజికంగా, రాజకీయంగా ముందంజలో ఉండాలన్నదే సీఎం జగన్ తపన అని తెలిపారు. 2024 ఎన్నికల్లో బాపట్ల నుంచి ఎంపీగా నందిగం సురేష్, చీరాల అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా కరణం వెంకటేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఆరోగ్యశ్రీ సేవల్లో భారీ వృద్ధి

- 2018–19లో రోజుకు సగటున 1,547 అభ్యర్థనలు
- ప్రస్తుతం రోజుకు 5,563 అభ్యర్థనల నమోదు
- గత ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు మధ్య 9.12 లక్షల మందికి 12.66 లక్షల చికిత్సలు
- పేదల ఆరోగ్యంపై ప్రభుత్వ భరోసాకు, శ్రద్ధకు ఇదే నిదర్శనం



సాక్షి, అమరావతి: అనారోగ్యం బారినపడి.. వైద్యం చేయించుకునే స్థోమతలేని నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కొండంత అండగా నిలుస్తోంది. చేతి చిల్లిగవ్వ కూడా ఖర్చుపెట్టే పనిలేకుండా ఆపత్కాలంలో ఆపద్బాంధవిలా ఆదుకుంటోంది. ఆరోగ్యశ్రీ పథకంలో ప్రొసీజర్లను గణనీయంగా పెంచడం, నెట్‌వర్క్ ఆస్పత్రులను విస్తరించడం ద్వారా సీఎం వైఎస్ జగన్ ఈ పథకాన్ని మరింత విస్తృతంగా పేదలకు అందుబాటులోకి తెస్తున్నారు. ఇందుకోసం చేపడుతున్న సంస్కరణల ఫలితంగా సేవల్లో భారీ వృద్ధి నమోదవుతోంది.

రోజుకు సగటున 5,563 ప్రీయాథ్స్..

2018–19లో ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్‌కు నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి రోగుల చికిత్స నిమిత్తం ఆమోదం కోసం రోజుకు సగటున 1,547 అభ్యర్థనలు వస్తుండేవి. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటే చికిత్సలన్నింటినీ ఆరోగ్యశ్రీ పథకంలోకి సీఎం జగన్ తీసుకొచ్చారు. దీంతో టీడీపీ హయాంలో 1,059గా ఉన్న ప్రొసీజర్లు.. ప్రస్తుతం 3,257కు పెరిగాయి. అనారోగ్యం లేదా ఏదైనా ప్రమాదం బారినపడినా కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం పేదలకు ఉచిత వైద్యసేవలు లభిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం రోజుకు సగటున 5,563 అభ్యర్థనలను వస్తున్నాయి. ఇలా ట్రస్ట్‌కు వచ్చిన అభ్యర్థనలకు ఆమోదం తెలపడంతో గత ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు మధ్య 9,12,370 మందికి రాష్ట్ర ప్రభుత్వం 12,66,365 చికిత్సలను ఉచితంగా చేసింది. ఇందుకు సంబంధించి సర్కారు రూ.2,489.78 కోట్లు వెచ్చించింది. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గత ఏడాది నవంబరు నెలాఖరు వరకూ 37.40 లక్షల మందికి 53.02 లక్షల చికిత్సలను ఉచితంగా అందించింది. ఇందుకోసం ఏకంగా రూ.11,859.96 కోట్లను ఖర్చుచేసింది. టీడీపీ ప్రభుత్వంలో 2014–19 మధ్య అరకొర ప్రొసీజర్లతో కేవలం 22.32 లక్షల చికిత్సలను మాత్రమే అందించారు.

రికార్డు స్థాయిలో నిధుల ఖర్చు

పెరిగిన సేవలకు తగ్గట్టుగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కోసం రికార్డు స్థాయిలో నిధులు ఖర్చు చేస్తోంది. 2014–19 మధ్య టీడీపీ సర్కారు రూ.5,177.38 కోట్లు మాత్రమే ఖర్చుచేసింది. సీఎం జగన్ ప్రభుత్వం మాత్రం 2019 నుంచి గత ఏడాది నవంబరు నెలాఖరు వరకు ఏకంగా రూ.11,859.96 కోట్లు ఖర్చుచేసింది. దీనికి అదనంగా చికిత్సానంతరం రోగులకు భరోసానిస్తూ ఆరోగ్య ఆసరా నిమిత్తం రూ.1,309 కోట్లు వెచ్చించింది. ఇలా నాలుగున్నరేళ్లలో ఆరోగ్యశ్రీ, ఆసరా కోసం ఏకంగా రూ.13,165.96 కోట్లు ఖర్చుచేసింది.

రూ.25 లక్షలకు పెంపు..

ఆరోగ్యశ్రీ అమలు విషయంలో సీఎం జగన్ మరో అడుగు ముందుకేసి వైద్యసేవల ఖర్చును ఏకంగా రూ.25 లక్షలకు పెంచారు. తెలంగాణలో ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని కాంగ్రెస్ ప్రకటించగా, బీఆర్ఎస్ రూ.15 లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని, బీజేపీ రూ.10 లక్షల వరకూ అంటూ తమ మేనిఫెస్టోల్లో ప్రకటించాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.25 లక్షల వరకూ ఉచితంగా ఆరోగ్యశ్రీ కింద సీఎం జగన్ ప్రభుత్వం వైద్యం అందిస్తోంది. కేన్సర్ బాధితులకు సైతం రూ.25 లక్షలు ఖర్చయినా ఆ భారాన్ని మొత్తంగా భరిస్తోంది.

ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌కు సీఎం జగన్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 24వ తేదీన తిరుపతిలో జరిగే ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొననున్నారు. బుధవారం మధ్యాహ్నం 2.45 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి సీఎం జగన్ బయలుదేరి తిరుపతి చేరుకుంటారు. అక్కడ తాజ్ హోటల్‌లో జరిగే ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొంటారు. అనంతరం బయలుదేరి రాత్రికి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

సీఆర్డీఏ రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు

27 నుంచి మూడో విడత ఈ–లాటరీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ)కు భూములిచ్చిన రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించనున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు గ్రామాల వారీగా ఈ–లాటరీ తీయనున్నట్లు పేర్కొన్నారు. గతంలో వారికి కేటాయించిన నివాస, వాణిజ్య ప్లాట్లు భూసేకరణ పూర్తికాని భూమిలో ఉన్నాయని, దాంతో ఆ రైతులకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ ప్లాట్లు ఇచ్చేందుకు ఇప్పటికే నోటీసులిచ్చినట్లు తెలిపారు. తొలి విడత ఈ–లాటరీలో 44 మందికి గత డిసెంబర్ నెలలో ప్లాట్లు కేటాయించి పత్రాలు కూడా అందజేశామని పేర్కొన్నారు. ఇటీవల రెండో విడతలో 48 మంది రైతులకు ప్లాట్లు ఇచ్చామని, మిగిలిన రైతులకు ప్లాట్లను ఈ–లాటరీ పద్ధతిలో కేటాయిస్తామని వివరించారు.

అప్పుడు అపచారం

విజయవాడలో బాబు కూల్చిన శనైశ్చర స్వామి ఆలయం



హిందువుల మనోభావాలు దెబ్బతీసిన చంద్రబాబు

ఆలయాల పునఃనిర్మాణం, బాగోగులపై సీఎం జగన్ దృష్టి

ఇప్పుడు వైభవోజ్వలం

విజయవాడలో పూర్తికావచ్చిన శనైశ్చర స్వామి ఆలయం



➤ 2015లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు తన ప్రచారార్భాటానికి గోదావరి పుష్కరాలను వాడుకున్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి రాజమండ్రిలోని వీఐపీ ఘాట్‌లో కాకుండా సాధారణ భక్తులకు కేటాయించిన ఘాట్‌లో పుష్కర స్నానాలకు వెళ్లారు. ఒక డాక్యుమెంటరీ చిత్రీకరణ కోసం ప్రజలను నియంత్రించి.. ఒక్కసారిగా వదిలేయడంతో తొక్కిసలాట జరిగి ఏకంగా 29 మంది భక్తులు మృత్యువాత పడ్డారు.

➤ 2016లో కృష్ణా పుష్కరాల ఏర్పాట్లకు అడ్డుగా ఉన్నాయని సీఎంగా ఉన్న చంద్రబాబు ఆదేశాలతో విజయవాడలో దాదాపు 30 ఆలయాలు కూల్చి వేశారు. శనైశ్వర స్వామి వారి ఆలయం, సీతమ్మ వారి పాదాలు, బొడ్డు బొమ్మ, వీరబాబు ఆలయం, అమ్మవారి పాత మెట్ల మార్గంలోని ఆంజనేయ స్వామి ఆలయం, వినాయక ఆలయం, గో సంరక్షణ సంఘంలోని కృష్ణ మందిరం, దక్షిణాముఖ ఆంజనేయ స్వామి ఆలయం, పద్మావతి ఘాట్ సమీపంలోని సాయిబాబా మందిరం, మల్లేశ్వర స్వామి ఆలయం మెట్ల మార్గంలోని వీరాంజనేయ స్వామి ఆలయం, పాత మెట్ల మార్గంలోని శృంగేరీ పీఠానికి చెందిన వీరాంజనేయ స్వామి ఆలయం, కొండపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మౌన స్వామి ఆలయం తదితర ఆలయాలు కూల్చివేతకు గురయ్యాయి.

➤ విజయవాడలోని ఇంద్రకీలాద్రి ఆలయం కోసం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.



రామతీర్థం బోడికొండపై శిథిలావస్థలో కోదండరామాలయం

➤ విజయనగరం జిల్లా రామతీర్థం పుణ్యక్షేత్రంలో బోడికొండపైనున్న శ్రీ కోదండ రాముని ఆలయం 2014 అక్టోబరులో సంభవించిన హుద్‌హుద్ తుపాను ప్రభావంతో శిథిలమైంది. ప్రహరీ, ధ్వజస్తంభం పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త టీడీపీ సీనియర్ నాయకుడు పూసపాటి అశోక్‌గజపతిరాజే. అప్పుడు సీఎంగా ఉన్నదీ చంద్రబాబే. వీరెవ్వరూ పట్టించుకోక పోవడంతో దుండగులు కోదండ రాముడి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఆదాయం లేని ఆలయాలలో నిత్య ధూప దీప నైవేద్య నిర్వహణకు అమలు చేసే డీడీఎన్‌ఎస్ పథకం 1,620 ఆలయాల (అందులో 1500 దాకా ఉమ్మడి ఏపీలో మంజూరు చేసినవే)కు మాత్రమే వర్తింపు.



విజయవాడలో చంద్రబాబు కూల్చిన ఆలయం



బోడికొండపై పునర్నిర్మించిన కోదండరామాలయం

శిథిలమైన రామతీర్థం ఆలయం రూ.4 కోట్లతో పునర్నిర్మాణం. నిపుణులైన శిల్పులతో సీతా సమేత కోదండరాముడు, లక్ష్మణ విగ్రహాల తయారీ. ఆకర్షణీయంగా గర్భాలయం తర్వాత అర్ధ, ముఖ మండపాలు. ధ్వజస్తంభాన్ని పునరుద్ధరణ. పటిష్టంగా ప్రహరీ నిర్మాణం. మొత్తంగా 2022 ఏప్రిల్ 15వ తేదీన పునఃప్రతిష్ఠ.

రాష్ట్ర సంక్షేమం, సర్వతోముఖాభివృద్ధి కాంక్షిస్తూ 'అష్టోత్తర శతకుండాత్మక చండి, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం' నిర్వహణ.



వైఎస్ జగన్ ప్రభుత్వం పునర్నిర్మించిన ఆలయం

➤ చంద్రబాబు ప్రభుత్వం విజయవాడలో కూల్చి వేసిన ఆలయాల్లో ప్రధానంగా 8 ఆలయాల పునఃనిర్మాణం. ఈ ఎనిమిది ఆలయాలకు 2021 జనవరి 8న సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన. రూ.3.87 కోట్లతో నిర్మాణాలు పూర్తి. డిసెంబరు 8వ తేదీన భక్తులకు అంకితం. మరో ఐదు ఆలయాలలో ప్రధానమైన మౌన స్వామి విగ్రహం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో తిరిగి ఏర్పాటు. పాత మెట్ల మార్గంలోని ఆంజనేయస్వామి, మల్లేశ్వర స్వామి మెట్ల మార్గంలోని వీరాంజనేయస్వామి విగ్రహాలకు బ్రాహ్మణ వీధిలోని వాటర్ ట్యాంక్ వద్ద ఆలయాల్లో పూజా కార్యక్రమాలు.

➤ దుర్గగుడి అభివృద్ధి కోసం రూ.70 కోట్లు మంజూరు. దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం. రూ.216 కోట్లతో ఇంద్రకీలాద్రి కొండ రక్షణ పనులు, ఎనర్జీ, వాటర్ వర్క్స్, అన్నప్రసాద భవనం, పోటు భవనం, ఎలివేటెడ్ క్యూకాంప్లెక్స్, రాజగోపురం ముందు మెట్ల నిర్మాణం, మహారాజ ద్వారం, నూతన కేశఖండనశాల తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన.

➤ 757 పురాతన ఆలయాలను కామన్‌గుడ్ ఫండ్ నిధులతో పునః నిర్మాణం చేయడంతో పాటు టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులతో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార కాలనీల్లో కొత్తగా 2,872 ఆలయాల నిర్మాణం. ఇప్పుడు నిత్య ధూప దీప నైవేద్య నిర్వహణకు డీడీఎన్‌ఎస్ పథకం 4,834 ఆలయాలకు వర్తింపు

– సాక్షి, అమరావతి/ సాక్షి ప్రతినిధి, విజయవాడ, విజయనగరం

పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.16,927 కోట్లు

31 లక్షల పేద అక్కచెల్లెమ్మలకు స్వగృహయోగం

రాష్ట్రవ్యాప్తంగా 17,005 జగనన్న కాలనీలు.. 31.19 లక్షల మంది అక్కచెల్లెమ్మల పేరిట ఉచితంగా ఇళ్ల స్థలాలు.. వారు ఇళ్లు కట్టుకోవడానికి ఒక్కొక్కరికి రూ.2.70 లక్షలు సాయం.. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తూ 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం చేస్తున్న మేలు ఇది.

– సాక్షి, అమరావతి



పేదల ఇళ్లకు ప్రభుత్వం నిధులు ఖర్చు పెట్టిందిలా..

సంవత్సరం	నిధులు (రూ.కోట్లలో)
2019-20	678.26
2020-21	227.68
2021-22	3,493
2022-23	7,712.80
2023-24	4,815.42
మొత్తం	16,927.16

ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి కావాల్సిన భూమి కొనుగోలుకు భారీ ఎత్తున ప్రభుత్వం వ్యయం చేసింది. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చాక 2019 నుంచి ఇప్పటివరకు వారి ఇళ్ల నిర్మాణానికి ఏకంగా రూ.16,927.16 కోట్లు ఖర్చు చేసింది. ఈ వ్యయాలు కాకుండా కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి మరింత ఖర్చు పెట్టనుంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా పేదింటి అక్కచెల్లెమ్మలను లక్షాధికారులను చేస్తూ కనిష్టంగా 1.50 లక్షల కోట్ల నుంచి గరిష్టంగా రూ.3 లక్షల కోట్ల సంపదను వారి చేతుల్లో ప్రభుత్వం పెడుతోంది. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇప్పటివరకు పేదలకు ఇంత పెద్ద ఎత్తున స్థలాలు, ఇళ్లు ఇచ్చిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.

ఆర్థిక సాయంతోపాటు నిర్మాణ సామగ్రిపై సబ్సిడీ

2019లో అధికారంలోకి వచ్చాక నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద ఇళ్ల నిర్మాణాల కోసమే ఇప్పటివరకు ఏకంగా రూ.16,927.16 కోట్లు ఖర్చు చేశారు. ఈ నిధులతో లబ్ధిదారులకు చకచకా ఇంటి బిల్లులను చెల్లించారు. అంతేకాకుండా 4.70 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా సిమెంట్, 33 వేల టన్నులకుపైగా స్టీల్, ఇతర నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై సరఫరా చేశారు. ఉచితంగా స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణం కోసం యూనిట్‌కు రూ.1.80 లక్షలు ప్రభుత్వం ఇస్తోంది. పావలా వడ్డీకి రూ.35 వేలు చొప్పున బ్యాంక్ రుణాన్ని సమకూరుస్తోంది. బ్యాంకులు 9 నుంచి 11 శాతం వడ్డీకి రుణాలు ఇస్తుండగా లబ్ధిదారులు పావలా వడ్డీనే కడుతున్నారు. మిగిలిన వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తోంది. అంతేకాకుండా రూ.15 వేల విలువ చేసే ఇసుకను ఉచితంగా అందిస్తోంది. స్టీల్, సిమెంట్, ఇలా 12 రకాల నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై సరఫరా చేయడం ద్వారా మరో రూ.40 వేలు చొప్పున మేలు చేస్తోంది.

రూ.20 లక్షల విలువైన ఆస్తి

ఇంటి స్థలం, ఇల్లు రూపంలో రూ.20 లక్షలు, అంతకంటే విలువైన స్థిరాస్తిని అక్కచెల్లెమ్మల పేరిట ప్రభుత్వం అందిస్తోంది. తద్వారా పేదింటి మహిళలను లక్షాధికారులుగా మారుస్తోంది. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన స్థలాల విలువ.. ప్రాంతాన్ని బట్టి రూ.2.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ మార్కెట్‌లో పలుకుతోంది. ఇంటి నిర్మాణం కూడా పూర్తయితే ఆ ఆస్తి విలువ కనీసం రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షలు, అంతకు పైమాటే.

ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతపై.. మళ్లీ అడ్డం తిరిగిన తెలంగాణ

- రెండు రాష్ట్రాలతో ఈనెల 17న కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఉన్నతస్థాయి సమావేశం
- ఉమ్మడి ప్రాజెక్టులు అప్పగించేందుకు అంగీకరించిన రెండు రాష్ట్రాలు
- హైదరాబాద్‌కు చేరుకున్నాక మాట మార్చిన తెలంగాణ



సాక్షి, అమరావతి: ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను కృష్ణా బోర్డుకు అప్పగింతపై తెలంగాణ రాష్ట్రం మళ్లీ అడ్డం తిరిగింది. కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఈనెల 17న ఢిల్లీలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో కృష్ణా బోర్డుకు ఉమ్మడి ప్రాజెక్టులను అప్పగించేందుకు అంగీకరించిన తెలంగాణ నీటిపారుదల శాఖాధికారులు.. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకోగానే ప్లేటు ఫిరాయించి ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతకు తాము అంగీకరించలేదని బుకాయించారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమల్లోకి వచ్చేవరకూ ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించబోమని తెలంగాణ సర్కార్ చెబుతోంది. కానీ.. ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించినట్లు సమావేశపు మినిట్స్‌లో స్పష్టంగా ఉంది. ఈ మినిట్స్‌పై ఏపీ అధికారులతోపాటు తెలంగాణ అధికారులు కూడా సంతకాలు చేశారు.

అప్పుడూ ఇలాగే ప్లేటు ఫిరాయింపు..

గతంలో కృష్ణా బోర్డు 16వ సర్వసభ్య సమావేశంలో ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించిన తెలంగాణ అధికారులు.. ఆ మరుసటి రోజే అడ్డం తిరిగారు. ఇప్పుడూ అదే రీతిలో అడ్డం తిరగడంతో కేంద్ర జల్‌శక్తి శాఖ తీవ్రంగా పరిగణించింది. మరోవైపు.. ఉన్నతస్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈనెల 24లోగా త్రిసభ్య కమిటీ సమావేశమై ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింత విధానాన్ని ఖరారు చేయాలి. ఈ సమావేశంలో తెలంగాణ తరఫున హాజరయ్యే నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ స్పందనను బట్టి చర్యలు తీసుకోవడానికి కేంద్ర జల్‌శక్తి శాఖ సిద్ధమైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఏపీలో ఆరు.. తెలంగాణలో తొమ్మిది ఔట్‌లెట్లు..

నిజానికి.. విభజన నేపథ్యంలో కృష్ణా జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు తలెత్తకుండా చూసేందుకు కేంద్రం కృష్ణాబోర్డును ఏర్పాటుచేసింది. ఈ బోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021, జూలై 15న గెజిట్ నోటిఫికేషన్ జారీచేసిన కేంద్రం.. ఉమ్మడి ప్రాజెక్టులను ఏడాదిలోగా బోర్డుకు అప్పగించాలని నిర్దేశించింది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో ఏపీ భూభాగంలోని ఆరు, తెలంగాణ భూభాగంలోని తొమ్మిది అవుట్‌లెట్లను స్వాధీనం చేయాలని 16వ సర్వసభ్య సమావేశంలో రెండు రాష్ట్రాలను బోర్డు కోరింది. ఇందుకు రెండు రాష్ట్రాలు తొలుత అంగీకరించాయి. తెలంగాణ భూభాగంలోని అవుట్‌లెట్లను స్వాధీనం చేసుకుంటే.. తమ భూభాగంలోని అవుట్‌లెట్లను అప్పగిస్తామని ఏపీ ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తంచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కానీ.. తెలంగాణ సర్కార్ తన భూభాగంలోని అవుట్‌లెట్లను బోర్డుకు అప్పగించబోమని అడ్డం తిరిగింది. ఈ నేపథ్యంలో.. రాష్ట్ర హక్కులను పరిరక్షించుకోవడానికి మన భూభాగంలోని సాగర్ స్పిల్ వే సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను జలవనరుల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తమ నిర్వహణలో ఉన్న సాగర్‌ను ఏపీ అధికారులు అక్రమంగా స్వాధీనం చేసుకున్నారంటూ కేంద్రానికి తెలంగాణ సర్కార్ ఫిర్యాదు చేసింది. ఈ వివాదాన్ని పరిష్కరించడమే అజెండాగా ఈనెల 17న ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు.

సమ్మెకు తెర

నేటి నుంచి విధుల్లోకి అంగన్‌వాడీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సమ్మె విరమించారు. ప్రభుత్వంతో సోమవారం అర్ధరాత్రి వరకు జరిపిన చర్చలు ఫలించడంతో మంగళవారం నుంచి యథావిధిగా విధుల్లోకి వెళ్లనున్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ అధికారుల సమక్షంలో అంగన్‌వాడీల డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సచివాలయంలో మంత్రి బొత్స మీడియాతో మాట్లాడుతూ.. అంగన్‌వాడీల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు పెట్టిన 11 డిమాండ్లలో 10 అంగీకరించడంతో పాటు, చాలా వాటిని అమలు చేసేందుకు కార్యాచరణ చేపట్టామని చెప్పారు. ముఖ్యమైన వేతనాల పెంపుపై ఇటు ప్రభుత్వం.. అటు అంగన్‌వాడీ యూనియన్లు పరస్పర అంగీకారంతో నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనిని జూలై నుంచి అమలు చేసే దిశగా పని చేస్తున్నామని తెలిపారు. 'అంగన్‌వాడీల శ్రేయస్సు, సంక్షేమం దృష్ట్యా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను వర్కర్లకు రూ.50 వేల నుంచి ఏకంగా రూ.1.20 లక్షలకు, హెల్పర్లకు రూ.20 వేల నుంచి రూ.60 వేలకు పెంచుతున్నాం. అందరి ఉద్యోగుల మాదిరిగానే పదవీ విరమణ వయసు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు.. ప్రమోషన్ల కోసం వయో పరిమితి 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతున్నాం. కేంద్ర నిబంధనల ప్రకారం మినీ అంగన్‌వాడీల అప్‌గ్రేడ్ చేస్తాం. అంగన్‌వాడీల్లో పని చేస్తూ చనిపోయిన వారికి మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు ఇవ్వాలని నిర్ణయించాం. కేంద్ర ప్రభుత్వ దృష్టికి గ్రాట్యుటీ అంశం తీసుకెళ్లి.. వారిచ్చేది నేరుగా అమలు చేస్తాం. భవిష్యత్తులో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ నియమిస్తాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి సమ్మె కాలంలోని అంగన్‌వాడీల వేతనం, పోలీసు కేసుల అంశం తీసుకెళ్లి.. న్యాయం జరిగేలా చూస్తాం. ఇన్ని డిమాండ్లను అంగీకరించడం అంటే అంగన్‌వాడీ అక్కచెల్లెమ్మల సంక్షేమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం' అని మంత్రి తెలిపారు.

ఇక విధుల్లోకి వెళ్తున్నాం..

తమ డిమాండ్లపై ప్రభుత్వంతో చర్చలు సుహృద్భావ వాతావరణంలో విజయవంతం అయ్యాయని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ప్రకటించారు. ఇకపై తాము విధుల్లోకి వెళ్లనున్నట్టు తెలిపారు. వేతనాల పెంపు విషయంలో దీర్ఘకాలిక పోరాటానికి పరిష్కారం లభించిందన్నారు. సర్వీసులో ఉండి అంగన్‌వాడీలు చనిపోతే మట్టి ఖర్చులు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం విషయంలో సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామన్నారని తెలిపారు. అంగన్‌వాడీలకు ప్రత్యేకంగా వైఎస్సార్ బీమా, అంగన్‌వాడీల బీమా అమలు చేస్తామనడం సంతోషంగా ఉందన్నారు. 2017 నుంచి కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోవడంతో టీఏ బిల్లులు నిలిచిపోయాయని, ఆ బిల్లులు వచ్చిన వెంటనే విడుదల చేస్తామన్నారని తెలిపారు. ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం నిధుల నుంచి నెలకు ఒక టీఏ బిల్లు ఇస్తామనడం సంతోషంగా ఉందన్నారు. యాప్‌ల భారాన్ని సైతం తగ్గించేందుకు స్పష్టమైన హామీ లభించిందన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ బిల్లులు, గ్యాస్ మెనూ పెంపు, చిన్నారుల మెనూ పెంచాలని కోరగా ప్రత్యేక కమిటీలో చర్చించి నిర్ణయిస్తామని చెప్పారన్నారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయడానికి చర్యలు చేపడతామనడం ఆనందాన్నిస్తోందన్నారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి, గౌరవాధ్యక్షురాలు మంజుల, వీఆర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'ఛలో' భగ్నం

ఇదిలా ఉండగా.. అంగన్‌వాడీల ఆందోళనను అడ్డు పెట్టుకుని పలుచోట్ల టీడీపీ నేతలు టెంట్లు, కుర్చీలు, భోజనాలు సమకూరుస్తూ కొన్ని శక్తులను ఆందోళనకు పురిగొల్పుతున్నారు. అంగన్‌వాడీల ముసుగులో అసాంఘిక శక్తులు ఉద్రిక్తతలు, హింసను ప్రేరేపించేలా అరాచకంగా వ్యవహరిస్తున్నాయి. ఇందులో భాగంగా సోమవారం 'ఛలో విజయవాడ'కు పిలుపునిచ్చాయి. నిఘా వర్గాలు హెచ్చరించడంతో పోలీసులు ఈ కార్యక్రమాన్ని భగ్నం చేశారు.

20 మంది 'ఎర్ర' స్మగ్లర్లు అరెస్ట్

తిరుపతి మంగళం: శేషాచల అడవుల్లో ఆదివారం నిర్వహించిన దాడుల్లో ఎర్రచందనం చెట్లను నరికి అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తున్న 20మంది ఎర్రస్మగ్లర్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ సోమవారం వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. సుండుపల్లి మండలం సానిపాయ రేంజ్‌లో కుడుమాండ్లపల్లి రోడ్డు పక్కన అనుమానాస్పదంగా నిలిపి ఉన్న కారును టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చుట్టుముట్టారు. వారిని చూసి కొంతమంది పారిపోగా బెంగళూరుకు చెందిన సయ్యద్ నౌషద్ (28)ని అరెస్టు చేసి, 5ఎర్రచందనం దుంగలు, హ్యూండయ్ కారును స్వాధీనం చేసుకున్నారు. అలాగే రోళ్లమడుగు, ఏకాసు కుప్పం ప్రాంతంలో కూంబింగ్ చేపట్టగా.. రాజంపేట రేంజి ఎస్ఆర్ పాళెం సెక్షన్‌లోని పుట్టంగి మడుగు వద్ద తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన ఏలుమలై కుప్పుస్వామి (28)ని పట్టుకుని ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో నెల్లూరు జిల్లా వెంకటరాజురామపేట ప్రాంతంలో తమిళనాడుకు చెందిన 17మందిని, నెల్లూరుకు చెందిన నక్కిన మహేష్ రెడ్డిని అరెస్టు చేసి, టెంపో ట్రావెలర్ స్వాధీనం చేసుకున్నారు.

సరిహద్దులు కట్టుదిట్టం

- సరిహద్దుల్లో చెక్‌పోస్టులు 139కి పెంపు.. మరో 15 ఏర్పాటుకు సన్నాహాలు
- వెయ్యిమందికిపైగా సిబ్బందితో తనిఖీలు

సాక్షి, అమరావతి: రానున్న ఎన్నికల సక్రమ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ప్రధానంగా రాష్ట్రంలోకి అక్రమ రవాణా నిరోధానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులను మూడురెట్లు పెంచింది. ఇప్పటివరకు ఉన్న 46 చెక్‌పోస్టుల సంఖ్యను 139కి పెంచింది. వీటిలో వివిధ శాఖల పరిధిలోని చెక్‌పోస్టులు, పలు శాఖలతో కలిపి ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఉన్నాయి. మరో 15 చెక్‌పోస్టుల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. ఎన్నికల సక్రమ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై కేంద్ర ఎన్నికల కమిషన్ ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రశంసించింది. అదే తరహాలో వ్యవహరించాలని సరిహద్దు రాష్ట్రాల ప్రభుత్వాలకు కూడా సూచిస్తామని పేర్కొంది.

అక్రమ రవాణా నిరోధమే లక్ష్యం

ఎన్నికల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చెక్‌పోస్టుల్ని బలోపేతం చేస్తోంది. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు సరిహద్దుల రాష్ట్రాల నుంచి నగదు, మద్యం మొదలైనవాటిని రాష్ట్రంలోకి అక్రమంగా తరలించకుండా చూడటమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వ యంత్రాంగం ఇతర రాష్ట్రాల నుంచి దొంగ ఓటర్లు రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని నిర్దేశించుకుంది. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి పరిధిలోని యానాం రాష్ట్రానికి సరిహద్దులు. వీటితో రాష్ట్రానికి పొడవైన సరిహద్దు ప్రాంతం ఉంది. అందుకే అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులను మూడు రెట్లు పెంచింది. 2019 వరకు రాష్ట్రంలో 46 అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులు ఉండేవి. కాగా తాజాగా ఆరు కేటగిరీల కింద వీటి సంఖ్యను 139కి పెంచడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీటిలో పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, అటవీశాఖ, జీఎస్టీ, రవాణాశాఖల పరిధి లోని చెక్‌పోస్టులు, ఈ శాఖలన్నింటితో కలిపి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఉన్నాయి. ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులకు 12 మంది చొప్పున, ఇతర చెక్‌పోస్టులకు ఆరుగురు వంతున సిబ్బందిని కేటాయించారు. వీరు సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతిస్తున్నారు.

మన సరిహద్దుల్లో ఆయా రాష్ట్రాలవి 56 చెక్‌పోస్టులే..

ఎన్నికల ఏర్పాట్లలో సరిహద్దు రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ మెరుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. అంతర్‌రాష్ట్రసరిహద్దుల వద్ద మన రాష్ట్రం 139 చెక్‌పోస్టులను ఏర్పాటు చేయగా.. ఆయా రాష్ట్రాల్లో మన సరిహద్దుల్లో 56 చెక్‌పోస్టులు మాత్రమే ఉన్నాయి. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ యానాం పరిధిలో మన రాష్ట్ర సరిహద్దుల్లో కేవలం 56 చెక్‌పోస్టులున్నాయి. వీటిలో పోలీస్ శాఖవి తొమ్మిది, ఎస్ఈబీ (ఎక్సైజ్)ది ఒకటి, జీఎస్టీ శాఖవి ఐదు, ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు 41 ఉన్నాయి. ఆ రాష్ట్రాలు కూడా చెక్‌పోస్టుల సంఖ్యను పెంచి నిశితంగా తనిఖీలు చేసేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది. రెండువైపులా ముమ్మర తనిఖీల ద్వారా ఎన్నికల సమయంలో మద్యం, నగదు అక్రమ రవాణాను అడ్డుకోగలమని రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర ఎన్నికల కమిషన్ ఆయా రాష్ట్రాలకు ఆదేశాలు జారీచేస్తామని పేర్కొంది.

తెలంగాణ

మా తాత పీవీ ఆత్మ శాంతించి ఉంటుంది: ఎన్వీ సుభాష్

సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వీక్షించి ఉంటే ఎంతో సంతోషించే వారని ఆయన మనవడు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ పేర్కొన్నారు. నాడు రామమందిర అంశంలో పీవీ అనవసర ఆరోపణలు ఎదుర్కొన్నారని, అయినప్పటికీ ఈ క్రతువుని చూసి ఆయన ఆత్మ శాంతించిందని భావిస్తున్నామని చెప్పారు. రామభక్తుల 500 ఏళ్ల పోరాటం ఫలించడంతో నోటి వెంట మాటలు రావడం లేదని సుభాష్ భావోద్వేగానికి లోనయ్యారు. రథయాత్రతో అయోధ్య పోరాటానికి నాంది పలికిన ఎల్‌కే అద్వానీ, వీహెచ్‌పీ సహా సంఘ్ పరివార్.. ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగిందన్నారు. ఈ విషయంలో ఏ ఒక్కరి పాత్రను తక్కువ చేసి చూడలేమని, కరసేవకుల త్యాగాలు విస్మరించలేమని కొనియాడారు. కార్యక్రమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ముస్లిం సోదరులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని సుభాష్ చెప్పారు.

పసుపు మయమైన కొమురవెల్లి

- ఘనంగా పెద్దపట్నం, అగ్నిగుండం

కొమురవెల్లి (సిద్దిపేట): సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఆలయతోట బావి ప్రాంగణంలో నగరానికి చెందిన యాదవులు పెద్దపట్నం, అగ్నిగుండం నిర్వహించారు. భక్తులు బండారిని (పసుపు) చల్లుకోవడంతో ఆలయ పరిసరాలన్నీ పసుపుమయమయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన భక్తుడు మానుక పోచయ్య వంశస్తులు మొదటి వారం అనంతరం అగ్నిగుండం, పెద్ద పట్నం నిర్వహించే ఆనవాయితీ ఉంది. ఒగ్గు పూజారులు పంచవర్ణాల పిండితో పెద్దపట్నం వేశారు. పంచ పల్లవాలతో (మామిడి, జువ్వి, రాగి, మేడి, మర్రి) నిప్పు చేసి అగ్నిగుండం వేశారు. ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దపట్నం, అగ్ని గుండం దాటి ఆలయంలోని మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మరోసారి 'వ్యూహం'ను రివ్యూ చేయండి

- తెలంగాణ హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ దర్శకత్వం వహించిన 'వ్యూహం' చిత్ర విడుదలకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ) ఇచ్చిన సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. రివైజింగ్ కమిటీ ఇచ్చిన నివేదికలో లోటుపాట్లు ఉన్నాయని పేర్కొంటూ మరోసారి రివ్యూ చేయాలని సీబీఎఫ్‌సీని ఆదేశించింది. మూడు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని చెబుతూ పిటిషన్‌ను అనుమతించింది. 'వ్యూహం' చిత్రానికి సీబీఎఫ్‌సీ సర్టిఫికెట్ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ టీడీపీ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సూరేపల్లి నందా ఈ నెల 11న తీర్పు రిజర్వు చేసి సోమవారం తీర్పు వెలువరించారు. కాగా, సింగిల్ జడ్జి ఆదేశాలను చిత్ర నిర్మాత ద్విసభ్య ధర్మాసనం వద్ద ఒకట్రెండు రోజుల్లో సవాల్ చేసే అవకాశముంది.

లైంగికదాడి కేసులో నిందితుడికి 34 ఏళ్ల జైలు

- సూర్యాపేట జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి తీర్పు

చివ్వెంల(సూర్యాపేట): బాలికపై లైంగికదాడి, కిడ్నాప్, బాల్యవివాహం కేసుల్లో ఓ నిందితుడికి 34 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి అమరావతి సోమవారం తీర్పు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం రాంపురం తండాకు చెందిన గంట మహేశ్ ప్రేమ, పెళ్లి పేరిట అదే తండాకు చెందిన బాలిక(16) వెంటపడ్డాడు. ఈ క్రమంలో ఒకరోజు బాధితురాలి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెపై లైంగికదాడి చేశాడు. ఈ క్రమంలో 2021 డిసెంబర్ 27న కాలేజీకని బాలిక బయలుదేరింది. మోతె మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉన్న బాలికకు మహేశ్ మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లాడు. ఉర్లుగొండ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆమె మెడలో తాళి కట్టాడు. అక్కడ నుంచి సూర్యాపేటకు, ఆ తర్వాత హైదరాబాద్‌కు తీసుకువెళ్లాడు. రామచంద్రపురంలో ఒక గది అద్దెకు తీసుకుని కొన్ని రోజులపాటు ఆమెను శారీరకంగా అనుభవించాడు. కాలేజీకి వెళ్లిన కుమార్తె ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహేశ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అతడు 2022 జనవరి 5వ తేదీన బాలికను మోతె మండల కేంద్రంలో వదిలిపెట్టాడు. ఇంటికి వెళ్లిన బాధితురాలు జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వివరించారు. దీంతో పోలీసులు మహేశ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి సాక్షులను విచారించి నిందితుడికి పోక్సో యాక్టు కింద 20 ఏళ్లు, కిడ్నాప్ కేసులో 10 ఏళ్లు, బాల్య వివాహం, బంధించినందుకు నాలుగేళ్లు మొత్తం 34 సంవత్సరాల జైలుశిక్షతోపాటు రూ.60 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రాజకీయ స్వార్థం కోసమే షర్మిల మాటలు

• ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు: రాజకీయ స్వార్థం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదని షర్మిల చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పేదరిక నిర్మూలన కోసం అవినీతికి తావు లేకుండా, లంచాలు లేకుండా రూ.2.50 లక్షల కోట్లు డీబీటీ ద్వారా ప్రజలకు ఇచ్చారని వివరించారు. ప్రాంతీయ పార్టీలకు అధికారం ఇస్తే అహంకారం వస్తుందని మాట్లాడడం తగునా అని ప్రశ్నించారు.జగనన్న చేతిలో ఉన్నంత వరకే షర్మిల పదునైన బాణం అని, ప్రస్తుతం ఆ బాణానికి పదును తగ్గిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఆంధ్రప్రదేశ్‌ను రెండుగా చీల్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో చచ్చిపోయిందన్నారు. షర్మిలను ఏపీసీసీ అధ్యక్షురాలిగా మాత్రమే చూస్తామని, వైఎస్ రాజశేఖరరెడ్డి బిడ్డగా చూడలేమని స్పష్టం చేశారు. సుపరిపాలన ద్వారా జగన్ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, ఆయనను గద్దె దించడం ఎవరి తరం కాదని రాచమల్లు తెలిపారు.

'కోనసీమ' కేసుల ఉపసంహరణ జీవో రద్దు చేయండి

• హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిన అంబేడ్కర్ జిల్లా సాధన సమితి



సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా పేరు పెట్టిన సమయంలో చెలరేగిన అల్లర్లకు సంబంధించి పలువురిపై నమోదైన కేసుల ఉపసంహరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 20న జారీ చేసిన జీవో 1566ను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ జీవోను రద్దు చేయాలని కోరుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా సాధన సమితి కన్వీనర్ జంగా బాబురావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇందులో రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. 'జిల్లాకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సంఘ విద్రోహ శక్తులు పట్టణంలో విధ్వంసం సృష్టించాయి. మంత్రి ఇంటికి నిప్పు పెట్టడమే కాకుండా.. అధికార పార్టీ నేతల ఇళ్లపై, పోలీసులపై దాడులు చేశాయి. దీనిపై పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి.. అరెస్టులు చేశారు. ఈ కేసులను ఉపసంహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవో జారీ చేసింది. సంబంధిత కోర్టుల్లో కేసుల ఉపసంహరణ కోసం పిటిషన్లు వేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు స్పష్టం చేయాలని డీజీపీని ప్రభుత్వం ఆదేశించింది. తీవ్రమైన అభియోగాలు ఎదుర్కొంటున్న వారిపై కేసులను ఉపసంహరించడానికి వీల్లేదు. బల్వంత్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ కేసుతో పాటు పలు ఇతర కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు ఈ జీవో విరుద్ధం. కేసులను ఎందుకు ఉపసంహరించుకోవాలని నిర్ణయించిందో ఆ కారణాలను ప్రభుత్వం జీవోలో పేర్కొనలేదు. ఈ వ్యాజ్యంపై నిర్ణయం వెలువడే వరకు జీవో అమలును నిలుపివేయండి' అని పిటిషనర్ హైకోర్టును కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

'తూర్పు' బరిలో డిష్యుం..డిష్యుం



నివురుగప్పిన నిప్పులా టీడీపీలో విభేదాలు

• తోడైన జనసేన వర్గాలు
• అధినేత చంద్రబాబు వైఖరితో అగ్నికి మరింత ఆజ్యం
• గోపాలపురంలో మద్దిపాటిని వ్యతిరేకిస్తున్న బాపిరాజు
• బాబు వద్ద తేలని పంచాయితీ
• నిడదవోలులో టీడీపీ అభ్యర్థిత్వంపై అయోమయం
• కొవ్వూరులో ఎస్సీ నేత, మాజీ మంత్రి జవహర్‌ను పార్టీ కార్యక్రమాలకు దూరం పెట్టి అవమానం
• రాజానగరం జనసేనకంటూ..



మద్దిపాటి వెంకట్రాజు, వెంకటేశ్వరరావు

సాక్షి, రాజమహేంద్రవరం: తూర్పు గోదావరి జిల్లా టీడీపీలో వర్గ విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఒక్కో నియోజకవర్గంలో రెండు మూడు వర్గాలుగా విడిపోయిన ఆ పార్టీ నేతలు కయ్యాలకు కాలు దువ్వుతున్నారు. ఎమ్మెల్యే సీటు నాదంటే నాదంటూ బాహాటంగా ప్రకటించుకుంటూ తిరుగుతున్నారు. ఈ పరిణామం ఆ పార్టీ శ్రేణులను అయోమయానికి గురి చేస్తోంది. అభ్యర్థులపై స్పష్టత ఇవ్వాల్సిన టీడీపీ అధినేత చంద్రబాబు నాన్చుడు ధోరణి అవలంబిస్తూ అగ్నికి మరింత ఆజ్యం పోస్తున్నారు. పలుమార్లు జిల్లాలో పర్యటించిన బాబు స్వపక్ష నేతల మధ్య నెలకొన్న వైషమ్యాలను చక్కదిద్దలేక చేతులెత్తేశారు. దీనికి తోడు జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా ఎవరి సీటుకు ఎసరు వస్తుందోనన్న మీమాంస నెలకొంది. ఆది నుంచీ ఉన్న వారికి భంగపాటు తప్పదా? అనే ప్రశ్న తలెత్తుతోంది.

నిడదవోలులో 'సోషల్' వార్

నిడదవోలు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై స్వపక్షంలో అయోమయం ఏర్పడింది. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, టీడీపీ నేత కుందుల సత్యనారాయణలు సీటు కోసం నువ్వా నేనా? అనే రీతిలో చక్రం తిప్పుతున్నారు. అధినేత ప్రసన్నం కోసం ఎవరికి వారే కార్యక్రమాలు చేపడుతున్నారు. మరో అడుగు ముందుకేసి సోషల్ మీడియాలో వార్‌కు దిగారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మా నాయకుడే ఎమ్మెల్యే అవుతాడని ఇరు వర్గాలూ పోస్టులు పెడుతూండటంతో ద్వితీయ స్థాయి నాయకులు ఎవరి వెంట నడవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. తనకే కేటాయించాలని టీడీపీ అధిష్టానానికి కుందుల సత్యనారాయణ భారీగా ముట్టజెప్పినట్లు సమాచారం. ఇది చాలదన్నట్లు జనసేన నుంచి మరో ముగ్గురు బరిలోకి దిగేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. పవన్ కళ్యాణ్‌కు సన్నిహితంగా ఉండే సినీ నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్‌తో పాటు తణుకు జనసేన ఇన్‌చార్జ్ విడివాడ రామచంద్రరావు ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ఆశిస్తుండగా.. మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య కుమారుడు సూర్యప్రకాష్ సైతం రేసులో ఉన్నారు. పొత్తులో భాగంగా నిడదవోలు జనసేనకు కేటాయిస్తారని, తామే పోటీ చేస్తామని జనసేన నేతలు ధీమా వ్యక్తం చేస్తున్న అంశం టీడీపీ నేతల్లో మింగుడు పడటం లేదు.

రాజమహేంద్రవరం రూరల్‌లో తేలని పంచాయితీ

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే స్థానంపై టీడీపీ – జనసేన మధ్య నెలకొన్న పంచాయితీ నేటికీ కొలిక్కి రావడం లేదు. పొత్తు నేపథ్యంలో తనకే ఈ సీటు దక్కుతుందని జనసేన నేత కందుల దుర్గేష్ చెబుతూండగా.. తన స్థానంలో పోటీ చేసే ధైర్యం ఇతరులెవరికైనా ఉందా? తానే పోటీ చేస్తానని టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామం రెండు పార్టీల నేతల్లో విభేదాలకు ఆజ్యం పోస్తోంది.

గోపాలపురం.. గందరగోళం

గోపాలపురం నియోజకవర్గంలో వర్గ విభేదాలు ముదురు పాకాన పడుతున్నాయి. ఆది నుంచీ పార్టీ పటిష్టత కోసం పని చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి నుంచి తప్పించి.. ఆయన స్థానంలో మద్దిపాటి వెంకట్రాజును బాబు నియమించారు. కనీస సమాచారం లేకుండా ఎందుకు మార్చారని ముప్పిడి వర్గం చంద్రబాబును నిలదీసింది. వచ్చే ఎన్నికల్లో మద్దిపాటే పోటీ చేస్తారని బాబు ప్రకటించడంతో ఇరు వర్గాల మధ్య విభేదాల అగ్గి మరింతగా రాజుకుంది. అప్పటి నుంచీ ముప్పిడి వర్గం, ఎస్సీ సామాజిక వర్గ నేతలు టీడీపీ అధినేతపై గుర్రుగా ఉన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా.. ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరకపోగా తాడోపేడో తేల్చుకునేందుకు అధిష్టానం వద్ద బలప్రదర్శనకు దిగుతున్నారు.

కొవ్వూరులో ఎస్సీలకు అవమానం

ఎస్సీ రిజర్వు నియోజకవర్గమైన కొవ్వూరులో ఆ సామాజిక వర్గాలకు ఘోర అవమానం ఎదురవుతోంది. చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు నేతలకు పార్టీ పగ్గాలు అప్పగించి, తమకు అన్యాయం చేస్తున్నారని ఎస్సీ సామాజిక వర్గీయుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ మంత్రి కేఎస్ జవహర్‌కు జిల్లా పార్టీ పగ్గాలు అప్పగించినా కొవ్వూరు పార్టీ వ్యవహారాలకు ఆయనను దూరం పెట్టారు. పెండ్యాల అచ్చిబాబుకు అందలం వేయడం.. జవహర్‌కు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ద్వితీయ స్థాయి నేతలు పార్టీపై గుర్రుగా ఉన్నారు. దీనికి తోడు జనసేన నుంచి మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు కొవ్వూరు అభ్యర్థిత్వం తనదేనంటూ చెప్పుకుంటూండటంతో ఇరు వర్గాలూ కత్తులు దూస్తున్నాయి.

రాజానగరం.. గరంగరం

రాజానగరంలో రాజకీయం రంజుగా మారుతోంది. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా రాజానగరం జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదే జరిగితే సీటు తనకే వరిస్తుందని జనసేన నేత బత్తుల బలరామకృష్ణ ధీమా వ్యక్తం చేస్తున్నారు. జనసేన అధినేత పవన్‌తో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ తానే పోటీ చేస్తానని ప్రకటిస్తున్నారు. ఇదే క్రమంలో జనసేన అధిష్టానానికి భారీ స్థాయిలో పార్టీ ఫండ్ ఇచ్చారని.. అందుకే అంత ధైర్యంగా ఉన్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ పరిణామం ఇప్పటికే రాజానగరం నుంచి టీడీపీ టికెట్ ఆశిస్తున్న బొడ్డు వెంకట రమణ చౌదరి వర్గంలో అగ్గి రాజేస్తోంది. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న తనను కాదని, జనసేనకు టికెట్ ఇస్తారన్న ప్రచారం రెండు వర్గాల మధ్య చిచ్చు రేపుతోంది. మరోవైపు బొడ్డు వెంకట రమణ చౌదరిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంపై ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ వర్గం ఇప్పటికే పార్టీ అధినేతపై గరంగరంగా ఉంది. ఒకవేళ టీడీపీకే ఈ సీటు కేటాయించినా ఇటు పెందుర్తి వర్గం, అటు జనసేన శ్రేణులు వెంకట రమణ చౌదరికి జెల్ల కొట్టే అవకాశాలే కనిపిస్తున్నాయి. అలా కాదని జనసేనకే కేటాయించినా ఆ పార్టీ అభ్యర్థికి టీడీపీ వర్గాలు మద్దతు తెలిపే అవకాశాలు కనిపించడం లేదు.

సంక్షేమ పాలన కోసం వైఎస్సార్‌సీపీనే మళ్లీ గెలిపిద్దాం

• వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి పిలుపు
• ప్రజా సంక్షేమంలో సీఎం జగన్ ఏపీని అగ్రస్థానంలో నిలిపారు
• మంగళగిరిలో టీడీపీ కుట్రలను దీటుగా ఎదుర్కోవాలి
• నియోజకవర్గం కార్యకర్తలు, నేతలతో సమావేశం



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, చిత్రంలో మంగళగిరి ఇన్‌చార్జి చిరంజీవి

సాక్షి, అమరావతి: ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్ దేశంలోనే ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టారని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామని, అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం జగన్‌ని వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. తాడేపల్లిలో సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళగిరి నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు, నాయకులతో విజయసాయిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2014, 2019లో గెలిచిన విధంగానే వచ్చే ఎన్నికల్లో కూడా మంగళగిరిలో విజయం సాధించాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. బీసీ అభ్యర్థి గంజి చిరంజీవిని నియోజకవర్గ సమన్వయకర్తగా సీఎం వైఎస్ జగన్ నియమించారని, ఆయన విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం కుట్రలు చేయడంతో పాటు, విష ప్రచారాలు మొదలుపెట్టారని దీనిని దీటుగా ఎదుర్కోవాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తల మీద ఉందని ఆయన చెప్పారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు అయ్యాయని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా పార్టీ ప్రణాళికలను తయారు చేస్తున్నామన్నారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు మంగళగిరి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో త్వరలో జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశానికి మంగళగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, దుగ్గిరాల జెడ్పీటీసీ దానబోయిన సంతోష్ కృపారాణి, ఎంపీపీ మేకతోటి అరుణ, నియోజకవర్గ పరిశీలకుడు రాపాక శ్రీనివాస్, పార్టీ నాయకులు దొంతిరెడ్డి వేమారెడ్డి, వేణుగోపాలరెడ్డి, చిల్లపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు, ఆంధ్రజ్యోతి ప్రతులు దహనం

నెహ్రూనగర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ పరిపాలన చేస్తుంటే పెత్తందారులు అడ్డుపడటం సిగ్గుచేటని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు గూడూరు నాని ముదిరాజ్ మండిపడ్డారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి మీకు నచ్చట్లేదా? అని ఎల్లో మీడియాను ప్రశ్నించారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం జగన్‌పై తమ అక్కసు వెళ్లగక్కుతూ చంద్రబాబు డైరెక్షన్‌లో విషపు రాతలు రాసిన ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను సోమవారం గుంటూరు లాడ్జి సెంటర్‌లో బీసీ నేతలు దహనం చేశారు.



ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను దహనం చేస్తున్న బీసీ సంఘ నాయకులు

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

చంద్రగిరి (తిరుపతి జిల్లా): డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా మరో 21 మంది స్వల్పంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురానికి చెందిన మీనాక్షి ట్రావెల్స్ బస్సు ఆదివారం రాత్రి సుమారు 40 మంది ప్రయాణికులతో చెన్నైకి బయలు దేరింది. తిరుపతి–మదనపల్లి జాతీయ రహదారి భాకరాపేట కనుమ దారిలో వచ్చే క్రమంలో డ్రైవర్ హరీష్ శివమొగ్గ బస్సును అతివేగంగా నడపడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఇదే సమయంలో అటుగా వస్తున్న కొంతమంది ప్రయాణికులు స్థానిక పోలీసులు, 108 సిబ్బందికి సమాచారం అందజేశారు. 108 సిబ్బంది క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

అసైన్డ్ భూముల సేకరణ పరిహారంపై కొత్త నిబంధన

సాక్షి, అమరావతి: అసైన్డ్ భూముల భూసేకరణకు సంబంధించి ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ చట్ట సవరణ చేసిన రాష్ట్ర ప్రభుత్వం అందులో స్వల్ప మార్పులు చేస్తూ ఇటీవల ఆర్డినెన్స్ జారీ చేసింది. అసైన్డ్ భూములను ప్రజా ప్రయోజనాల కోసం సేకరించినప్పుడు వాటికి అక్కడి మార్కెట్ విలువకు సమానమైన పరిహారాన్ని మాత్రమే చెల్లిస్తారు. ఆ ప్రాంతంలోని ఇతర భూముల యజమానులు సంప్రదింపులు లేదా కోర్టును ఆశ్రయించడం ద్వారా పొందుతున్న పరిహారం ఈ భూములకు వర్తించదని ఈ చట్టంలో స్పష్టం చేశారు. అసైన్డ్ భూముల పరిహారానికి సంబంధించి కోర్టు తీర్పు ప్రకారం కొన్ని ప్రత్యేక కేసుల్లో పరిహారం పెంచి ఇవ్వాల్సి వచ్చింది. దీన్ని ఆధారంగా చేసుకుని పరిహారాన్ని తమకూ పెంచి ఇవ్వాలని కోర్టులను ఆశ్రయించడంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. దీంతో మార్కెట్ విలువ ప్రకారమే పరిహారం లభిస్తుందని, కోర్టు తీర్పుల ఆధారంగా గతంలో పెంచి ఇచ్చిన పరిహారాలు ఇకపై ఎవరికీ వర్తించని విధంగా చట్టంలో మార్పులు చేశారు.

చంద్రబాబు వెంటే కరువు

'వైఎస్సార్ రైతు విజయ సంకల్ప పాదయాత్ర'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



అమడగూరు: చంద్రబాబు అధికారంలోకి వస్తే వెంటనే కరువు కూడా వచ్చేస్తుందని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని 193 చెరువులకు కృష్ణా జలాలను నింపే పనులకు శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆయన చేపట్టిన 'వైఎస్సార్ రైతు విజయ సంకల్ప పాదయాత్ర' నాలుగో రోజు సోమవారం అమడగూరు, ఓడీ చెరువు మండలాల్లో కొనసాగింది. పాదయాత్రలో భాగంగా మహమ్మదాబాద్ క్రాస్‌లో ప్రజలను ఉద్దేశించి శ్రీధర్‌రెడ్డి 2014 ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలను నిండా ముంచారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవోజ్వల ప్రాణప్రతిష్ట

అయోధ్య భవ్య మందిరంలో రామ్‌లల్లా దర్శనం ఆరంభం

ప్రధాన యజమాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా కమనీయ ఘట్టం

- స్వర్ణ వజ్రాభరణాలు, పుష్పమాలల అలంకరణతో మైమరిపించిన బాలరాముడు
- రామాలయంతో పాటు నగరమంతటా పూల వర్షం కురిపించిన సైనిక హెలికాప్టర్లు
- నిర్విఘ్నంగా పూర్తయిన చరిత్రాత్మక వేడుక, అయోధ్యలో ఉత్సవ వాతావరణం
- దేశ విదేశాల్లో ఘనంగా ఉత్సవాలు.. ఇళ్లలో రామజ్యోతి వెలిగించిన భక్తులు



సోమవారం బాలరాముని ప్రాణప్రతిష్ట సందర్భంగా శోభాయమానంగా అయోధ్య ఆలయం. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు, భక్తజన సందోహం.

సాక్షి, అయోధ్య: దేశ ప్రజలంతా ఎప్పుడెప్పుడా అని ఆత్రుతగా ఎదురు చూసిన అద్భుత, చరిత్రాత్మక ఘట్టం వైభవోపేతంగా, నిర్విఘ్నంగా జరిగింది. అయోధ్య భవ్య మందిరంలో రామ్‌లల్లా సోమవారం మధ్యాహ్నం ప్రాణప్రతిష్ట జరుపుకున్నాడు. దివ్యమంగళ రూపంతో, మందస్మిత వదనంతో ఐదేళ్ల నీలమేఘ రాముడు భక్తులకు దర్శనం ఇస్తున్నాడు. ప్రత్యక్షంగా వేలాది మంది, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది టీవీల్లో ఈ వేడుకను కనులారా తిలకించి ఆనంద పరవశులయ్యారు. బంగారు ధనస్సు, బాణంతోపాటు విలువైన స్వర్ణ వజ్రాభరణాలు, పూల దండలు, తులసి మాలలతో అద్భుతంగా అలంకరించిన మర్యాద పురుషోత్తముడి విగ్రహం చూపరులను మంత్రముగ్ధులను చేసింది. ప్రధాన యజమాని(కర్త) హోదాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఉత్సవాన్ని తన చేతుల మీదుగా నిర్వహించారు. అటంకాలేవీ లేకుండా అనుకున్న ముహూర్తానికే గర్భగుడిలో బాలరాముడి ప్రాణప్రతిష్ట జరిగింది. ఈ కార్యక్రమం తర్వాత నూతన భవ్య మందిరంపై సైనిక హెలికాప్టర్లతో పూల వర్షం కురిపించారు. మన రామయ్య అయోధ్య నగరానికి వచ్చేశాడంటూ ప్రధానమంత్రి మోదీ అతిథుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అయోధ్యలో జరిగిన రామ్‌లల్లా ప్రాణప్రతిష్టను పురస్కరించుకొని దేశ విదేశాల్లో లక్షలాది మంది భక్తులు వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. రాత్రి తమ ఇళ్లలో రామజ్యోతి వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు

అయోధ్యలో ప్రాణప్రతిష్ట ఉత్సవాలు సోమవారం ఉదయమే మొదలయ్యాయి. అతిథులు, ప్రముఖులు ఉదయం నుంచే బారులు తీరారు. సంప్రదాయ సంగీత కళాకారులు రాముడి భక్తి గీతాలు ఆలపించారు. సంగీత వాయిద్యాలతో ఆహూతులకు ఆధ్యాత్మిక పరిమళాలు పంచారు. ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి తొలుత అయోధ్య ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. పట్టు వస్త్రాలు, పూజా ద్రవ్యాలతో మధ్యాహ్నం ఆలయం లోపలికి అడుగుపెట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్‌తో కలిసి గర్భగుడి ఎదుట కొన్ని క్రతువులు నిర్వహించారు. అనంతరం గర్భగుడిలోకి ప్రవేశించారు. మోదీ వెంట భాగవత్‌తో పాటు యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులున్నారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు ప్రతిధ్వనిస్తుండగా, జైశ్రీరామ్ అనే నినాదాలు మార్మోగుతుండగా గర్భాలయం లోపల నరేంద్ర మోదీ అభిజిత్ ముహూర్తంలో 84 సెకన్ల వ్యవధిలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. బాలరాముడి పాదాలకు నమస్కరించారు. విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆ తర్వాత సాష్టాంగ ప్రణామం చేశారు. ప్రాణప్రతిష్ట ముగిశాక ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికనుంచి మోదీ ప్రసంగించారు.

కుబేర తిల శివాలయంలో మోదీ పూజలు

రామమందిరంలో ప్రాణప్రతిష్ట తర్వాత ప్రధాని మోదీ ఇదే ప్రాంగణంలో ఉన్న కుబేర తిల శివాలయాన్ని దర్శించుకొని, పూజలు చేశారు. శివలింగానికి జలాభిషేకం నిర్వహించారు. శివాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ప్రాచీన కుబేర తిల ఆలయాన్ని శ్రీరామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు అభివృద్ధి చేసింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జటాయువు పక్షి విగ్రహాన్ని మోదీ ఆవిష్కరించారు. బాధ్యతల నిర్వహణలో జటాయువు పట్టుదలను ఆయన గుర్తుచేసుకున్నారు.

రామో విగ్రహవాన్ ధర్మః

- అద్భుత రూపంతో ఆకట్టుకుంటున్న బాలరాముని దివ్యమంగళ మూర్తి
- పీతవస్త్రం, ముచ్చటైన కిరీటం, స్వర్ణాభరణాలు, తులసి దళాలతో కనువిందు

సాక్షి, న్యూఢిల్లీ: మందస్మిత వదనం. విశాల వక్షస్థలం. చేత విల్లంబులు. ముద్దొచ్చే రూపం. అయోధ్య ఆలయంలో కొలువుదీరిన బాలరాముడు నఖశిఖ పర్యంతమూ రామచరితమానస్‌లో వర్ణించినట్టే శోభాయమానంగా ఉన్నాడని భక్తులు మురిసిపోతున్నారు. పచ్చలు, కెంపులు పొదిగిన కిరీటం, ఆభరణాలు, ముత్యాల దండలు, బంగారు దండ, మణికట్టుకు కడియాలు, పచ్చల కంఠాభరణం, వక్షస్థలంపై పేటల గొలుసు, కుడి చేత బాణం, ఎడమ చేత విల్లు, బంగారు జరీతో కూడిన పసుపు రంగు ధోతీ, ఎర్రని అంగ వస్త్రం, తులసిదళాల మాలతో బాలరాముడు ముచ్చటగొలుపుతున్నాడు. విగ్రహం ఆర్చికి ఇరువైపులా స్వస్తిక్, ఓం, చక్రం, గద, దశావతారాలైన మత్స్య, కూర్మ, వరాహ నృసింహ, వామన, పరశురామ, రామ, శ్రీకృష్ణ, బుద్ధ, కల్కి, గరుత్మంతుడు, హనుమంతుడు ఉన్నారు. ఆభరణాల రూపకల్పన కోసం వాల్మీకీ, తులసీ, అధ్యాత్మ రామాయణాలను సమగ్ర అధ్యయనం చేసినట్టు ఆలయ ట్రస్టు పేర్కొంది.

నేటినుంచి దర్శనం

మంగళవారం బాలరాముడు భక్తులకు దర్శనమివ్వనున్నాడు. రామ వనవాసాన్ని గుర్తుకు తెచ్చేలా రోజూ 14 గంటలపాటు ప్రజలకు స్వామి దర్శనం ఉంటుంది.

11 రోజుల అనుష్ఠానం విరమించిన ప్రధాని మోదీ

అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట అనంతరం ప్రధాని మోదీ 11 రోజుల అనుష్ఠాన దీక్షను ముగించారు. శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు కోశాధికారి గోవింద్ దేవ్‌గిరి మహారాజ్ ప్రధానికి చరణామృతం (ఉపచారాలకు వాడే పాలతో చేసిన తీపి పానీయం) ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఆయన పాదాలకు ప్రధాని నమస్కరించారు. ఉపవాస దీక్షను కొనసాగించిన మోదీ భక్తిని దేవ్‌గిరి ప్రశంసించారు. అనుష్ఠానం ఆసాంతం మోదీ కటిక నేలపై శయనిస్తూ కొబ్బరి నీళ్లు మాత్రమే తీసుకున్నారు. రోజూ గంటా 11 నిమిషాల పాటు మంత్ర జపం, ధ్యానం చేశారు.

రామాలయ కార్మికులకు ఘనంగా సన్మానం

అయోధ్య రామ మందిర నిర్మాణంలో భాగస్వాములైన కార్మికులను ప్రధాని మోదీ ఘనంగా సన్మానించారు. ప్రాణప్రతిష్ట అనంతరం కార్మికులపై ఆయన కృతజ్ఞతాపూర్వకంగా పూలు చల్లారు. దాంతో ప్రాణప్రతిష్టకు హాజరైన వంద మందికి పైగా కార్మికులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.





రామ్‌లల్లా పాత విగ్రహానికి పూజలు చేస్తున్న మోదీ



ప్రాణ ప్రతిష్ట అనంతరం బాలరామునికి మోదీ తొలి హారతి



రామ్‌లల్లాకు సాష్టాంగ ప్రణామం చేస్తున్న ప్రధాని మోదీ



మోదీ ఉపవాస దీక్షను విరమింపజేస్తున్న మహంత్ నృత్య గోపాల్ దాస్

అయోధ్య పురవీధుల నిండా... ప్రతిధ్వనించిన 'మంగళధ్వని'

అయోధ్య: రామాలయంలో ప్రాణప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 50 సంప్రదాయ సంగీత పరికరాల 'మంగళ ధ్వని'అయోధ్యలో ప్రతిధ్వనించింది. అయోధ్యకు చెందిన ప్రముఖ కవి యతీంద్ర మిశ్రా సారథ్యంలో కార్యక్రమం జరిగింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఘటం, యూపీ నుంచి పంఖవాజ్, ఫ్లూట్, ఢోలక్, కర్ణాటక నుంచి వీణ, పంజాబ్ నుంచి అల్గోజా, మహారాష్ట్ర నుంచి సుందరి, ఒడిశా నుంచి మర్దాలా, మధ్యప్రదేశ్ నుంచి సంతూర్, మణిపూర్‌కు చెందిన పుంగ్, అస్సాంకు చెందిన నగద, కలి, ఛత్తీస్‌గఢ్ నుంచి తెచ్చిన తంబుర తదితరాలు వీటిలో ఉన్నాయి. అంతకుముందు, సోను నిగమ్, అనురాధా పొడ్వాల్, శంకర్ మహదేవన్ పలు గీతాలు ఆలపించారు.

అయోధ్య అంతటా ఉత్సవ వాతావరణమే

ఆర్మీ హెలికాప్టర్లు ఆలయ ప్రాంగణంతోపాటు అయోధ్య వీధుల్లో పూల వర్షం కురిపించాయి. ఆలయాలు, భవనాలు, ఇళ్లను విద్యుద్దీపాలతో అలంకరించారు. రామ్‌పథ్, ధరమ్ పథ్‌లను సుందరంగా తీర్చిదిద్దారు. ఇక్కడి ల్యాంప్ పోస్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సామూహిక భోజనశాలలు భక్తులకు వేడివేడిగా ఆహార పదార్థాలు అందించాయి.

ఆహూతులను ఆకట్టుకున్న నృత్య, సంగీత ప్రదర్శనలు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రాణ ప్రతిష్ఠ వేడుకను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన నృత్య, సంగీత,నాటక ప్రదర్శనలు మంత్రిముగ్ధుల్ని చేశాయి. రామ చరితతోపాటు, 500 ఏళ్ల నుంచి రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ వరకు జరిగిన విశేషాలను ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. 'బధాయ్, చారీ, గూమర్, భవాయ్, ఝుమర్, ధోబియా, రాయ్, రస్లీల, మయూర్, ఖయాల్ నృత్యం, సతారియా'వంటి జానపద నృత్యాలతో కళాకారులు అమితానందం కల్గించారు. భరతనాట్యం, ఒడిస్సీ, కూచిపూడి, మణిపూరి, మోహిని ఆట్టం, కథాకళి, కథక్ వంటి భారతీయ శాస్త్రీయ నృత్యాల ప్రదర్శనలు జరిగాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ప్రాణ ప్రతిష్ఠ ముగిసేదాకా ఈ నృత్య ప్రదర్శనలు జరిగాయి. సినీ, క్రీడా రంగ ప్రముఖులు, వ్యాపార, రాజకీయ దిగ్గజాలు ఈ నృత్య, సంగీత, నాటక ప్రదర్శనలను సెల్‌ఫోన్లలో బంధించారు. చలనచిత్ర, సంగీత కళాకారులు బాల రాముడిపై అభిమానాన్ని పాటల రూపంలో చాటారు. ప్రముఖ సంగీత కళాకారులు శంకర్ మహదేవన్, సోను నిగమ్ 'రామ్ భజన్' చేశారు. అనురాధ పౌడ్‌వాల్, మాలినీ అవస్థీ 'రామాష్టకం'తో అలరించారు. 'రాం సియా రాం' అంటూ సోను నిగం పాడిన పాట ఆకట్టుకుంది.

రామ భక్తి పారవశ్యంలో ఓలలాడిన భారతావని

కొట్టాయం/రాంచీ: అయోధ్యలో వేడుక స్వయంగా తమ ఇంట్లో, తమ వీధిలో జరిగినంత ఆనందంతో యావత్ భారతదేశ ప్రజలు పండుగలా జరుపుకున్నారు. అన్ని రాష్ట్రాల ప్రజలు స్థానిక ఆలయాలు, మైదానాలు, కూడళ్ల వద్ద ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో దేశవ్యాప్త పండగ వాతావరణాన్ని తెచ్చారు. ఇంటి ముందు ముగ్గులతో, గుమ్మాలకు తోరణాలతో తెల్లవారుజాము నుంచే పండగ సంబరం కనిపించింది. ఆలయాలను సందర్శించి అక్కడి పూజా కార్యక్రమాలు, భజనలు, సంకీర్తనల్లో పాల్గొన్నారు. రాజస్తాన్‌లో భారత్–పాక్ సరిహద్దు వెంట తనోత్ మాతా ఆలయంలో బీఎస్‌ఎఫ్ సైనికులు రామాయణం పఠించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని షిమ్లాలో 'అఖండ్ రామాయణ్' పఠనం జరిగింది. సాయంత్రం ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సముదాయాల వద్ద ఐదు ప్రమిదలను వెలిగించి దీపావళి జరుపుకున్నారు. రాత్రిపూట బాణసంచా భారీ ఎత్తున కాల్చారు. ఆ పిల్లాడి పేరు రామ్ రహీమ్: ప్రాణప్రతిష్ట దివ్యముహూర్తంలో జన్మించిన తన కుమారుడికి ఒక ముస్లిం మహిళ 'రామ్ రహీమ్' అని పేరు పెట్టి మతసామరస్యాన్ని చాటారు. ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో ఈ పిల్లాడు సోమవారం మధ్యాహ్నం జన్మించాడు.

ప్రపంచ నలుమూలల్లోనూ ఘనంగా ప్రాణప్రతిష్ట వేడుకలు

వాషింగ్టన్/పోర్ట్ ఆఫ్ స్పెయిన్: అయోధ్య రామమందిరం ప్రాణప్రతిష్ఠ మహోజ్వల ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారాల్లో చూసి ప్రపంచవ్యాప్తంగా భక్తులు పులకించిపోయారు. ఆస్ట్రేలియా నుంచి అమెరికా దాకా సంబరాలు జరుపుకున్నారు. న్యూయార్క్‌లో ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్ కూడలి వద్ద భారీ తెరలపై వందలాది భారతీయ అమెరికన్లు వేడుకను వీక్షించారు. సంప్రదాయ వస్త్రధారణలో భజనలు, కీర్తనలు చేశారు.

పాకిస్తానీ ముస్లింలు సైతం..

అమెరికాలో వర్జీనియా రాష్ట్రం ఫెయిర్‌ఫాక్స్ కౌంటీలోని శ్రీవెంకటేశ్వర లోటస్ టెంపుల్ వద్ద సిక్కులు, ముస్లింలు, పాకిస్తానీ అమెరికన్లు, క్రైస్తవులు సైతం వేడుకల్లో పాలుపంచుకున్నారు. అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజీ 'నాస్‌డాక్' స్క్రీన్ మీదా కోదండరాముని చిత్రాన్ని ప్రదర్శించారు. లాస్‌ఏంజిలెస్‌లో 1,000 మందికిపైగా 250 కార్ల ర్యాలీ చేపట్టారు. పారిస్‌లో ఈఫిల్ టవర్ వద్ద భారతీయులు జై శ్రీరామ్ అని నినాదాలు చేశారు. ట్రినిడాడ్, టొబాగో, మారిషస్, ఫిజీ, స్పెయిన్ తదితర దేశాల్లో సంబరాలు జరిగాయి. మెక్సికోలో తొలి రామాలయాన్ని అయోధ్య ప్రాణప్రతిష్ఠ ముహూర్తంలోనే ప్రారంభించారు.

రామ జ్యోతి వెలిగించిన మోదీ

న్యూఢిల్లీ: అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ట అనంతరం ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పలువురు బీజేపీ నేతలు సోమవారం సాయంత్రం తమ ఇళ్లలో దీపాలు వెలిగించారు. ప్రధాని మోదీ లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ఏడో నంబర్ అధికార నివాసంలో రాముడి విగ్రహం చిత్ర పటం ఎదుట దివ్వె వెలిగిస్తున్న ఫొటోలను 'ఎక్స్'లో షేర్ చేశారు. ఈరోజు దేశమంతా దీపావళి వేడుక జరుపుకుంటోంది. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో కుటుంబసభ్యులతో కలిసి రామజ్యోతిలను వెలిగించాలని కోరారు. నితిన్ గడ్కరీ తన నివాసంలో కుటుంబసభ్యులు, బధిరుల పాఠశాల విద్యార్థులతో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా తన నివాసంలో దివ్వె వెలిగించారు. ఇది చారిత్రక దినమని పేర్కొన్నారు.



రూ.11 కోట్ల కిరీటం

అయోధ్య: అయోధ్య రామ్‌లల్లాకు సూరత్‌కు చెందిన వజ్రాల వ్యాపారి ముకేశ్ పటేల్ రూ.11 కోట్ల విలువైన బంగారు కిరీటాన్ని కానుకగా అందజేశారు. నాలుగు కిలోల బంగారం, వజ్రాలు, విలువైన రాళ్లు పొదిగిన ఈ కిరీటం ఆరు కిలోలుంది. గ్రీన్‌ల్యాబ్ డైమండ్ కంపెనీ అధిపతి ముకేశ్ తన కుటుంబసభ్యులతో కలిసి సోమవారం ప్రాణప్రతిష్ట సందర్భంగా రామాలయ ట్రస్ట్ సభ్యులకు ఈ కిరీటాన్ని అందజేశారు.

ఒకే రోజు 100 విమానాలు

న్యూఢిల్లీ: అయోధ్య విమానాశ్రయంలో సోమవారం ఒకే రోజు 100 చార్టర్డ్ విమానాలు ల్యాండయ్యాయి. రామాలయం ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రముఖులు విచ్చేశారు. వివిధ సంస్థలు, వ్యక్తులు అయోధ్యకు 100 చార్టర్డ్ విమానాలను బుక్ చేసుకున్నారని, ఇందులో 50 వరకు జెట్ విమానాలున్నాయని బిజినెస్ ఎయిర్ క్రాఫ్ట్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెప్టెన్ ఆర్‌కే బాలి పీటీఐకి తెలిపారు.

అంబానీ కుటుంబం రూ. 2.51 కోట్ల విరాళం

అయోధ్య: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్ ముకేశ్ అంబానీ, ఆయన కుటుంబం సోమవారం అయోధ్యలో జరిగిన ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరయ్యారు. రూ.2.51 కోట్ల విరాళాన్ని ఆలయ ట్రస్టుకు అందజేయనున్నట్లు అనంతరం వారు ప్రకటించారు. ముకేశ్ అంబానీ, భార్య నీతా అంబానీతోపాటు, వారి కుమారులు అనంత్, ఆకాశ్, కూతురు ఇషా అంబానీ పాల్గొన్నారు.

32 ఏళ్లకు నెరవేరిన ప్రతిజ్ఞ

ముంబై: అయోధ్యలో బాలరాముడు కొలువుదీరిన నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి 32 ఏళ్ల తర్వాత పాదరక్షలు ధరించారు. 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం జరిగాక, అక్కడ రామాలయం నిర్మాణం జరిగేదాకా చెప్పులు ధరించనంటూ జల్గావ్‌లో పాన్‌షాప్ నడుపుకునే విలాస్ భవ్‌సర్ (60) ప్రతిజ్ఞ బూనారు. అప్పటి నుంచి కాళ్లకు ఎటువంటి పాదరక్షలు లేకుండానే గడిపారు.

ప్రపంచంలోనే అదృష్టవంతుణ్ని

శిల్పి అరుణ్ యోగిరాజ్



అయోధ్య: అయోధ్య రామాలయంలో సోమవారం ప్రతిష్ఠించిన రామ్‌లల్లా విగ్రహాన్ని మలిచి అందరి ప్రశంసలు అందుకున్న మైసూరు శిల్పి అరుణ్ యోగిరాజ్ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ బృహత్కార్యానికి రాముడే తనను ఎంచుకున్నాడని, ప్రపంచంలో తనకంటే అదృష్టవంతుడు ఇంకెవరూ ఉండరని అన్నారు. తనను, తన కుటుంబాన్ని అన్నివేళలా రాముడే కాపాడుతుంటాడని నమ్ముతున్నానని చెప్పారు. మైసూర్ యూనివర్సిటీలో ఎంబీఏ చదివాక అరుణ్ ఆరు నెలలపాటు ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేశారు. ఆ పని సంతృప్తినివ్వలేదు. నాలుగు తరాలుగా వారసత్వంగా వస్తున్న శిల్పకళా వృత్తినే ఎంచుకున్నారు. ''ఈ శిల్పాన్ని చెక్కే క్రమంలో నిద్రలేని రాత్రులు గడిపాను. అందుకు ఫలితం లభించింది. ఇది నా జీవితంలోనే సుదినం. ఈ కళను తండ్రి నుంచి నేర్చుకున్నాను. ఆయనుంటే నేను చెక్కిన విగ్రహాన్ని చూసి గర్వించే వారు'' అని అరుణ్ అన్నారు.

అత్యుత్తమ క్రిష్ణ శిల

రామ్‌లల్లాను మలిచేందుకు అరుణ్ యోగిరాజ్ ఉపయోగించిన రాయి దక్షిణ భారతంలోనే అత్యంత పురాతనమైందని మైసూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు చెప్పారు. దీని వయస్సు 300 కోట్ల సంవత్సరాలని ఆయన వివరించారు. అత్యుత్తమమైన ఈ క్రిష్ణ శిల గుజ్జెగౌడనపురలో లభించిందని చెప్పారు. ఆ స్థలం యజమాని రామదాస్ తన నాలుగు గుంటల స్థలాన్ని రామాలయ నిర్మాణానికి విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. ఆ స్థలంలో సోమవారం స్థానికులు పూజలు చేశారు. ఇక్కడ నిర్మించే ఆలయంలో ప్రతిష్ఠించేందుకు కూడా విగ్రహాన్ని మలచాలని అరుణ్ యోగిరాజ్‌ను స్థానికులు కోరారు.

మన రాముడొచ్చాడు





అయోధ్యలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పారవశ్యం

- శతాబ్దాల ఎదురుచూపులు, బలిదానాలు, త్యాగాలు, తపస్సులు ఫలించాయి
- బాలరాముడు ఇకపై డేరాలో ఉండడు.. భవ్య మందిరంలో శాశ్వత స్థానం
- జనవరి 22వ తేదీని వెయ్యేళ్ల తర్వాత కూడా ప్రజలు గుర్తుంచుకుంటారు
- రాజ్యాంగబద్ధంగానే రామాలయ నిర్మాణం జరిగింది
- శ్రీరాముడు నిప్పు కాదు.. ఒక శక్తి. వివాదం కాదు.. పరిష్కారం
- రాబోయే వెయ్యి సంవత్సరాల భారతదేశ నిర్మాణంపై ఇక దృష్టి పెట్టాలి
- రాముడి ఆశీస్సులతో దేశం కోసం పని చేస్తామంటూ మనమంతా ప్రతిజ్ఞ చేద్దాం
- రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట అనంతరం సభలో ప్రసంగించిన మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: అయోధ్యకు మన రాముడు వచ్చేశాడని ప్రధానమంత్రినరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు. అయోధ్య ఆలయంలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ సాకారమైన వేళ ప్రతి పౌరుడు ఇకపై దేశ భవిష్యత్ నిర్మాణ మార్గాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని పిలుపునిచ్చారు. మన దేశ పురోగమనానికి, ప్రగతికి రామ మందిరం గొప్ప సాక్షిగా ఉంటుందని చెప్పారు. 'వికసిత్ భారత్'కు ఈ రామ మందిరం సాక్షి అవుతుందని పేర్కొన్నారు. రాముడు ఈ దేశ విశ్వాసం, ఆలోచన, చట్టం, ప్రతిష్ట, వైభవం అని ఉద్ఘాటించారు. రాముడి ప్రభావం ఈ భూమిపై వేల సంవత్సరాలు పాటు కొనసాగిందని గుర్తుచేశారు. ఇదే సరైన సమయమని, రాబోయే వెయ్యేళ్ల భారతదేశానికి పునాది వేయాలని సూచించారు. అయోధ్య ఆలయంలోసోమవారం రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట అనంతరం నిర్వహించిన సభలో ప్రధాని మోదీ అతిథులు, ప్రముఖులు, సాధుసంతులు, భక్త జనులను ఉద్దేశించి దాదాపు 40 నిమిషాలపాటు ప్రసంగించారు. భవ్య మందిరం నిర్మాణం పూర్తయ్యిందని, ఒక దేశ నిర్మాణంపై దృష్టి పెట్టాలని చెప్పారు. బలమైన, సమర్థవంతమైన, దివ్య, భవ్య భారతదేశాన్ని నిర్మించడానికి మనం ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ప్రజల మనస్సాక్షిలో రాముడి ఆదర్శం ఉండాలని ఉద్బోధించారు. అయోధ్య సభలో ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

ప్రజల త్యాగానికి నా కృతజ్ఞతలు

''సమిష్టి తత్వంతో సంఘటితంగా, సమర్థవంతంగా పని చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు. ఇది భారతదేశ సమయం. దేశం మరింత ముందుకు సాగబోతోంది. శతాబ్దాల నిరీక్షణ తర్వాత ఇక్కడికి చేరుకున్నాం. మనమందరం ఈ యుగం కోసం, ఈ కాలం కోసం ఎదురు చూశాం. ఇప్పుడు మనం పరుగు ఆపబోం. అభివృద్ధిలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటాం. రామాలయాన్ని సుసాధ్యం చేసిన ప్రజల త్యాగానికి నా కృతజ్ఞతలు. సాధువులు, కర సేవకులు, రామభక్తులకు నా అభినందనలు. ఇది కేవలం శ్రీరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ మాత్రమే కాదు. శ్రీరాముడి రూపంలో వ్యక్తమయ్యే భారతీయ సంస్కృతిపై అచంచలమైన విశ్వాసాన్ని ప్రతిష్ఠించుకొనే కార్యక్రమం. మానవీయ విలువలు, అత్యున్నత ఆశయాలకు భారతీయ సంస్కృతి ప్రతిరూపం. ఇది యావత్ ప్రపంచానికీ అవసరం. ఇది రాముడి రూపంలో ఉన్న జాతీయ చైతన్య ఆలయం. శ్రీరాముడు భారతదేశ విశ్వాసం, పునాది, ఆలోచన, చట్టం, స్పృహ, ఆలోచన, ప్రతిష్ట, కీర్తి. రామ్ అనేది ఓ ప్రవాహం, ఓ ప్రభావం, ఓ నీతి, విశ్వవ్యాప్త ఆత్మ. శ్రీరాముని ప్రాణప్రతిష్ట ప్రభావం వేల సంవత్సరాల పాటు కొనసాగుతుంది.

నూతన కాలచక్రానికి నాంది

శతాబ్దాల ఎదురు చూపులు, ఎన్నో బలిదానాలు, లెక్కలేనన్ని త్యాగాలు, తపస్సుల తర్వాత ఎట్టకేలకు రాముడు మళ్లీ అయోధ్యకు చేరుకున్నాడు. ఈ శుభ సందర్భాన దేశ ప్రజలందరికీ నా శుభాకాంక్షలు. మన రామ్‌లల్లా ఇకపై డేరాలో ఉండడు. దివ్య మందిరంలో ఆయనకు శాశ్వత స్థానం లభించింది. జనవరి 22 అనేది కేవలం ఒక తేదీ కాదు. కొత్త కాలచక్రానికి ప్రతీక, నవశకానికి నాంది. వెయ్యేళ్ల తర్వాత కూడా ఈ తేదీని ప్రజలు గుర్తుపెట్టుకుంటారు. రామజన్మభూమి ఆలయ పూజ, అభివృద్ధి పనులు దేశ పౌరుల్లో కొత్త శక్తిని నింపాయి. రామ భగవానుడి ఆశీర్వాదం వల్లే ఈ మహత్తర సందర్భానికి మనం సాక్షిగా ఉన్నాం. రోజులు, దిశలు, ఆకాశాలు సహా ప్రతిదీ ఈ రోజు దైవత్వంతో నిండి ఉంది. ఇది సాధారణ కాలం కాదు. కాలక్రమేణా ముద్రించబడుతున్న చెరగని స్మృతి మార్గం. బానిస మనస్తత్వపు సంకెళ్లను తెంచుకుని, గత అనుభవాల నుంచి స్ఫూర్తి పొంది, చరిత్రను లిఖించే గొప్ప సందర్భమిది.

భారతీయుల హృదయాల్లో కొలువయ్యాడు

బాలరాముడి ప్రాణప్రతిష్టతో చిన్న చిన్న గ్రామాలతో సహా దేశం మొత్తం సంబరాలు చేసుకుంటోంది. దేవాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేశం మొత్తం ఈ రోజు దీపావళిని జరుపుకుంటోంది. సాయంత్రం వేళల్లో ప్రతి ఇంట్లో 'రామజ్యోతి' వెలిగించబోతున్నారు. రామసేతు ప్రారంభ బిందువు అయిన అరిచల్ మున్నైలో ఇటీవల పర్యటించా. రాముడు పాదం మోపిన అన్ని పవిత్ర ప్రదేశాలను 11 రోజుల అనుష్ఠాన సమయంలో సందర్శించా. నాసిక్‌లోని పంచవటీ ధామ్, కేరళలోని త్రిప్రయార్ దేవాలయం, ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షి, శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయం, రామేశ్వరంలోని శ్రీరామనాథస్వామి దేవాలయం, ధనుష్కోటీని సందర్శించా. సముద్రం నుండి సరయూ నది వరకు నా ప్రయాణం సాగింది. రఘుకులోత్తమ రాముడు భారతదేశ ఆత్మకు చెందిన ప్రతి కణంతో అనుసంధానమై ఉన్నాడు. రాముడు భారతీయుల హృదయాల్లో కొలువయ్యాడు. భారతదేశంలో ఎక్కడైనా ప్రతి ఒక్కరి మనస్సాక్షిలో ఏకత్వ భావన కనిపిసుంది. సామూహికతకు ఇంతకంటే కచ్చితమైన సూత్రం మరొకటి లేదు. శ్రీరామ కథను అనేక భాషల్లో నేను ఆలకించాను. మన సంప్రదాయాలు, పండుగల్లో రాముడు ఉన్నాడు. ప్రతి యుగంలో ప్రజలు రాముడిని తలిచారు. తమదైన శైలిలో, మాటల్లో ఆ భగవంతుడిని వ్యక్తీకరించారు. ఈ 'రామ్‌రస్' జీవన ప్రవాహంలా నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. రామకథ అనంతం. రామాయణం అంతులేనిది. రాముడి ఆదర్శాలు, విలువలు, బోధనలు ప్రతిచోటా ఒకే విధంగా ఉంటాయి.

ప్రతి ప్రయత్నానికీ బలం, సహకారం

ప్రతి భారతీయుడిలోని భక్తి, సేవ, అంకితభావం, ఏకత్వం, ఐక్యత అనే భావాలు సమర్థవంతమైన, గొప్ప, దైవిక భారతావనికి ఆధారమవుతాయి. ప్రజలు దేవుడి నుండి దేశానికి(దేవ్ టూ దేశ్), రాముడి నుండి రాజ్యానికి(రామ్ టూ రాష్ట్ర) చైతన్యాన్ని విస్తరింపజేయాలి. రామభక్త హనుమాన్ సేవ, భక్తి, అంకితభావాన్ని చూసి ప్రజలు ఎంతో నేర్చుకోవచ్చు. దేశంలో నిరాశకు తావు లేదు. తమను తాము చిన్నవారుగా, సామాన్యులుగా భావించేవారు రామాయణంలో రామయ్యకు ఉడుత అందించిన సేవలను గుర్తు చేసుకోవాలి. సంకోచాన్ని వదులుకోవాలి. చిన్నదైనా, పెద్దదైనా ప్రతి ప్రయత్నానికీ బలం, సహకారం ఉంటుంది. విపరీతమైన జ్ఞానం, అపారమైన శక్తి కలిగిన లంకాధీశుడు రావణుడితో పోరాడి ఓడిపోతానని తెలిసి కూడా చిత్తశుద్ధితో కర్తవ్యాన్ని నిర్వర్తించిన జటాయువును ఆదర్శంగా తీసుకోవాలి. ప్రస్తుత అమృత కాలంలో యువత అకుంఠిత విశ్వాసంతో ముందుకు సాగాలి. సంప్రదాయ స్వచ్ఛత, ఆధునికతలను మేళవించడం ద్వారా భారతదేశం తన లక్ష్యాన్ని చేరుకుంటుంది. శ్రీరాముడి తోడ్పాటు, ఆశీస్సులతో దేశం కోసం పని చేస్తామంటూ మనమంతా ప్రతిజ్ఞ చేద్దాం'' అని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు.

న్యాయ వ్యవస్థకు ధన్యవాదాలు

శ్రీరాముడి ప్రతి పనిలో హనుమంతుడి ఉనికి తప్పనిసరిగా ఉంటుంది. సీతమ్మతో పాటు హనుమంతుడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడిని సైతం ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాలి. ఈ ఆలయ నిర్మాణ ప్రధాన ఘట్టంలో ఆధ్యాత్మిక సంస్థల పాత్ర మరువలేనిది. రామయ్యా.. నన్ను క్షమించు. అయోధ్యలో ఆలయ నిర్మాణం, ప్రాణప్రతిష్ట ఆలస్యమైనందుకు ప్రభు శ్రీరాముడిని క్షమాపణలు కోరుతున్నా. మన ప్రయత్నాలు, త్యాగాలు, తపస్సులో ఏదో లోటు జరిగిన కారణంగానే ఇన్ని శతాబ్దాలుగా అయోధ్యలో రామ మందిర నిర్మాణం చేయలేకపోయాం. రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్టతో నేడు ఆ లోటు తీరింది. శ్రీరాముడు మనల్ని తప్పకుండా ఈ రోజు క్షమిస్తాడని నమ్ముతున్నా. రామాయణ కాలంలో అయోధ్య నగరం శ్రీరాముడితో 14 ఏళ్ల పాటు వియోగం పొందింది. ఈ యుగంలో అయోధ్యవాసులు, దేశ ప్రజలు రాముడి వియోగాన్ని వందల ఏళ్లపాటు అనుభవించారు. మన దేశ రాజ్యాంగం అసలు ప్రతిలో శ్రీరాముడు ఉన్నప్పటికీ, మందిర నిర్మాణం కోసం సుదీర్ఘ న్యాయ పోరాటం జరిగింది. న్యాయం గౌరవాన్ని చెక్కుచెదరకుండా ఉంచినందుకు భారతదేశ న్యాయ వ్యవస్థకు నా ధన్యవాదాలు. శ్రీరాముడి ఆలయ నిర్మాణం రాజ్యాంగబద్ధంగానే జరిగింది. దైవ ఆశీర్వాదం, దైవిక ఆత్మల వల్లనే మందిర నిర్మాణం పూర్తయ్యింది.

నిప్పు కాదు శక్తి పుట్టింది

శ్రీరామ ప్రాణప్రతిష్ట సందర్భం కేవలం విజయానికి సంబంధించిన అంశం కాదు. ఇది వినయానికి సంబంధించినది. రామ్‌లల్లా ఆలయ నిర్మాణం శాంతి, సహనం, పరస్పర సామరస్యం, భారతీయ సమాజంలోని సమన్వయానికి ప్రతీక. అయోధ్యలో ఆలయం నిర్మిస్తే దేశం అగ్నిగుండం అవుతుందని కొందరు హెచ్చరించారు. పునరాలోచన చేయాలని వారిని కోరుతున్నా. ఈ కట్టడం వల్ల ఏ నిప్పూ పుట్టడం లేదు, శక్తి పుట్టడం చూస్తున్నాం. ఉజ్వల భవిష్యత్తు బాటలో ముందుకు సాగేందుకు రామమందిరం సమాజంలోని ప్రతి వర్గానికీ స్ఫూర్తినిస్తోంది. రాముడు నిప్పు కాదు.. అతడొక శక్తి. అతడు వివాదం కాదు.. పరిష్కారం. రాముడు మనకు మాత్రమే కాదు, అందరికీ చెందినవాడు. రాముడు అనంతుడు. 'వసుదైవ కుటుంబకమ్' ఆలోచనే రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట. దేశంలో నేడు నిరాశావాదానికి చోటు లేదు. హనుమ, ఉడత, జటాయువుల నుంచి కూడా కొత్త విషయాలు నేర్చుకుందాం.


సోమవారం అయోధ్య ఆలయంలో బాలరాముని ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సంప్రదాయ వస్త్రధారణలతో గర్భాలయ ప్రవేశం చేస్తున్న ప్రధాని మోదీ

జాతి మందిరమిది: యోగి

సాక్షి, న్యూఢిల్లీ: అయోధ్య వీధుల్లో ఇకపై బుల్లెట్ల మోతలు, కర్ఫ్యూలు ఉండవని, దీపోత్సవాలు, రామోత్సవాలు మాత్రమే జరుగుతాయని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. అయోధ్య వీధులు ఇకపై రామ నామ సంకీర్తనలతో మార్మోగుతాయన్నారు. అయోధ్య లో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్టతో 500ఏళ్ల కల సాకారమైందని, కోట్లాది ప్రజల విశ్వాసం నెరవేరిందని, ఇది అలౌకిక ఆనంద క్షణమన్నారు. రామ మందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ట అనంతరం ఆయన మాట్లాడారు. ''అయోధ్యలో శ్రీరాముడు మళ్లీ కొలువుదీరడం త్రేతాయుగాన్ని తలపిస్తోంది. ఇది జాతి మందిరం! భగవంతునికి తన జన్మ స్థలిలో ఆలయ నిర్మాణం కోసం దేశంలోని మెజారిటీ సామాజిక వర్గం ఇలా ఏకంగా 500 ఏళ్లు ఎదురు చూడాల్సిన రావడం ప్రపంచంలోనే తొలిసారి! ఎట్టకేలకు సంకల్పించిన చోటే భవ్యమైన ఆలయ నిర్మాణం జరిగింది. 'మందిర్ వహీ బనాయేంగే (ఆలయాన్ని అక్కడే నిర్మిస్తాం)' అన్న వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాం. ఈ మహత్తర కార్యక్రమాన్ని చూడడం ఈ తరం అదృష్టం' అని అన్నారు.

ఆత్మగౌరవం తిరిగొచ్చింది: మోహన్ భాగవత్

అయోధ్య మందిరంలోకి 500 ఏళ్ల తర్వాత రాముని ఆగమనంతో దేశ ఆత్మగౌరవం తిరిగొచ్చిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ఇకనుంచి విభేదాలు మరచి కలిసి సాగుదామని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రాణ ప్రతిష్ట అనంతరం ఆయన మాట్లాడారు. '' ఈ ఆనందమయ క్షణం కోసం ఎన్నో తరాలు రక్తాన్ని, చెమటను ధారపోశాయి. రాముని దయ వల్లే ఈ స్వర్ణమయ రోజును చూస్తున్నాం'' అని పిలుపునిచ్చారు.



సాధ్వీ రితంబర కంటతడి


రవిశంకర్ ప్రసాద్ ఉద్వేగం


ఉమాభారతి


బాబా రామ్‌దేవ్


కంగనా రనౌత్



అనుపమ్ ఖేర్


జాకీష్రాఫ్


మిథాలీరాజ్, సైనా నెహ్వాల్


పీటీ ఉష, చిరంజీవి దంపతులు, రామ్‌చరణ్


సచిన్, రజనీకాంత్


ముకేశ్ అంబానీ దంపతులు


రణ్‌బీర్ దంపతులు, విక్కీ కౌశల్ తదితరులు


సాధు సంతులు, మహంతులు

ప్రముఖుల సందడి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని మోదీ ప్రధాన కర్తగా ఉండి జరిపించిన ప్రాణప్రతిష్ఠ క్రతువుకు అన్ని రంగాల దిగ్గజాలు సాధారణ ప్రేక్షకుల్లా మారి ఆసాంతం ఆస్వాదించారు. గంటలకొద్దీ సమయం వేచి ఉండి రామదర్శనం చేసుకున్నారు.

కుటుంబంతో కలసి మళ్లీ వస్తా

జనవరి 22వ తేదీ చారిత్రాత్మకమైన రోజు. నాతో పాటు దేశ ప్రజలు, ప్రపంచం నలుమూలల ఉన్న భారతీయుల కల సాకారమైన రోజు. రామ మందిర ప్రాణ ప్రతిష్ట వేడకలో నేను పాల్గొనడం బాల రాముడు నాకు కల్పించిన గొప్ప అవకాశం. త్వరలో నా కుటుంబంతో కలసి మళ్లీ వచ్చి దర్శించుకుంటా.

– సచిన్ టెండూల్కర్, మాజీ క్రికెటర్

దేవుడిచ్చిన అవకాశం

బాల రాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో కుటుంబంతో కలసి భాగస్వామిని కావడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. హనుమంతుడే నన్ను వ్యక్తిగతంగా పిలిచాడనే భావనతో భావోద్వేగంలో ఉన్నా. శతబ్దాల కల నెరవేరినందుకు సంతోషిస్తున్నా.

– చిరంజీవి, సినీ హీరో

'రామ్ దీపావళి'

జనవరి 22 అనేది ప్రపంచంలోనే చారిత్రాత్మకమైన రోజు. 'రామ్' అనే పదం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మార్మోగుతుంది. ఈరోజు దేశ ప్రజలు 'రామ్ దీపావళి' పేరుతో సంబరాలు జరుపుకుంటున్నారు. ఈ వేడుకలో భాగస్వామి కావడం గర్వంగా ఉంది.

– ముకేశ్ అంబానీ, నీతూ అంబానీ

అందరికీ గొప్పరోజు

ఇది యావత్ భారత ప్రజానికానికి గొప్పరోజు. ప్రాణ ప్రతిష్ట పర్వంలో నేను భాగస్వామిని కావడం నా అదృష్టం. చాలాసేపు వేచి ఉండి రామదర్శనం చేసుకోవడం మాటల్లో చెప్పలేకపోతున్నా.

– సైనా నెహ్వాల్

కల నెరవేరింది

అందరి కల నెరవేరడం అనేది చాలా ఆనందంగా ఉంది.

–మిథాలీరాజ్, మాజీ క్రికెటర్

ఆలయాల సందర్శనల్లో బీజేపీ అగ్రనేతలు

న్యూఢిల్లీ: ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం వేళ బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షా తదితరలు సోమవారం ఢిల్లీలో ఆలయ సందర్శన చేశారు. అక్కడి నుంచి టీవీల్లో ప్రత్యక్ష ప్రసారంలో కార్యక్రమాన్ని వీక్షించారు. జేపీ నడ్డా ఢిల్లీలోని ఝుండేవాలన్ ఆలయాన్ని సందర్శించి పూజలో పాల్గొన్నారు. అమిత్ షా, కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి, ఇతర నేతలు లక్ష్మీనారాయణ్ ఆలయం(బిర్లా టెంపుల్) సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రతిపక్ష నేతలు ఏం చేశారంటే..

న్యూఢిల్లీ: అయోధ్యలోని రామాలయంలో ప్రాణప్రతిష్ట ఒక వైపు అంగరంగ వైభోగంగా జరుగుతుండగా ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు ఆ కార్యక్రమానికి దూరంగా ఉండిపోయారు. తమకు అందిన ఆహ్వానాలను వారు పట్టించుకోలేదు. వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొని, ఈ సందర్భాన్ని తమదైన శైలిలో ఉపయోగించుకున్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అస్సాంలోని నగావ్ జిల్లాలో ఉన్న శంకరదేవ జన్మస్థలిని దర్శించుకునేందుకు వెళ్లారు. సోమవారం బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోల్‌కతాలో సర్వమత ర్యాలీ నిర్వహించారు. సీఎం కేజ్రీవాల్ ఢిల్లీలో సుందరకాండ పారాయణంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆ పార్టీకి చెందిన హిమాచల్ ప్రదేశ్ సీఎం విక్రమాదిత్య సింగ్, పార్టీకే చెందిన ఎమ్మెల్యే సుధీర్ శర్మ అయోధ్యలో ప్రాణప్రతిష్టలో పాల్గొన్నారు.

ఆలయంలోకి రాహుల్ ప్రవేశం నిరాకరణ

- ధర్నాకు దిగిన కాంగ్రెస్ అగ్ర నేత
- అస్సాంలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఉద్రిక్తత


ఆలయంలోకి అనుమతించకపోవడంతో బైఠాయించి ధర్నాకు దిగిన రాహుల్ గాంధీ

నగావ్: అస్సాంలో కొనసాగుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్రలో సోమవారం హైడ్రామా నడిచింది. నగావ్ జిల్లా బోర్దువాలోని శ్రీశ్రీ శంకర్ దేవ్ సాత్ర ఆలయంలోకి రాహుల్ ప్రవేశాన్ని అధికారులు నిరాకరించడం ఉద్రిక్తతకు దారి తీసింది. సోమవారం స్థానిక ఆలయంలో పూజల తర్వాత రాహుల్ జోడో యాత్ర ప్రారంభించాల్సి ఉంది. ఇందుకోసం, పార్టీ నేతలతో కలిసి వస్తుండగా హైబొరాగావ్‌లో అధికారులు వారిని అడ్డుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత మాత్రమే ఆలయంలోకి వెళ్లేందుకు అనుమతి ఉందని చెప్పారు. ఆ ప్రాంతంలో భారీగా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయంలోకి దారి తీసే అన్ని రోడ్లను దిగ్బంధించారు. మీడియాను సైతం రానివ్వలేదు. నిరసనగా రాహుల్, కాంగ్రెస్ మహిళా నేతలు అక్కడ బైఠాయించారు. తనను ఎందుకు అడ్డుకున్నారో తెలపాలంటూ అధికారులను నిలదీశారు. ఎవరు, ఎప్పుడు ఆలయంలోకి వెళ్లాలో కూడా ఇప్పుడు ప్రధాని మోదీయే నిర్ణయిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. ఆలయంలోకి ప్రతి ఒక్కరూ వెళ్లొచ్చు కానీ, తను వెళ్తే శాంతిభద్రతల సమస్య వస్తుందంటూ అడ్డుకోవడం వింతగా ఉందని మండిపడ్డారు. పార్టీ ఎంపీ గౌరవ్ గొగోయ్, బటద్రవ ఎమ్మెల్యే శిబమోని బోరా మాత్రమే ఆలయంలోకి వెళ్లి పూజలు చేసి, వచ్చారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి జనవరి 22వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముందు ఆలయంలో ప్రవేశానికి అనుమతివ్వడం లేదని శనివారం ఆలయ కమిటీ తెలిపింది. అయోధ్యలో ప్రాణప్రతిష్ట కార్యక్రమం పూర్తవడానికి ముందు ఆలయంలోకి రావొద్దంటూ రాహుల్‌కు విజ్ఞప్తి చేసినట్లు సీఎం శర్మ చెప్పారు. ఎంతో ప్రాముఖ్యత ఉన్న శంకరదేవ ఆలయంలోకి రాహుల్‌ను ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. జనవరి 11వ తేదీన రాహుల్‌కు అనుమతిచ్చిన ఆలయ అధికారులు, 20వ తేదీన మాత్రం మాటమార్చారని చెప్పారు.

మోరిగావ్‌లో పాదయాత్రకు అనుమతి లేదు

సంఘ వ్యతిరేక శక్తులు శాంతిభద్రతలు, సామరస్య వాతావరణానికి భంగం కలిగించే ప్రమాదం ఉన్నందున మోరిగావ్ జిల్లాలో భారత్ జోడో న్యాయ్ యాత్ర, ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించరాదని కాంగ్రెస్ నిర్వాహకులను కోరినట్లు జిల్లా కమిషనర్ దేవాశీష్ శర్మ తెలిపారు. బిహుతోలి పోలీస్ స్టేషన్ సమీపంలో ర్యాలీ, మోరిగావ్‌లోని శంకరదేవ చౌక్ నుంచి పాదయాత్ర చేపట్టాలని కాంగ్రెస్ ముందుగా నిర్ణయించిందని ఆయన తెలిపారు. మోరిగావ్ జిల్లా నుంచి గోల్‌సెపాకు చేరే వరకు రాహుల్ వాహన శ్రేణిని ఎక్కడా ఆపరాదని ఆయన కోరారు. స్థానిక యంత్రాంగం, పోలీసులకు సమాచారం ఇవ్వకుండా రాహుల్ వాహనం వీడి వెళ్లరాదని స్పష్టం చేశారు. మోరిగావ్ జిల్లా భారత్ జోడో న్యాయ్ యాత్రకు సంబంధించి గతంలో ఇచ్చిన అన్ని అనుమతులను రద్దు చేసినట్లు వివరించారు.

'బిల్కిస్' దోషులు జైలుకు

గోద్రా: బిల్కిస్ బానో కేసులో మొత్తం 11 మంది దోషులు గుజరాత్‌లోని గోద్రా సబ్ జైలులో అధికారుల ఎదుట లొంగిపోయారు. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ప్రకారం దోషులందరూ జనవరి 21వ తేదీ అర్ధరాత్రి జైలుకు వచ్చినట్లు స్థానిక క్రైం బ్రాంచి ఇన్‌స్పెక్టర్ ఎన్ఎల్ దేశాయ్ ధ్రువీకరించారు. 2002లో గుజరాత్‌లో మత కలహాల సమయంలో బిల్కిస్ బానో అనే అయిదు నెలల గర్భవతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడటంతోపాటు ఆమె కుటుంబంలోని ఏడుగురిని దుండుగులు దారుణంగా చంపేశారు. ఈ ఘటనకు సంబంధించి కోర్టు 11 మంది దోషులకు జీవిత ఖైదు విధించింది. అయితే, 14 ఏళ్లపాటు జైలు జీవితం గడిపిన వీరిని సత్ప్రవర్తన కలిగిన వారిగా పేర్కొంటూ 2022లో గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిర్ణయాన్ని ఈ నెల 8వ తేదీన సుప్రీంకోర్టు కొట్టివేసింది.

కోటి నివాసాలపై సోలార్ ప్యానెళ్లు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: అయోధ్య రామ మందిరంలో ప్రాణప్రతిష్ట వేడుక దేశ ప్రజల ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలన్న తన సంకల్పాన్ని బలపరిచిందని ప్రధాని మోదీ అన్నారు. కోటి ఇళ్లకు సౌర శక్తిని ఇంధన వనరుగా మార్చే పథకాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. 'అయోధ్యలో ప్రాణప్రతిష్ట నుంచి వచ్చాక ప్రధానమంత్రి సూర్యోదయ యోజన పథకాన్ని ప్రారంభించాలనే మొదటి నిర్ణయం తీసుకున్నాను. కోటి ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయడం ఈ పథకం లక్ష్యం'అని పేర్కొన్నారు.

మైమరిపించేలా మ్యూజియం!

అధునాతన టెక్నాలజీతో ఏపీలో మ్యూజియంల అభివృద్ధి

అవి శతాబ్దాల మన చరితకు చిహ్నాలు. తరతరాల నుంచి వారసత్వంగా వస్తున్న వెలకట్టలేని పురాతన వస్తువులు. వీటిని పరిరక్షిస్తూ భావితరాలకు అందించడం మన బాధ్యత. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలతో పాటు పురాతన వస్తువుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలోని పురావస్తు ప్రదర్శన శాలలను సుందరంగా తీర్చిదిద్దుతోంది. రాష్ట్ర విభజన అనంతరం గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా హైదరాబాద్‌లోని స్టేట్ మ్యూజియంకి పరిమితమైన మన వాటా వారసత్వ సంపద సైతం సీఎం వైఎస్ జగన్ చొరవతో రాష్ట్రానికి చేరుకుంటోంది.


అనంతపురంలో కొత్తగా నిర్మించిన మ్యూజియం

- రూ.20 కోట్లతో బాపూ, ఏలూరు, అనంతపురం మ్యూజియంల నిర్మాణం
- మరో రూ.70 కోట్లతో ఏడు మ్యూజియంలకు కొత్త భవనాల ప్రతిపాదన
- రూ.400 కోట్లతో రాజమహేంద్రవరాన్ని హెరిటేజ్ సిటీగా తీర్చిదిద్దేందుకు కసరత్తు
- ఏపీ పురావస్తు సంపద గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో హైదరాబాద్‌లోనే..
- సీఎం జగన్ చొరవతో త్వరలోనే రాష్ట్రానికి..

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పురావస్తు ప్రదర్శన శాలలు కొత్త కళను సంతరించుకుంటున్నాయి. సాంకేతిక సొబగులద్దుకుని సందర్శకులను ఆకట్టుకుంటూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నాలుగున్నరేళ్లలో దశల వారీగా మ్యూజియంలను అభివృద్ధి చేస్తున్నారు. విజయవాడలోని బాపూ మ్యూజియంను విద్య, విజ్ఞాన సందర్శనాలయంగా తీర్చిదిద్దారు. 2020 అక్టోబర్ 2వ తేదీన సీఎం వైఎస్ జగన్ ప్రారంభించిన ఈ మ్యూజియం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఏలూరు, అనంతపురంలోని జిల్లా మ్యూజియంలకు నూతన భవన నిర్మాణాలు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ మ్యూజియాలను అధునాతనంగా మార్చారు. మరో రూ.70 కోట్ల ప్రతిపాదనలతో ఏడు మ్యూజియంలకు కొత్త భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. మైలవరం (కడప), కాకినాడ, గుంటూరు, కర్నూలు, పెనుకొండ, కడప, రాజమహేంద్రవరం మ్యూజియంలకు కూడా సాంకేతిక హంగులు అద్దనుంది.

మన సంపద వెనక్కి..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఏపీకి దక్కాల్సిన వేల ఏళ్లనాటి చారిత్రక, వారసత్వ సంపదను తీసుకురావడంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించింది. అప్పటి స్టేట్ మ్యూజియంలోని సుమారు 56వేలకు పైగా పురాతన వస్తువులు, నాణేలు, చిత్రపటాలు పదేళ్లుగా హైదరాబాద్‌లోనే ఉండిపోయాయి. ఈ క్రమంలో సీఎం జగన్ చొరవతో ఏపీ పురావస్తు శాఖ అధికారులు పలు దఫాలుగా తెలంగాణ అధికారులతో చర్చలు జరిపి చివరికి పురాతన వస్తువుల విభజన ప్రక్రియను ముగించారు. త్వరలో వాటిని ఏపీకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

పురావస్తు సంపద పరిరక్షణకు పెద్దపీట

విభజన తరువాత రాష్ట్రానికి స్టేట్ మ్యూజియం అంటూ ఏదీ లేదు. ఈ నేపథ్యంలో అతిపెద్ద స్టేట్ మ్యూజియంను నిర్మించేందుకు పురావస్తు శాఖ ప్రణాళికలు రూపొందించింది. దీంతోపాటు రాజమహేంద్రవరం నగరాన్ని 'హెరిటేజ్ సిటీ'గా అభివృద్ధి చేసేందుకు రూ.400 కోట్ల ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేసింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ.15 కోట్లతో టాయ్ మ్యూజియం నిర్మాణానికి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. పురావస్తుశాఖ ఆధ్వర్యంలోని లక్షలాది శాసనాలు, ఎస్టేంపేజీలు (శాసనాల కాపీలు)పరిరక్షణకు ప్రత్యేకంగా 'శాసన మ్యూజియం'ను నిర్మించాలని ప్రభుత్వం తలపెట్టింది. దీనిద్వారా ఇప్పటి వరకు లభ్యమైన శాసనాల వివరాలను ఒకే వేదికపైకి తీసుకురానుంది.

దక్షిణాదిలో తొలిసారిగా..

స్మారక, సందర్శనీయ స్థలాల అభివృద్ధిలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని కొండపల్లి కోటను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా బాపూ మ్యూజియం, కొండపల్లి కోటలో అగుమెంట్ రియాలిటీ, డిజిటల్ వాల్ ప్యానల్, ఇంటరాక్టివ్ డిజిటల్ డిస్‌ప్లే, కియోస్క్‌లు, వర్చువల్ రియాల్టీ, లేజర్ షో, ప్రొజెక్షన్ మ్యాపింగ్, ఇమ్మెర్సివ్ ప్రొజెక్షన్ థియేటర్, డిజిటల్ వాల్‌బుక్ పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా భవనాలు నిర్మించిన ఏలూరు, అనంతపురం మ్యూజియాల్లో కూడా అమలుచేయనున్నారు.


విజయవాడలో ఆధునీకరించిన బాపు మ్యూజియం

గణనీయమైన పురోగతి



ప్రజా సంక్షేమంతో పాటు మన వారసత్వ సంపదను రక్షించుకోవాల్సిన బాధ్యతను సీఎం జగన్ చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నారు. విభజన తర్వాత తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్‌లో మ్యూజియంలు గణనీయమైన పురోగతిని సాధించాయి. ప్రపంచ స్థాయి ఏఆర్, వీఆర్ టెక్నాలజీలను ప్రవేశపెట్టాం. తద్వారా సందర్శకులకు అర్థవంతమైన భాషలో, సరళంగా వారసత్వ చరిత్ర తెలుస్తోంది. మ్యూజియంల అభివృద్ధిని ఇలాగే కొనసాగిస్తాం. త్వరలోనే స్టేట్ మ్యూజియంను కూడా నిర్మిస్తాం.

– ఆర్కే రోజా, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ మంత్రి

వేసవిలోనూ సమృద్ధిగా నీరు

తాగునీటి అవసరాలకు రూ.128.66 కోట్లతో ముందస్తు ప్రణాళిక



సాక్షి, అమరావతి: వేసవి కాలంలో సైతం గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా.. సమృద్ధిగా నీరందించేలా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసింది. రాష్ట్రంలోని గ్రామాలు, కాలనీలు, ఏరియాల వారీగా గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ అంతర్గతంగా మొత్తం 48,444 నివాసిత ప్రాంతాలుగా వర్గీకరించింది. ఎండల తీవ్రత అధికంగా ఉంటే.. 15 జిల్లాల పరిధిలోని 4,011 నివాసిత ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉంటుందని అధికారులు గుర్తించారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు రూ.128.66 కోట్లతో తాత్కాలిక నివారణ చర్యల ప్రణాళికలకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 4,011 నివాసిత ప్రాంతాల ప్రజల కోసం ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు రూ.104.47 కోట్ల ఖర్చు చేయనున్నారు. ఒకవేళ తీవ్ర ప్రభావం పడితే.. ఐదు జిల్లాల పరిధిలో 1,283 నివాసిత ప్రాంతాల్లోని పశువుల కోసం కూడా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు మరో రూ.8.21 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. బోర్లు ఇంకిపోతే.. మరికొంత లోతుగా బోరు వేసేందుకు 4,500 బోర్ల కోసం రూ.13.28 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలకు అనుబంధంగా ఉండే సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గంలో నీటిని నింపడం.. లేదంటే అవసరమైన చోట వ్యవసాయ నీటి బావులను లీజుకు తీసుకోవడం వంటి వాటితో కలిపి వేసవి మొత్తానికి అన్ని రకాల కార్యక్రమాలు చేపట్టేందుకు మొత్తం రూ.128.66 కోట్లతో అధికారులు ఈ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం అధికారులు ప్రతిపాదనలు పంపగా.. ఆయా ప్రతిపాదనలపై 4 రోజుల క్రితం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది వేసవిలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో ప్రభుత్వం ముందస్తుగానే ఈ కార్యక్రమంపై దృష్టి పెట్టింది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఒకవైపు గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా వాటర్ గ్రిడ్ కార్యక్రమం ద్వారా 365 రోజుల పాటు నీటి సరఫరాను అందుబాటులోకి తెచ్చే భారీ కార్యక్రమాలను చేపడుతూనే.. మరోవైపు ఆ వాటర్ గ్రిడ్ పథకాలు పూర్తయ్యేలోగా వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తాత్కాలిక నివారణ చర్యలను కూడా కొనసాగిస్తోంది.

విశాఖ రైల్వే జోన్‌కు గ్రీన్ సిగ్నల్

- ఫిబ్రవరి మొదటి వారంలో భూమి పూజ
- అనకాపల్లి ఎంపీ బీవీ సత్యవతి వెల్లడి



అనకాపల్లి: విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి చెప్పారు. ఆమె సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి మొదటి వారంలో రైల్వే జోన్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సౌత్ కోస్ట్ రైల్వేజోన్ నిర్మాణానికి రూ.170 కోట్లు కేటాయించిందని, భూమిపూజకు రూ.10 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. వడ్లపూడిలో రైల్వే స్థలం 100 ఎకరాలు ఉండగా, జీవీఎంసీ పరిధిలోని ముడసర్లోవలో 52 ఎకరాల స్థలాన్ని రైల్వే అధికారులకు అప్పగించినట్లు వివరించారు. సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు ఓఎస్‌డీ స్థాయి అధికారిని కేంద్ర ప్రభుత్వం విశాఖలో నియమించిందని పేర్కొన్నారు. ప్రజల అభీష్టాన్ని, రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరాన్ని గౌరవించి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కేంద్రం విరమించుకుందని చెప్పారు. విభజన చట్టంలోని అంశాలను కేంద్ర ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తుంటే.. 'ప్రత్యేక హోదా వద్దు ప్రత్యేక ప్యాకేజీ ముద్దు..' అని చెప్పి నగదు తీసుకున్న రోజులను చంద్రబాబు మరిచిపోయినా... జనం ఇంకా గుర్తుంచుకున్నారని ఆమె అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధి రాష్ట్రానికి వెన్నెముకలాంటిదని, విజయవాడలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. దివంగత సీఎం రాజశేఖరరెడ్డి గోదావరి జలాలను ఇచ్ఛాపురం వరకూ అందించాలని పోలవరం ప్రాజెక్టును చేపడితే చంద్రబాబు నాయుడు అడ్డుకున్న రోజులను గుర్తెరగాలని పేర్కొన్నారు. ప్రాజెక్టును పూర్తిచేయాలంటే సుమారు రూ.56 వేల కోట్లు ఖర్చవుతుందని, ఈ విషయంపై కేంద్ర జలవనరుల శాఖమంత్రితో చర్చించామని ఎంపీ సత్యవతి చెప్పారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు భూసేకరణలో ఇబ్బందుల కారణంగా ముందుకు సాగలేదని, చోడవరం మండలంలో ఒక గ్రామ ప్రజలు సహకరించకపోవడంతో పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, ఇతర నేతలు గత ఐదేళ్లలో ఏనాడూ కేంద్ర మంత్రులను కలిసిన పాపానపోలేదన్నారు. వారు ఈ విషయాలపై మాట్లాడడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు.

జిల్లా వార్తలు

కొంగొత్తగా కోవెల

తుది దశకు మల్లేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం

- అద్భుతంగా తీర్చిదిద్దుతున్న కళాకారులు
- ప్రత్యేక ఆకర్షణగా రాతి మండపం
- నిరంతరం పర్యవేక్షిస్తున్న ఆలయ అధికారులు
- మహా శివరాత్రికి స్వామి వారి దర్శనం


ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం (ఇన్‌సెట్) రాతి శ్లాబు పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన పరంజాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి. స్వామి వారి ఆలయాన్ని కళాకారులు అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. మహా శివరాత్రి నాటికి ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యేలా పనులు చురుగ్గా సాగుతున్నాయి. అభివృద్ధి పనులను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని విశేష పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అదే క్రమంలో స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలో మహా శివరాత్రి నాటికి పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పనుల సరళి ఇలా..

స్వామి వారి ప్రధాన ఆలయం నిర్మాణం ఇప్పటికే పూర్తి కాగా ఆలయం చుట్టూ రాత్రి ప్రాకార మండపం పనులు శ్లాబ్ దశకు చేరుకున్నాయి. ఆలయానికి పడమర వైపు రాతి మండపం నిర్మాణం పూర్తి కాగా, ఉత్తర, దక్షిణం వైపున రాతి స్తంభాల ఏర్పాటు పనులు జరిగాయి. ఇక స్తంభాలపై శ్లాబు పలకలుగా రాతిని తీర్చేదిద్దే పనిలో కళాకారులు బిజీగా ఉన్నారు. ఆలయ నిర్మాణం పూర్తయితే తూర్పు వైపున విశాలమైన ప్రాంగణం దేవస్థానానికి అందుబాటులోకి రానుంది. అంతే కాకుండా స్వామి వారి దర్శనం చేసుకున్న అనంతరం భక్తులు తూర్పు వైపు నుంచి నగరాన్ని, దక్షిణం వైపున ఉన్న ఖాళీ ప్రదేశం నుంచి పవిత్ర కృష్ణానది అందాలు, ప్రకాశం బ్యారేజీని వీక్షించే అవకాశం కలుగుతుంది.

సీఎం ప్రత్యేక చొరవతో..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దుర్గగుడి అభివృద్ధి నిమిత్తం కేటాయించిన నిధుల నుంచి మల్లేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులు చేపట్టారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన రాతితో పాటు స్తంభాలు, విగ్రహాలను తిరుపతిలో ప్రత్యేకంగా తయారు చేయించారు. స్వామి వారి ప్రధాన ఆలయం చుట్టూ 36 విగ్రహాలను ప్రతిష్ఠించారు. త్రిపురాంతకమూర్తి, దక్షిణామూర్తి, గజసంహార మూర్తి, భిక్షాటన మూర్తి, హరిహరమూర్తి, అర్ధనారీశ్వరమూర్తి, వృషభారుడమూర్తి, వీరభద్రస్వామి, చతుర్ముఖ బ్రహ్మ, చంద్రశేఖరమూర్తి, సుబ్రహ్మణ్య స్వామి, లింగోద్భవమూర్తి, గణపతి స్వామి విగ్రహాలతో పాటు అష్ట దిక్పాలకుల విగ్రహాలు, పడమర భాగంలో మొదటి కర్ణకోట మధ్యభాగంలోని శరభమూర్తి, శిఖర భాగంలో చతుర్ముఖ బ్రహ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రధాన ఆలయానికి ద్వారాలు ఏర్పాటు పూర్తి కాగా, ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో వైపున ఆలయ ప్రాంగణంలో ఉత్తరం వైపు నవ గ్రహ మండపం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నవగ్రహ మండపానికి అవసరమైన రాతి స్తంభాలను తీర్చిదిద్దారు. మరో వారం రోజుల్లో నవగ్రహ మండపం నిర్మాణం ప్రారంభమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ధర్మానికి ప్రతిరూపం రాముడే


మాట్లాడుతున్న రమా సత్యనారాయణ, వేదికమీద విజయలక్ష్మి తదితరులు

విజయవాడ కల్చరల్: ప్రజారంజక పాలనకు ఆద్యుడు శ్రీరామచంద్రుడని ఆధ్యాత్మికవేత్త నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, మహానటి సావిత్రి సాంస్కృతిక సాంఘిక సంక్షేమం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం అయోధ్య బాల రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం, సినీ సంగీత విభావరి నిర్వహించారు. రమాసత్యనారాయణ మాట్లాడుతూ ధర్మానికి ప్రతిరూపం రామచంద్రుడని అన్నారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ 500 ఏళ్ల పోరాటం వల్లే మందిర నిర్మాణం సాధ్యమైందన్నారు. బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు కొప్పరపు బలరామకృష్ణ మాట్లాడుతూ రామాయణం నిత్యం పారాయణ చేయాలని సూచించారు. హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరావు, కార్యదర్శి నీలం దుర్గారావు పాల్గొన్నారు. గాయని వడ్డాది కామేశ్వరి ఆధ్వర్యంలో సత్యవర్ధన్, ఉమాబలరాం, సుధారాణి, డాక్టర్ భాగ్యశ్రీ భక్తి గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. సీతా, లక్ష్మణ, హనుమ సమేత శ్రీరామచంద్రమూర్తికి నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


ఉరికి వేలాడుతున్న అమలేశ్వరరావు

పెదన: జీడి మామిడి తోటలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన పెడన పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెడన మండలం తూర్పుతెలుగు పాలెంకు చెందిన శెలపాటి అమలేశ్వరరావు(45) మద్యానికి బానిసయ్యాడు. కడుపులో నొప్పిగా ఉందని ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అమలేశ్వరరావు ఆ గ్రామంలోని జీడిమామిడి తోటలో ఒక చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమలేశ్వరరావు కుమారుడు శశికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన ఎస్‌ఐ–2 హనుమంతరావు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరైన ఆహార అలవాట్లతో విస్తృత ప్రయోజనాలు

ఏఎన్‌యూ వీసీ ఆచార్య రాజశేఖర్


ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, వేదికపై యూనివర్సిటీ అధికారులు

ఏఎన్‌యూ: సరైన ఆహారపు అలవాట్లు ఉన్న వారికి విస్తృత ప్రయోజనాలు కలుగుతాయని వీసీ ఆచార్య రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాల ఫుడ్ సైన్స్ న్యూట్రిషన్ అండ్ డైటిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఆహార విశ్లేషణ' అనే అంశంపై సోమవారం నిర్వహించిన జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను వీసీ ప్రారంభించారు. వీసీ ప్రసంగిస్తూ నేటి ఆధునిక కాలంలో వస్తున్న మార్పుల్లో భాగంగా ఆహారపు అలవాట్లలో కూడా అనేక మార్పులు వచ్చాయన్నారు. ఎన్ని మార్పులు వచ్చినా సరైన ఆహార అలవాట్లు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సామాజికంగా, మానసికంగా, ఆలోచన పరంగా నిత్యం మానవుడు తీసుకునే ఆహారం, అలవాట్లతో సామాజిక గుర్తింపు ఉంటుందన్నారు. ఆహారపు అలవాట్లతో మెరుగైన జీవన విధానం అలవర్చుకునే వీలును ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. వర్క్‌షాప్ డైరెక్టర్ డాక్టర్ శాంతి శ్రీ వర్క్ షాప్ ఉద్దేశాలను, వివరించారు. వర్క్‌షాప్ నిర్వహణ కార్యదర్శిగా డాక్టర్ బి.భవిత వ్యవహరించారు. గీతం యూనివర్సిటీ హైదరాబాద్ ప్రొఫెసర్ రాంబాబు, తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అరుణ, ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల ప్రొఫెసర్ ఎల్. ఏడుకొండలు, ప్రొఫెసర్ సీహెచ్‌వీవీ సూర్యనారాయణ, విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ సయీద్, ఏఎన్‌యూ మైక్రో బయాలజీ విభాగం అధ్యాపకుడు డాక్టర్ అమృతవల్లి, పెరల్స్ ల్యాబ్ సీఈవో డాక్టర్ గురవయ్య, బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ సుధాకర్, డాక్టర్ కృష్ణసత్య, డాక్టర్ ఉదయశ్రీ, ఫుడ్ సైన్స్ విభాగం గెస్ట్ ఫ్యాకల్టీలు డాక్టర్ సీహెచ్. మంజుల, డాక్టర్ డి.జలజకుమారి, విద్యార్థులు, పరిశోధకులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.3కోట్లతో అత్యాధునిక ఐసీయూ

- గుంటూరు జీజీహెచ్‌లో అతిపెద్ద ఇంటెన్సివ్ కేర్ యూనిట్
- నేడు ప్రారంభించనున్న వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని


గుంటూరు జీజీహెచ్‌లో సిద్ధమైన ఐసీయూ

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల పెద్ద ఆసుపత్రిగా పేరు గడించిన గుంటూరు జీజీహెచ్‌లో మొట్టమొదటిసారిగా అతి పెద్ద ఐసీయూ నిర్మాణం జరిగింది. సుమారు రూ.3 కోట్లతో అత్యాధునిక వైద్య సౌకర్యాలతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) నిర్మించారు. మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చేతుల మీదుగా ఐసీయూ ప్రారంభం కానుంది.


ఐసీయూ కీలకం..

ప్రాణాపాయ స్థితిలో చికిత్స అందించి రోగుల ప్రాణాలు కాపాడేందుకు ఐసీయూ, వెంటిలేటర్ వైద్యసేవలు చాలా ముఖ్యం. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఒక్క రోజుకు ఐసీయూలో చికిత్స అందించినందుకు రూ. 50వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు అవుతోంది. అలాంటి ఖరీదైన అత్యవసర వైద్యసేవలను పేదప్రజలకు పూర్తి ఉచితంగా అందించేందుకు గుంటూరు జీజీహెచ్ సిద్ధంగా ఉంది. ఒక్కొక్కటి రూ.13 లక్షలు ఖరీదుచేసే వెంటిలేటర్లు 15, ఒక్కొక్కటి రూ.లక్ష ఖరీదు చేసే మానిటర్స్ 25, ఒక్కొక్కటి రూ. 27వేలు ఖరీదు చేసే సిరంజి పంప్స్ 25, ఐసీయూ కాట్స్ 25, ఒక్కొక్కటి రూ. 6 లక్షల ఖరీదు చేసే హైఫ్రీక్వెన్సీ నాజల్ క్యాన్యులా మిషన్లు 5 అత్యాధునిక ఐసీయూలో అందుబాటులో ఉన్నాయి.

జీజీహెచ్‌పై ప్రత్యేక శ్రద్ధ..

గుంటూరు జీజీహెచ్‌పై ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టి కోట్లాది రూపాయల వైద్య పరికరాలు ఆస్పత్రికి మంజూరు చేశారు. రాష్ట్రంలో ఏ ఆస్పత్రికి లేని విధంగా ఈ ఏడాదిలో రూ.25 కోట్లు ఖరీదు చేసే పెట్ సీటీ స్కాన్ వైద్య పరికరం, రూ.4 కోట్లు ఖరీదైన సీటీ స్కాన్ వైద్య పరికరం, ఇతర వైద్య పరికరాలు మంజూరు చేశారు. సర్వీస్ బ్లాక్ నిర్మాణం కోసం రూ.7.5 కోట్లు, కాకుమానువారితోట హాస్పిటల్ ప్రహరీ నిర్మాణం కోసం రూ.3.5 కోట్లు సీఎం మంజూరు చేశారు. ఆస్పత్రి మరమ్మతుల కోసం ఇటీవల కాలంలో కేటాయించిన రూ. 5 కోట్లతో జీజీహెచ్ క్యాజువాలిటీలో కోవిడ్ కాలంలో రోగులను ఉంచిన ప్రదేశంలో నేడు ట్రాన్సిట్ అడ్వాన్స్ ఐసీయూను నిర్మించారు.

పూర్తి ఉచితంగా సేవలు..



పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు ఉచితంగా అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా జీజీహెచ్‌కు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోంది. తాజాగా ఐసీయూ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు, వైద్య పరికరాలు ఇవ్వటంతో 25 పడకలతో ఆధునిక ఐసీయూ నిర్మించాం. దీనికి సహకరించిన సీఎం వైఎస్ జగన్, మంత్రి విడుదల రజిని, హెల్త్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, డీఎంఈ నరసింహం, కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫాలకు ధన్యవాదాలు.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్



తాలుతో తంటా

తాలు మిరపకాయలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వాతావరణ పరిస్థితుల వల్లే తాలు శాతం అధికంగా ఉందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

-10లో



పీహెచ్‌సీ భవనం ప్రారంభం

పెదపారుపూడి: గ్రామంలో నిర్మించిన పీహెచ్‌సీ, సచివాలయ భవనాలను పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబుతో కలిసి సోమవారం ప్రారంభించారు.



కనులపండువగా ఉరుసు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి షాబూఖారీ దర్గా ఉరుసు మహోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. సోమవారం గంధం ఊరేగింపు వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

కృష్ణా జిల్లా అభివృద్ధికి సహకరించండి



చిలకలపూడి(మచిలీపట్నం): వర్తక, వాణిజ్య, పారిశ్రామికవర్గాల వారు జిల్లా అభివృద్ధికి సహకరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు కోరారు. ఆయన చాంబర్‌లో వర్తక, వాణిజ్య సంఘాలు, పారిశ్రామికవేత్తలతో కలెక్టర్ సోమవారం రాత్రి సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాల విభజన అనంతరం జిల్లా ముఖ్య కేంద్రమైన మచిలీపట్నంతో పాటు జిల్లా అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జరుగుతున్న సుందరీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల గురించి వారికి వివరించారు. మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో అభివృద్ధి చేసేందుకు అవకాశాలు కలిగిన ప్రదేశాలు, అభివృద్ధి వివరాలు అందజేస్తామని సామాజిక బాధ్యతగా భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వీరయ్యచౌదరి, కార్యదర్శి అన్నే శ్రీనుబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి జల్లూరి గోపీనాథ్, పరిశ్రమల శాఖ డీడీ విజయకుమార్, ఏపీఐఐసీ డెప్యూటీ జోనల్ మేనేజర్ మధు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్, కార్మికశాఖ సహాయ కమిషనర్ సీహెచ్ ఆషారాణి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ జ్యోత్స్నశ్రీ పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం




చిలకలపూడి(మచిలీపట్నం): తుపానుకు దెబ్బతిన్న వరి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు తగిన న్యాయం చేస్తామని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశపు హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వరి కుప్పలను నూర్పిడి చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కొంత మంది రైతులకు ధాన్యం బకాయిలు రావాల్సి ఉందని కమిటీ సభ్యులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై జేసీ స్పందిస్తూ సేకరించిన ధాన్యానికి ఇప్పటి వరకు రూ.637 కోట్లు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేశామన్నారు. సాంకేతిక సమస్యల వల్ల పెండింగ్‌లో ఉన్న నగదును త్వరలో జమ చేస్తామని స్పష్టం చేశారు. తడిసి రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తాగు, సాగునీటి కోసం నీటిని విడుదల చేయాలని, రైతులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జన్ను రాఘవరావు మాట్లాడుతూ.. ఆక్వాజోన్ పరిధిలో ఉండే అర్హత కలిగిన ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీలను అందించాలన్నారు. రైతు భరోసా కేంద్రం పరిధిలోని పశువులకు వైద్యసేవలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ సలహామండలి సభ్యులు శ్రీకాకోళపు నాగేశ్వరరావు, పట్టపు శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.పద్మావతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దాసి రాజు తదితరులు పాల్గొన్నారు.

1,04,121 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,15,589 మిర్చి బస్తాలు వచ్చాయి. నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,04,121 బస్తాలు విక్రయించారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.20 వేల వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8 వేల నుంచి 21 వేల వరకు లభించింది. తాలు రకం మిర్చి ధర రూ.5 వేల నుంచి రూ.12 వేల వరకు పలికింది. విక్రయాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 52,793 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.



ఇస్కాన్ టెంపుల్‌లో భారీ స్క్రీన్‌పై బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం





అజిత్‌సింగ్‌నగర్ జీసీఆర్‌కాలనీలో భక్తుల తన్మయత్వం



జగమంతా రామమయం

శ్రీరామ నామం ప్రతిధ్వనించింది. జగదభిరాముడి నామస్మరణతో ప్రతి మదీ పులకించింది. స్వామివారి శోభాయాత్ర, ప్రత్యేక పూజలు, భజనలు, కోలాటాలతో పల్లెలు, పట్టణాలు పరవశించాయి. ఊరూవాడా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో తరించాయి. పలు చోట్ల ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్లపై అయోధ్యలో జరిగిన బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించి తన్మయత్వం చెందారు. జై శ్రీరామ్ అంటూ స్వామివారిని మనసారా స్మరించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



అజిత్‌సింగ్‌నగర్ జీసీఆర్‌కాలనీలో దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



రామలింగేశ్వరనగర్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో జై శ్రీరామ ఆకృతిలో దీపాలు



దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ఆమే కీలకం



- ఎన్టీఆర్ జిల్లా ఓటర్ల తుది జాబితా విడుదల
- జిల్లాలో మొత్తం ఓటర్లు 16,74,995 మంది
- పురుషులు 8,17,484 మంది, మహిళలు 8,57,361 మంది
- మైలవరంలో ఓటర్లు అత్యధికం, జగ్గయ్యపేటలో అత్యల్పం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. గతేడాది అక్టోబర్‌లో విడుదల చేసిన ముసాయిదా జాబితాతో తుది ఓటర్ల జాబితా పోల్చి చూస్తే ఓటర్ల శాతం పెరిగింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ – 2024లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పారదర్శకంగా తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించేందుకు క్రమం తప్పకుండా ప్రతి బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లోపాలు లేని ఓటర్ల జాబితా తయారు చేశారు. ఓటర్లలో అవగాహన పెంచేందుకు స్వీప్‌లో భాగంగా వృద్ధులు, దివ్యాంగులు, థర్డ్ జెండర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఓటర్లుగా నమోదు చేయించారు. ముఖ్యంగా యువ ఓటర్లను చేర్పించేందుకు కళాశాలల్లో స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. 80 ఏళ్లు పైబడిన వృద్ధులతోపాటు దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. దీనిపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జనవరి ఐదో తేదీన తుది జాబితా విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ గడువును పొడిగించారు. గతేడాది జనవరిలో విడుదల చేసిన తుది జాబితా 16,31,883 మంది ఓటర్లు ఉన్నారు. అక్టోబర్‌లో విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 16,39,152 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం విడుదల చేసిన తుది జాబితాలో మొత్తం 16,74,995 మంది ఉన్నారు. 2023 జనవరిలో విడుదల చేసిన తుది జాబితాతో ప్రస్తుతం జాబితాను పోలిస్తే ఓటర్ల సంఖ్య పెరిగింది. తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 16,74,995 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 8,17,484 మంది, మహిళలు 8,57,361 మంది, ఇతరులు 150 మంది ఉన్నారు.

పారదర్శకంగాఓటర్ల జాబితా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో పూర్తి పారదర్శకంగా, లోపాలు లేని ఓటర్ల జాబితా రూపొందించినట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఆయన తన కార్యాలయంలో సోమవారం ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. అనంతరం జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)–2024 కింద ప్రచురించిన తుది ఓటర్ల జాబితాను అందజేసి, అందులోని అంశాలను వివరించారు. 2023, అక్టోబర్ 27వ తేదీన విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా, తుది జాబితా ప్రకారం ఉన్న ఓటర్ల వివరాలను వెల్లడించారు. ముసాయిదా, తుది జాబితాల మొత్తం ఓటర్ల సంఖ్యను పోల్చితే 35,843 మంది ఓటర్లు పెరిగినట్లు తెలిపారు. తుది ఓటర్ల జాబితాలను డిజిగ్నేటెడ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల్లో ప్రజల పరిశీలన కోసం అందుబాటులో ఉంచామన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి రాజకీయ పార్టీల నుంచి 1,30,852 ఫిర్యాదులు అందాయని, వీటి పరిశీలనలో 7,748 డెత్ కేసులు, 10,145 శాశ్వత షిఫ్టెడ్ కేసులు, 11,311 డబుల్ ఎంట్రీలను గుర్తించి, నిబంధనల మేరకు తొలగించామని వివరించారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంపునకు స్వీప్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించడం, జాతీయ ఓటర్ల దినోత్సవం (జనవరి 25) రోజున బూత్ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ, విద్యాసంస్థల్లో ప్రత్యేక శిబిరాల ఏర్పాటు, అవగాహన కార్యక్రమాలు చేపడ్తామని తెలిపారు.

తుది జాబితా ప్రకారం జిల్లాలో ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
తిరువూరు(ఎస్సీ)	1,01,327	1,04,142	7	2,05,476
విజయవాడ వెస్ట్	1,23,218	1,25,596	35	2,48,849
విజయవాడ సెంట్రల్	1,33,048	1,40,656	50	2,73,754
విజయవాడ ఈస్ట్	1,29,721	1,35,036	21	2,64,778
మైలవరం	1,34,410	1,41,981	18	2,76,409
నందిగామ (ఎస్సీ)	98,531	1,04,784	7	2,03,322
జగ్గయ్యపేట	97,229	1,05,166	12	2,02,407
మొత్తం	8,17,484	8,57,361	150	16,74,995

17 అక్టోబర్ 2023న విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
తిరువూరు (ఎస్సీ)	99,241	1,01,363	9	2,00,613
విజయవాడ వెస్ట్	1,21,538	1,23,888	34	2,45,460
విజయవాడ సెంట్రల్	1,32,902	1,38,615	59	2,71,576
విజయవాడ ఈస్ట్	1,26,150	1,30,967	17	2,57,134
మైలవరం	1,30,824	1,37,943	18	2,68,785
నందిగామ (ఎస్సీ)	96,418	1,02,189	9	1,98,616
జగ్గయ్యపేట	94,936	1,02,021	11	1,96,968
మొత్తం	8,02,009	8,36,986	157	16,39,152

05 జనవరి 2023న విడుదల చేసిన తుది జాబితా ప్రకారం..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
తిరువూరు(ఎస్సీ)	1,00,054	1,01,653	8	2,01,715
విజయవాడ వెస్ట్	1,20,460	1,21,670	34	2,42,164
విజయవాడ సెంట్రల్	1,30,698	1,35,752	60	2,66,510
విజయవాడ ఈస్ట్	1,32,145	1,35,989	20	2,68,154
మైలవరం	1,28,260	1,34,781	13	2,63,054
నందిగామ(ఎస్సీ)	94,429	99,728	9	1,94,166
జగ్గయ్యపేట	94,724	1,01,385	11	1,96,120
మొత్తం	8,00,770	8,30,958	155	16,31,883

మైలవరంలో ఎక్కువ మంది ఓటర్లు

తుది జాబితా ప్రకారం జిల్లాలో మైలవరం నియోజకవర్గంలో అత్యధికంగా 2,76,409 మంది, కనిష్టంగా జగ్గయ్యపేటలో 2.02,407 మంది ఓటర్లు ఉన్నారు. ముసాయిదా జాబితా ప్రకారం అత్యధికంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 2,71,576 మంది ఓటర్లు, మైలవరం నియోజకవర్గంలో 2,68785 మంది ఉన్నారు. తుది జాబితాలో మైలవరం నియోజకవర్గంలో 7,624 ఓట్లు పెరిగాయి.

ప్రతి అర్జీకీ తక్షణ పరిష్కారం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- స్పందనలో 106 అర్జీల నమోదు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పందన ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీకీ తక్షణ పరిష్కారం చూపాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో ఎస్.వి.మోహనరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్పందనలో 106 అర్జీలు అందాయన్నారు. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 50 అర్జీలు ఉన్నాయని పేర్కొన్నారు. మిగిలినవి పోలీస్, మునిసిపల్, సర్వే సెటిల్‌మెంట్, కో–ఆపరేటివ్, హౌసింగ్, సమాచార శాఖ, పంచాయతీ రాజ్, ఎంప్లాయిమెంట్, హెల్త్, దేవదాయ, విద్య, బీసీ వెల్ఫేర్, డీఆర్డీఏ, డ్వామా, విభిన్న ప్రతిభావంతులు, గనులు, పశుసంవర్ధక, విద్యుత్, పౌర సరఫరాలు, కాలుష్య నివారణ శాఖలకు సంబంధించినవని వివరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జె.సునీత, హౌసింగ్ పీడీ ఎం.రజిని కుమారి, డీఎంహెచ్ఓ ఎం.సుహాసిని, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాస్ రావు, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇందిరా గాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 26వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి 75వ గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ సూచించారు. స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాంతో కలిసి జేసీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సమైక్యతకు అద్దం పట్టేలా గణతంత్ర వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకావిష్కరణ చేస్తారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. వీవీఐపీ, వీఐపీ గ్యాలరీల్లో ప్రొటోకాల్ మేరకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకల్లో పాల్గొనే కంటింజెంట్ విభాగాల ప్రదర్శనలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిని చాటేలా వివిధ శాఖల శకటాలను ముందుగానే సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య సిబ్బందితో మెడికల్ క్యాంపు, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న గణతంత్ర వేడుకలను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తలశిల రఘురాం పలు సూచనలు చేశారు. వేడుకలకు ఏర్పాట్లు ప్రత్యేకంగా ఉండాలన్నారు. ఏర్పాట్ల పరిశీలనలో ప్రొటోకాల్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీఆర్వో ఎస్.వి.నాగేశ్వరరావు, డీఎంహెచ్ఓ ఎం.సుహాసిని, సబ్ కలెక్టర్ అదితి సింగ్, పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు, డెప్యూటీ డీఈఓ కె.వి.ఎస్.కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ సంపత్‌కుమార్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం

2, 3 తేదీల్లో 'నారేడ్కో' జాతీయ సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నారేడ్కో) 16వ జాతీయ సదస్సు ఫిబ్రవరి 2, 3 తేదీల్లో ఢిల్లీలో జరగనున్నట్లు ఆ సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ జి. చక్రధర్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో సోమవారం ఆ సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జి. చక్రధర్ రావు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంతో సంబంధం ఉన్న వారందరూ ప్రభుత్వాధికారులతో సహా ఈ సదస్సులో పాల్గొననున్నట్లు తెలిపారు. నిర్మాణ రంగంలో ఆధునిక ధోరణులు, సాంకేతికాభివృద్ధిని ఉపయోగించుకునేందుకు ఈ సదస్సు ఒక చక్కని వేదిక అవుతుందని ఆయన పేర్కొన్నారు. గృహ నిర్మాణం అందరికీ అందుబాటులోకి తేవటం, ప్రభావం, ఫైనాన్స్ వెసులుబాటు, సాంకేతికాభివృద్ధిని ఉపయోగించుకోవడం, పెట్టుబడులకు ఉన్న అవకాశాలు వీటన్నిటితో పాటు ఇండియా విజన్-2047 కోసం ఒక ప్రత్యేకమైన సెషన్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నారేడ్కో రాష్ట్ర జనరల్ సెక్రటరీ సీతారామయ్య, సెంట్రల్ జోన్ ప్రెసిడెంట్ ముక్తేశ్వరరావు, విజయవాడ శాఖ ప్రెసిడెంట్ బి.అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు త్రో బాల్ జిల్లా జట్లు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి సీనియర్ స్త్రీ, పురుషుల త్రో బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను ఈ నెల 23వ తేదీ మంగళవారం ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా త్రో బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఇ.సులోచన తెలిపారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు ఎంపిక పోటీలకు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వారి ఆధార్ కార్డుతో ఎంపిక ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు అనంతపురంలో జరిగే 8వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

తాలుతో తంటా

- మిర్చిరైతు కంట కన్నీరు
- దిగుబడిలో సగానికి పైగా తాలుకాయలు
- పెట్టుబడులు కూడా రానివైనం
- ఎన్టీఆర్ జిల్లాలో 45 వేల ఎకరాల్లో సాగు



కల్లంలో ఉన్న తాలుకాయలు

వత్సవాయి: ఎర్రబంగారంగా పేరుగాంచిన మిర్చి పంటను ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో సాగుచేశారు. ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం నియోజకవర్గాల్లో ఈ ఏడాది గతం కంటే అధికంగా పంటను సాగుచేశారు. మిర్చి పంట నాటిన ప్రారంభ దశలో బాగానే ఉన్నా, కాపు దశలోకి వచ్చే సమయంలో ఇరవై రోజులపాటు రోజు వర్షం పడింది. ఫలితంగా పంటలో సగానికిపైగా తాలుకాయలు వస్తున్నాయి. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు. కొంతమంది రైతులు తాలుకాయలు గ్రేడింగ్ చేయకుండానే అన్నింటిని కలిపి అమ్మేందుకు సిద్ధపడుతున్నారు. ధర కూడా 10 వేలు మాత్రమే పలుకుతుండడంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు.

జిల్లాలో 45 వేల ఎకరాల్లో సాగు..

ఎన్టీఆర్ జిల్లాలో 45 వేల ఎకరాలలో మిర్చి సాగు చేపట్టినట్లు ఉద్యానవనశాఖ అధికారులు తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో 6,000 హెక్టార్లు, నందిగామలో 4,200 తిరువూరులో 7,000, మైలవరంలో 800 హెక్టార్లలో పంటను సాగుచేసినట్లు సిబ్బంది ఈ-క్రాప్ లో నమోదైంది. గతేడాది కంటే మూడు వేల ఎకరాల్లో అధికంగా మిర్చి సాగు చేపట్టినట్లు చెప్పారు.

వాతావరణ పరిస్థితుల వల్లే తాలుకాయ..

వాతావరణ పరిస్థితుల వల్లే తాలుకాయ శాతం అధికంగా ఉందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. కాయ పక్వానికి వచ్చే సమయంలో పడిన వర్షాలకు కాయపై మచ్చలు ఏర్పడి తాలుగా మారినట్లు చెప్పారు. సాధారణంగా పండు కాయ సమయంలో పడిన వర్షానికి కాయపై మచ్చలు ఏర్పడి ఎండిన తరువాత తాలుకాయగా మారుతుందని వివరిస్తున్నారు. అంతేకాకండా విచ్చలవిడిగా పురుగుమందుల పిచికారీ ప్రభావం కూడా ఉంటుందన్నారు. ఖరీఫ్‌లో పంట నాటడానికి ముందే పశువులు, మేకల ఎరువులను తోలుకోవడంతోపాటు, పచ్చిరొట్ట విత్తనాలను చల్లి నలభై రోజుల తర్వాత దుక్కిలో కలిపిదున్నితే మంచిదని సూచిస్తున్నారు.

దొరకని కూలీలు..

ప్రస్తుతం మిర్చి కోతకు వచ్చి సిద్ధంగా ఉంది. కానీ గ్రామాల్లో కూలీల కొరత ఎక్కువైంది. అధికమోతాదులో మిర్చి తోటలు వేయడంతో కూలీల సమస్య ఏర్పడింది. గతంలో నల్గొండ జిల్లా నుంచి కూలీలు వచ్చి నెల పాటు గ్రామాల్లో ఉండి మిర్చి కోతలు కోసేవారు. కానీ ఈ ఏడాది తాలుకాయల శాతం అధికంగా ఉండడంతో వారు కూడా వచ్చే పరిస్థితులు లేవని రైతులు చెబుతున్నారు. కూలీ రూ. 350 నుంచి 400 వరకు పలుకుతుందని వాపోతున్నారు.

నష్టాలు తప్పవేమో..



ఈ ఏడాది మిర్చి రైతులకు నష్టాలు తప్పవు. గతేడాదితో పోల్చితే దిగుబడులు తగ్గిపోయాయి. దీనికితోడు తాలుకాయశాతం పెరగడంతో నష్టాలు వస్తాయి. సగానికి సగం తాలుకాయలు వస్తున్నాయి. పండు దశలో ఉన్నప్పుడు పడిన వర్షాలే దీనికి కారణం.

– ఎస్. లక్ష్మీనారాయణ, రైతు, వత్సవాయి

వర్షాలే కారణం..

పండు దశలో ఉన్నప్పుడు పడిన అకాల వర్షాలకే తాలుకాయ శాతం ఎక్కువ అవుతుంది. కొన్నిచోట్ల దిగుబడిలో సగానికిపైగా తాలుకాయ వస్తోంది. అంతేకాకుండా విపరీతంగా పురుగుమందులను పిచికారీ చేయడం వల్ల కూడా తాలుశాతం పెరిగే అవకాశం ఉంది.

– వర్షిణీకుమారి, ఉద్యానశాఖాధికారి

జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్

కంకిపాడు(పెనమలూరు): సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్ అన్నారు. మండలంలోని మారేడుమాక, తెన్నేరు, మంతెన, ఉప్పులూరు, వేల్పూరు, ఈడుపుగల్లు, మద్దూరు, గొడవర్రు, కంకిపాడు, చలివేంద్రపాలెం, నెప్పల్లి తదితర గ్రామాల్లో మంత్రి జోగి రమేష్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు మంత్రి జోగి రమేష్‌కు ఘనస్వాగతం పలికారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. జోగి రమేష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి బాటలు వేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తేవడం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. పెనమలూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరి రాణి, కమ్మ కార్పొరేషన్, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు రామినేని రమాదేవి, నందిపాటి బిందు మాధవి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



రోడ్డు భద్రతా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, డీటీసీ పురేంద్ర

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రహదారి భద్రతా సూచికలు.. సురక్షిత గమ్యానికి మార్గాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల (జనవరి 20–ఫిబ్రవరి 19) సందర్భంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, డీటీసీ ఎం.పురేంద్ర తదితరులతో కలిసి రహదారి భద్రతా మాసోత్సవాలు, రోడ్డు భద్రతా సంకేతాలు, చిహ్నాలు తదితరాలపై రూపొందించిన పుస్తకం, పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చిన్న తప్పిదాలే పెద్ద ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. వాహనాలు నడిపేవారు రహదారి భద్రతా నియమాలను పాటించకపోవడం, అజాగ్రత్త, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వంటి ప్రధాన కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాంటి వారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించి కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో యువతీ, యువకులు రోడ్డు భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించి ప్రమాదాల నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. జేసీ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీటీసీ ఎం.పురేంద్ర మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మాసోత్సవంలో చేపడుతున్న కార్యక్రమాలు, జిల్లాలో రహదారి ప్రమాదాలు జరక్కుండా, మరణాలను తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలు తదితరాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్టీఓలు ఎ.విజయసారథి, వై.ఐశ్వర్య రెడ్డి, ఏవో సీహెచ్ శ్రీనివాసరావు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, కె.శివరామ గౌడ్, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.శ్రీనివాసరావు, జి.ప్రియదర్శిని, ఎ.సత్యఫణితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్‌శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో డీఆర్వో రోజా

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుని రాబోయే ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలని కృష్ణా కలెక్టర్ పి. రాజాబాబు సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల తుదిజాబితా ప్రకటించామన్నారు. ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లను చైతన్యవంతం చేసేందుకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, ఇతర వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. దీని ద్వారా గతంలో కంటే పోలింగ్‌శాతం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి సహకరించాలన్నారు. గత ఎన్నికల్లో తక్కువ పోల్ అయిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో పోలింగ్‌శాతం పెంచేలా దృష్టి పెడుతున్నామన్నారు. 90 శాతం పైగా పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీఎల్‌వోలు ప్రతి ఓటరు వద్దకు వెళ్లి ఓటు ఎక్కడ ఉన్నదో తెలియజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యాపార సంస్థల్లో పనిచేసే వారందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా వ్యాపార సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, బీజేపీ నాయకుడు పంతం గజేంద్ర, సీపీఎం నాయకుడు కొడాలి శర్మ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొడమంచిలి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాలికా హక్కులను పరిరక్షిద్దాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాలికా హక్కులను పరిరక్షించి వారికి బంగారు భవిష్యత్తును అందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. బాలికలపై లైంగిక వేధింపులను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన పేర్కొన్నారు. ఈనెల 24న నిర్వహించనున్న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (సీఆర్ఏఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ సోమవారం కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బాలికల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న చట్టాలను సమర్థంగా అమలు చేసినపుడే బాలికలకు బంగారు భవిష్యత్తును అందించగలుగుతామన్నారు. బాలికల రక్షణకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటున్నప్పటికీ అక్కడక్కడ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడటం, చిన్న వయస్సులోనే వివాహాలను జరిపిస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. బాల్య వివాహాల కట్టడిపై మరింత కఠినంగా వ్యవహరించవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. లైంగిక వేధింపులను ఎదుర్కొనేలా బాలికలలో అవగాహన కల్పించి వారిని అప్రమత్తం చేయాలన్నారు. బాలికలపై వేధింపులు, దోపిడీ, హింస వంటి సంఘటనలను గుర్తిస్తే చైల్డ్ లైన్ 1098, పోలీసు 100, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, వంటి కాల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, డ్వామా పీడీ జె. సునీత, డీఆర్డీఏ పీడీ కె. శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి కె. అనూరాధ, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆఫీసర్ జాన్సన్ పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు కుంటముక్కల సర్పంచ్



జి.కొండూరు(మైలవరం): ఢిల్లీలో ఈ నెల 26వ తేదీన జరగనున్న గణతంత్ర దిన వేడుకలలో పాల్గొనేందుకు తనకు ఆహ్వానం అందినట్లు ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల పరిధి కుంటముక్కల గ్రామ పంచాయతీ సర్పంచ్ వంగూరి కుమారి కెనడీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కుంటముక్కల గ్రామ పంచాయతీని ఉత్తమ గ్రామ పంచాయతీగా నిలిపినందుకు తనకు ఈ గౌరవం దక్కినట్లు ఆమె వివరించారు. ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌తోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు తనని అభినందించినట్లు ఆమె పేర్కొన్నారు.

అంగన్‌వాడీల తొలగింపునకు ఉత్తర్వులు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో 1,485 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 1343 మంది సహాయకులను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి ఎస్.సువర్ణ సోమవారం తెలిపారు. జిల్లాలో 1,707 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని అందులో 1,686 అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండగా వారిలో 1,594 మంది కార్యకర్తలు 2023 డిసెంబర్ 12వ తేదీ నుంచి ధర్నా నిర్వహిస్తూ విధులకు హాజరు కాలేదన్నారు. వీరికి విధులకు హాజరు కావాలని షోకాజ్ నోటీసులు జారీ చేయగా 109 మంది కార్యకర్తలు హాజరయ్యారన్నారు. మిగిలిన 1,485 మంది హాజరు కాలేదని ఆమె తెలిపారు. అలాగే మొత్తం 1537 మంది సహాయకులు ఉండగా 1429 మంది ధర్నాలో పాల్గొని విధులకు హాజరు కాలేదని నోటీసులు ఇవ్వటంతో 86 మంది సహాయకులు విధులకు హాజరైనట్లు ఆమె తెలిపారు. మిగిలిన 1343 మంది హాజరు కాలేదన్నారు. దీంతో విధులకు హాజరుకాని వారిని తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చామన్నారు. వీరి స్థానంలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త సిబ్బందిని నియమించే వరకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన సిబ్బందితో యథావిధిగా కేంద్రాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

బాలిక కిడ్నాప్.. యువకుడికి మూడేళ్ల జైలు

విజయవాడస్పోర్ట్స్: పదో తరగతి చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసి.. ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజిని సోమవారం తీర్పు చెప్పారు. విజయవాడ సూర్యారావుపేట ప్రాంతానికి చెందిన బాలికకు కృష్ణలంకకు చెందిన 19 ఏళ్ల షేక్ అక్బర్‌బాషాతో పరిచయం ఏర్పడింది. కొన్నాళ్ల తరువాత అక్బర్‌బాషా ఆమెను ప్రేమ పేరుతో నమ్మించి కిడ్నాప్ చేశాడు. అదే సమయంలో బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. 2022 మే 30వ తేదీన వెలుగుచూసిన ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. బాధితురాలి తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుజ్జుల నాగిరెడ్డి కోర్టుకు వాదనలు వినిపించారు. ఎనిమిది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు అక్బర్‌బాషాకు జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుడు చెల్లించిన జరిమానాలో రూ. 8 వేలను, మరో రూ. 50 వేలను నష్టపరిహారంగా బాధితురాలికి చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు.

25న గుడివాడలో మెగా జాబ్ మేళా

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేళాలో టెక్నికల్, సాఫ్ట్‌వేర్, ఫైనాన్స్, ప్రైవేట్, ఆటోమొబైల్ కంపెనీలు ఉద్యోగ ఎంపిక చేస్తారన్నారు. 7, 10 తరగతులు, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారందరికీ అవకాశాలు ఉంటాయన్నారు. కావున ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 7981938644, 9848819682లను సంప్రదించాలని కోరారు.

వ్యక్తిపై హత్యాయత్నం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): పెట్రోల్ పోసి ఓ వ్యక్తిని హత్య చేసేందుకు ప్రయత్నించిన ఘటనపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రాణిగారితోట కోరేనామయ్యవీధికి చెందిన చినవెంకటేశ్వర్లు కృష్ణలంక ఎం హోటల్ సమీపంలో కిరాణా షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం ఏడు గంటలకు కాసులు అనే వ్యక్తి కిరాణా షాప్ ముందు వేరే వ్యక్తులతో గొడవపడ్డాడు. ఆ సమయంలో బాధితుడు చినవెంకటేశ్వర్లు అడ్డుగా వెళ్లాడు. దీనికి కోపోద్రిక్తుడైన కాసులు రాత్రి పది గంటల సమయంలో బాటిల్‌తో పెట్రోల్ తీసుకొచ్చి కిరాణా షాప్‌లో ఉన్న వెంకటేశ్వర్లుపై పోసి నిప్పంటించాడు. ఈ ఘటన చూసిన సమీపంలోని వ్యక్తులు అప్రమత్తమై మంటలను ఆర్పి బాధితుడు వెంకటేశ్వర్లును ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వెంకటేశ్వర్లుకు ముఖం, ఒంటిపై గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ ఘటనలో నిందితుడు కాసులుకు సైతం స్వల్పగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

క్లుప్తంగా

క్రాస్ కంట్రీ రన్నర్ ఎస్‌డీఎంఎస్ మహిళా కళాశాల



విజయవాడస్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల క్రాస్ కంట్రీ పోటీల్లో తమ కళాశాల జట్టు రన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుందని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ఫిజికల్ డైరక్టర్ వి.కనకదుర్గ తెలిపారు. ఈ నెల 20వ తేదీన ఉయ్యూరులోని ఏజీ, ఎస్‌జీ సిద్ధార్థ కాలేజీలో ఈ పోటీలు జరిగినట్లు తెలిపారు. తమ కళాశాల నుంచి బి.భవాని, ఎం.ఇందు, కె.హారిక, పి.పావని, ఆర్.యమున ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన క్రీడా జట్టును ఆ కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, డైరక్టర్ డాక్టర్ టి.విజయలక్ష్మి కన్వీనర్ ఎన్.లలిత్‌ప్రసాద్ సోమవారం అభినందించారు.

ముగిసిన అయోధ్య రామనామ సంకీర్తనం



విజయవాడ కల్చరల్: లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, సామగాన లహరి సాంస్కృతిక సంస్థ దేవస్థానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అయోధ్యరామయ్య సంకీర్తనోత్సవ కార్యక్రమాలు సోమవారం ముగిసాయి. నాగలక్ష్మి, సింధురాగేశ్వరి బృందం రావయ్య భద్రాదిరామ, ఇదుగో భద్రాది, తారక మంత్రము కీర్తనలు మధురంగా ఆలపించారు. శివానంద యశస్వి, మల్లాది ఆదినారాయణ శర్మ, శివరాం, రఘురాం సంప్రదాయ కీర్తనలు ఆలపించారు. చివరిగా సంగీత విద్వాంసులు సామగాన లహరి వ్యవస్థాపకులు మల్లాది సూరిబాబు, మల్లాది శ్రీరాం, మల్లాది రవికుమార్ నిర్వహించిన సంప్రదాయ కీర్తనా స్రవంతి ఆకట్టుకుంది.

త్వరలో మెట్ల మార్గం నుంచి రాకపోకలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ వాసులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న దుర్గగుడి మల్లికార్జునపేట మెట్ల మార్గంలో రాకపోకలు త్వరలో ప్రారంభం కానున్నాయి. మల్లికార్జునపేట ఉప్పరవాగు ప్రాంతం నుంచి అమ్మవారి ఆలయానికి మెట్ల మార్గం ఉంది. అయితే కొన్నేళ్లగా ఆలయ అధికారులు అమ్మవారి దేవస్థానానికి ఈశాన్యంలో ఉన్న ఈ మెట్ల మార్గాన్ని భద్రతా కారణాలు చూపి మూసివేశారు. దీంతో వన్‌టౌన్, కొత్తపేట, చిట్టినగర్, సాయిరాం ప్రాంతాలకు చెందిన వారు అమ్మవారిని దర్శించుకోవాలంటే చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దుర్గగుడి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కర్నాటి రాంబాబు ఈ మెట్ల మార్గాన్ని తిరిగి తెరవాలని ప్రతిపాదన చేశారు. దీంతో ఆలయ అధికారులు ఈ మెట్ల మార్గాన్ని తిరిగి తెరిచేందుకు అవసరమైన పనులు చేపట్టారు. గత రెండు రోజులుగా మెట్ల మార్గాన్ని శుభ్రం చేయించడంతో పాటు భక్తులు రాకపోకలు సాగించేందుకు అనువుగా తీర్చిదిద్దారు. మెట్ల మార్గం వద్ద సెక్యూరిటీ సిబ్బందితో పాటు శానిటేషన్ సిబ్బందికి ఆలయ ఏఈవో చంద్రశేఖర్ విధులు కేటాయించారు. సోమవారం మెట్ల వద్ద పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఇప్పటికే మెట్ల మార్గం ద్వారా భక్తుల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఒకటి, రెండు రోజుల్లో ఆలయ చైర్మన్, ఈవోలు ఈ మార్గాన్ని లాంఛనంగా ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్



మొగల్రాజపురం శివాలయంలో నిర్వహించిన పూజలో భక్తులు



ఇస్కాన్ మందిరంలో నిర్వహించిన సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): అయోధ్యలో శ్రీరామచంద్రుని (రాంలల్లా) విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం రామలింగేశ్వరనగర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డెప్యూటీ మేయర్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎస్‌ఆర్‌కెఎం స్కూలు రోడ్డులో చంటి ఆధ్వర్యంలో సీతారాములవారి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. స్క్రూబ్రిడ్జి సమీపంలోని దివంగత వంగవీటి రంగా విగ్రహం సమీపంలోని డివైడర్ పక్కన కళ్లం ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డెప్యూటీ బెల్లం దుర్గ మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో తిలకించారన్నారు. ఇది చారిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్లచెల్లారావు, భక్తులు పాల్గొన్నారు.

ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక పూజలు

అయోధ్యలో శ్రీరామచంద్రుని (రాంలల్లా) విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం పాత వీబీఎం కాలేజీ ఆవరణలోని ఇస్కాన్ మందిరంలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిర అధ్యక్షుడు చక్రధారిదాస్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. దీపోత్సవంతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రావ్యమైన కీర్తనలు, ప్రేరణకలిగించే ఉపన్యాసాలు చేశారు. దీంతో మందిర ఆవరణమంతా రామనామస్మరణతో మార్మోగింది. ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై అయోధ్య ప్రారంభోత్సవం ప్రత్యక్ష ప్రసారానికి మందిరం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా చక్రధారిదాస్ మాట్లాడుతూ అయోధ్యలో జరిగే మందిర ప్రారంభోత్సవం మరపురానిదని చెప్పారు. అనంతరం రాత్రి 7 గంటలకు మూడు వేల దీపాలతో రామనామాన్ని, రామబాణాన్ని ఏర్పాటు చేసి జ్యోతులను వెలించారు. కార్యక్రమంలో బలరాం గోవిందదాస్, శ్రీకాంత నరసింహదాస్, భక్తులు పాల్గొన్నారు.

పటమటలో వైభవంగా రాముడి విగ్రహ ప్రతిష్ఠ

పటమట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గ పరిధిలోని 13వ డివిజన్, జె.డి నగర్ మెయిన్ రోడ్‌లో శ్రీరామ మందిర సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ రాముడి విగ్రహం ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలు అందరూ సుభిక్షంగా ఉండాలని ప్రార్ధించానని పేర్కొన్నారు. 13వ డివిజన్ ఇంచార్జ్ రామయణపు శ్రీనివాస్, శ్రీ రామ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు...

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మొగల్రాజపురంలోని శివాలయం పరిసరాలు సోమవారం జై శ్రీరామ్ అంటూ రామనామస్మరణతో మార్మోగాయి. నారయణీ సేన ఆధ్వర్యంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై రామనామ సంకీర్తనలు, భజనలతో పాటుగా 58 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అయోధ్యలో రామాలయం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక తెరలపై భక్తులు వీక్షించారు. శివాలయాన్ని పూలు, అరిటి ఆకులతో భక్తులు అలంకరించారు. ఆలయం ఆవరణలో రాముడు, సీత, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలను ఉంచి పూజలు చేశారు. పూజల అనంతరం అయోధ్య నుంచి తెప్పించిన అక్షింతలను నారాయణీ సేన చైర్మన్ పిట్టల గోవిందు భక్తులకు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో దేవినేని అవినాష్



భక్తులకు అన్నదానం చేస్తున్న డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తదితరులు



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న మహిళలు



రాముడి వేషధారణలో స్వామి ఊరేగింపులో వస్తున్న దృశ్యం

ప్రజా సంక్షేమానికి పెద్ద పీట



కరపత్రాలు అందచేస్తున్న సుధీర, కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక

గుణదల (విజయవాడ తూర్పు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేశారని ఆ పార్టీ నాయకురాలు దేవినేని సుధీర అన్నారు. 3వ డివిజన్ పరిధిలోని గణేష్ నగర్‌లో సోమవారం ఆమె పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని తెలిపారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. నవరత్నాల ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందారని పేర్కొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, కో ఆప్షన్ సభ్యులు ముసునూరి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్ లోని స్క్రూబ్రిడ్జి సమీపంలో విద్యుత్ ఉపకేంద్రం, 11 కేవీ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బీవీ సుధాకర్ తెలిపారు. అయ్యప్పనగర్, రఘురోడ్డు, వీఎంరంగా రోడ్డు, ఆళ్లచెల్లారావురోడ్డు, గాంధీకాలనీ, ఎర్రపోతులవారివీధి, సాయిరాం కట్ పీసెస్‌రోడ్డు, వీఎంఆర్‌రోడ్డు, కృష్ణవేణిరోడ్డు, సుధాకర్ శాస్త్రివీధి, గాయత్రిరోడ్డు,సాయిస్ట్రీట్ తో పాటు రామలింగేశ్వరనగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

స్పందన సమస్యలకు తక్షణ పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 22 అర్జీలు రాగా అందులో ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగంపై -5, టౌన్ ప్లానింగ్‌పై-12, రెవెన్యూపై-2, ప్రజారోగ్య విభాగంపై-1, ఎస్టేట్‌పై- 2 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఫిర్యాదు దారుల సంతృప్తే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, సిటీ ప్లానర్ జీవీజీ ఎస్వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) వెంకటలక్ష్మి, ఉద్యానవన విభగం అధికారి శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్వహణలో ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య పట్టణంలో రామ్ లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సబ్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అత్యంత సుందరంగా నిర్మితమైన మహాద్భుత రామమందిరం కోట్లాది మంది హిందువుల ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలుస్తుందని కలెక్టర్ అన్నారు. ఎవరినీ నొప్పించకుండా సామరస్య భావంతో మతాల మధ్య వివాదాలు లేకుండా శాంతియుత వాతావరణంలో రామ మందిరం నిర్మాణం పూర్తి కావడం దేశానికి శుభసూచకమన్నారు. హిందువులందరూ విశ్వసిస్తున్న రామజన్మ భూమిలో బాల రాముని విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ గావించడం దేశ చరిత్రలో ఒక గొప్ప మైలురాయిగా నిలుస్తుందన్నారు.

యువతకు అయ్యదేవర స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్య్ర సమరయోధుడు అయ్యదేవర కాళేశ్వరరావు జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అయ్యదేవర జయంతిని పురస్కరించుకుని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఆయన విగ్రహానికి సోమవారం మల్లాది విష్ణు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విష్ణు మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఇచ్చిన పిలుపుతో న్యాయవాద వృత్తిని వదిలి స్వాతంత్య్రోద్యమంలో పాల్గొన్న ఆంధ్రులలో అయ్యదేవర కాళేశ్వరరావు ప్రముఖులన్నారు. స్వదేశీ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా తదితర ఉద్యమాల్లో పాల్గొని కఠిన కారాగార శిక్ష అనుభవించారన్నారు. జైలులో ఉంటూనే చైనా జాతీయోద్యమ చరిత్ర, ఈజిప్పు చరిత్ర, ఫ్రెంచి విప్లవ చరిత్ర, అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రపై పుస్తకాలు రాశారన్నారు. ముఖ్యంగా ఆయన రాసిన 'నా జీవిత చరిత్ర' ఆనాటి ఆంధ్రోద్యమ గాథకు అద్దం పడుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ తొలి స్పీకర్ గా ఆయన అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. విజయవాడ పురపాలక సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై మంచినీరు, మురుగునీటి పారుదల, గ్రంథాలయాల ఏర్పాటు, వంతెనల నిర్మాణం మొదలైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యునిగా, విజయవాడ నేషనల్ ఎడ్యుకేషన్ కమిటీ అధ్యక్షుడిగా అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



అయ్యదేవర కాళేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మల్లాది విష్ణు

కొండ ప్రాంతాల్లో ఎన్నడూ లేనంత అభివృద్ధి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కొండ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధే తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఏడో డివిజన్ పరిధిలోని దాసరి రమణ నగర్, ఇందిరా నగర్, సీఎస్ఐ చర్చి ప్రాంతాల్లో అవినాష్ సోమవారం పర్యటించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేసే అభివృద్ధి పనులను వివరిస్తూ మీ అవినాష్ అన్న హామీ పేరుతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. నాలుగున్నర ఏళ్లలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తూర్పు నియోజకవర్గ పరిధిలోని కొండ ప్రాంతాల్లో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరిగిందని చెప్పారు. ప్రజల్లో ముఖ్యమంత్రికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు కుట్రలను ప్రజలందరూ గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎంత మంది కలిసి వచ్చినా చివరకు గెలిచేది వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. కార్పొరేటర్ ఎం.మాధురి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, పార్టీ డివిజన్ నాయకులు తాళ్ళూరి ఉదయ్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న దేవినేని అవినాష్

యువతకు అన్ని రంగాల్లో ఉద్యోగావకాశాలు

కోల్ ఇండియా సంస్థ చైర్మన్ మల్లికార్జున ప్రసాద్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతకు అన్ని రంగాల్లోనూ ఉద్యోగ అవకాశాలు అపారంగా ఉన్నాయని కోల్ ఇండియా సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పోలవరపు మల్లికార్జున ప్రసాద్ (పీఎం.ప్రసాద్) అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో సహజ వనరు బొగ్గు గనుల నిర్వహణ-ఉత్పాదన శక్తి అనే అంశంపై కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో సోమవారం సదస్సు నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ మన దేశంలో యువత నైపుణ్యాలు పెంచుకుంటే ఎక్కడైనా ఉద్యోగాలు పొందవచ్చునని చెప్పారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇండియన్ రైల్వే సంస్థ తర్వాత రెండవ అతిపెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉన్నది కోల్ ఇండియా లిమిటెడ్‌లోనే అని చెప్పారు. తమ సంస్థలో రెండులక్షల 35 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది 780 మెట్రిక్ టన్నుల బొగ్గును ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించుకున్నామని అది సాధించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి ద్వారా పోటీ ప్రపంచంలో ముందంజ వేస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలను తమ సంస్థ సాధిస్తుందని చెప్పారు. ప్రైవేటు రంగ సంస్థలకు కూడా ఈ బొగ్గు ఉత్పత్తిలో పాల్గొనే అవకాశాన్ని భారత ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా కోల్ ఇండియా సంస్థ తరపున దేశం వ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలకు నిర్వహించామన్నారు. పర్యావరణ సమతుల్యత పాటిస్తూ ఉద్యోగుల భద్రత, సంక్షేమ కార్యక్రమాలకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లుగా వెల్లడించారు. డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి. జంపాలా మాట్లాడుతూ ప్రసాద్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల ప్రాంతం అని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఆర్.సాంబిరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ బి.జయప్రకాష్, డాక్టర్ ఎస్‌బీ రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, డాక్టర్ ఎండీఎస్ రెహమాన్, డాక్టర్ జె.దుర్గాప్రసాద్‌లు కలిసి అతిథి ప్రసాద్‌ను శాలువాతో సత్కరించారు.



మల్లికార్జున ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

24న వార్డు వలంటీర్లకు ఇంటర్వ్యూలు

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో 96 వార్డు వలంటీర్ల అభ్యర్థుల ఎంపికకు ఈ నెల 24వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్-3 కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు వార్డు సెక్రటేరియట్స్ స్పెషల్ సెల్ 8185933187 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

దుర్గమ్మ సన్నిధిలో ఆంధ్ర నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయంకు చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన ఆంధ్ర నాట్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నృత్యాలయానికి చెందిన అంజలి, పూజిత, హేమ, రేష్మా, పూజ, భవ్యశ్రీ, శ్రావణిలతో పాటు పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించారు.



అంతా రామమయం..

అయోధ్యలో రామాలయం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా బెజవాడ నగరంలో సోమవారం రామనామం మార్మోగింది. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్ అంటూ భక్తులు ఆధ్యాత్మిక భావనలో మునిగిపోయారు. రామమయం... జగమంతా రామమయం అంటూ గీతాలు ఆలపించారు. రామమందిర ప్రతిష్ఠను పురస్కరించుకొని వాడవాడలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











శ్రీరామునికి వానర వందనం



అల్లూరి సీతారామ రాజు జిల్లా సీలేరు కోదండ రామాలయంలో సోమవారం జరిగిన ఓ ఘటన అందర్నీ ఆకట్టుకుంది. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో అక్కడ ఏర్పాటు చేసిన శ్రీరాముని పతాకం వద్దకు ఓ వానరం వచ్చింది. నీలమేఘ శ్యాముడి చిత్రాన్ని తదేకంగా చూసి వందనం సమర్పించి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనను చూసిన వారు భక్తిభావంతో పరవశించారు.'రాముని చెంతకు హనుమ వచ్చాడు' అంటూ సంబరపడ్డారు.

-సీలేరు (అల్లూరి సీతారామరాజు)



కడలిలో శ్రీరాముడి కటౌట్

అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా లైవ్ ఇన్ అడ్వెంచర్స్‌కు చెందిన డైవర్లు వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా రూపొందించిన బోర్డుపై శ్రీరాముని చిత్రపటం తయారు చేసి రుషికొండ బీచ్ సముద్ర గర్భంలో 22 అడుగుల లోతులో ప్రదర్శించారు. 500 సంవత్సరాల తర్వాత ప్రతి భారతీయుని కల నెరవేరిందని, దానికి ప్రతీకగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు లైవ్ ఇన్ అడ్వెంచర్స్ వ్యవస్థాపకుడు బలరామ్ నాయుడు తెలిపారు. - కొమ్మాది(విశాఖ)

హైకోర్టులో శ్రీరాముడికి ప్రత్యేక పూజలు

సాక్షి, అమరావతి: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని హైకోర్టులో సోమవారం హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హైకోర్టు ప్రాంగణం పూలతో అలంకరించారు. జై శ్రీరామ్ నినాదంతో ఉన్న జెండాలను ఏర్పాటు చేశారు. శ్రీరాముడి చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు చేశారు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠను ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. న్యాయమూర్తులు సైతం హాజరయ్యారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా హైకోర్టు న్యాయవాదుల సంఘం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్, న్యాయవాదులు





మెహందీతో శ్రీరాముని చిత్రపటం రూపుదిద్దిన విజయనగరం జిల్లాకు చెందిన మానస పిళ్లా

రామా.. నిను తలచి..



ముళ్ల కట్టెలపై నాట్యమాడుతున్న కళాకారులు

ముళ్ల కంపను చూస్తే భయంతో పక్కకు వెళ్లిపోతాం. పొరపాటున ముళ్లు గుచ్చుకుంటే విలవిలలాడిపోతాం. కానీ రామునిపై భక్తి ముందు భయం బలాదూర్ అయ్యింది. శ్రీరామ నామం జపిస్తూ కర్ణాటకలోని ఓ గ్రామంలో కళాకారులు ముళ్లకంపతో చుట్టిన గడులలో చిందేశారు. సోమవారం అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా కర్ణాటకలోని ధార్వాడ దగ్గర కెలగేరి గ్రామంలో 'ముళ్ల హెజ్జె' పేరిట కొందరు జానపద కళాకారులు ముళ్ల కట్టెల మధ్య నృత్యాలు చేశారు. డోలు, తప్పెట వాయిద్యాలకు అనుగుణంగా గడుల మధ్య చిందేస్తూ సెబాష్... అనిపించుకున్నారు. అందరూ ముళ్లు గుచ్చుకోకుండా చిందేయడం విశేషం. - హుబ్లీ

'అయోధ్య' పూజారిగా తిరుపతి విద్యార్థి మోహిత్ పాండే



తిరుపతి సిటీ: అయోధ్యలోని రామమందిరం పూజారిగా తిరుపతికి చెందిన మోహిత్ పాండే ఎంపికయ్యారు. రామ మందిరంలో పూజారిగా పనిచేయడానికి దేశవ్యాప్తంగా మూడు వేల మంది దరఖాస్తు చేసుకోగా, 50 మందికి అవకాశం కల్పించారు. వారిలో తిరుపతికి చెందిన శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ విద్యార్థి మోహిత్ పాండే ఉన్నారు. తిరుపతి వేదిక యూనివర్సిటీలో ఆచార్య సామవేదంలో ఎంఏ అభ్యాసనం చేస్తున్నారు. ఈ సందర్భంగా మోహిత్ పాండేను తోటి విద్యార్థులు, కళాశాల యాజమాన్యం, తిరుపతి ప్రజలు అభినందించారు.

తరతరాల కల సాకారం

టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి



తిరుమల:తరతరాల కల నేడు సాకారమైందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ విగ్రహ రూపంలో రాముడే దివి నుంచి భూమిపైకి వచ్చినట్లు అనిపిస్తోందన్నారు. మానవత్వ విలువలతో సమానత్వమే ధ్యేయంగా ప్రపంచ శాంతి, దోపిడీ లేని రాజ్యం స్థాపనకు రామ మందిరం నిర్మాణం ఒక గొప్ప సందేశం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం జన్మజన్మల పుణ్యఫలమని చెప్పారు.

25న శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటి

తిరుమల:తిరుమలలో ఈ నెల 25న శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటి వైభవంగా జరుగనుంది. పురాణాల ప్రకారం తిరుమలలో 3 కోట్ల 50 లక్షల పుణ్యతీర్థాలు ఉన్నాయి. ఈ పుణ్యతీర్థాల్లో, సప్తగిరుల్లో వెలసి ఉన్న సప్తతీర్థాలు ప్రముఖమైనవి. వీటిలో స్వామి పుష్కరిణి తీర్థం, కుమారధార తీర్థం, తుంబురు తీర్థం, శ్రీరామకృష్ణ తీర్థం, ఆకాశగంగ తీర్థం, పాపవినాశన తీర్థం, పాండవ తీర్థం అత్యంత ప్రసిద్ధమైనవి. పుష్యమి నక్షత్రంతో కూడిన పౌర్ణమినాడు ఈ తీర్థ ముక్కోటిని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఈ పర్వదినం నాడు ఉదయం 7.30 గంటలకు శ్రీవారి ఆలయ అర్చకులు మంగళవాయిద్యాలతో ఆలయ మాడ వీధుల గుండా పూలు, పండ్లు, స్వామివారి ప్రసాదాలు తదితర పూజా సామగ్రిని శ్రీరామకృష్ణ తీర్థానికి తీసుకెళతారు. అక్కడున్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. అలాగే పుష్యమాస పౌర్ణమి సందర్భంగా అదే రోజు రాత్రి గరుడసేవ జరుగనుంది. ఇందులో భాగంగా రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

చెప్పింది చెప్పినట్లుగా..

నేడు రూ.6,394.83 కోట్ల నాలుగో విడత 'వైఎస్సార్ ఆసరా' పంపిణీ

79 లక్షల మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్ సర్కార్ భరోసా

- 2019 ఎన్నికల నాటికి పొదుపు సంఘాల మొత్తం అప్పు రూ.25,571 కోట్లు
- ఇందులో మూడు విడతల్లో ఇప్పటికే రూ.19,175.97 కోట్లు చెల్లింపు
- నేటి నుంచి ఆఖరిదైన నాలుగో విడత మొత్తం జమ
- అనంతపురం జిల్లా ఉరవకొండలో నేడు లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో రెండు వారాలపాటు ఉత్సవంలా కార్యక్రమాలు
- ప్రజల్లో తనపట్ల ఉన్న విశ్వసనీయత, నమ్మకాన్ని మళ్లీమళ్లీ చాటుకుంటున్న జగన్
- చంద్రబాబు నిర్వాకంతో కుదేలైన సంఘాలన్నీ మళ్లీ గాడిలోకి..
- సర్కారు చర్యలతో పొదుపు సంఘాల ఎన్‌పీఏలు 18.36 శాతం నుంచి 0.17 శాతానికి తగ్గుదల

సాక్షి, అమరావతి: చెప్పాడంటే చేస్తాడంతే.. అన్న నినాదాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాదాపు 79 లక్షల మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మల విషయంలో అక్షరాలా నిజం చేస్తున్నారు. గత ఎన్నికల్లో వారికి ఆయన ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నారు. మాట ఇస్తే తప్పడని ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ము కానీయకుండా ఆయన తన విశ్వసనీయతను మళ్లీమళ్లీ చాటుకుంటున్నారు. ఇందులో భాగంగా డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానంటూ అప్పట్లో పొదుపు సంఘాల మహిళలకు ఆయన ఇచ్చిన హామీని ఇప్పుడు సంపూర్ణంగా అమలుచేయబోతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటివరకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడు విడతల్లో ఆయన డ్వాక్రా అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో రూ.19,175.97 కోట్లు జమచేయగా.. తాజాగా, మంగళవారం నుంచి నాలుగో విడతగా మిగిలిన రూ.6,394.83 కోట్లను జమచేస్తూ వారికి ఇచ్చిన వాగ్దానాన్ని సీఎం జగన్ పూర్తిస్థాయిలో నెరవేర్చనున్నారు.

ఆంధ్రప్రదేశ్ బ్యాంకర్ల సంఘం (ఎస్ఎల్‌బీసీ) గణాంకాల ప్రకారం.. గత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగిన 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి రాష్ట్రంలో 78,94,169 మంది డ్వాక్రా మహిళల పేరిట రూ.25,570.80 కోట్లు పొదుపు సంఘాల



రుణాలు ఉండగా.. వైఎస్ జగన్ ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటికే మూడు విడతల్లో రూ.19,175.97 కోట్లను ఆయా మహిళల ఖాతాల్లో జమచేశారు. ఇక మంగళవారం నుంచి నాలుగో విడతగా మిగిలిన రూ.6,394.83 కోట్లను కూడా నేరుగా వారి ఖాతాల్లో జమచేయబోతోంది. ఈ నేపథ్యంలో.. నాలుగో విడత 'వైఎస్సార్ ఆసరా' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా పొదుపు సంఘాల మహిళలు వీక్షించేలా అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నిజానికి..

నేడు సీఎం జగన్ ఉరవకొండ పర్యటన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23న మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండలో పర్యటించనున్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రారంభించి, డ్వాక్రా సంఘాల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమచేస్తారు. ఉ.8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. అక్కడి నుంచి బహిరంగ సభా వేదిక వద్దకు చేరుకుని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు, ఆ తర్వాత వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద బటన్ నొక్కి డ్వాక్రా సంఘాల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తారు. అనంతరం తాడేపల్లి నివాసానికి తిరిగి చేరుకుంటారు.

గత ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా రుణాలు ఎవరూ కట్టొద్దు.. పొదుపు సంఘాల తరఫున తామే చెల్లిస్తామని 2014లో పార్టీ మేనిఫెస్టోలో పెట్టి మరీ హామీ ఇచ్చారు. కానీ, దాన్ని అమలుచేయని కారణంగా దాదాపు 7.98 లక్షల స్వయం సహాయక పొదుపు సంఘాలు ఆర్థికంగా చితికిపోయాయి. ఆ తర్వాత సీఎం పగ్గాలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ వాటికి తిరిగి ఊపిరిపోశారు.

ఫిబ్రవరి 5 వరకు జిల్లాల్లో 'ఆసరా' ఉత్సవాలు..

ఇక వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కార్యక్రమాన్ని రెండు వారాలపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉత్సవాల మాదిరిగా నిర్వహించనున్నారు. అలాగే..

- అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయా నియోజకవర్గాల పరిధిలో రోజుకు కొన్ని గ్రామాలు లేదా మున్సిపల్ వార్డుల చొప్పున లబ్ధిదారులతో సభలు నిర్వహించి, ప్రభుత్వం వారికి చేకూరుస్తున్న లబ్ధిని వివరిస్తారు.
- గత నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాల ద్వారా లబ్ధిపొంది, ప్రభుత్వం అందజేసిన ఆర్థిక సహాయంతో సుస్థిరమైన జీవనోపాధి ఏర్పాటుచేసుకున్న వారి విజయగాథలను వివరిస్తూ.. అందుకు సంబంధించిన వీడియోలను ప్రదర్శిస్తారు.
- మిగిలిన సభ్యులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని ముందుకొచ్చే వారికి అధికారులు తగిన సహాయం అందించేలా ఎమ్మెల్యేలు చర్యలు చేపడతారు. ఇందులో భాగంగా బ్యాంకర్లతో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.
- ఎమ్మెల్యే తన నియోజకవర్గంలోని ఏ ప్రాంతంలో ఏ రోజు పర్యటిస్తారో తెలిపే 14 రోజుల ప్రణాళికను అధికారులు ఇప్పటికే సిద్ధంచేశారు.
- ఫిబ్రవరి 5 వరకు రెండు వారాల్లో మొత్తం 7,98,395 సంఘాలకు రూ.6,394.83 కోట్లను జమచేసే ప్రక్రియ పూర్తిచేస్తారు.

56 నెలల్లో మహిళలకు రూ.2,66,772 కోట్ల లబ్ధి..

వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడతగా అందిస్తున్న లబ్ధితో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత 56 నెలల కాలంలో సంక్షేమ కార్యక్రమాల ద్వారా కేవలం మహిళలకు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా అందించిన సాయమే రూ.2,66,772.55 కోట్లుగా అధికారులు పేర్కొన్నారు.

- మరోవైపు.. ప్రభుత్వం చేసిన లబ్ధి ద్వారా మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడేటట్లుగా చేసి, వారి జీవనోపాధి మెరుగుపడేలా అదనంగా ప్రముఖ అంతర్జాతీయ వ్యాపార దిగ్గజ సంస్థలైన అమూల్, హిందూస్తాన్ లివర్, ఐటీసీ, ప్రాక్టర్ అండ్ గ్యాంబల్, అల్లానా, అజియో రిలయన్స్, గ్రామీణ వికాస కేంద్రం, టేనేజర్, కాల్‌గుడి, జియాన్, నినె, ఇర్మా, అయేకార్ట్, మహేంద్ర అండ్ ఖేతి వంటి వాటితో పాటు బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుని వారికి చక్కటి వ్యాపార మార్గాలు చూపించే చర్యలు చేపట్టింది.
- అంతేకాక.. కార్పొరేట్ సంస్థలు, బ్యాంకులతో అనుసంధానం చేసి జగన్ ప్రభుత్వం వారికి అందించిన సహకారంతో ఇప్పటివరకు 14,77,568 మంది మహిళలు కిరాణా దుకాణాలు, ఆవులు, గేదెలు, మేకల పెంపకం, వస్త్ర వ్యాపారం తదితర వ్యాపారాలు చేపట్టి నెలకు రూ.7,000 నుండి రూ.10,000ల వరకు అదనపు ఆదాయం పొందుతున్నారు.
- అమూల్‌తో ఒప్పందం కారణంగా మార్కెట్‌లో పోటీ పెరిగి లీటరు పాలపై రూ.10 నుండి రూ.22 వరకు అదనపు ఆదాయం పొందుతున్నారు.
- దాదాపు నాలుగు లక్షల మంది మహిళా మార్ట్‌ల ద్వారా లబ్ధిపొందుతున్నారు.
- గత పాలకులు ఒకవైపు రుణాలు మాఫీ చేస్తామని మాటిచ్చి అమలుచేయకపోగా, అక్టోబరు 2016 నుండి సున్నా వడ్డీ పథకాన్ని సైతం రద్దుచేయడంతో 'పొదుపు' మహిళల అప్పులు చక్రవడ్డీలతో తడిసిమోపెడై మోయలేని భారంగా మారాయి.
- అప్పట్లో సుమారు రూ.3,036 కోట్ల వడ్డీని మహిళలు బ్యాంకులకు అపరాధ వడ్డీ రూపేణా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంకోవైపు 'ఎ', 'బి' గ్రేడ్‌లో ఉండే పొదుపు సంఘాలు కూడా 'సీ', 'డి' గ్రేడ్‌లోకి దిగజారిపోయాయి.
- అనంతరం.. జగన్ ప్రభుత్వం 'వైఎస్సార్ ఆసరా', 'వైఎస్సార్ సున్నావడ్డీ'ల ద్వారా లబ్ధి పొందిన అక్కచెల్లెమ్మల పొదుపు సంఘాలు తిరిగి క్రియాశీలకంగా మారడంతో ఇప్పుడు అవే పొదుపు సంఘాల ఎన్‌పీఏలు 18.36 శాతం నుండి 0.17 శాతానికి తగ్గాయి.

నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా అమలు తీరు.. (రూ.కోట్లలో)

విడత	అమలు తేదీ	అందించిన లబ్ధి
మొదటి విడత	11 సెప్టెంబరు 2020	6,318.76
రెండవ విడత	07 అక్టోబరు 2021	6,439.52
మూడవ విడత	25 మార్చి 2023	6,417.69
నాల్గవ విడత	23 జనవరి 2024	6,394.83

నరేంద్ర మోదీ మరో ఆదిశంకరాచార్యుడు

విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ప్రధాని నరేంద్ర మోదీ మరో ఆదిశంకరాచార్యుడు అని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని విశాఖ అంబికాబాగ్‌లోని శ్రీసీతారామచంద్రస్వామిని సోమవారం స్వరూపానందేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. దేవస్థానం నిర్వహించిన సీతారామ కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు శతాబ్దాల కలను సాకారం చేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. యావత్ భారతావని మోదీకి రుణపడి ఉంటుందని తెలిపారు. అయోధ్య కార్యక్రమం ద్వారా భారతదేశం ఎనలేని కీర్తి సంపాదించిందన్నారు.ఈవో కె.శిరీష తదితరులు పాల్గొన్నారు.

నేడు శంబర పోలమాంబ సిరిమానోత్సవం



మక్కువ: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి సిరిమాను సంబరం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామంలో జరిగే పోలమాంబ సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు మన రాష్ట్రంతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి సుమారు 3 లక్షల మంది భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల మధ్య సిరిమానోత్సవం ప్రారంభం కానుంది. పూజారి జన్ని పేకాపు భాస్కరరావు సిరిమానును అధిరోహించనున్నారు. ఉత్సవం ప్రశాంతంగా నిర్వహించేందుకు 700 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తెలిపారు. ప్రభుత్వం ఈ ఉత్సవాన్ని రాష్ట్ర జాతరగా ప్రకటించిందని, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

విద్యుత్ పొదుపు చర్యల్లో ఏపీ భేష్

బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ



అభయ్

సాక్షి, అమరావతి: ఇంధన భద్రత, పొదుపు కోసం అమలు చేసిన స్టాండర్డ్స్–లేబెలింగ్ కార్యక్రమం విజయవంతానికి ఏపీ అందించిన తోడ్పాటు అద్భుతమని కేంద్ర విద్యుత్ శాఖ నేతృత్వంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ(బీఈఈ) వెల్లడించింది. బీఈఈ దక్షిణాది రాష్ట్రాల సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి సోమవారం 'సాక్షి'తో మాట్లాడుతూ.. స్టార్ రేటెడ్ విద్యుత్ ఉపకరణాలను వినియోగించడంపై అవగాహన కల్పించడం కోసం కేంద్రం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. దేశవ్యాప్తంగా 2020–21లో 56 బిలియన్ యూనిట్ల విద్యుత్, రూ.30 వేల కోట్లకు పైగా బిల్లులు ఆదా అయ్యాయని.. సుమారు 46 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గాయని బీఈఈ పేర్కొంది. ఇందులో ఆంధ్రప్రదేశ్ ముఖ్య పాత్ర పోషించిందని తెలిపింది. ఈ నేపథ్యంలో బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్.. స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీని అభినందించారు.

ఎన్నికలతో సంబంధం ఉన్న.. అధికారులను 25లోగా బదిలీ చేయండి

- ఒకే ప్రాంతంలో మూడేళ్లు పనిచేసిన వారిని ట్రాన్స్‌ఫర్ చేయండి
- ఓటర్లలో విభిన్న ప్రతిభావంతుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలి
- సీఈవో, జిల్లా ఎన్నికల అధికారుల కార్యాలయాల్లో ఖాళీలను త్వరగా భర్తీ చేయండి
- సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై సమీక్షలో సీఎస్ జవహర్ రెడ్డి



సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎస్ జవహర్ రెడ్డి

సాక్షి, అమరావతి: ఒకే ప్రాంతంలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని, ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అధికారులు, సిబ్బందిని ఈ నెల 25వ తేదీలోగా బదిలీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా. కేఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన సౌకర్యాలు, సిబ్బంది ఖాళీల భర్తీ, బదిలీలు తదితర అంశాలపై ఆయన సోమవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన కనీస సౌకర్యాలు, ముఖ్యంగా విభిన్న ప్రతిభావంతులైన ఓటర్ల కోసం ర్యాంపులు వంటివి కల్పించాలని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్యా తదితర శాఖల అధికారులను ఆదేశించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణా నియంత్రణతో పాటు పటిష్ఠ నిఘాకు ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులను వెంటనే ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారుల (కలెక్టర్లు) కార్యాలయాల్లో ఖాళీల భర్తీకి త్వరగా చర్యలు తీసుకోవాలని సీఈవో, సీసీఎల్ఏను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ బదిలీ చేయాల్సిన అధికారులు, సిబ్బందిని గుర్తించామని, ఇప్పటికే కొందరిని బదిలీ చేశామని తెలిపారు. ముఖ్యంగా రెవెన్యూ, మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్), పోలీస్ శాఖల్లో మూడు రోజుల్లోగా బదిలీలు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, అదనపు డీజీపీ (శాంతి భద్రతలు) ఎస్.బాగ్చి, సీడీఎంఏ వివేక్ యాదవ్, సెబ్ డైరెక్టర్ ఎం.రవిప్రకాశ్, ఐజీ రవీంద్ర బాబు, అదనపు సీఈవో కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, నిషాంత్ పాల్గొన్నారు.

ఆ ఫైళ్లను ముందుగా ఆర్థిక శాఖకు పంపాలి: సీఎస్

సచివాలయ బిజినెస్ రూల్స్ ప్రకారం నిర్దిష్ట అంశాల ఫైళ్లను ముందుగా ఆర్థిక శాఖకు పంపించి అనుమతి తీసుకోవాలని సీఎస్ డా. కేఎస్ జవహర్ రెడ్డి అన్ని శాఖలను ఆదేశించారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగాల భర్తీ, పదోన్నతులు, బడ్జెట్, ప్రాజెక్టు పనులు, సవరించిన అంచనాలు, విధానపరమైన అంశాల ఫైళ్లను ముందుగా ఆర్థిక శాఖకు పంపించి అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఇటీవల ఈ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని శాఖలు వ్యవహరిస్తున్నాయని తెలిపారు. పరిపాలన అనుమతులు మంజూరు చేసిన తరువాత ఆర్థిక శాఖకు ఫైళ్లు పంపిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఉద్యోగుల నియామకాలు, పదోన్నతులు, బడ్జెట్ మంజూరు, నిధుల విడుదల, అదనపు నిధులు, ప్రొక్యూర్‌మెంట్ ప్రాజెక్టులు, పనులు, సర్వీసెస్ పరిపాలన అనుమతులు, సవరించిన అంచనాలు, కార్యక్రమాలు, పథకాలు, ఇన్‌స్టిట్యూషన్స్, విధానపరమైన అంశాలు, చట్టాలు, జీవోలు, విధివిధానాల మార్గదర్శకాలకు సంబంధించిన ఫైళ్లను తప్పనిసరిగా ఆర్థిక శాఖకు పంపి, అనుమతి పొందాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల కార్యదర్శులు ఆర్థిక శాఖకు పంపే ఫైళ్లపై తగిన సిఫార్సులు కూడా చేయాలని, నిబంధనల మేరకు సంబంధిత అథారిటీ అనుమతి మేరకే ఫైళ్లు పంపుతున్నారా లేదా అనే విషయాలను కూడా ఫైళ్లలో స్పష్టంగా పేర్కొనాలన్నారు. ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చే ముందు అందుకు తగిన నిధులు ఉన్నాయా లేదా, సంబంధిత ఫైళ్లకు సంబంధించిన అంశాల వల్ల ప్రభుత్వ ప్రాధాన్యతలు నెరవేరుతాయా లేదా అనే విషయాలను పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. శాఖలు పంపే ప్రతిపాదనలు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో ఉన్నాయా లేదా, బడ్జెట్ కేటాయింపులున్నాయా లేదా అనే విషయాలను ఆర్థికశాఖ పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు.

సైకిలెక్కితే సైడ్‌ట్రాకే!


సూర్యప్రకాశ్‌రెడ్డి | సుజాతమ్మ | అఖిలప్రియ | బ్రహ్మానందరెడ్డి | గౌరు చరిత

టీడీపీలో చేరి చతికిలపడ్డ 'సీమ' హేమాహేమీలు.. కోట్ల, భూమా కుటుంబాలకు గెలుపు పూర్తిగా దూరం

- గౌరు, బుడ్డాతో పాటు వరదరాజులరెడ్డి, ఆదినారాయణరెడ్డి పరిస్థితీ అంతే
- టీడీపీని నమ్మి చేరిన పలువురికి టికెట్ నిరాకరణ

సాక్షి ప్రతినిధి, కర్నూలు: ఒకప్పుడు సీమ రాజకీయాల్లో పేరొందిన ఆ రాజకీయ నేతలు చంద్రబాబు పంచన చేరితే వంచనకుగురై చతికిలపడ్డారు. సైకిలెక్కి తప్పుచేశామని, బాబు నిండాముంచేశారని తెరవెనుక గగ్గోలు పెడుతున్నారు. కోట్ల.. భూమా.. గౌరు.. బుడ్డా కుటుంబాలకు చెందిన రాజకీయ నాయకులతోపాటు నంద్యాల వరదరాజులరెడ్డి, దేవగుడి ఆదినారాయణరెడ్డి ఒకప్పుడు కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీలో బలమైన నేతలు. బలమైన రాజకీయ నేపథ్యం వారి సొంతం. చంద్రబాబు కల్లబొల్లి మాటలు నమ్మి టీడీపీలో చేరితే 'సీమ' రాజకీయాల్లో తెరమరుగయ్యే స్థితికి చేరారు. చంద్రబాబును నమ్మి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన మరికొంతమంది కనీసం టికెట్ దక్కించుకోలేక మోసపోయారు. వీరిలో కొందరు తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. చంద్రబాబు మోసం గ్రహించి 'సీమ'లో టీడీపీ పని ఖతమైందని తెలుసుకున్న కొందరు.. ఆ పార్టీలో ఉండి ఓడిపోవడం కంటే మౌనంగా ఉండటం మంచిదనే నిర్ణయానికి వచ్చారు. ఈసారి తాము కోరిన టికెట్ ఇవ్వకపోతే పోటీనుంచి తప్పుకోవాలనే భావనలో మరికొందరు ఉన్నారు.

కోట్ల కోటకు బీటలు

కర్నూలు జిల్లాలో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, భూమా నాగిరెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి కుటుంబాలు 'సీమ' రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండేవి. మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి తనయుడు సూర్యప్రకాశ్‌రెడ్డి కేంద్రమంత్రిగా చేశారు. భూమా నాగిరెడ్డి జిల్లాలో బలమైన నేతగా ఉండేవారు. 2014లో సూర్యప్రకాశ్ రెడ్డి కాంగ్రెస్ తరఫున కర్నూలు ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆపై చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో ఎంపీగా కోట్ల, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన సతీమణి సుజాతమ్మ పోటీ చేసి ఓడిపోయారు. టీడీపీలో చేరడమే కోట్ల కుటుంబం చేసిన తప్పిదమని, దీంతోనే గెలుపు దక్కడం లేదనే భావన ఆయన అనుచరవర్గంలో ఉంది. ఈ దఫా కూడా ఎంపీగా గెలవలేమని కోట్ల భావిస్తున్నారు. అందుకే ఎమ్మిగనూరు టికెట్ ఆశించగా.. డోన్ ఎంచుకోవాలని చంద్రబాబు చెప్పినట్లు తెలుస్తోంది. అక్కడ బరిలోకి దిగితే ఓటమి తప్పదని కోట్ల భయపడుతున్నారు.



భూమా కుటుంబం తంటాలు

వైఎస్సార్‌సీపీ నుంచి 2014లో నంద్యాల, ఆళ్లగడ్డ ఎమ్మెల్యేలుగా గెలిచిన భూమా నాగిరెడ్డి, అఖిలప్రియలు అనంతర పరిణామాల్లో టీడీపీలో చేరారు. ఆ తర్వాత నాగిరెడ్డి మృతి చెందారు. అఖిలప్రియ టీడీపీ తరఫున 2019లో పోటీ చేసి ఘోరంగా ఓడిపోయింది. దీంతో పార్టీ మారి తప్పుచేశామనే చర్చ అఖిల కుటుంబంలో జరిగింది. ఆమె కుటుంబీకులు కూడా దూరమయ్యారు. నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డికి ఈ సారి మొండిచేయి చూపారు. అతని స్థానంలో ఫరూక్‌కు టికెట్ ఖాయమైంది. ఆళ్లగడ్డలో కూడా అఖిలకు కాకుండా పొత్తులో భాగంగా జనసేనకు టికెట్ ఇస్తారని సమాచారం. ఇదే జరిగితే పోటీ నుంచి భూమా కుటుంబం పూర్తిగా వైదొలిగినట్లే..

నమ్మితే నిండాముంచారు

శ్రీశైలం, పాణ్యం, జమ్మలమడుగు ఎమ్మెల్యేలుగా గెలిచిన బుడ్డా రాజశేఖరరెడ్డి, గౌరు చరిత, దేవగుడి ఆదినారాయణరెడ్డిలు కూడా 2014 తర్వాత టీడీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో వీరికి ఘోర ఓటమి తప్పలేదు. వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యేగా గెలిచిన బుడ్డా.. రాజకీయ భవిష్యత్ ఇచ్చిన పార్టీని కాదని చంద్రబాబును నమ్మడంతో 2019లో ఓటమి తప్పలేదు. ఇప్పుడు అసలు టికెట్ దక్కని పరిస్థితి నెలకొంది. గౌరు వెంకటరెడ్డి కుటుంబానికి వైఎస్ చేసిన మేలు అందరికీ తెలిసిందే.. జగన్‌మోహన్‌రెడ్డిని కాదని టీడీపీలో చేరితే 2019లో ఓడిపోయారు. ఈ దఫా కూడా వీరు గెలిచే పరిస్థితి లేదు. మరోవైపు జమ్మలమడుగు ఎమ్మెల్యే కడప ఎంపీగా పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారు. ఐదుసార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి 2014లో టీడీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. 2019లో అతనికి టికెట్ కూడా ఇవ్వలేదు.

అంతర్మథనంలో నేతలు

రాయలసీమలో అత్యంత బలంగా వైఎస్సార్‌సీపీ ఉంది. 52 అసెంబ్లీ స్థానాల్లో 49 చోట్ల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలే ఉన్నారు. దీంతో బలహీనంగా ఉన్న టీడీపీలో కొనసాగినా రాజకీయ భవిష్యత్తు ఉండదనే భావనకు వచ్చారు. చంద్రబాబు మోసపూరిత వైఖరిపై ప్రజలతో పాటు సొంత పార్టీలోని నేతలకు కూడా స్పష్టత వచ్చింది. ప్రత్యామ్నాయం లేక టీడీపీలో కొనసాగుతున్నామని, ఏ ఆప్షన్ ఉన్నా వెంటనే సైకిల్ దిగి వెళ్లిపోతామని ఈ నేతలంతా తమ అనుచరులతో చెబుతున్నారు.

కల్లబొల్లి మాటలు నమ్మి వెళ్తే..

2014లో వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచి టీడీపీలో చేరిన వారిలో కర్నూలు, కోడుమూరు, కదిరి, బద్వేల్ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, మణిగాంధీ, అత్తర్ చాంద్‌బాషా, జయరాములు ఉన్నారు. వీరికి 2019 ఎన్నికల్లో చంద్రబాబు టికెట్ ఇవ్వలేదు. దీంతో మోహన్‌రెడ్డి, మణిగాంధీ తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. చంద్రబాబును నమ్మినందుకు చాంద్‌బాషా, జయరాములు పూర్తిగా రాజకీయ భవిష్యత్ కోల్పోయారు. కర్నూలు, నంద్యాల ఎంపీలు బుట్టా రేణుక, ఎస్పీవై రెడ్డి కూడా వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరారు. ఇద్దరికీ చంద్రబాబు టిక్కెట్ ఇవ్వలేదు. దీంతో బుట్టా రేణుక 2019 ఎన్నికలకు ముందే తిరిగి సొంత పార్టీలో చేరారు. చంద్రబాబును నమ్మి మోసపోయానంటూ ఎస్పీవై రెడ్డి జనసేన తరఫున నంద్యాల ఎంపీగా, అల్లుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి నంద్యాల ఎమ్మెల్యేగా, కుమార్తె సుజల శ్రీశైలం నుంచి, మరో కుమార్తె అరవిందరాణి బనగానపల్లి నుంచి పోటీ చేశారు. ఇలా వీరంతా చంద్రబాబును నమ్మి మోసపోయినవారే. చంద్రబాబును నమ్మి మోసపోయానని ఎస్పీవై రెడ్డి 2019లో బహిరంగ ప్రకటన కూడా చేశారు.

వైఎస్సార్‌సీపీలో ఫుల్ జోష్

- ఎన్నికల సమరానికి రెడీ
- ఏలూరులో కొత్త అభ్యర్థుల పరిచయ సభ గ్రాండ్ సక్సెస్
- టీడీపీలో ఇంకా కొనసాగుతున్న సీట్ల గందరగోళం
- పొత్తులపై అయోమయం, అభ్యర్థుల అన్వేషణలో జాప్యం
- ప్రజాక్షేత్రంలో కలియదిరుగుతున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- నియోజకవర్గాలవారీగా పార్టీ శ్రేణులతో వరుస సమావేశాలు


ఏలూరులో జరిగిన సమావేశంలో సునీల్‌కుమార్‌ను నేతలు, కార్యకర్తలకు పరిచయం చేస్తున్న ఆళ్ల నాని (ఫైల్)


ఏలూరులో ఆదివారం జరిగిన సమావేశానికి ర్యాలీగా తరలివస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: అధికార వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లాలో ఫుల్‌జోష్‌తో కనిపిస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా స్థానిక పరిస్థితులు, సమీకరణలకు అనుగుణంగా జిల్లాలో అభ్యర్థుల మార్పులు, చేర్పుల ప్రక్రియ ముగిసింది. ఈ క్రమంలో ఆదివారం జరిగిన పార్టీ ఏలూరు జిల్లా విస్తృత స్థాయి సమావేశం, నూతన అభ్యర్థుల పరిచయ సభ గ్రాండ్ సక్సెస్ కావడం పార్టీ క్యాడర్‌లో కొత్త ఉత్సాహం నింపింది. ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, చింతలపూడి అసెంబ్లీ అభ్యర్థి కంభం విజయరాజు, పోలవరం అసెంబ్లీ అభ్యర్థిగా తెల్లం రాజ్యలక్ష్మిలను జిల్లా నాయకులు కార్యకర్తలకు పరిచయం చేశారు. ఎన్నికల శంఖారావం పూరించారు. దీంతో పార్టీ శ్రేణుల్లో నవోత్సాహం కదం తొక్కుతోంది.

ఇప్పటికే ప్రజల్లోకి..

ఏలూరు పార్లమెంట్ పరిధిలో రెండు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానంలో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులను మార్చింది. మిగిలిన చోట్ల ఇప్పటికే ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్తున్నారు. పాదయాత్రలు చేస్తూ.. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఐదేళ్లలో తాము చేసిన పనులను వివరిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా గడపగడపకూ చేకూరిన లబ్ధిని చెబుతున్నారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఈనెల 30వ తేదీకల్లా నియోజకవర్గ స్థాయి సమావేశాలు ముగిసేలా షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు. బాధ్యతలు తీసుకున్న చింతలపూడి ఇన్‌చార్జి కంభం విజయరాజు, పోలవరం ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి ఇప్పటికే వారం రోజులుగా నియోజకవర్గంలో విస్తతంగా పర్యటిస్తున్నారు. ఇక ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ ఆదివారం నుంచి పార్లమెంట్ పరిధిలో పర్యటనకు శ్రీకారం చుట్టారు.

టీడీపీలో అనిశ్చితి

ఇక ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలో రాజకీయ అనిశ్చితి తారాస్థాయికి చేరింది. పొత్తుల గందరగోళం ఒక వైపు, టీడీపీ, జనసేన నేతల మధ్య సమన్వయ లోపం మరోవైపు ఆ పార్టీ నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఏలూరు ఎంపీ టికెట్‌ను ముగ్గురు, నలుగురు అభ్యర్థులు ఆశిస్తున్నా స్పష్టత లేకపోవడం పొత్తుల్లో జనసేనకు ఇచ్చే స్థానాలు తేల్చకపోవడంతో రెండు పార్టీల నేతల్లో రాజకీయ నైరాశ్యం నెలకొంది. ఇక దెందులూరు నియోజకవర్గంలో టీడీపీ సమన్వయకర్త చింతమనేని ప్రభాకర్ యథావిధిగా హల్‌చల్ చేస్తున్నారు. టీడీపీ, జనసేన నేతలు చింతమనేని వద్దు–ఎవరైనా ముద్దు అనే పేరుతో నిరసన సమావేశం నిర్వహించినప్పటి నుంచి ఆయన తీవ్ర ఆందోళనకు గురై టికెట్ ఆశిస్తున్న ఇతర నేతలపై నోరుపారేసుకుంటున్నట్లు సమాచారం. కైకలూరు, నూజివీడు, పోలవరంలలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పార్లమెంట్ స్థానానికో సభ నిర్వహిస్తున్నా అభ్యర్థిత్వాలపై స్పష్టత ఇవ్వడం లేదు. ఫలితంగా ముఖ్యనేతలు ఖర్చుకు ముందుకురాని పరిస్థితి. అయితే జనసేన, టీడీపీ శ్రేణులు మాత్రం సోషల్ మీడియా వార్ కొనసాగిస్తున్నాయి. ఏ పార్టీ ఏ స్థానాల్లో పోటీ చేస్తాయో పోస్టులు షేర్ చేస్తూ గందరగోళాన్ని మరింత పెంచుతున్నాయి.

మిత్ర ధర్మమిదేనా 'బాబూ'!

- జనసేనతో సీట్ల సర్దుబాటు ఖరారు కాకున్నా టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని చంద్రబాబు పిలుపు
- మండపేటలో మండిపడుతున్న జనసేన క్యాడర్
- టీడీపీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సోషల్ మీడియా వేదికగా ప్రచారం


మాట్లాడుతున్న చంద్రబాబు, పక్కనే జోగేశ్వరరావు

సాక్షి అమలాపురం: ఓ వైపు జనసేనతో పొత్తు ఉందని చెబుతారు..మరోవైపు తమ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిస్తారు..ఇదీ బాబు మార్కు మిత్ర ధర్మం. రానున్న ఎన్నికల్లో టీడీపీ – జనసేన మధ్య పొత్తు ఉందని ఇరు పార్టీల అధినేతలూ ప్రకటించారు. కానీ సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపిక ఇప్పటివరకూ కొలిక్కి రాలేదు. అయినప్పటికీ టీడీపీ చేపట్టిన 'రా.. కదలి రా' సభల్లో మాత్రం తమపార్టీ అభ్యర్థులను గెలిపించాలంటూ చంద్రబాబు పిలుపునివ్వడం జనసేన నేతలకు, ఆశావహులకు మింగుడుపడడం లేదు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు 'రా... కదలిరా..' బహిరంగ సభలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని అసెంబ్లీ, పార్లమెంటరీ జనసేన ఇన్‌చార్జ్‌లు, నాయకులు పాల్గొన్నారు. ప్రస్తుతం వారు ఆయా నియోజకవర్గాల నుంచి టికెట్లు ఆశిస్తున్నారు. వాస్తవానికి సభలో టీడీపీ కార్యకర్తలకన్నా జనసైనికుల సందడే అధికంగా ఉంది. ఇంతమంది ఉన్న సభలో చంద్రబాబు.. మండపేట నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వేగుళ్ల జోగేశ్వరరావును మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆ సమయంలో జనసేన మండపేట ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ అక్కడే ఉన్నారు. సభలో తమ అభ్యర్థి జోగేశ్వరరావు అని బాబు ప్రకటించడంతో లీలాకృష్ణతో పాటు జనసేన కార్యకర్తలు మండిపడుతున్నారు. బాబు పక్కనే ఉన్న గంటి హరీష్‌ను మాత్రం పార్లమెంట్‌కు పంపాలని బాబు పిలుపునివ్వకపోవడం గమనార్హం.

ఏకపక్షంగా ఎలా ప్రకటిస్తారు?

సీట్ల సర్దుబాటు ఖరారు కాకున్నా.. చంద్రబాబు ఏకపక్షంగా తమ పార్టీ తరఫున అభ్యర్థులను ప్రకటించడం చూసి, జనసేన ఆశావహులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ప్రమేయం లేకుండా ఇలా ఏకపక్షంగా జోగేశ్వరరావును మళ్లీ గెలిపించండంటూ చంద్రబాబే పిలుపునివ్వడంపై జనసైనికులు సోషల్ మీడియా వేదికగా ఫైర్ అవుతున్నారు. పొత్తు ధర్మానికి విరుద్ధంగా బాబు ప్రవర్తించడంతో టీడీపీ కార్యక్రమాలకు కార్యకర్తలెవ్వరూ వెళ్లవద్దంటూ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి లీలాకృష్ణ ఆదేశించారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. లీలాకృష్ణ తానలా చెప్పలేదన్నా.. జనసేన అనుకూల సోషల్ మీడియాలో టీడీపీపై సెటైర్లు కొనసాగుతూనే ఉన్నాయి. చాలాచోట్ల టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు తమదే సీటు అంటూ ప్రచారం చేస్తుండడం కూడా జనసేన ఇన్‌చార్జిలకు మింగుడు పడడంలేదు. 'మా పార్టీ అధినేత పొత్తుకు వెళ్లినట్టు లేదు.. కాళ్ల బేరానికి వెళ్లినట్టుంది' అంటూ సగటు జనసేన కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ ప్రచారానికి పవన్ ఫొటోలు

కానీ జనసేనలో కానరాని ఎన్నికల హడావుడి

సాక్షి, అమరావతి: ఒకపక్క పవన్‌కళ్యాణ్ ఫొటోలతో టీడీపీ తన రాజకీయ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తుండగా ఆయన అధ్యక్షుడుగా ఉన్న జనసేనలో మాత్రం పూర్తి స్తబ్దత నెలకొంది. చంద్రబాబు తన ఫొటో పక్కనే పవన్‌కళ్యాణ్ ఫొటోలు పెట్టుకొని జనసేనకు ఏమాత్రం సంబంధం లేకుండా రోజుకు రెండు బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. అప్పుడప్పుడూ రాష్ట్ర పర్యటనకు వచ్చి హడావుడి చేసే పవన్ కళ్యాణ్ తీరా ఎన్నికలు సమీపించిన తరుణంలో కాడి పారేయడంపై జనసేన శ్రేణుల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. మూడు నెలలుగా వారాహి యాత్రను మూలన పెట్టేశారు. తమ పార్టీలో ఎన్నికల హడావుడే కానరాకుండా పోయిందని జనసేన నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు. ఏ రాజకీయ పార్టీలోనైనా సర్వ సాధారణంగా ఎన్నికల ముందు కోలాహలమైన వాతావరణం కనిపిస్తుంది. ఎవరు ఎక్కడ పోటీ చేస్తారు? ఎవరికి టిక్కెట్లు ఇస్తారు? అనే ఉత్కంఠ నెలకొంటుంది. అభ్యర్థుల ఎంపిక కసరత్తు నెలల తరబడి సాగుతుంటుంది. కానీ జనసేనలో మాత్రం ఎన్ని స్థానాల్లో పార్టీ పోటీ చేస్తుందనే కనీస స్పష్టత కరువైందని ఆ పార్టీ నాయకులు, పవన్‌కళ్యాణ్ మద్దతుదారులు వాపోతున్నారు. హడావుడిగా పొత్తులను ప్రకటించిన తమ అధినేత సీట్ల విషయంపై మాత్రం దృష్టి పెట్టకుండా నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీట్ల సంఖ్య, స్థానాలు తేలకుండా ఎన్నికల సమయంలో ఏ రాజకీయ పార్టీ అయినా క్షేత్రస్థాయిలో ఎలా కార్యక్రమాలు నిర్వహిస్తుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. 'నన్ను నమ్మండి.. ఎన్నికల వ్యూహం పూర్తిగా నాకు వదిలేయండి..' అంటూ పవన్ పేర్కొనటాన్ని నేతలు తప్పుబడుతున్నారు.

'ఆనం'దం ఆవిరి

- నెల్లూరు టీడీపీలో ఆధిపత్యపోరు
- వెంకటగిరిలో చంద్రబాబు సభ సాక్షిగా విభేదాలు బహిర్గతం
- 'రా.. కదలిరా' సభకు 'ఆనం'ను ఆహ్వానించని సోమిరెడ్డి, రవిచంద్ర
- ఆనం, కోటంరెడ్డిలతో బస్సులో బాబు ఏకాంత చర్చలు
- సోమిరెడ్డి, రవిచంద్రలపై ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యేలు
- సోమిరెడ్డికి చీవాట్లు పెట్టి వెళ్లిపోయిన బాబు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు జిల్లాలో టీడీపీ పరిస్థితి కరి మింగిన వెలగపండులా తయారైంది. ఓ వైపు అధిష్టానం అభ్యర్థిత్వాలపై ఎటూ తేల్చలేక పోతుండడం, మరో వైపు పార్టీ నేతల మధ్య నెలకొన్న ఆధిపత్యపోరు వెరసి అంతర్గత విభేదాలను తారాస్థాయికి చేరుస్తున్నాయి. ఫలితంగా క్యాడర్ డోలాయమానంలో కొట్టుమిట్టాడుతోంది. వెంకటగిరిలో ఈనెల 19న చంద్రబాబు నిర్వహించిన 'రా.. కదలిరా' సభ సాక్షిగా విభేదాలు బహిర్గతమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే (వైఎస్సార్ సీపీ బహిష్కృత నేత) ఆనం రామనారాయణరెడ్డిని సభకు జిల్లా నాయకులు ఆహ్వానించలేదు. దీంతో ఆనం అలకబూనారు. ఈ విషయంపై చంద్రబాబుకు సమాచారం పంపారు. దీంతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ద్వారా విషయం తెలుసుకున్న చంద్రబాబు ఆనం రామనారాయణరెడ్డిని చివరి నిమిషంలో సభకు పిలిపించుకున్నారు. సభలో ఆనం ప్రసంగిస్తున్నప్పుడూ ఓ పథకం ప్రకారమే కురుగొండ్ల రామకృష్ణ అనుచరులు అడ్డుతగిలి ఘోరంగా అవమానించారు. దీంతో సభ ముగిసిన అనంతరం చంద్రబాబు వైఎస్సార్ సీపీ బహిష్కృత ఎమ్మెల్యేలైన ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని బస్సులోకి పిలిపించుకుని చర్చలు జరిపారు.

నమ్మి వస్తే అవమానిస్తారా..!

నమ్మి పార్టీలోకి వస్తే తమకు సరైన గుణపాఠం చెప్పారని ఆనం, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు చంద్రబాబు ముందు ఆవేదన వ్యక్తం చేశారట. పార్టీలోకి వస్తే జిల్లాపై పెత్తనంతోపాటు కోరుకున్న సీటు ఇస్తానని మాటిచ్చిన విషయాన్ని ఆనం బాబుకు గుర్తు చేశారట. ఆత్మకూరులో పరిస్థితి బాగాలేదని, వెంకటగిరి నుంచే పోటీ చేస్తానని ఆనం కోరగా బాబు వారించి ఆత్మకూరు నుంచే పోటీకి సిద్ధంగా ఉండాలని చెప్పి పంపారని తెలుస్తోంది. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్రల తీరుపై బాబుకు ఆనం, కోటంరెడ్డి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో జిల్లా పార్టీ పెద్దలు చేసుకున్న లోపాయికారీ ఒప్పందాల నుంచి ఇటీవల చేసిన మైనింగ్ అక్రమాల వరకు అన్నింటిపైనా ఆధారాలతో సహా బాబుకు వివరించారని తెలిసింది. నెల్లూరు రూరల్‌ను జనసేనకు కేటాయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని, ఆ సీటు తనకే ప్రకటించాలని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరగా, అలాగే.. అంటూ చంద్రబాబు మాట దాటేశారని విశ్వసనీయ వర్గాల సమాచారం. అనంతరం సోమిరెడ్డి, బీద రవిచంద్రలను తన వద్దకు పిలిపించుకుని చంద్రబాబు చివాట్లు పెట్టారని తెలుస్తోంది.

చిన్నబుచ్చుకున్న సోమిరెడ్డి!

అనంతరం కడప జిల్లాలో జరిగే సభకు చంద్రబాబుతో కలిసి వెళ్లేందుకు సోమిరెడ్డి హెలిప్యాడ్ వద్దకు చేరుకోగా బాబు వారించి 'నీ అవసరం లేదులే' అని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. దీంతో సోమిరెడ్డి చిన్నబుచ్చుకున్నారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

బాబు దౌర్భాగ్య రాజకీయాలు సిగ్గుచేటు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

1,212వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: చంద్రబాబు, ఎల్లో మీడియా దౌర్భాగ్య రాజకీయాలకు దిగుతున్నాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,212వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. అమరావతి పేరుతో డిజిటల్ మాయాజాలం చూపించిన చంద్రబాబు ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా రాజధాని విషయంలో తన చేతగానితనాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై నెట్టి తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకుని నీచరాజకీయాలకు దిగడం సిగ్గుచేటన్నారు. బాబు తోడుదొంగ సింగపూర్ మంత్రి ఈశ్వరన్ మంత్రి పదవి ఊడిపోయిందని, త్వరలోనే చంద్రబాబు కూడా జైలుకు వెళ్లడం తప్పదని చెప్పారు. పీసీసీ అధ్యక్షురాలి హోదాలో షర్మిల వ్యాఖ్యానాలు చేయాలి కానీ, ఎల్లో మీడియా స్క్రిప్టును తీసుకొచ్చి చదివి బహుజనుల ఆశలపై నీళ్లు చల్లే ప్రయత్నం చేయడం మంచిది కాదని హితవు పలికారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసిన గజదొంగ చంద్రబాబు కులోన్మాద రాజకీయాలకు ఇక చరమగీతం తప్పదని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

మొరుసుపల్లి షర్మిల శాస్త్రీ మీకిది గుర్తుందా?

- రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది కాంగ్రెస్సే
- రాష్ట్రంలో ప్రశాంతంగా ఉన్న క్రైస్తవులు, దళితుల మధ్య చిచ్చు పెడతారా?
- షర్మిలను, అనిల్‌ను నమ్ముకున్న ఏపీ క్రైస్తవులను సముద్రంలో ముంచారు
- అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు బెన్నీ లింగం


సమావేశంలో మాట్లాడుతున్న బెన్నీ లింగం

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించి ఏపీ ప్రజలు ఇబ్బందులు పడడానికి ప్రధాన కారణం కాంగ్రెసేనన్న విషయాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు మొరుసుపల్లి షర్మిల శాస్త్రి గుర్తుంచుకోవాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జాన్ బెన్నీ లింగం అన్నారు. అటువంటి పార్టీని వెనకేసుకు రావడం సరికాదన్నారు. సోమవారం విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొరుసుపల్లి షర్మిల శాస్త్రి ఊసరవల్లిలా రంగులు మారుస్తున్నారని, దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర ప్రజలకు మొండిచేయి చూపిందన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ప్రశాంతంగా ఉన్న క్రైస్తవులు, దళితుల మధ్య చిచ్చు పెట్టడానికి షర్మిల కాంగ్రెస్ బాధ్యతలు తీసుకున్నారన్నారు. షర్మిల వైఎస్ ఇంటి పేరును తక్షణమే తొలగించుకోవాలని డిమాండ్ చేశారు. మత బోధకుడిగా పిలవబడుతున్న ఆమె భర్త అనిల్‌కుమార్ మణిపూర్ రాష్ట్రంలో మారణహోమం జరుగుతుంటే ఏం చేశాడని ప్రశ్నించారు. అక్కడ ప్రజల దగ్గరికి వెళ్ళాడా, వారికి ఆర్థిక సాయం చేశాడా అని నిలదీశారు. ఆంధ్ర రాష్ట్రంలో షర్మిలను, అనిల్‌కుమార్‌ను నమ్ముకున్న క్రైస్తవులను నడి సముద్రంలో ముంచి తెలంగాణకు వెళ్లిపోయారని మండిపడ్డారు. అటువంటి వారిని ప్రజలు నమ్మబోరని, రాష్ట్ర ప్రజలంతా వైఎస్ జగన్ వెంట ఉన్నారని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్త యోనా రాజు, పాస్టర్ నత్త బాలస్వామి, దళిత జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అన్నవరపు నాగేశ్వరరావు, పాస్టర్ కే ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లకు ఆద్యుడు బాబే

శాసన మండలిలో విప్ లేళ్ల అప్పిరెడ్డి ధ్వజం.. పక్క రాష్ట్రాల ఓటర్లను చేర్చేందుకు టీడీపీ డ్రైవ్ చేపట్టింది

- జనసేన పోటీ చేసే చోట టీడీపీ ఓట్లు వేరే చోటకు బదిలీ
- టీడీపీ మై డాష్ బోర్డ్‌పై చర్యలు తీసుకోవాలని కోరాం
- 10 లక్షల ఓట్లను తొలగించేందుకు కోనేరు సురేష్ దరఖాస్తు

సాక్షి, అమరావతి: దొంగ ఓట్లకు ఆద్యుడైన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారని శాసనమండలిలో విప్ లేళ్ల అప్పిరెడ్డి మండిపడ్డారు. సచివాలయంలో సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలిసిన అనంతరం టి.లోకేశ్వర్ రెడ్డి, నారాయణమూర్తితో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టుగా మారారని ధ్వజమెత్తారు. కుప్పంలో దొంగ ఓట్లతో గెలుస్తున్న చంద్రబాబు తెలంగాణలో ఓటుకు కోట్లు వెదజల్లి సాక్షాధారాలతో దొరికిపోవడం నిజం కాదా? అని నిలదీశారు. పక్క రాష్ట్రాల ఓటర్లను ఏపీలో ఓటర్లుగా చేర్చేందుకు టీడీపీ డ్రైవ్ చేపట్టిందని వెల్లడించారు.

ఓటర్ డేటాను అమెరికాలో స్టోర్ చేస్తున్నారు

టీడీపీ సేకరించిన ఓటర్ డేటాను అమెరికాలోని న్యూయార్క్‌లో ఒక సర్వర్ పాయింట్ వద్ద స్టోర్ చేస్తున్నారని వెల్లడించారు. జనసేన పోటీ చేసే చోట టీడీపీ ఓట్లను వేరే చోటకు బదిలీ చేసుకుంటున్నారని చెప్పారు. ఇల్లీగల్ ఓటర్ ప్రొఫైలింగ్‌కు పాల్పడుతున్న టీడీపీ మై డాష్ బోర్డ్‌పై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. 10 లక్షల ఓట్లను తొలగించేందుకు దరఖాస్తు చేసిన టీడీపీ ఎలక్షన్ సెల్‌కు చెందిన కోనేరు సురేష్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు చెప్పారు. సీఈసీ నుంచి ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారన్నారు. హైదరాబాద్‌లో ఓటేసి ఇక్కడా ఓటేస్తామంటే కుదరదు బాబూ అని హెచ్చరించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కుటుంబాలు ఎక్కడ నివాసం ఉంటున్నాయని ప్రశ్నించారు. టీడీపీ ఫిర్యాదు ప్రకారం చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్ ఓట్లనే మొదట తొలగించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ రెండోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

క్లుప్తంగా...

విశాఖలో పోలీస్ కమాండో పోటీలు ప్రారంభం



విశాఖ స్పోర్ట్స్: కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు, రాష్ట్ర పోలీస్ బలగాలకు చెందిన 23 టాప్ కమాండో బృందాలు పాల్గొనే 14వ ఆలిండియా పోలీస్ కమాండో కాంపిటీషన్స్(ఏఐపిసిసి) సోమవారం విశాఖలోని ఏపీ గ్రేహౌండ్స్ గ్రౌండ్స్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను విశాఖ నగర సీపీ ఎ.రవిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్కటి ప్రతిభ కలిగిన జట్టు విజయం సాధిస్తుందని, క్రీడాస్ఫూర్తితో తలపడాలన్నారు. ఏపీ గ్రేహౌండ్స్ అదనపు డీజీ రాజీవ్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తొలిసారిగా ఈ పోటీలకు ఆతిథ్యమిస్తోందన్నారు. విశాఖలో 16 రాష్ట్రాల పోలీస్ కమాండో జట్లతో పాటు ఏడు పారామిలిటరీ దళాల కమాండో జట్లు ఐదు దశల్లో జరిగే పోటీల్లో పాల్గొంటాయన్నారు. జాతీయ సమగ్రతకు ఈ పోటీలు చక్కటి ఉదాహరణ అన్నారు. తొలుత అక్షర క్రమంలో ఆంధ్రప్రదేశ్ జట్టుతో ప్రారంభమై, ఉత్తరాఖండ్ జట్టు చివరగా మొత్తం 23 జట్లు గౌరవవందనం సమర్పించాయి. గ్రేహౌండ్ బ్యాండ్ మార్చ్‌పాస్ట్ అలరించింది. ఈ కార్యక్రమంలో ఇన్‌కంటాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ రాజీవ్‌కుమార్ సింగ్, పోలీస్ రిక్రూట్‌మెంట్ చైర్మన్ ఏడీజీ అతుల్‌సింగ్, రేంజ్ ఐజీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన ఏపీ విద్యార్థి

- సాఫ్ట్‌బాల్ టెన్నిస్ పోటీల్లో బంగారు పతకం కైవసం
- టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకం



బంగారు పతకం సొంతం చేసుకున్న ఆరోన్ రొనాల్డిన్హో

సాక్షి, అమరావతి: జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాయ్‌పూర్‌లో జరుగుతున్న క్రీడల్లో ఏపీ విద్యార్థులు సత్తా చాటారు. సోమవారం జరిగిన సాఫ్ట్‌బాల్ టెన్నిస్ అండర్-19 బాలుర విభాగంలో సింగిల్స్‌లో అనంతపురం జిల్లా గుంతకల్లులోని ఎస్ఎస్‌జీఎస్ జూనియర్ కాలేజీ విద్యార్థి ఎస్.ఆరోన్ రొనాల్డిన్హో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. విజేతలు గుంటూరు భాష్యం జూనియర్ కాలేజీ విద్యార్థి సదుర్ల చరణ్‌కుమార్, నారాయణ జూనియర్ కాలేజీ విద్యార్థి గోవాడ బాల మనోజ్ కుమార్, కాకినాడ జిల్లా నేమాం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కందికట్ల అభిషేక్, మూలపేట జెడ్పీ స్కూల్ విద్యార్థి బొడ్డు చంద్రశేఖర్ ఉన్నారు.

శేషాచలంలో అరుదైన తూనీగ




తిరుపతి మంగళం (తిరుపతి జిల్లా): శేషాచలం కొండల్లో డ్రాగన్ ఫ్లైస్ జాతికి చెందిన అరుదైన తూనీగ (రామ్ సెలై)ను గుర్తించినట్లు వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఇనేష్ సిద్ధార్థ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ తూనీగలు 2 అంగుళాలు ఉంటాయని... ఇవి మాత్రం ఒకటిన్నర అంగుళం మాత్రమే ఉంటాయని పేర్కొన్నారు. రామ్ సెలై తూనీగలు ఎక్కువగా చిత్తడి నేలల వద్ద ఉంటూ దోమలను ఆహారంగా తీసుకుంటాయని ఆయన వెల్లడించారు.

నేటి నుంచి ఎఫ్ఏ-3 పరీక్షలు

సాక్షి, అమరావతి: ఒకటి నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్-3 (యూనిట్ టెస్ట్) పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. మంగళవారం నుంచి ఈనెల 30 వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష ముగిసిన అనంతరం మిగిలిన సమయంలో మరుసటిరోజు జరిగే పరీక్ష కోసం విద్యార్థులకు పునశ్చరణ తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ అధికారులను ఆదేశించారు. అన్ని సబ్జెక్టులను మూల్యాంకనం చేసి ఫిబ్రవరి 3న జవాబు పత్రాలను విద్యార్థులకు అందించాలని, ఆదేరోజు ఉపాధ్యాయులు టాపర్స్‌తో సెల్ఫీ తీసి గ్రూప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

జాతీయ స్కూల్ బ్యాండ్ పోటీల్లో ఏపీ విద్యార్థుల ప్రతిభ



సాక్షి, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా ఆరుగొలనులోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. సోమవారం ఢిల్లీలో జరిగిన జాతీయ స్కూల్ బ్యాండ్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచారు. దేశవ్యాప్తంగా ఎనిమిది జోన్ల నుంచి 16 జట్లు పోటీలో పాల్గొనగా, ఆంధ్రప్రదేశ్ జట్టు రెండో స్థానంలో నిలవడం విశేషం.

విద్యా సంస్కరణలకు అద్దంపట్టేలా రాష్ట్ర శకటం



గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు సిద్ధం చేసిన సమాచార పౌరసంబంధాల శాఖ

సాక్షి, న్యూఢిల్లీ : 75వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో భాగంగా జనవరి 26న న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఆంధ్రప్రదేశ్ శకటాన్ని ప్రదర్శించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో చేపట్టిన సంస్కరణలకు అద్దంపట్టేలా ''ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యను మార్చడం - విద్యార్థులను ప్రపంచవ్యాప్తంగా పోటీపడేలా చేయడం'' అనే ఇతివృత్తంతో శకటాన్ని రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు, వినూత్న పథకాలను తీసుకురావడంతో పాటు కార్పొరేట్ పాఠశాలలకు పోటీగా ప్రభుత్వ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తోందని, తద్వారా విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతోందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేంద్రానికి వివరించింది. ఇప్పటికే 62 వేల డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త చరిత్ర సృష్టించింది. 'మనబడి నాడు-నేడు' కార్యక్రమం ద్వారా ఇంగ్లిష్ ల్యాబ్, ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డులు, స్మార్ట్ టీవీ, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ప్లే గ్రౌండ్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించింది. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను అందిస్తోంది. ఈ అంశాన్ని అందరినీ ఆకట్టుకునేలా శకటంలో ప్రదర్శించనున్నారు. దీనికి సంబంధించి 55 సెకన్ల నిడివిగల థీమ్ సాంగ్ రూపొందించామని, శకటం పరేడ్‌లో ప్రదర్శనకు సిద్ధమైందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఓటర్లు 4.08 కోట్లు

2019తో పోలిస్తే రాష్ట్రంలో 15 లక్షలు అదనంగా పెరిగిన ఓటర్లు

ఈదఫా పురుషులు 2.01 కోట్లు.. మహిళలు 2.07 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 4,08,07,256కు చేరుకుంది. వీరిలో పురుష ఓటర్లు 2,00,74,322 మంది కాగా మహిళా ఓటర్లు 2,07,29,452, థర్డ్ జెండర్ 3,482 మంది ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. 2024 ఓటర్ల తుది జాబితాను సోమవారం ఆయన విడుదల చేశారు. గతేడాది అక్టోబర్ 27న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై ఫిర్యాదులను జనవరి 11 వరకు స్వీకరించి ఇంటింటి సర్వే చేసి అనంతరం పూర్తి పారదర్శకంగా తుది జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. ప్రతి 1,500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఉండేలా చర్యలు చేపట్టడంతో పోలింగ్ స్టేషన్లు మరో 214 పెరిగాయన్నారు. పోలింగ్ స్టేషన్ల సంఖ్య 46,165కి చేరింది. తాజాగా విడుదల చేసిన తుది జాబితాపై అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేసేందుకు జనవరి 23 నుంచి సీఈవో కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితాను https://-electoralsearch.eci.gov.in/ లో చూడొచ్చన్నారు. ఫారం 6 పూర్తి చేసి ఓటరుగా నమోదు చేసుకోవడానికి నామినేషన్ల చివరి రోజు వరకు అనుమతిస్తామని చెప్పారు.



ముసాయిదాతో పోలిస్తే పెరుగుదల

అక్టోబర్‌లో విడుదలైన ముసాయిదాతో పోలిస్తే తుది జాబితాలో నికరంగా 5,86,530 ఓటర్లు పెరిగారు. ముసాయిదాలో 4.02 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య కొత్త ఓటర్ల చేరిక, తొలగింపుల తర్వాత 4.08 కోట్లకు చేరింది. సవరణ సందర్భంగా 22,38,952 మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు. ముసాయిదా జాబితా సమయంలో 18-19 ఏళ్ల ఓటర్ల సంఖ్య 2,88,155గా ఉంటే తుది జాబితా వచ్చే సరికి ఈ సంఖ్య 8,13,544కు చేరింది. అంటే అదనంగా 5,25,389 మంది కొత్త యువ ఓటర్లు నమోదయ్యారు. ఇంటింటి సర్వే చేసి మరణించిన వారు, ఒక చోట కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు ఉన్న వారిని గుర్తించడం ద్వారా 16,52,422 మంది ఓటర్లను తొలగించారు. 2019లో 3.93 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్యతో పోలిస్తే ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో అదనంగా 15 లక్షల మంది కొత్త ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

6.55 లక్షల మంది మహిళా ఓటర్లు అదనం

రాష్ట్రంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 6,55,130 మంది అదనంగా ఉన్నారు. పురుష ఓటర్ల సంఖ్య 2,00,74,322 కాగా మహిళా ఓటర్లు 2,07,29,452 మంది ఉన్నారు. ప్రతి వెయ్యి మంది పురుష ఓటర్లకు 1,036 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. శ్రీకాకుళం మినహా మిగిలిన 25 జిల్లాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలో పురుష ఓటర్ల సంఖ్య 9,37,988 కాగా దానికంటే కొద్దిగా తక్కువగా 9,37,883 మంది మహిళా ఓటర్లున్నారు. అత్యధికంగా కర్నూలు జిల్లాలో 20,16,396 మంది ఓటర్లు ఉంటే అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 7,61,538 మంది ఓటర్లు ఉన్నారు.

ఓటర్ల తుది జాబితా ఇలా

వివరం	ఓటర్ల సంఖ్య
2024 ఎస్ఎస్ఆర్ ముసాయిదా జాబితా	4,02,21,450
2024 ఎస్ఎస్ఆర్ తుది జాబితా	4,08,07,256
ముసాయిదా జాబితా తర్వాత చేరిన కొత్త ఓటర్లు	22,38,952
ముసాయిదా జాబితా తర్వాత తొలగించిన ఓటర్లు	16,52,422
నికరంగా పెరిగిన ఓటర్లు	5,86,530
జాబితాలో దివ్యాంగుల సంఖ్య	4,87,594
ప్రతి వెయ్యిమంది జనాభాకి ఓటర్ల నిష్పత్తి	722
లింగ నిష్పత్తి	1,036
మొత్తం పోలింగ్ స్టేషన్ల సంఖ్య	46,165

పూర్తి పారదర్శకంగా జాబితా

జనవరి 2022 నుంచి తొలగించిన ఓటర్లను ఇంటింటి సర్వే ద్వారా పరిశీలించి వంద శాతం ఆధారాలను సేకరించిన తరువాతే సవరణ చేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఈ సమయంలో 21,18,940 ఓటర్లను తొలగించగా కేవలం 13,061 కేసుల్లో మాత్రమే నిబంధనలు పాటించలేదని, వాటిని నిబంధనలకు అనుగుణంగా సవరించామని పేర్కొంది. సున్నా ఇంటి నెంబర్‌పై 2,51,767 ఇళ్లు, ఒకే ఇంటి నెంబర్‌పై పది కంటే ఎక్కువ ఓట్లు ఉన్న 1,57,939 ఇళ్లను గుర్తించి ఆగస్టు, సెప్టెంబర్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సవరణ చేసినట్లు తెలిపింది. జీరో నెంబర్ ఇంటి కేసులను 97 శాతం సవరణ చేయగా పది కంటే ఎక్కువ ఓట్లున్న ఇళ్ల సంఖ్యలో 98 శాతం పరిష్కరించినట్లు తెలిపింది. ఓట్ల తొలగింపు, డూప్లికేటు ఓట్లు, మరణాలు, చిరునామా మార్పు లాంటి వాటిపై రాజకీయ పార్టీల నుంచి 14,48,516 ఫిర్యాదులు రాగా అందులో 5,64,497 కేసులు అర్హత ఉన్నవిగా గుర్తించి వాటిని తొలగించినట్లు పేర్కొంది. కొన్ని నియోజకవర్గాల్లో ఒక్కరే పెద్ద మొత్తంలో ఓట్ల తొలగింపు, చేర్పులకు దరఖాస్తు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయని, ఇలా బల్క్‌గా దరఖాస్తులు సమర్పించిన 70 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలోని ఓట్లు వేరువేరు చోట్ల నమోదైన కేసులను గుర్తించి వాటిని సవరించామని, ఈ విధంగా విశాఖలో 26,000 ఓట్లను సవరణ చేయగా, ఎన్టీఆర్ జిల్లాలో 2,27,906 ఓటర్లను సవరించినట్లు తెలిపింది. నెల్లూరు, గుంటూరు, కాకినాడ జిల్లాల్లో కూడా చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది.

వారికి ఇంటివద్దే ఓటు హక్కు

80 ఏళ్లు దాటిన వారు, దివ్యాంగులు, కోవిడ్ సోకిన వారు ఈ ఎన్నికల్లో ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్న వారిలో 80 ఏళ్లు దాటిన వారు 5,76,791 మంది ఉండగా, దివ్యాంగులు 4,87,594 మంది ఉన్నారు. ఇటీవలే పొరుగు రాష్ట్రాల్లో ఓటు హక్కు వినియోగించుకుని ఇప్పుడు ఏపీలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి దరఖాస్తు చేసుకునే ఓటర్ల విషయంలో జిల్లా ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడే నివాసం ఉంటున్నట్లు (ఆర్డినరీ రెసిడెన్స్) ధృవపత్రం ఇచ్చిన వారు మాత్రమే ఓటరుగా చేరడానికి అర్హులని, తప్పుడు ధృవపత్రాలు ఇచ్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పది రోజులు ముందు దాకా..

ఎన్నికల వరకు ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియ చేపడుతూనే ఉంటామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. ఎన్నికల తేదీకి పది రోజుల ముందు వరకు అందిన వివరాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఓటర్ల తుది జాబితా ప్రకటించిన నేపథ్యంలో సోమవారం గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో సందేహాలు, ఉంటే అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.

జిల్లాపేరు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
శ్రీకాకుళం	937988	937883	139	1876010
విజయనగరం	765620	780818	83	1546521
పార్వతీపురం మన్యం	380827	396869	68	777764
అల్లూరి సీతారామరాజు	366640	394861	37	761538
విశాఖపట్నం	963538	982574	112	1946224
అనకాపల్లి	623840	653634	38	1277512
కాకినాడ	788868	810810	179	1599857
కోనసీమ	750857	760427	17	1511301
తూర్పుగోదావరి	785802	820568	105	1606475
పశ్చిమగోదావరి	717777	744338	74	1462189
ఏలూరు	794549	830415	129	1625093
కృష్ణా	737936	780825	65	1518826
ఎన్టీఆర్	817837	857394	150	1675381
గుంటూరు	856985	913929	191	1771105
బాపట్ల	627171	653152	73	1280396
పల్నాడు	838451	875480	196	1714127
ప్రకాశం	903504	902919	98	1806521
ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు	935195	973089	214	1908498
కర్నూలు	996446	1019638	312	2016396
నంద్యాల	676176	698459	262	1374897
అనంతపురం	990229	1006163	245	1996637
శ్రీసత్యసాయి	695767	697162	63	1392992
వైఎస్ఆర్	793421	825242	224	1618887
అన్నమయ్య	690591	713366	136	1404093
చిత్తూరు	769193	788814	84	1558091
తిరుపతి	869114	910623	188	1779925
మొత్తం	20074322	20729452	3482	40807256

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం ॥ 23-1-2024

మానసికం

అతిగా ఆలోచన ఆనందానికి శత్రువు



'నేను చేసింది తప్పేమో'
'నేను చేసిన పని వల్ల ఇలా అవుతుందేమో'
'వాళ్లు అలా చేస్తే ఏం చేయాలి?'
'నా పరువు పోతుందేమో'...
చిన్న చిన్న కారణాలకు కూడా ఎంతో ఆలోచిస్తూ బాధ పడుతూ ఉంటారు కొందరు.
దీనిని 'ఓవర్‌థింకింగ్' అంటారు మానసిక నిపుణులు.
'ఇలాంటివారిని ఒకచోట చేర్చి ఆలోచనలు పంచుకుంటే ధైర్యం వస్తుంది' అంటుంది వర్షా విజయన్.
ఈమె మొదలు పెట్టిన 'ఓవర్‌థింకర్స్ క్లబ్' ఇలాంటి క్లబ్‌ల అవసరాన్ని తెలియచేస్తోంది.

'ఓ మీరూ అంతేనా?' అంది ఒక మహిళ ఆ పార్క్‌కు వచ్చిన మరో మహిళతో.

తిరువనంతపురానికి చెందిన 27 ఏళ్ల వర్షా విజయన్ 'ఓవర్‌థింకర్స్ క్లబ్'ను ప్రారంభించింది. ఇదేదో ఒక భవంతో, క్లినిక్కో కాదు. పార్కులో కొంతమంది కలవడమే. సోషల్ మీడియా ద్వారా ఈ క్లబ్ గురించి ఆమె ప్రచారం చేసింది. 'ప్రతి దానికీ తీవ్రంగా ఆలోచించే మనం ఈ ఆలోచనల నుంచి బయటపడదాం రండి' అనే ఆమె పిలుపునకు స్పందించిన స్త్రీ, పురుషులు రకరకాల వయసుల వాళ్లు వారానికి ఒకసారో నెలలో రెండుసార్లు కలవసాగారు.

'జీవితంలో మార్పులు సహజం. కాని జరగబోయే మార్పు గురించి చదువు, ఉద్యోగం, వివాహం, విడాకులు, పిల్లల ఆరోగ్యం లేదా తల్లిదండ్రుల చివరి రోజులు... వీటి గురించి రోజుల తరబడి ఆలోచిస్తూ ఉంటారు కొందరు. ఆ ఆలోచనలు పాజిటివ్ వైపు కాకుండా నెగెటివ్ వైపుగా వెళ్లడంతో ఆందోళన చెందుతుంటారు. దాని వల్ల డిప్రెషన్ వస్తుంది. అన్నింటికీ మించి ఏ నిర్ణయమూ జరక్క ఏ పనీ ముందుకు కదలదు. వర్తమానంలో ఉండే ఆనందాన్ని అనుభవించక ఎప్పుడో ఏదో నష్టం జరుగుతుందేమోనన్న ఆందోళనతో బాధ పడుతుంటారు ఓవర్‌థింకర్లు' అంటుంది వర్షా విజయన్.

ఆలోచన.. అతి ఆలోచన

'ఆలోచన మంచిదే. కాని అతి ఆలోచన మంచిది కాదు' అంటుంది వర్షా విజయన్. ఓవర్‌థింకర్ల క్లబ్‌కు హాజరైన వారు ఒకరి మాటల్లో మరొకరు తెలుసుకునే విషయం ఏమిటంటే తమ చేతుల్లో లేని వాటి గురించి కూడా అధికంగా ఆలోచించడం. ఉదాహరణకు ఎప్పుడో పెట్టుకున్న శుభకార్యం రోజు వాన పడితే... వాన పడితే... వాన పడితే అని ఆలోచించడం. వానను ఆపడం మన చేతుల్లో లేదు. పడితే పడుతుంది... లేకపోతే లేదు. పడినప్పుడు అందుకు తగ్గ సర్దుబాట్లతో పనులు అవసరం అవుతాయి. అలా అనుకుని వదిలేయాలి గాని అదే పనిగా ఆలోచించడం ఆరోగ్యం కాదు. దాని వల్ల ఇవాళ్టి ఆనందాలు మిస్ అవుతాయి.

ఓవర్‌థింకర్ల లక్షణాలు

- ఆత్మవిమర్శ అధికంగా చేయడం
- ఒక పని పూర్తిగా లోపరహితంగా చేయాలనుకోవడం (పర్ఫెక్షనిజం)
- జరిగిపోయిన ఘటనలు, మాటలు తలచుకుని వాటిలో ఏమైనా తప్పులు జరిగాయా, పొరపాట్లు జరిగాయా, వాటి పర్యవసానాలు ఏమిటి అని తల మునకలు కావడం
- ప్రయాణాల్లో ప్రమాదాలు ఊహించడం
- శుభకార్యాలప్పుడు అవి సరిగ్గా జరుగుతాయో లేదోనని ఆందోళన చెందడం
- చిన్న చిన్న సమస్యలకు కూడా పెద్ద పర్యవసానాలు ఊహించడం
- ఎవరికీ చెప్పుకోక ఆ ఆందోళనల్లోనే రోజుల తరబడి ఉండటం.



ధ్యాస మళ్లించాలి

ఓవర్‌థింకర్లు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మెరుగ్గా ఉండొచ్చు అంటుంది వర్షా విజయన్
● అతిగా ఆలోచించే చాలా విషయాలు పడే భయాలు దాదాపుగా నిజం కావు. పిల్లల్ని స్కూల్ బస్ ఎక్కించాక దానికి ప్రమాదం జరిగితే.. ప్రమాదం జరిగితే అని ఆలోచించడం మంచిది కాదు. అలా లక్షసార్లలో ఒకసారి జరుగుతుంది. ఆ ఒక సారి గురించి అతి ఆలోచన చేయకూడదు ● ఎక్కువ ఆత్మవిమర్శ చేసుకోకుండా ఏదో ఉన్నంతలో బెస్ట్ చేద్దాం... చేశాం అని ముందుకెళ్లాలి. ఏదో ఒక మేరకు సంతృప్తి చెంది పని జరిగేలా చూడాలి ● ఆలోచనలు శ్రుతి మించుతుంటే స్నేహితులతో మాట్లాడాలి. చెప్పుకోవాలి. కొత్త పనులేవైనా నేర్చుకుని ధ్యాస మళ్లించాలి ● సోషల్ మీడియాలో పనికిమాలిన పరిజ్ఞానం, వీడియోలు తగ్గించాలి ● ఈ క్షణంలో ఉండటం ప్రాక్టీస్ చేయాలి. అందుకు యోగా ఉపయోగపడుతుంది ● అన్ని మనం అనుకున్నట్టుగా జరగవు అనే వాస్తవాన్ని యాక్సెప్ట్ చేయాలి. సమస్య ఎదురైనప్పుడు చూసుకుందాంలే అనుకుని ధైర్యంగా ఉండాలి.

వినూత్నం

నాట్య వెన్నెల

వెన్నెలకు పరిమితులు ఉండవు.
ధనిక, పేద, దివ్యాంగులు అనే తేడాలుండవు.
'నృత్యం కూడా వెన్నెలలాంటిదే. అది అందరి కోసం. అందరిదీ' అంటున్న మెథిల్ దేవిక బధిరుల కోసం కొత్త నృత్యశైలిని సృష్టించింది. నాట్యంలో మూడు దశాబ్దాల అనుభవం ఉన్న కేరళకు చెందిన దేవిక డ్యాన్స్ రిసెర్చ్ స్కాలర్, ఎడ్యుకేటర్, కొరియోగ్రాఫర్‌గా పేరు తెచ్చుకుంది. సైన్‌లాంగ్వేజ్ నేర్చుకుంది. హస్తముద్రలను, సైన్‌లాంగ్వేజ్‌తో మిళితం చేసి 'క్రాస్ ఓవర్' నృత్యానికి రూపకల్పన చేసింది.

గత నెల తిరువనంతపురంలో దేవిక ఇచ్చిన శాస్త్రీయ నృత్యప్రదర్శనను ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చున్న బధిరులు ఆనందంగా ఆస్వాదించారు. ఒకసారి నృత్యప్రదర్శన ఇవ్వడానికి గుజరాత్‌కు వెళ్లిన దేవిక అక్కడ బధిరుల బృందాన్ని చూసింది. నృత్యం చూడాలనే ఆసక్తి వారిలో ఉన్నా సంపూర్ణంగా ఆస్వాదించగలరా? నృత్యం ద్వారా చెప్పే కథను వారు అర్థం చేసుకోగలరా? వారికి సులభంగా అర్థం కావాలంటే ఏంచేయాలి... ఇలాంటి విషయాలు ఎన్నో ఆలోచించింది దేవిక.

దేవిక సందేహించినట్లుగానే వారు తన నృత్యప్రదర్శనతో కనెక్ట్ కాలేదు. అర్థం కానట్లు ముఖం పెట్టారు. ఇక అప్పటి నుంచి 'డ్యాన్స్ ఫిలాంత్రపి అండ్ సోషల్ ఇన్‌క్లూజన్' ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టింది. డ్యాన్స్ వొకాబ్యులరీని అభివృద్ధి చేయడానికి ఎంతోమందితో మాట్లాడింది. 'నృత్యకారులకు తమతో తాము సంభాషించుకునే, తమలో ఊహాలోకాన్ని ఆవిష్కరించుకునే ఏకాంతంలో కొత్త ఆలోచనలు వస్తుంటాయి. నృత్యప్రదర్శనలు లేని ఖాళీ సమయంలో బధిరులను దృష్టిలో పెట్టుకొని మనసులోనే డ్యాన్స్‌ను కంపోజ్ చేశాను. ఊహల్లోని నృత్యానికి వాస్తవరూపం ఇవ్వడానికి సైన్ లాంగ్వేజ్ నేర్చుకున్నాను' అంటుంది దేవిక.

కేరళలోని పాలక్కాడ్‌లో కళాకారుల కుటుంబంలో పుట్టింది దేవిక. నాలుగేళ్ల వయసులోనే కాలికి గజ్జె కట్టింది. 20 సంవత్సరాల వయసులో సోలో పెర్‌ఫార్మెన్స్ ఇచ్చింది. కూచిపూడి నృత్యంలో మాస్టర్స్ డిగ్రీ చేసింది. 'కేరళ కళామండపం'లో విద్యార్థులకు నాట్య పాఠాలు బోధించింది. టీవీ డ్యాన్స్ షోలకు జడ్జిగా వ్యవహరించింది.

'నృత్యానికి పరిమితులు ఉన్నప్పుడు దాని ఉద్దేశం నెరవేరదు. అది సంపన్న కళాప్రియులకే కాదు అందరికీ చేరువ కావాలి' అంటున్న దేవిక తన నృత్యప్రదర్శన సామాన్యులకు చేరువ చేయడానికి ప్రయత్నిస్తోంది.

తిరువనంతపురం డ్యాన్స్ షోలో బధిరులు తన హస్తముద్రలను అనుకరించడం దేవికకు సంతోషం ఇచ్చింది. 'అదొక గొప్ప అనుభవం. వారి కళ్లు ఆనందంతో వెలిగిపోయాయి. ఎన్నో సంస్కృతులు, ఎన్నో భాషలకు చెందిన ప్రేక్షకుల ముందు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను. ఆ సంతోషాన్ని మించిన సంతోషం ఇది. నా నృత్యం వారి హృదయానికి దగ్గరైంది. నా ఉద్దేశం నెరవేరింది' అంటోంది దేవిక.

'నృత్యాన్ని ప్రజాస్వామీకరించాలి. అది అందరికీ చేరువ కావాలి' అంటున్న దేవిక తన ప్రాజెక్ట్ ద్వారా మరిన్ని ప్రదర్శనలు ఇవ్వాలనుకుంటోంది. మనం ఒక ప్రయోగానికి సిద్ధపడినప్పుడు కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావాలి. దేవిక అలాగే చేసింది. ధైర్యంగా ముందు అడుగు వేసింది. బధిరులలో ఎంతోమందికి నృత్యం నేర్చుకోవాలనే ఆసక్తి ఉండవచ్చు. అయితే ప్రతికూల ఆలోచనలు వారిని వెనక్కి లాగవచ్చు. అలాంటి వారిని నృత్యకారులుగా తయారుచేయడానికి దేవిక సృష్టించిన నృత్యశైలి ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది అనడంలో సందేహం లేదు.



క్రాస్‌ఓవర్
నృత్యప్రదర్శన చూస్తున్నప్పుడు వారి ముఖాల్లో కనిపించిన వెలుగు నాకు సంతోషాన్ని, ధైర్యాన్ని ఇచ్చాయి.
మనం వెదకాలేగాని దారులు ఎన్నో ఉన్నాయి. 'క్రాస్‌ఓవర్' ద్వారా నాకు ఒక కొత్త దారి దొరికింది.
- మెథిల్ దేవిక

బాదంకూ ఉంది ఓ రోజు!



బాదంపప్పుల ప్రయోజనాల ప్రాముఖ్యతను తెలియజేయడానికి ప్రతి యేటా జనవరి 23న 'నేషనల్ ఆల్మండ్ డే' ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా నలభై ఏళ్లుగా వెల్‌నెస్ అండ్ న్యూట్రిషన్ కన్సల్టెంట్ అయిన షీలా కృష్ణస్వామి రోజువారీ ఆహారంలో బాదంపప్పును చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తున్నారు.

★ ప్రతిరోజూ పది బాదం పప్పులు తినడం వల్ల శరీరానికి కావల్సిన విటమిన్ ఇ, మెగ్నీషియం, ప్రొటీన్, జింక్.. వంటి 15 ముఖ్యమైన పోషకాలు అందుతాయి ★ రోజూ కొన్ని బాదంపప్పులు తింటే ఆహారం తక్కువ తీసుకున్నా పొట్ట, బ్రెయిన్ సంతృప్తితో నిండిన భావన కలుగుతుంది. అంటే, బాదంపప్పులు బరువును బ్యాలెన్స్ చేయడంలో సహాయపడతాయి ★ బాదంపప్పులను రోజూ తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్ తగ్గి, గుండెకు హాని కలిగించే సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది ★ బాదంపప్పుల్లో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. ఎముకలు, దంతాలు, కండరాల పనితీరు నిర్వహణకు తోడ్పడుతుంది.

సాగుబడి

శ్రవణ కార్తె: జనవరి 24 నుంచి

- రెండేళ్ల క్రితం తొలుత అందుకొర్ర విత్తిన రైతు హేమాద్రిరెడ్డి
- పంట కోత తర్వాత తిరిగి దుక్కి చేసి నీరు పెడితే చాలు.. విత్తనాలు వేయకుండానే రాలిన విత్తనాలే తిరిగి మొలుస్తున్న వైనం..
- కోతకు సిద్ధంగా నాలుగో పంట.. ఎకరానికి ప్రతి పంటలోనూ పది క్వింటాళ్ల దిగుబడి
- 5 ఎకరాలతో అందుకొర్ర సాగు ప్రారంభించి 20 ఎకరాలకు విస్తరించిన రైతు

ఒక్కసారి విత్తితే.. నాలుగు పంటలు!

అందుకొర్ర.. చిన్న చిరుధాన్యా(స్మాల్ మిల్లెట్స్)ల్లో విశిష్టమైన పంట. పంట కాలం 90–100 రోజులు. ధాన్యపు పంట ఏదైనా కోత కోసి, దుక్కి చేసిన తర్వాత మళ్లీ పంట రావాలంటే తిరిగి విత్తనాలు ఎదపెట్టాల్సిందేనని మనకు తెలుసు. అయితే, అందుకొర్ర పంటను రెండేళ్లుగా సాగు చేస్తున్న కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన కె. హేమాద్రిరెడ్డి అనుభవం అందుకు భిన్నంగా ఉంది.

2022 జూలైలో తొలిసారి 5 ఎకరాల్లో అందుకొర్ర విత్తనం వేసి, అక్టోబర్‌లో పంట కోసుకున్నారు. నవంబర్‌లో దుక్కిచేసి మినుము చల్లి, నీటి తడి పెట్టారు. అందుకొర్ర వత్తుగా మొలవటంతో ఆశ్చర్యం కలిగింది. అందుకొర్ర కోత కోసే సమయంలో రాలిన ధాన్యమే నెల రోజుల తర్వాత దుక్కి చేసి తడి పెట్టగానే మొలిచిందన్నమాట. మినుము మొలకలు కనిపించినా అవి ఎదగలేకపోయాయి. అందుకొర్ర ఏపుగా పెరిగింది. సరే.. ఇదే పంట ఉండనిద్దామని నిర్ణయించుకొని.. ట్రాక్టర్‌తో సాళ్లు తీసి అందుకొర్ర పంటనే కొనసాగించారు. అదే విధంగా మూడు పంటలు పూర్తయ్యాయి. నాలుగో పంట ఇప్పుడు కోతకు సిద్ధంగా ఉందని, ప్రతి పంటలోనూ ఎకరానికి 10 క్వింటాళ్ల అందుకొర్ర దిగుబడి వస్తోందని, పంట పంటకు దిగుబడి ఏమాత్రం తగ్గలేదని, తక్కువ ఖర్చుతోనే అందుకొర్ర పంట అధికాదాయాన్ని అందిస్తోందని రైతు హేమాద్రి రెడ్డి సంతోషంగా చెప్పారు. అనంతపురంలో ఇటీవల జరిగిన మూడు రోజుల చిరుధాన్యాల సమ్మేళనం ప్రారంభోత్సవానికి హాజరైన ఆయన 'సాక్షి సాగుబడి'తో తన ఆనందాన్ని పంచుకున్నారు. కదిరికి చెందిన ఎర్త్ 360 సంస్థ వ్యవస్థాపకులు దినేశ్ సూచనలు, సహాలతో చిరుధాన్యాల సాగు చేపట్టానని ఆయన తెలిపారు.



అందుకొర్ర పొలంలో హేమాద్రిరెడ్డి

కలుపు బాధ లేని అందుకొర్ర పంట

40 ఎకరాల ఆసామి అయిన హేమాద్రిరెడ్డి సాగు భూమిని చాలా కాలంగా కౌలుకు ఇస్తూ వచ్చారు. రెండేళ్ల క్రితం మనుమడి సూచన మేరకు 5 ఎకరాల్లో అందుకొర్ర చిరుధాన్యాల సాగు ప్రారంభించారు. కూలీల కొరతతో ఇబ్బంది అవుతుందని తొలుత సంశయించానని, అయితే అందుకొర్ర పంటకు కలుపు సమస్య లేకపోవటంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నానని ఆయన అన్నారు. పెద్దగా ప్రయాస పడాల్సిన అవసరం లేని చక్కని పంట అందుకొర్ర అన్నారాయన. కలుపు మొక్కల కన్నా అందుకొర్ర మొక్కలు వేగంగా పెరుగుతుంది. అందువల్ల కలుపు పెరిగే అవకాశమే లేదన్నారు. దీంతో ప్రయాస లేకుండానే పంట చేతికి వస్తోందని, యంత్రంతో కోతలు జరుపుతున్నారు. ఇప్పుడు మొత్తం 20 ఎకరాలకు అందుకొర్ర సాగును విస్తరించారు.

మోళ్లు కలియదున్నుతాం..

దుక్కి చేసిన తర్వాత గొర్రెలను పొలంలో నిల్వగడతారు. గొర్రెల మలమూత్రాలు పొలాన్ని సారవంతం చేస్తాయి. ఆ తర్వాత కలియదున్నిన తర్వాత వరుసల మధ్య 15 అంగుళాలు ఉండే ట్రాక్టర్ గొర్రుతో ఎకరానికి 5 కిలోల అందుకొర్ర విత్తనాలను తొలి ఏడాది విత్తారు. రెండో పంట నుంచి.. పంట కోత తర్వాత మోళ్లను రొటవేటర్‌తో భూమిలో కలియదున్నుతున్నారు. పంట కాలంలో మూడు దఫాలు హంద్రీ నది నుంచి మోటారుతో తోడిన నీటిని పారగడుతున్నారు. నల్లరేగడి నేల కావటంతో ఎక్కువగా తడి ఇవ్వటం లేదని, ఇది మెట్ట పంట కాబట్టి నీరు ఎక్కువ పెడితే రొట్ట పెరుగుతుంది తప్ప దిగుబడి రాదని హేమాద్రి రెడ్డి వివరించారు. గొర్రెలు ఆపటానికి ఎకరానికి రూ. 1,500 ఖర్చవుతోంది. దుక్కి, అంతర సేద్యం అంతా సొంత ట్రాక్టర్‌తోనే చేస్తున్నారు. బయటి ట్రాక్టర్‌తో ఈ పనులు చేస్తే ఎకరానికి పంటకు రూ. 3 వేలు ఖర్చు వస్తుంది.

'అంతకు మించి చేసేదేమీ లేదు. చీడపీడలు, తెగుళ్ల సమస్య లేదు కాబట్టి పురుగుమందుల పిచికారీ అవసరం రావటం లేద'న్నారాయన. కలుపు, చీడపీడల సమస్యలు లేని, కూలీల అవసరం పెద్దగా లేని అందుకొర్ర పంటను సునాయాసంగా సాగు చేస్తూ.. క్వింటాకు రూ. 9,500 ఆదాయం పొందుతున్నానని హేమాద్రిరెడ్డి తెలిపారు. మిషన్‌తో పంట కోత ఖర్చు, గడ్డి అమ్మితే సరిపోతోందన్నారు. కొర్ర కూడా సాగు చేస్తున్నానని, వచ్చే సీజన్ నుంచి అరికలు కూడా వేద్దామనుకుంటున్నానన్నారు.

క్వింటా రూ.9,500

రెండేళ్ల క్రితం తొలిసారి 5 ఎకరాల్లో అందుకొర్ర విత్తినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి పంటా ఎకరానికి పది క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. తొలి పంట క్వింటా రూ. 5 వేలకు అమ్మాను. రెండో పంటను క్వింటా రూ.7,500కు అమ్మాను. గత ఏడాది ఖరీఫ్‌లో మరో 15 ఎకరాల్లో కూడా అందుకొర్ర వేశా. మూడో పంటను క్వింటా రూ. 9,500కు అమ్మాను. నాలుగో పంట కొద్ది రోజుల్లో కోతకు సిద్ధమవుతోంది. రైతులకు విత్తనంగా కూడా ఇస్తున్నాను. ఎకరానికి రూ. 20 వేలు ఖర్చులు పోగా మంచి నికరాదాయం వస్తోంది. 3 సార్లు నీరు కడుతున్నాం. నీరు ఎక్కువైతే దిగుబడి తగ్గిపోతుంది. ఒక పొలంలో జనుము సాగు చేసి రొటవేటర్ వేస్తే ఆ తర్వాత అందుకొర్ర దిగుబడి ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు వచ్చింది. ప్రయాస లేని పంట అందుకొర్ర.

- కె. హేమాద్రిరెడ్డి (93469 22110), అందుకొర్ర రైతు, కోడుమూరు, కర్నూలు జిల్లా

అందుకొర్ర అద్భుత పంట



అద్భుతమైన చిరుధాన్య పంట అందుకొర్ర.. కలుపును ఎదగనివ్వదు. ఈ విత్తనానికి నిద్రావస్థ పెద్దగా ఉండదు. గింజ బాగా తయారైన తర్వాత కోత కోసి నూర్పిడి చేస్తే, వారం రోజుల తర్వాత మొలుస్తుంది. ఒక్కసారి విత్తి వరుసగా నాలుగో పంట తీసుకుంటున్న హేమాద్రి రెడ్డి సాగు అనుభవం రైతులకు స్ఫూర్తిదాయకంగా ఉంది. పంట కోసిన తర్వాత మోళ్లను భూమిలోకి కలియదున్నటం, గొర్రెలను నిలపటం వల్ల భూమి సారవంతమవుతోంది. మార్కెట్‌లో అందుకొర్రలు సహా అన్ని చిరుధాన్యాలకు ఇప్పుడు మంచి గిరాకీ ఉంది. ధర తగ్గే ప్రమాదం లేదు.

- దినేశ్ (94408 70875), చిరుధాన్యాల నిపుణుడు, ఎర్త్ 360, కదిరి

11న దేశీ గోవ్యాధులపై సదస్సు

ఫిబ్రవరి 11(ఆదివారం) న ఉ. 7 గం. నుంచి సా. 4 గం. వరకు గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతునేస్తం ఫౌండేషన్ ఆవరణలో దేశీ గో–జాతుల వ్యాధులు, ఇతర సమస్యలపై రాష్ట్ర స్థాయి సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు తెలిపారు. దేశీ ఆవుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై గో పోషకులకు అవగాహన కల్పిస్తారు. గోవులకు ఉచిత వైద్య శిబిరంతోపాటు ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అందరూ ఆహ్వానితులే. ప్రవేశం ఉచితం. **వివరాలకు** 97053 83666.

'చిరు' యంత్రాల ఫౌండేషన్!





కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికెలు వంటి చిన్న చిరుధాన్యాల (స్మాల్ మిల్లెట్స్) ధాన్యాన్ని వండుకొని తినాలంటే పైపొట్టు తీసి బియ్యం తయారు చేసుకోవాల్సి ఉంటుంది. పూర్వం దంపుకొని చిరుధాన్యాల బియ్యం తయారు చేసుకునేవారు. ఇది చాలా శ్రమతో కూడిన పని.


కొన్ని సంవత్సరాలుగా మిక్సీలను ఉపయోగించి ఇంటి స్థాయిలో మిల్లెట్ బియ్యం తయారు చేసుకోవటం ప్రారంభమైంది. అయితే, మిక్సీకి ఉన్న పరిమితుల దృష్ట్యా వాణిజ్య దృష్టితో చిన్న చిరుధాన్యాల బియ్యం ఉత్పత్తి చేయదలచిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాలు, మహిళా స్వయం సహాయక బృందాలు, చిన్న వ్యాపారులు యంత్రాలను ఆశ్రయించక తప్పట్లేదు. యంత్రాల ధర అందుబాటులో లేని పరిస్థితుల్లో చిన్న చిరుధాన్యాల ప్రాసెసింగ్ పెద్ద సంస్థలు, కంపెనీలకే పరిమితం అవుతూ వచ్చింది. ఇది గ్రామాల్లో పేద రైతులు, మహిళా బృందాలు, చిన్న వ్యాపారులకు ఈ ప్రక్రియ పెద్ద సవాలుగా నిలిచింది.


ఈ సవాలును అధిగమించడానికి ఇంటి స్థాయిలో, గ్రామస్థాయిలో మహిళలు, పిల్లలు సైతం ఉపయోగించడానికి అనువైన అనేక చిన్న యంత్రాల రూపకల్పనలో అనేక ఏళ్లుగా విశేష కృషి చేస్తున్న తమిళనాడుకు చెందిన స్మాల్ మిల్లెట్ ఫౌండేషన్ (డెవలప్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ యాక్షన్ – ధాన్ – ఫౌండేషన్ అనుబంధ సంస్థ) విజయం సాధించింది. ఈ సంస్థ రూపొందించిన చిన్న యంత్రాల్లో ఒకటి.. దేశంలోనే తొలి 'టేబుల్ టాప్ డీహల్లర్ మిషన్'. కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికెలు వంటి ఏ రకం చిరుధాన్యాలతోనైనా, అర కిలో అయినా సరే, ఈ యంత్రంతో బియ్యం తయారు చేసుకోవచ్చు. ఇటువంటివే మరికొన్ని చిన్న యంత్రాలను ఈ ఫౌండేషన్ రూపొందించింది. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చిన మేలైన సాగు, శుద్ధి, విలువ జోడింపు పద్ధతులు, యంత్రాలపై నీతి ఆయోగ్ 'మిల్లెట్ సంకలనం'ను న్యూఢిల్లీలో ఇటీవల విడుదల చేసింది. స్మాల్ మిల్లెట్ ఫౌండేషన్ ప్రజలు, శాస్త్రవేత్తలు, రైతులు అవసరాల మేరకు తయారు చేసి అందుబాటులోకి తెచ్చిన చిన్న యంత్రాలను ప్రశంసిస్తూ ఒక కథనం ప్రచురించటం విశేషం. నీతి ఆయోగ్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ నీలం పటేల్ తదితరులు ఈ సంకలనానికి సంపాదకులుగా వ్యవహరించారు.

టేబుల్ టాప్ హల్లర్

దేశంలోనే తొలి 'స్మాల్ మిల్లెట్ టేబుల్ టాప్ ఇంపాక్ట్ హల్లర్ వి3' ఇది. చిన్న చిరుధాన్యాల పైపొట్టు తీసి బియ్యం తయారు చేసుకోవడానికి ఉపయోగపడే చిన్న యంత్రం ఇది. బరువు 30 కిలోలు. ముప్పావు మీటరు ఎత్తు, అర మీటరు పొడవు, అర మీటరు వెడల్పు ఉంటుంది. ఇంట్లో చిన్న టేబుల్ మీద పెట్టుకొని వాడుకోవచ్చు. మహిళలు, పిల్లలు సైతం ఉపయోగించడానికి అనువైనది. ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లవచ్చు. అతి తక్కువ 0.5 హెచ్ పి విద్యుత్తుతో పనిచేస్తుంది. సింగిల్ ఫేజ్ విద్యుత్తు లేదా సౌర విద్యుత్తు లేదా పెట్రోలు మోటారుతోనూ నడుస్తుంది. 90% సామర్థ్యంతో పనిచేస్తుంది. ఒకసారి మర పడితే 10% మెరికలు వస్తాయి. రెండోసారి మళ్లీ మరపడితే వంద శాతం బియ్యం సిద్ధమవుతాయి. చిరుధాన్యం రకాన్ని బట్టి గంటకు 30 నుంచి 80 కిలోల ధాన్యాన్ని మర పట్టొచ్చు. ఏ రకం చిన్న చిరుధాన్యాన్నయినా ఈ యంత్రానికి ఎటువంటి మార్పులు చేయాల్సిన అవసరం లేకుండానే మర పట్టుకోవచ్చు. అర కేజీ ధాన్యం ఉన్నా సరే దీన్ని ఉపయోగించవచ్చు. తక్కువ శబ్దం చేస్తుంది. 2 గంటల తర్వాత ఓ గంట విరామం ఇవ్వాలి. దీని ధర రూ. 88 వేలు (18% జీఎస్టీ అదనం).

పోర్టబుల్ ఇంపాక్ట్ హల్లర్





టేబుల్ టాప్ హల్లర్ కన్నా కొంచెం పెద్దది స్మాల్ మిల్లెట్ పోర్టబుల్ ఇంపాక్ట్ హల్లర్ (ఎస్.ఎం.ఎఫ్. వి2). ఇది గంటకు 100 నుంచి 500 కిలోల చిన్న చిరుధాన్యాలను ప్రాసెస్ చేస్తుంది. 1 హెచ్‌పి మోటారుతో త్రీఫేస్ విద్యుత్తుతో పనిచేస్తుంది. బరువు 98 కిలోలు. మీటరు పొడవు, మీటరు ఎత్తు, ముప్పావు మీటరు వెడల్పు ఉంటుంది. ఎక్కువ గంటల పాటు వాడొచ్చు. మహిళలు సైతం సురక్షితంగా, సులువుగా వాడటానికి అనువైనది. ఎస్.ఎం.ఎఫ్. వి2 ధర రూ. 1,68,000. (18% జీఎస్టీ అదనం). ఈ యంత్రాలపై ఆసక్తి గల వారు తమిళనాడులోని కృష్ణగిరి కేంద్రంగా పనిచేస్తున్న స్మాల్ మిల్లెట్ ఫౌండేషన్ (ఎస్.ఎం.ఎఫ్.) సాంకేతిక విభాగం ఇన్‌చార్జ్ శరవణన్‌ను 86675 66368 నంబరులో ఇంగ్లిష్ లేదా తమిళంలో సంప్రదించవచ్చు.



ఏ అభిప్రాయం లేకుండా ఉండే అవకాశం నీకు ఎప్పుడూ ఉంది. నువ్వు నియంత్రించలేని విషయాల పట్ల, నీ ఆత్మను ఇబ్బంది పెట్టుకోవాల్సిన అవసరం లేదు. తీర్పు ఇమ్మని ఆ విషయాలు నిన్ను కోరడం లేదు.

– మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 23 జనవరి 2024

అవిస్మరణీయ క్షణాలు

కొన్ని క్షణాలు చరిత్రలో ప్రత్యేకంగా నిలుస్తాయి. భారత ప్రధాని మోదీ మాటల్లో చెప్పాలంటే, హిందువులు ఆరాధించే శ్రీరాముడికి పురాణప్రసిద్ధమైన ఆయన జన్మస్థలి అయోధ్యలో వెలసిన మందిర ప్రారంభం, అక్కడ అయిదేళ్ళ బాలరాముడి విగ్రహానికి సోమవారం జరిపిన ప్రాణప్రతిష్ఠాపన ఘట్టం అలాంటివే. మరో వెయ్యేళ్ళు గుర్తుండిపోయే రోజుగా మోదీ పేర్కొన్న మందిర ప్రారంభ దినాన కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా రామనామం ప్రతిధ్వనించింది. నేపాల్, బాలీ, ట్రినిడాడ్ సహా దేశదేశాల్లోని హిందువులు ఉత్సవం చేసుకున్నారు. వజ్రవైడూర్య ఖచిత స్వర్ణాభరణాలంకృత మందస్మిత బాలరామ రూపసాక్షాత్కారం, సాయంసంధ్యలో సరయూ తీరంలో లక్షల సంఖ్యలో దీపప్రజ్వలనంతో... అనంత కాలగతిలో ఒక చక్రభ్రమణం పూర్తి అయినట్టయింది. నాగరకతలో ఇదొక మహత్తర క్షణమనీ, రామరాజ్య స్థాపనకు తొలి అడుగనీ కొందరంటే... రామరాజ్యమంటే హిందూ రాజ్యం కాదు, ధర్మరాజ్యమనే గాంధీ భావనను ఇతరులు గుర్తుచేయాల్సి వచ్చింది.

అనేక మతఘర్షణలు, దశాబ్దాల రాజకీయ, న్యాయ పోరాటాలు ఈ మందిర నిర్మాణం వెనుక ఉన్నాయి. రామ జన్మభూమిలో 1528లో బాబర్ సైన్యాధ్యక్షుడు మీర్ బాఖీ కట్టినట్టు చెబుతున్న బాబ్రీ మసీదు 1992 డిసెంబర్ 6న కరసేవకుల చేతిలో కూలడం, చివరకు సుప్రీమ్ కోర్ట్ వేర్వేరుగా ఆలయ – మసీదు నిర్మాణాలకు ఆదేశాలివ్వడం... అలా అది ఓ సుదీర్ఘ చరిత్ర. వెరసి, అయిదు శతాబ్దాల తర్వాత రామ్ లల్లా (బాల రాముడు)కు అది మందిరమైంది. వేలాది ధార్మికుల మొదలు అద్వానీ, మురళీ మనోహర్ జోషీ, అశోక్ సింఘాల్, కల్యాణ్ సింగ్ లాంటి నేతల వరకు ఈ ఆలయ నిర్మాణ ఘట్టానికి ప్రేరకులు, కారకులు ఎందరెందరో. మూడు దశాబ్దాల క్రితం తమ పార్టీ చేసిన ఎన్నికల వాగ్దానాన్ని ఎట్టకేలకు నెరవేర్చిన ఘనత మాత్రం మోదీకి దక్కింది. తెరపై రామ జన్మభూమి ట్రస్ట్ లాంటి పేర్లున్నా, తెర వెనుక చక్రం తిప్పుతున్నదెవరో తెలియనిది కాదు. వచ్చే మేలో మరోసారి ప్రజాతీర్పు కోరి, వరుసగా మూడోసారి బీజేపీని గద్దెనెక్కించే పనిలో మోదీ ఉన్నారు. హడావిడి, అసంపూర్ణ ఆలయ ప్రారంభోత్సవాన్ని ఎన్నికల అస్త్రంగా విమర్శకులు తప్పుబడుతున్నదీ అందుకే. కోట్లాది శ్రద్ధాళువుల ఉత్సాహం అర్థం చేసుకోదగినదైనా, దేశమంతటా ఉద్వేగం రగిలించి, మందిరాన్ని సైతం మెగా ఈవెంట్‌గా మార్చేయడం వెనుక రాజకీయ ప్రయోజనాలు లేవనలేం.

'ఆనకట్టలే ఆధునిక దేవాలయాలు' అన్న భావన నుంచి పక్కకు జరిగి, అత్యద్భుత ఆలయ నిర్మాణాలు అవసరమనే విధాన మార్పు వైపు దేశం ప్రయాణించింది. బీజేపీ, మోదీల మందిర రాజకీయాలు ప్రాంతీయ నేతలకూ పాఠమయ్యాయి. ఆలయాలు అనంత రాజకీయ ఫలదాయకమని అందరూ గుర్తించారు. అయోధ్య అక్షతలను ఇంటింటికి పంపే పని ఒకరు చేస్తే, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ రాష్ట్రంలో ప్రతి ఇంటా బియ్యం, తాంబూలం సేకరించి, గత బుధవారం పూరీ క్షేత్రంలో ఆలయ విస్తరణ ప్రాజెక్ట్ 'జగన్నాథ్ పరిక్రమ' ప్రారంభించారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ శక్తిపీఠాల్లో ఒకటైన కోల్‌కతాలోని కాళీఘాట్ ఆలయ పునర్నిర్మాణాన్ని తెరపైకి తెచ్చారు. మతానికీ, రాజకీయానికీ ముడివేసే ఈ ప్రయత్నాలు ఎంత దూరం వెళతాయో చెప్పలేం. అడుగడుగున గుడి, అందరిలో దేవుడున్నాడని భావించే భారతీయ సంస్కృతి నడయాడిన నేలపై... అయోధ్యలో మందిరావిష్కారం రోజునే మమత సర్వమత సౌభ్రాతృత్వ యాత్ర చేపట్టడం గమనార్హం.

నిజానికి, ప్రపంచవ్యాప్తంగా ధార్మిక స్థలాల సందర్శన పెరుగుతోంది. ధార్మిక పర్యాటకం పోటెత్తుతోంది. భారత్‌లో ఏటా 20 కోట్ల మందికి పైగా కాశీని సందర్శిస్తారనీ, రోజుకు లక్ష మందికి పైగా తిరుపతికి వస్తారనీ లెక్క. ఇప్పుడీ జాబితాలో కొత్తగా అయోధ్య చేరనుంది. దేశంలోనే పెద్ద హిందూ దేవాలయంగా నిర్మాణమైన రామమందిరం, సరయూ నదీ తీరంలోని సామాన్య పట్నాన్ని మహానగరంగా మార్చేందుకు వేసిన మెగా ప్రణాళిక, ప్రచార హంగామాతో పరివ్యాప్తమైన ధార్మిక వాతావరణం... అన్నీ కలసి పురాణ ప్రసిద్ధ శ్రీరామ జన్మస్థలి అయోధ్యను సరికొత్త ఆధ్యాత్మిక గమ్యంగా మారుస్తున్నాయి. చరిత్ర ప్రసిద్ధ ప్రాంతాలను పర్యాటక క్షేత్రాలుగా తీర్చి దిద్దడం మన వారసత్వ వైభవానికీ, పర్యాటక వాణిజ్యానికీ మంచిదే. కాకుంటే, రూ. 15 వేల కోట్ల ప్రాజెక్టులు, 85 వేల కోట్ల పెట్టుబడులు అంటూ ఒకప్పుడు రోజుకు 2 వేల మందికి పరిమితమైన ప్రాంతాన్ని రోజుకు 3 లక్షల పర్యాటకుల స్థాయికి తీసుకెళ్ళే క్రమంలో తగు జాగ్రత్తలూ ముఖ్యం.

అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠాపన, మందిర ప్రారంభాలకు ఉత్సవం చేసుకోవడం సరే. ఈ సంబరాల వేళ సాటి వర్గాలను మానసికంగా ఒంటరివాళ్ళను చేస్తేనే కష్టం. సమస్త జనుల సౌభాగ్యానికి మారుపేరైన 'రామరాజ్యం' వైపు నడిస్తేనే సార్థకత. దేశంలోని అన్ని వర్ణాలు, వర్గాల మధ్య సమత, సమానత, సహనం, సామరస్యం, సౌభ్రాతృత్వం నెలకొనేలా చూడాల్సింది నాయకులే. ఆ కృషి చేస్తేనే అర్థం, పరమార్థం. శ్రీరాముడు చేసింది అదే. అలాకాక, 'అయోధ్య అయిపోయింది... కాశీ, మథుర మిగిలింది' లాంటి రెచ్చగొట్టే నినాదాలతో వైమనస్యాలు పెంచితే, దేశ సమైక్యతకే అది గొడ్డలిపెట్టు. మరో రావణకాష్ఠానికి మొదటి మెట్టు. ఈ దేశం నీది, నాది, మనందరిదీ అని అన్నివర్గాలూ అనుకోగలిగే ఏకాత్మ భావనే భిన్న సంస్కృతులు, ధర్మాల సమ్మిళితమైన భారతావనికి శ్రీరామరక్ష. పాత తప్పుల్ని తవ్వి తలకుపోసుకొనే పని మాని, కలసి నడవాల్సిన సమయమిది. ఆ దిశలో... నేటికీ కలగానే మిగిలిన నిరుద్యోగ నివారణ, దారిద్య్ర నిర్మూలన, స్త్రీలోకపు సశక్తీకరణ, పీడితజన సముద్ధరణ లాంటి లక్ష్యాలతో మన పాలకులు అడుగులు వేయాలని ఆశిద్దాం. అందరూ ఆ మహా సంకల్పం చెప్పుకొంటేనే ఏ సంబరానికైనా పుణ్యం, పురుషార్థం!

ఎన్ని తగ్గిస్తే అన్ని నెగ్గినంత!

కామెంట్



కరణ్ థాపర్

28 పార్టీల 'ఇండియా' కూటమి ప్రధాన లక్ష్యం ఏమిటి అన్నదాన్ని బట్టే అది తన లక్ష్యం సాధించగలదా లేదా అన్నది ఆధారపడి ఉంటుంది. బీజేపీని 272 సీట్ల కన్నా తక్కువకు నియంత్రించి, మిత్రపక్షాల మద్దతు లేనిదే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని స్థితికి తేవడమా? లేక, కూటమిలోని 28 పార్టీలు దేనికదిగా అత్యధిక సీట్లలో విజయం సాధించటమా? ఈ రెండు కూడా వేర్వేరు లక్ష్యాలు. అత్యధిక సీట్లను గెలుచుకోవటమే 'ఇండియా' కూటమి లక్ష్యమైతే... చేజేతులా బీజేపీని తిరుగులేని విధంగా అధికారంలోకి రానివ్వటమే! అలా కాకూడదంటే, ఓట్లు చీలకుండా ఆ యా పార్టీలు తాము గెలవలేని రాష్ట్రాల్లో మిత్రపక్షాల కోసం సీట్లను త్యాగం చేయవలసి ఉంటుంది.

ఈరోజు నేను చెప్పాలనుకుంటున్న విషయం సరళమైనది, సూటిగా మాట్లాడుకోబోయేదీ. అదేమిటంటే – వచ్చే ఎన్నికల్లో నరేంద్ర మోదీని, భారతీయ జనతా పార్టీని 'ఓడించాలన్న' 28 పార్టీల 'ఇండియా' కూటమి కల నిజం అవుతుందా అన్నది! అయితే ఆ కల నిజం అవటం అన్నది ఒకే ఒక ప్రశ్నకు లభించే సమాధానం పైనే ఆధారపడి ఉంటుంది. 'ఇండియా' కూటమి లక్ష్యం ఏమిటన్నదే ఆ ప్రశ్న. బీజేపీని 272 సీట్ల కన్నా తక్కువకు నెట్టేసి, మిత్రపక్షాల మద్దతు లేనిదే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని స్థితికి ఆ పార్టీ తేవడమా? లేక, కూటమిలోని 28 పార్టీలు దేనికదిగా అత్యధిక సీట్లలో విజయం సాధించటమా?

ఇవి రెండూ వేర్వేరు లక్ష్యాలు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒకే లక్ష్యంగా అవి కూటమి కలను సాకారం చేయగలిగినవి కావు. రెండు లక్ష్యాలకు వేటికవిగా భిన్న విధానాలు, భిన్న వ్యూహాలు అవసరం. అత్యధిక సీట్లను గెలుచుకోవటమే తన లక్ష్యంగా 'ఇండియా' కూటమి పెట్టుకున్నట్లయితే... అది చేజేతులా చాలా పెద్ద సంఖ్యలో సీట్ల గెలుపుతో బీజేపీని తిరుగులేని విధంగా అధికారంలోకి రానివ్వటమే!

బీజేపీని 272 సీట్లకు దిగువనే ఉంచటానికి కూటమిలోని ప్రతి ఒక్క పార్టీ తన పరిమితుల్ని అంగీకరించవలసి ఉంటుంది. పైకి అదేమంత పెద్ద విషయంగా అనిపించకపోయినా ప్రధానంగా అదే పెద్ద విషయం. కూటమి లబ్ధి కోసం పార్టీలు తమ ప్రయోజనాలను త్యాగం చేయటం అవసరం. అప్పుడు మాత్రమే ఇండియా కూటమి కనీసం 400 సీట్లలో ప్రత్యర్థితో ముఖాముఖి తలపడగలదు. అప్పుడు మాత్రమే ప్రతిపక్ష కూటమికి పడిన 60 శాతం ఓట్లు... పోటీలో ఉన్న ఎక్కువమంది అభ్యర్థుల మధ్య చీలిపోయే అవకాశం ఉండదని ఆశించవచ్చు.

ఈ విషయం మీకు వివరంగా చెప్పడానికి కాంగ్రెస్‌ను నేను ఒక ఉదాహరణగా తీసుకుంటాను. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లలో ఇటీవలి చరిత్రలను చూస్తే కనుక అక్కడ కాంగ్రెస్‌కు ఉన్న విజయావకాశాలు పరిమితమేననీ, వాటిని మెరుగుపరుచుకునే ప్రయత్నాలకు కూడా ఇది సమయం కాదనీ నిర్ధారణగా తెలుస్తుంది.

2014లో ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్ రెండంటే రెండే లోక్‌సభ సీట్లను గెలుచుకుంది. యూపీలోనే 2022 విధాన సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లు కూడా రెండే. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఓట్లు వరుసగా 6.4. శాతం, 2.4 శాతం. బెంగాల్‌లో మరీ హీనం. అక్కడ 2019లో కాంగ్రెస్ రెండు స్థానాల్లో మాత్రమే గెలిచింది. 2021 శాసనసభ ఎన్నికల్లోనైతే ఒక్క సీటు కూడా రాలేదు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లభించిన ఓట్లు వరుసగా 5.7 శాతం, 3.1 శాతం.



ఇండియా కూటమి నేతలు

స్పష్టంగా తెలుస్తున్నది ఏమిటంటే, కాంగ్రెస్ ఎన్ని ఎక్కువ సీట్లకు పోటీ చేస్తే బీజేపీ అన్ని ఎక్కువ సీట్లలో గెలుస్తోంది. బిహార్‌లో సరిగ్గా ఇదే జరిగింది. 2020 బిహార్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ 70 చోట్ల పోటీ చేస్తే, గెలిచింది 19 సీట్లు మాత్రమే. అంతకు ముందరి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఫలితాలే ఇక్కడా పునరావృతం అయ్యాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ 9 సీట్లకు పోటీ చేస్తే ఒక్క చోట మాత్రమే విజయం సాధించింది.

అయితే, 'ఇండియా' కూటమిలోని తక్కిన పార్టీలు కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా త్యాగాలు చేయవలసిన రాష్ట్రాలు కొన్ని ఉన్నాయి. అవి: మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ. ఈ రాష్ట్రాల్లో సమాజ్‌వాది, ఆమ్ ఆద్మీ వంటి పార్టీలు తమ ప్రయోజనాలకు అతీతంగా పని చేయాలి. ఆశల రెక్కల్ని చాపుకోడానికి వాటికిది సమయం కాదు. బీజేపీని ఆ రాష్ట్రాలలో ఓడించగల స్థానంలో ఒక్క కాంగ్రెస్ మాత్రమే ఉంది.

అలాగే 'ఇండియా' కూటమికి సమస్యాత్మకమైన రాష్ట్రాలు కూడా ఉన్నాయి. వాటిల్లో పంజాబ్, ఢిల్లీ ప్రధానమైనవి. పంజాబ్‌లో లోక్‌సభ స్థాయిలో కాంగ్రెస్ 8 సీట్లు, ఆమ్ ఆద్మీ 1 సీటు గెలుచుకున్నాయి. శాసనసభ ఎన్నికలకు వచ్చేటప్పటికి ఈ పరిస్థితి పూర్తిగా తారుమారు అయ్యింది. ఆప్ 92 చోట్ల, కాంగ్రెస్ 18 చోట్ల విజయం సాధించాయి. ఇక ఢిల్లీలో కాంగ్రెస్ గానీ, ఆప్ గానీ ఒక్క లోక్‌సభ సీటును కూడా గెలుచుకోలేక పోయాయి. అయితే ఆప్ కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ రెండవ స్థానంలో నిలిచింది. ఢిల్లీ శాసన సభ ఎన్నికల్లో మాత్రం ఆప్‌దే పైచేయిగా ఉంది. ఈ రెండు రాష్ట్రాలలో కూడా కూటమి పార్టీల మధ్య సీట్ల విభజన అంత సులభమేమీ కాదు. అయినప్పటికీ అత్యాశతో అవి విభజనకు ప్రయత్నించాయా... బీజేపీ గెలిచినట్లే!

నేను చెప్పాలనుకున్న ఈ విషయం ఎందుకింత సరళంగా, సూటిగా... అదే సమయంలో ఎందుకింత ముఖానికి కొట్టొచ్చినంత స్పష్టంగా కూడా ఉన్నదో మీకు అర్థమయిందా? నా ఈ విశ్లేషణతో విభేదించడం 'ఇండియా' కూటమికి స్వయంకృత పరాజయం మాత్రమే అవుతుందన్న విషయాన్ని కూడా మీరు అంగీకరించగలరా? బీజేపీని 272 సీట్లకంటే తక్కువకు పరిమితం చేయడానికి ప్రతిపక్షాలు కనీసంలో కనీసంగా తీసుకోవలసిన జాగ్రత్తలు ఇవే. త్యాగాలకు సిద్ధపడటం, అత్యాశను వదులుకోవటం. ఇవి కాకుండా వారు తెలుసుకోవలసినవి ఇంకొన్ని కూడా ఉన్నాయి.

మొదటిది: ప్రధానమంత్రిపై వ్యక్తిగత విమర్శలు పనికిరావు. రెండు: అదానీ, క్రోనీ క్యాపిటలిజం (రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు కుమ్మక్కు అవటం), చైనా వైఖరి పట్ల మోదీ బలహీనమైన ప్రతిస్పందన, లేదా మైనారిటీలను తక్కువగా చూడటం అనే అంశాలేవీ ఓట్లు రాల్చేవి కాదు. ఈ రెండు విషయాలను పక్కన పెట్టి, సామాన్య ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తున్న ద్రవ్యోల్బణం, విద్య, ఆరోగ్యం, ఉద్యోగాలు, పేదరికం వంటి వాటిపై కూటమి దృష్టి పెట్టాలి.

ఇప్పుడు మరికొంచెం ముందుకు వెళతాను. 'మోదీకి పోటాపోటీ ఎవరు?' అనే ప్రశ్న... 'ఇంకెవరు? రాహుల్‌గాంధీ'నే అనే సంసిద్ధ సమాధానంతో పూర్తవదని ఇండియా కూటమి స్పష్టతను కలిగి ఉండాలి. రాహుల్ గాంధీ కూడా తను కనీసం సంభావ్య ప్రధానిమంత్రి అభ్యర్థినైనా కానని స్పష్టం చెయ్యాలి. అవసరమైతే, నిస్సందేహంగా అది ఆమోదం పొందేవరకూ రాహుల్ పదే పదే దాన్ని పునరుద్ఘాటించాలి.

చివరిగా కాంగ్రెస్‌కు ఒక మాట. మోదీని, బీజేపీని ఓడించడం తేలిక కాదు. ఆ పార్టీని 272 సీట్ల దిగువకు దింపడమే కాంగ్రెస్ పార్టీ 2024 లక్ష్యం కావాలి. 2029లో మాత్రమే కాంగ్రెస్ తను సొంతంగా మెజారిటీ సాధించేందుకు పని చేయాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఉత్తేజకర సంకేతం



ఇది భారత సంస్కృతికి ఉత్తేజకర కాలం. భూగోళ వ్యాప్తంగా వేద పునరుజ్జీవనం జరుగుతోంది. భారత్ లోపల, బయట నిర్మాణమయ్యే గొప్ప ఆలయాలు సనాతన ధర్మ సంస్కృతి పునరుద్ధరణకు సంకేతాలు.

– జెఫ్రీ ఆర్మ్‌స్ట్రాంగ్, వేదాంశాల రచయిత

ఏకత కోసం...



ఒక భారతీయ ముస్లింగా, నా తోటి పౌరులతో నేను రామ మందిర ప్రారంభోత్సవంలో పాల్గొంటున్నాను. దేశంలోని రెండో అతి పెద్ద మత సమూహంగా, అత్యధికులను ఒక దగ్గరికి చేర్చే ఇలాంటి వేడుకల్లో పాల్గొనడం అంతిమంగా దేశ ఏకత్వానికి తోడ్పడుతుంది.

– సనా హాష్మీ, ఫెలో

నిశ్శబ్ద హీరో



చరిత్రను ఏమార్చిన నెహ్రూవియన్ – మార్క్సిస్ట్ చరిత్రకారుల బండారం బయటపెట్టిన పురాతత్వవేత్త కె.కె.మహమ్మద్ లాంటి చరిత్రకెక్కని హీరోలకు (అయోధ్య రామాలయ నిర్మాణం సందర్భంగా) మనం కృతజ్ఞత చెప్పాలి. థ్యాంక్యూ సర్!

– వినోద్ కుమార్, ఏఐఎఫ్ వెటరన్

కారిపోతోంది...



కొద్ది రోజులుగా వాట్సాప్ చాట్లు, 'ఎక్స్' పోస్టులు ఎంత భక్తిమయం అయిపోయాయంటే... ఆ యాప్స్ ఓపెన్ చేసిన ప్రతిసారీ నేను చెప్పులు విడుస్తున్నాను.

– సందీప్ థాపర్, సెటైరిస్ట్

ఐ యామ్ సారీ!



ఇతర మతాలను అనుసరించే నా తోటి సోదర సోదరీమణులకు నా క్షమాపణలు. జరుగుతున్నది ఏదైనా, అది దేశ లౌకిక తత్వాన్ని చెడగొట్టేది. మతాన్ని రాజకీయం చేసేది. దేశ సమగ్రతకు భంగం కలిగించేది. నేను దేశం కోసం ప్రార్థిస్తాను.

– అంకుర్ మిశ్రా, అడ్వకేట్

మనం అంతే!




ఒకానొక కాలంలో... ఇండియాలోని ప్రతీ హిల్ స్టేషన్‌కు తనదైన ఒక ఆకర్షణ ఉండేది. కానీ ఇప్పుడు అన్నింటినీ వాలు మీద ఉన్న సరోజినీ నగర్‌లను చేశాం. (హిల్ స్టేషన్లు అన్నీ ఇరుకైన బస్తీల్లా మారాయన్న అర్థంలో.)

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

ఇన్ బాక్స్

భారత స్వాతంత్ర్య సేనాని

మాతృదేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్నే ధారపోసి, బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎంత త్వరగా అంతమొందించితే దేశానికంత మేలు అన్న లక్ష్యంతో పోరాటం సల్పిన మహానాయకుడు సుభాష్ చంద్రబోస్. 1897 జనవరి 23వ తేదీన కటక్‌లో ఒక బెంగాలీ కుటుంబంలో జన్మించాడు బోసు బాబు. ఉన్నత విద్యాభ్యాసమంతా కలకత్తాల్లో సాగింది. 1921 ఏప్రిల్‌లో ఐసీఎస్‌లో ఉత్తీర్ణుడై ఇంగ్లండ్ నుంచి భారత్‌కు తిరిగి వచ్చాడు కానీ ప్రభుత్వ సర్వీస్‌లో చేరలేదు. స్వాతంత్ర్యోద్యమంలో దూకాడు.



సుభాష్ చంద్రబోస్

1939లో గాంధీజీ పూర్తిగా బలపరిచిన భోగరాజు పట్టాభి సీతారామయ్యను ఓడించిన బోసు బాబుకు గాంధీజీతో పాటు కాంగ్రెస్ పెద్దలు చాలా మంది సహకరించలేదు. దీంతో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి 'ఫార్వర్డ్ బ్లాక్' స్థాపించాడు. 1939 సెప్టెంబర్‌లో రెండవ ప్రపంచ యుద్ధం ఆరంభమైంది. బ్రిటిషు వాళ్లకు ఎటువంటి సహాయమూ చేయవద్దని బోస్ ప్రజలకు పిలుపునిచ్చాడు. 1940లో ప్రభుత్వం అరెస్టు చేసి గృహ నిర్బంధంలో ఉంచింది. 1941 జనవరిలో తన ఇంటికి కాపలాగా ఉన్న పోలీసుల కన్నుగప్పి జర్మనీ చేరాడు. 1942 ఏప్రిల్‌లో బెర్లిన్ రేడియో ద్వారా బ్రిటన్ శత్రువైన జర్మనీ మనకు మిత్రదేశమని ప్రకటించాడు. 1943లో జర్మనీ నుంచి ఒక జలాంతర్గామిలో సముద్రంలో ప్రయాణం చేసి సింగపూర్ చేరుకున్నాడు. బోసు 1943 జులై 4న రాస్ బిహారీ బోస్ నుంచి 'ఆజాద్ హింద్ ఫౌజ్' పగ్గాలు తీసుకున్నాడు. జపాన్ సహాయంతో బ్రిటిష్ సైన్యాలతో యుద్ధానికి తలపడ్డాడు.

1943 నవంబర్‌లో అండమాన్ నికోబార్ దీవులను ఆజాద్ హింద్ ఫౌజ్ వశపరచుకొన్నది. 1944 జనవరిలో బోసు ఇండియన్ నేషనల్ ఆర్మీ కేంద్ర కార్యాలయాన్ని రంగూన్‌కు మార్చి 'ఢిల్లీ చలో' (ఢిల్లీకి పదండి) అని తన సైన్యానికి పిలుపు ఇచ్చి 'మీ రక్తాన్ని నాకివ్వండి – మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను' అంటూ ఉత్తేజపరిచాడు. మార్చి నెలలో ఈ సైన్యం బర్మా సరిహద్దు దాటి భారత భూభాగంపై అడుగుపెట్టింది. అయితే హిరోషిమా, నాగసాకిలపై అమెరికా అణుబాంబులు వేయడంతో జపాన్ లొంగిపోయింది. దీంతో బోస్ సైన్యం ఎన్నో ఇక్కట్లు ఎదుర్కొంది. 1945 ఆగస్టు 18వ తేదీన 'ఫార్మోసా' దగ్గర జరిగిన ఒక విమాన ప్రమాదంలో బోసు మరణించినట్లు వార్త వెలువడింది. ఇప్పటికీ ఆయన మరణవార్తను చాలామంది నమ్మడంలేదు.

– దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావు | 94930 33534

(నేడు సుభాష్ చంద్రబోస్ జయంతి)

పెరుగుదల వేరు... మెరుగుదల వేరు!

అభిప్రాయం



డానీ

ఆర్థికరంగంలో 'వృద్ధి', 'అభివృద్ధి' అనే పదాల్ని చాలామంది తరచుగా ఒకే అర్థంలో వాడుతుంటారు. సామాజిక రంగంలో ఇవి రెండు భిన్నమైన భావనలే కాక పరస్పర విరుద్ధమైన భావనలు కూడ. దేశంలోని వస్తువులు, వస్తు సేవల ఉత్పత్తిలో పెరుగుదలను ఆర్థిక వృద్ధి సూచిస్తుంది. దీనిని సాధారణంగా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ద్వారా కొలుస్తారు. ఆర్థిక వృద్ధికి పరిమాణం ముఖ్యం. ఒక దేశ /రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తాలూకు మొత్తం పరిమాణాన్ని ఇది పరిగణన లోనికి తీసుకుంటుంది. ఇది విస్తృత అభివృద్ధికి అవసరమైన కొలమానమేగానీ సమాజంపై దాని ప్రభావాన్ని చూడడానికి అదొక్కటే సరిపోదు.

ఆర్థిక అభివృద్ధి అనేది మానవ శ్రేయస్సు, సామాజిక పురోగతి మరీ ముఖ్యంగా సామాజిక న్యాయం తదితర అంశాల్లో మెరుగుదలలను పరిశీలించే విస్తృత భావన. ఇందులో ఆర్థిక అంశాలే కాకుండా సామాజిక, రాజకీయ, సాంస్కృతిక కోణాలు కూడా ఉంటాయి.

వృద్ధి ఆధారిత ప్రభుత్వాధినేతలు ఉన్నప్పుడు ఏదో జరిగిపోతున్నట్టు ప్రదర్శన, హడావిడి ఉంటుందిగానీ ప్రజలకు ఆ సౌఖ్యాలు అందవు. అభివృద్ధి ఆధారిత ప్రభుత్వాధినేతలు ఉన్నప్పుడు ఆ ప్రదర్శనలు, హడావిడి ఉండవుగానీ ప్రజలకు సౌఖ్యాలు అందుతుంటాయి. మన రాజకీయ నాయకుల్లో ఈ రెండు కోవలకు చెందినవారూ ఉంటారు. ఆయా దశల్లో ఇందిరాగాంధీ, ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖర రెడ్డి అభివృద్ధి ఆర్థిక విధానాలను అనుసరించారు. పీవీ నరసింహారావు, చంద్రబాబు, నరేంద్ర మోదీలది వృద్ధి ఆర్థిక విధానం. జీడీపీ బాగుంటుంది కానీ, పేదరికం పెరుగుతూ ఉంటుంది.

ఎన్నికల చరిత్రను పరిశీలించినప్పుడు ఆలోచనాపరుల ప్రభావం ఓటర్లపై అంతగా లేదనీ, వర్గ సిద్ధాంతాల ప్రాతిపదికగా ప్రజలు చాలాసార్లు ఓట్లు వేయలేదనీ అర్థమవుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో రెండు సందర్భాల్లో మాత్రమే వర్గ సిద్ధాంతాల ప్రాతిపదికగా ఎన్నికలు జరిగాయి. 1952లో హైదరాబాద్ స్టేట్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజాం-తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టులకు మంచి మెజారిటీ వచ్చింది. కానీ, నిజాం-హైదరాబాద్, మరాఠ్వాడ, కర్ణాటక ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ వచ్చి ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి ఆంధ్ర రాష్ట్రంలో శ్రామిక, భూస్వామ్య-పెట్టుబడీదారుల మధ్య మరో ఉధృత వర్గపోరాటంగా 1955 అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అప్పుడూ కాంగ్రెస్‌కే ఆధిక్యత వచ్చింది. ఎమర్జెన్సీని ఎత్తేసిన తరువాత లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. ఇందులో దేశంలోని ఆలోచనాపరుల పాత్ర కూడ వుంది. ఎమర్జెన్సీ తరువాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మూడు నాలుగు ఎన్నికల్లో



నక్సలైట్ల ప్రభావం కూడ కనిపించింది. నక్సలైట్ల మీద తీవ్రంగా విరుచుకు పడిన పార్టీలు ఓడిపోయేవి, నక్సలైట్లతో సత్సంబంధాలు పెట్టుకున్న పార్టీలు గెలిచేవి. తరువాత కాలంలో ఈ ప్రభావం మాయమయ్యింది.

ఇటు కమ్యూనిస్టులూ, అటు అంబేడ్కరిస్టులూ చెప్పే సిద్ధాంతాలకూ, ప్రజల ఓటింగ్ విధానాలకూ పొంతనే లేదు. దేశ జనాభాలో 85 శాతం శ్రామికవర్గమే అయినప్పటికీ కమ్యూనిస్టు పార్టీలకు ఎన్నికల్లో 2 శాతం ఓట్లు మాత్రమే వస్తున్నాయి. అలాగే దేశ జనాభాలో బహుజనులు 85 శాతం ఉన్నప్పటికీ బీఎస్పీ వంటి అంబేడ్కరిస్టు పార్టీలకు 4 శాతం ఓట్లు మాత్రమే వస్తున్నాయి.

ఈ ఫలితాల ఆధారంగా మనం రెండు సూత్రీకరణలు చేయవచ్చు. మొదటిది, కమ్యూనిస్టు, అంబేడ్కరిస్టు సిద్ధాంతాలను పెట్టుబడీదారీ పార్టీలు హైజాక్ చేశాయి అనేది. రెండోది; ప్రజలకు ఇప్పటి కమ్యూనిస్టు, అంబేడ్కరిస్టు పార్టీల నాయకుల మీద నమ్మకం లేదు అనేది.

కమ్యూనిజం వేరు, కమ్యూనిస్టు పార్టీలు వేరు అయినట్టు; అంబేడ్కరిజం వేరు, అంబేడ్కర్ పేరున వెలసిన పార్టీలు వేరు. అసలు విషయం ఏమంటే, ఈ పార్టీల్లో బహు అరుదుగాతప్ప నమ్మదగ్గ నాయకులు ప్రజలకు కనిపించడం లేదు. ఎవరయినా నమ్మదగ్గ నాయకులు ఎక్కడయినా కనిపిస్తే ప్రజలు కమ్యూనిస్టు, అంబేడ్కరిస్టు పార్టీలను అక్కడ గెలిపిస్తూనే ఉన్నారు. ఓటర్లకూ పార్టీల ప్రకటిత సిద్ధాంతాలకూ మధ్య ఒక వైరుధ్యం ఉంది. ముందుదాన్ని పరిష్కరించాలి.

రాజకీయాల్లో కాంగ్రెస్‌కు ప్రధాన సైద్ధాంతిక ప్రత్యర్థులయిన కమ్యూనిస్టుల్నీ, నక్సలైట్లనీ బల హీనపరచడానికి ఇందిరాగాంధీ భూసంస్కరణ చట్టాలు, అటవీ భూముల పరిరక్షణ చట్టాలు, బ్యాంకుల జాతీయాకరణ, రాజభరణాలు రద్దు వంటివాటిని తెచ్చారు. కమ్యూనిస్టు పార్టీలు కోరేదే కాంగ్రెస్ పార్టీ చేస్తున్నపుడు కమ్యూనిస్టు పార్టీలకు అభిమానులుగా ఉన్న ఓటర్లు సహితం కాంగ్రెస్ ఓటర్లుగా మారిపోయారు.

తాను ప్రకటించిన ఆదర్శాలను కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఆచరించలేదు. సరిగ్గా ఎన్టీ రామారావు రంగ ప్రవేశం చేసి ఇందిరా గాంధీ వాడిన ఆయుధాలతోనే ఆమె పార్టీ అయిన కాంగ్రెస్‌ను ఓడించారు. కిలో రెండు రూపాయల బియ్యం, జనతా వస్త్రాలు, పేదలకు పక్కా ఇళ్లు వంటి పథకాలన్నీ ఇందిరా గాంధీ 'గరీబీ హటావో' నుండి పుట్టినవే.

ఎన్టీ రామారావు ప్రకటించిన ఆదర్శాలను చంద్రబాబు చిత్త శుద్ధితో ఆచరించలేదు. పైగా వారు పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక సంస్కరణలకు (లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్) తనను తాను బ్రాండ్ అంబాసిడర్‌గా సగర్వంగా ప్రకటించుకోవడం మొదలెట్టారు. అప్పుడు వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రజల నాడిని పట్టుకున్నారు. ఇందిరా గాంధీ అందించిన ఆయుధాలతో ఎన్టీ రామారావు కాంగ్రెస్‌ను ఓడించినట్టే, ఎన్టీ రామారావు అందించిన ఆయుధాలతో తెలుగు దేశం పార్టీని ఓడించడానికి వైఎస్ సిద్ధపడ్డారు. చంద్రబాబు విద్యుత్ సంస్కరణలు చేపడితే... వైఎస్ వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు నినాదంతో వాటిని చిత్తు చేశారు. ఆ తరువాత 'ఆరోగ్యశ్రీ' వంటివి వచ్చాయి.

కొత్త ఆంధ్ర ప్రదేశ్‌కు తొలి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు తన పాత విధానాలను మార్చుకోలేదు. మరొక్కసారి నూతన ఆర్థిక విధానాలనే అనుసరించారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కొత్త రాజధానినీ, పోలవరం ప్రాజెక్టునూ నిర్మించి పెట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. అవి పూర్తయ్యేలోగా హైదరాబాద్‌ను రాజధానిగా కొనసాగించుకునే వీలుంది. అందులో అనవసరంగా జోక్యం చేసుకున్న చంద్రబాబు నూతన ఆర్థిక విధానాలను జొప్పించారు. అలాంటివి సింగపూర్ పెట్టుబడీదారులకు బాగుంటాయిగానీ ప్రజలకు బాగుండవు. గత ఎన్నికల్లో అమరావతి రాజధాని పరిధిలోని ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలోనూ టీడీపీ అభ్యర్థులు గెలవలేదు. ఇది ఏ సంకేతాన్ని ఇచ్చింది?

వైఎస్ జగన్ మరొక్కసారి ప్రజల నాడిని పట్టుకున్నారు. నూతన ఆర్థిక విధానాలకు పూర్తిగా వ్యతిరేకమయిన 'నవరత్నాల'ను ముందుకు తెచ్చారు. పేదల ఆర్థిక విధానం ముందు చంద్రబాబు మరొక్క సారి ఘోర పరాజయాన్ని చవిచూశారు.

చంద్రబాబు నూతన ఆర్థిక విధానాలను వదులుకోలేరు. దానికీ కొన్ని ఓట్లు ఉన్నాయన్నది వారి నమ్మకం. అయితే ఆ ఓట్లు ఎన్నికల యుద్ధంలో గెలవడానికి సరిపోవని వారికి స్పష్టంగా తెలుసు. వారికిప్పుడు అదనపు ఓట్ల కోసం పవన్ కల్యాణ్ కావాలి. తెలంగాణలో పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ జనసేన ఓడిపోవడమేగాక ఎక్కడా డిపాజిట్లను కూడ నిలబెట్టుకోలేక పోయింది. అదొక రికార్డు. రాజకీయాల్లో ప్రవేశించి దశాబ్దం దాటుతున్నా కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేని రికార్డు కూడ ఆయన సొంతం. వారిని చంద్రబాబు నమ్ముతున్నారు. పవన్ కల్యాణ్ ద్వారా బీజేపీ ఆశీస్సులు దక్కుతాయని చంద్రబాబు ఆశిస్తూ ఉండవచ్చు.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.8.46 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ఆరుద్ర పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.2.36 నుండి 4.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.49 నుండి 9.37 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.44 వరకు, **అమృతఘడియలు:** రా.8.25 నుండి 10.04 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.46.

సాక్షి బిజినెస్

మంగళవారం
23-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
260	51
71,424	21,572

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటల ముగింపు)			
నాస్‌డాక్	15,832	△	73
డోజోన్స్	37,934	△	130
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,494	△	26
డాక్స్	16,683	△	128
షాంఘై	2,756	▽	76
నికాయ్	36,547	△	584

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో


			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.75	83.77
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.56	107.12
€	యూరో	ఒకటి	89.46	91.83
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.54	56.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.85	55.78
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.21	62.67
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.69	23.51
¥	చైనా యువాన్	ఒకటి	10.39	12.49

ఆర్థిక వ్యవస్థకు శ్రీరామజయం

అయోధ్యకు పర్యాటకుల తాకిడి

- ఏటా 5 కోట్ల మంది సందర్శన
- దేశ ఆర్థిక వ్యవస్థకు బూస్టింగ్
- ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం
- బ్రోకరేజీ సంస్థ జెఫరీస్ అంచనా





న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య ఇక ప్రముఖ పర్యాటక ప్రాంతంగా శోభిల్లనుంది. దేశంలోని ఇతర ప్రముఖ ఆధ్యాత్మిక, పుణ్యక్షేత్రాలను దాటి పర్యాటకుల సందర్శన పరంగా అయోధ్య మొదటి స్థానానికి చేరుకోనుంది. బ్రోకరేజీ సంస్థ జెఫరీస్ వేసిన అంచనా ప్రకారం ఏటా సుమారు 5 కోట్ల మంది సందర్శకులు అయోధ్యకు రానున్నారు. నూతన విమానాశ్రయం, పునరుద్ధరించిన రైల్వే స్టేషన్, టౌన్‌షిప్, రహదారుల అనుసంధానం కోసం చేసిన 10 బిలియన్ డాలర్ల వ్యయానికి తోడు కొత్త హోటళ్ల రాక ఇవన్నీ అయోధ్యలో ఆర్థిక కార్యకలాపాల విస్తృతిని పెంచుతాయని జెఫరీస్ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. అంతర్జాతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కేంద్రంగా అయోధ్య విలసిల్లుతుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో ఎంతో విశిష్టత కలిగిన తిరుమల ఆలయాన్ని ఏటా 3 కోట్ల మంది వరకు భక్తులు సందర్శిస్తున్నారు. అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్‌కు సైతం ఇదే స్థాయిలో సందర్శకులు వస్తున్నారు. అంతర్జాతీయంగా చూస్తే వాటికన్ సిటీని ఏటా 90 లక్షల మంది, సౌదీ అరేబియాలోని మక్కాను 2 కోట్ల మంది సందర్శిస్తున్నారు.

అయోధ్యలో వసతులు

అయోధ్య ఎయిర్‌పోర్ట్ మొదటి దశ అందుబాటులోకి రాగా, ఏటా 10 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యాన్ని కలిగి ఉంది. 60 లక్షల ప్రయాణికుల సామర్థ్యానికి సేవలు అందించే అదనపు దేశీయ, అంతర్జాతీయ టెర్మినల్ 2025 నాటికి రానుంది. రోజువారీ 60 వేల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేశారు. 1,200 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ టౌన్‌షిప్ నిర్మాణాన్ని తలపెట్టారు. రోడ్ల కనెక్టివిటీని పెంచారు. ప్రస్తుతం 17 హోటళ్లు 590 రూమ్‌లను కలిగి ఉన్నాయి. కొత్తగా 73 హోటళ్లకు ప్రణాళికలు ఉన్నాయి. ఇందులో 40 హోటళ్ల నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైంది. ఇండియన్ హోటల్స్, మారియట్, విందమ్ ఇప్పటికే హోటళ్ల కోసం ఒప్పందాలు చేసుకున్నాయి. ఐటీసీ సైతం హోటల్ ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తోంది. ఓయో సైతం 1,000 హోటల్ రూమ్‌లను తన ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకురావాలని భావిస్తోంది.

ఊపందుకోనున్న టూరిజం

"ఆధ్యాత్మిక పర్యాటకం అనేది భారత పర్యాటక రంగంలో అతిపెద్ద విభాగంగా ఉంది. మౌలిక వసతుల సమస్యలు ఉన్నప్పటికీ పలు ప్రముఖ ఆధాత్మిక కేంద్రాలకు ఏటా 1–3 కోట్ల మధ్య పర్యాటకులు విచ్చేస్తున్నారు. మరింత మెరుగైన వసతులు, అనుసంధానంతో కొత్తగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కేంద్రం (అయోధ్య) చెప్పుకోతగ్గ స్థాయిలో ఆర్థిక ప్రభావం చూపించనుంది"అని జెఫరీస్ తన నివేదికలో పేర్కొంది. కరోనాకు ముందు 2018–19 ఆర్థిక సంవత్సరం జీడీపీలో పర్యాటక రంగం 194 బిలియన్ డాలర్ల వాటా కలిగి ఉంటే, అది ఏటా 8 శాతం కాంపౌండెడ్ వృద్ధితో 2032–22 నాటికి 443 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. దేశ జీడీపీలో పర్యాటక రంగం వాటా 6.8 శాతంగా ఉందని, అభివృద్ధి చెందిన, ప్రముఖ అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే తక్కువగా ఉన్నట్టు వివరించింది. "పర్యాటకం అయోధ్యకు ఆర్థికపరమైన, మతపరమైన వలసలను పెంచుతుంది. దీంతో హోటళ్లు, ఎయిర్‌లైన్స్, హాస్పిటాలిటీ, ఎఫ్‌ఎంసీజీ, పర్యాటక అనుబంధ రంగాలు, సిమెంట్ రంగాలు లాభపడనున్నాయి"అని జెఫరీస్ పేర్కొంది.

జీ–సోనీ విలీన డీల్ రద్దు!!

- జీ సంస్థకు నోటీసు పంపిన సోనీ
- ఒప్పంద నిబంధనలు ఉల్లంఘించినట్లు ఆరోపణ
- దాదాపు రూ.750 కోట్ల బ్రేకప్ ఫీజు కోసం డిమాండ్



న్యూఢిల్లీ: దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న జీ ఎంటర్‌టైన్‌మెంట్, సోనీ గ్రూప్ భారత విభాగ విలీన డీల్ ఊహాగానాలకు అనుగుణంగానే రద్దయింది. సోనీ గ్రూప్ కార్పొరేషన్ సోమవారం ఈ మేరకు ప్రకటన చేసింది. ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జీల్)కు నోటీసు పంపింది. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించినందుకు, ఆర్బిట్రేషన్‌కు తెర తీసినందుకు గాను 90 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.750 కోట్లు) బ్రేకప్ ఫీజు చెల్లించాలంటూ డిమాండ్ చేసింది. 'సోనీ గ్రూప్ కార్పొరేషన్‌లో భాగమైన సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా (ప్రస్తుతం కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్) సంస్థ .. జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జీల్) విలీనానికి సంబంధించి 2021 డిసెంబర్ 22న ప్రకటించిన ఒప్పందాలను రద్దు చేస్తూ, నోటీసులు ఇచ్చింది' అని సోనీ గ్రూప్ ఒక ప్రకటనలో తెలిపింది. విలీన సంస్థకు ఎవరు సారథ్యం వహించాలనే విషయంపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు ఈ విషయమై సోనీ నుంచి నోటీసులు వచ్చినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు జీల్ తెలిపింది. 'విలీన ఒప్పందాన్ని పూర్తి చేసేందుకు నిబద్ధతతో అన్ని ప్రయత్నాలు చేశాం. మాకు వన్‌టైమ్ ప్రాతిపదికన, మళ్లీ మళ్లీ ఖర్చులకు దారి తీసే చర్యలు కూడా తీసుకున్నాం' అని తెలిపింది. డీల్ రద్దు వ్యవహారంపై చట్టపరంగా తీసుకోదగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. నిబంధనల పాటింపునకు, నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు తెచ్చుకునేందుకు జీల్ 2023 సెప్టెంబర్ వరకు దాదాపు రూ. 367 కోట్లు వెచ్చించింది.

ఇదీ జరిగింది..

ఎస్‌పీఎన్‌ఐలో జీల్‌ను విలీనం చేసేందుకు సంబంధించి 2021 డిసెంబర్‌లో ఇరు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం 24 నెలల్లోగా విలీనం జరగాలి. అలా జరగకపోవడంతో నెల రోజుల పాటు జనవరి 21 గడువు పొడిగించారు. డీల్ సాకారమై ఉంటే దేశీయంగా 10 బిలియన్ డాలర్ల మీడియా దిగ్గజం ఆవిర్భవించేది. విలీన సంస్థలో సోనీకి 50.86 శాతం, జీల్ ప్రమోటర్లయిన గోయెంకా కుటుంబానికి 3.99 శాతం వాటాలు ఉండేవి. 70 పైగా టీవీ చానల్స్, రెండు వీడియో స్ట్రీమింగ్ సర్వీసులు, రెండు ఫిలిమ్ స్టూడియోలతో భారత్‌లో అతి పెద్ద ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్‌గా ఉండేది. ఈ ఒప్పందానికి నియంత్రణ సంస్థల నుంచి కూడా అనుమతులు లభించాయి. అయితే, ఈలోగా జీ ప్రమోటర్లయిన సుభాష్ చంద్ర, ఆయన కుమారుడు .. సీఈవో పునీత్ గోయెంకాలపై నిధుల మళ్లింపు ఆరోపణలు రావడంతో వారిని లిస్టెడ్ కంపెనీల్లో డైరెక్టర్లుగా ఉండకూడదంటూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది. దీనిపై సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో గోయెంకాకు స్టే లభించింది. కానీ, ప్రాథమికంగా డీల్ కింద విలీన సంస్థ సారథ్య బాధ్యతలను గోయెంకాకు అప్పగించాలని భావించినప్పటికీ ఈ పరిణామాలతో ఆ అంశంపై సందిగ్ధత నెలకొంది. గోయెంకాను సీఈవోగా కొనసాగించడాన్ని సోనీ ఇష్టపడటం లేదని, ఆయన వెనక్కి తగ్గటం లేదని వార్తలు వచ్చాయి. దీనిపై నిర్దిష్ట డెడ్‌లైన్‌లోగా ఇరు పక్షాలూ అంగీకారానికి రాకపోవడంతో డీల్ రద్దు కానుందంటూ ఊహాగానాలు వచ్చాయి.

ఇప్పుడేంటి..

ఆదాయాలు, లాభాల క్షీణతతో కొన్నాళ్లుగా జీ ఆర్థిక పనితీరు తగ్గుతూ వస్తోంది. సోనీతో డీల్ రద్దు అయిన నేపథ్యంలో జీల్‌కి సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, వాల్ట్ డిస్నీ భారత మీడియా వ్యాపార విలీనమైతే ఏర్పడే భారీ సంస్థతో పోటీపడేందుకు మళ్లీ వ్యూహాలు రచించుకోవాలి. కొన్ని క్రికెట్ ఈవెంట్ల ప్రసారం కోసం డిస్నీలో భాగమైన స్టార్‌తో జీల్‌కి ఒప్పందం ఉంది. దీని కోసం నాలుగేళ్ల వ్యవధిలో 1.32–1.44 బిలియన్ డాలర్ల వరకు చెల్లించాలి. సోనీతో డీల్ రద్దు అయినందున ఈ ఒప్పందంపైనా ప్రభావం పడొచ్చు. మరోవైపు, ప్రాంతీయ భాషల్లో జీల్‌కి ఉన్న కంటెంట్, టీవీ చానల్స్ అందుబాటులో ఉండవు కాబట్టి సోనీ కూడా భారత్‌లో తన కార్యకలాపాల వ్యూహాలను పునఃసమీక్షించుకోవాల్సి రావచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

వికాస్ లైఫ్‌కేర్ చేతికి స్కై 2.0

60 శాతం వాటా కొనుగోలుకి సై



న్యూఢిల్లీ: దేశీ కంపెనీ వికాస్ లైఫ్‌కేర్ లిమిటెడ్ తాజాగా దుబాయ్ సంస్థ స్కై 2.0 క్లబ్‌లో మెజారిటీ వాటాను కొనుగోలు చేయనుంది. ఇందుకు 7.9 కోట్ల డాలర్లు(సుమారు రూ. 650 కోట్లు) వెచ్చించనుంది. 2023–24 లోపు వాటా కొనుగోలు ప్రక్రియ ముగియనున్నట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. స్కై 2.0 క్లబ్ హోల్డింగ్ సంస్థ బ్లూ స్కై ఈవెంట్ హాల్ ఎఫ్‌జెడ్–ఎల్ఎల్‌సీ(దుబాయ్)తో ఇందుకు వాటా మార్పిడి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. 60% వాటాతోపాటు.. భవిష్యత్ బిజినెస్ వెంచర్లనూ సొంతం చేసుకోనున్నట్లు వివరించింది. 13 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో ఇందుకు డీల్ కుదిరినట్లు తెలిపింది.

కరూర్ వైశ్యా లాభం హైజంప్

క్యూ3లో రూ. 412 కోట్లు

ముంబై: ప్రైవేట్ రంగ సంస్థ కరూర్ వైశ్యా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 43 శాతం జంప్‌చేసి రూ. 412 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 289 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 2,013 కోట్ల నుంచి రూ. 2,497 కోట్లకు చేరింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.12 శాతం మెరుగుపడి 1.58 శాతానికి చేరాయి. గత క్యూ3లో 2.7 శాతంగా నమోదయ్యాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.9 శాతం నుంచి 0.42 శాతానికి దిగివచ్చాయి. వృద్ధి, లాభదాయకత, రుణాల నాణ్యత తదితర అంశాలలో మరోసారి నిలకడైన, పటిష్ట పనితీరును ప్రదర్శించగలిగినట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో బి.రమేష్ బాబు పేర్కొన్నారు.



ఫలితాల నేపథ్యంలో శనివారం కరూర్ వైశ్యా బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో 0.3 శాతం బలపడి రూ. 170 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

23-1-2024	
విశాఖ	563–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	72.00
22-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	536–00
వరంగల్	538–00
రిటైల్ ధర	5.95

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ప్రతిష్టాత్మక సంస్థల్లో ఫిజిక్స్ కోర్సులు

జెస్ట్ 2024

పీజీ, పీహెచ్‌డీల్లో ప్రవేశాలు » స్టైపెండ్ అందుకునే అవకాశం

ఉజ్వల కెరీర్ అవకాశాలను అందించే సబ్జెక్టుల్లో ఫిజిక్స్ ఒకటి. ఈ సబ్జెక్టుపై ఆసక్తి ఉండి, రాణించాలనుకునే వారికి దేశంలోని పలు ప్రతిష్టాత్మక సంస్థలు ఉన్నత విద్య కోర్సులను అందిస్తున్నాయి. ఇందుకోసం జాయింట్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (జెస్ట్)ను నిర్వహించి.. అర్హత సాధించిన వారికి పోస్ట్‌గ్రాడ్యుయేట్,ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ, పీహెచ్‌డీల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. జెస్ట్2024 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో... ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం.. సైన్స్,టెక్నాలజీ రంగాల్లో పరిశోధనలకు ఫిజిక్స్ ఎంతో కీలకం. ఈ సబ్జెక్టుపై ఆసక్తి ఉన్న విద్యార్థులను పరిశోధనల దిశగా ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న పలు ప్రముఖ విద్యాసంస్థలు జెస్ట్‌లో ప్రతిభ ఆధారంగా ఫిజిక్స్, అనుబంధ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తునాయి.

స్టైపెండ్

ఈ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ప్రతినెల స్టైపెండ్ కూడా అందుతుంది. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన వారికి నెలకు రూ.12వేలు చొప్పున రెండేళ్లపాటు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తారు. అనంతరం జేఆర్ఎఫ్‌లో భాగంగా నెలకు రూ.37 వేలు, ఎస్ఆర్ఎఫ్ స్థాయిలో రూ.42వేలు చొప్పున చెల్లిస్తారు. నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందిన వారు మొదటి రెండేళ్లు రూ.37 వేలు, ఆ తర్వాత రెండేళ్లు రూ.42 వేలు అందుకోవచ్చు. వీటితోపాటు ఉచిత వసతి లేదా స్టైపెండ్‌లో 30శాతం హెచ్ఆర్ఏ చెల్లిస్తారు.

కోర్సులు ఇవే

ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, అట్మాస్ఫిరిక్ ఫిజిక్స్, స్పేస్ అండ్ అట్మాస్ఫిరిక్ సైన్సెస్, బయో ఫిజిక్స్, కాంప్లెక్స్ సిస్టమ్స్ అండ్ నెట్ వర్క్స్, కండెన్స్‌డ్ మ్యాటర్ ఫిజిక్స్,క్వాంటమ్ ఫిజిక్స్ అండ్ క్వాంటమ్ ఇన్ఫర్మేషన్,న్యూక్లియర్ అండ్ రేడియేషన్ ఫిజిక్స్, ఆప్టిక్స్ అండ్ అటామిక్ ఫిజిక్స్, హైఎనర్జీ ఫిజిక్స్,బయో ఫిజిక్స్.. ఇలా పలు ఫిజిక్స్ స్పెషలైజేషన్లతో.. ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్/ఎమ్మెస్సీ/ఎంటెక్–పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లను అందిస్తున్నాయి.

అర్హతలు

- **ఫిజిక్స్ పీహెచ్‌డీ కోర్సులకు:** ఎమ్మెస్సీలో ఫిజిక్స్ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఫిజిక్స్ సంబంధిత విభాగాల్లో ఏదైనా పీజీ, ఎంటెక్‌తో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. పలు సంస్థలు బీఈ/బీటెక్ వారికి కూడా అవకాశం కల్పిస్తున్నాయి.
- **ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్–ఎమ్మెస్సీ/ఎంటెక్ పీహెచ్‌డీ:** బీఎస్సీ ఫిజిక్స్ ఉత్తీర్ణతతో ఈ కోర్సుల్లో చేరవచ్చు. కొన్ని సంస్థలు గ్రాడ్యుయేషన్‌లో మ్యాథ్స్, ఇంజనీరింగ్ చదివిన వారిని కూడా చేర్చుకుంటున్నాయి.
- **థియరిటికల్ కంప్యూటర్ సైన్స్:** కంప్యూటర్ సైన్స్‌లో ఎమ్మెస్సీ, ఎంటెక్ లేదా ఎంసీఏ చదివుండాలి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్‌లో ఈ కోర్సు ఉంది.

వంద మార్కులకు పరీక్ష

జెస్ట్ పరీక్షను వంద మార్కులకు 3 గంటల వ్యవధిలో నిర్వహిస్తారు. మొత్తం మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక విభాగంలో 15 ప్రశ్నలు, ప్రతి ప్రశ్నకు 3 మార్కులు. తప్పు జవాబుకు ఒక మార్కు తగ్గిస్తారు. మరో విభాగంలో 10 ప్రశ్నలు, ప్రతి ప్రశ్నకు 3 మార్కులు. నెగిటివ్ మార్కులు లేవు. ఇంకో విభాగం నుంచి 25 ప్రశ్నలు, ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున ఉంటాయి. తప్పు సమాధానానికి మూడోవంతు మార్కు చొప్పున తగ్గిస్తారు. ఫిజిక్స్ లేదా థియరిటికల్ కంప్యూటర్ సైన్స్ రెండింటిలో ఏదో ఒక పేపరే రాయడానికి వీలుంది. పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీలకు ఒకటే ప్రశ్నపత్రం ఉంటుంది.

కోర్సులను ఆఫర్ చేసే సంస్థలు

ఆర్యభట్ట రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అబ్జర్వేషనల్ సైన్సెస్, నైనిటాల్; బోస్ ఇన్‌స్టిట్యూట్, కోల్‌కతా; హోమీ బాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్, ముంబయి; ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ సైన్సెస్(ఐసీటీఆర్–టీఐఎఫ్ఆర్), బెంగళూరు; హరీష్ చంద్ర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, అలహాబాద్; ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్, కల్పక్కం; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐఐఎ), బెంగళూరు; ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్(ఐఐఎస్సీ), చెన్నై; ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్(ఐపీఆర్), గాంధీనగర్; ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయూసీఏఏ), పుణె; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ), బెంగళూరు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్)–భోపాల్; బరంపూర్, కోల్‌కతా, మొహాలి,పుణె,తిరువనంతపురం, తిరుపతి; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ), తిరువనంతపురం.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** జనవరి 24, 2024
- **పరీక్ష తేదీ:** మార్చి 03, 2024
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం
- **వెబ్‌సైట్:** https://www.jest.org.in

అగ్నివీర్‌లకు ఆహ్వానం

» అగ్నివీర్ వాయు 1/2025 నోటిఫికేషన్ విడుదల
» పైలట్స్, కమిషన్డ్ ఆఫీసర్స్, నేవిగేటర్స్, ఎయిర్ మెన్ కొలువులు
» అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా నియామకాలు
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్.. నిరంతరం గగనతల గస్తీతో..దేశ రక్షణలో అత్యంత కీలకమైన విభాగం. ఇంటర్మీడియెట్ అర్హతతోనే..ఎయిర్‌ఫోర్స్‌లో చేరే అవకాశం స్వాగతం పలుకుతోంది! అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా ఎయిర్‌ఫోర్స్‌లో పైలట్స్, కమిషన్డ్ ఆఫీసర్స్, నేవిగేటర్స్, ఎయిర్‌మెన్ కొలువులు సొంతం చేసుకోవచ్చు!! తాజాగా అగ్నివీర్ వాయు 1/2025కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ వాయు పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

కేంద్ర ప్రభుత్వ అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా.. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గత రెండేళ్లుగా అగ్నివీర్–వాయు పేరిట నియామకాలను చేపడుతోంది. తాజా నోటిఫికేషన్(అగ్నివీర్ వాయు 1/2025) ద్వారా కమిషన్డ్ ఆఫీసర్, పైలట్స్, నేవిగేటర్స్, ఎయిర్‌మెన్ పోస్టులను భర్తీ చేయనుంది.

అర్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి ఎంపీసీ, ఇతర గ్రూప్‌లతో ఇంటర్మీడియెట్/నిర్దేశిత బ్రాంచ్‌లతో డిప్లొమా/ఒకేషనల్ ఇంటర్మీడియెట్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **సైన్స్ సబ్జెక్ట్స్‌కు అర్హతలు:** 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్(ఎంపీసీ) ఉత్తీర్ణత లేదా మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్ /ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బ్రాంచ్‌లతో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి(లేదా)మ్యాథ్స్,ఫిజిక్స్‌లు సబ్జెక్ట్‌లుగా రెండేళ్ల ఒకేషనల్ కోర్సుల ఉత్తీర్ణత ఉండాలి.
- **సైన్సేతర సబ్జెక్ట్స్‌కు అర్హతలు:** 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ (జనరల్, ఒకేషనల్) ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 17 1/2– 21 ఏళ్ల మధ్య ఉండాలి (అభ్యర్థులు జనవరి 2, 2004 – జూలై 2, 2007 మధ్యలో జన్మించి ఉండాలి).

మూడు దశల ఎంపిక ప్రక్రియ

అగ్నివీర్ వాయు నియామకాలకు మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఆయా పోస్టులకు అనుగుణంగా.. సైన్స్, సైన్సేతర సబ్జెక్ట్స్, సైన్స్ సబ్జెక్ట్స్ అండ్ సైన్సేతర సబ్జెక్ట్‌ల పేరిట అర్హతలను, పరీక్ష విధానాన్ని పేర్కొన్నారు. మూడు దశల ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలి దశలో ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ టెస్ట్ మూడు సబ్జెక్ట్‌ల అభ్యర్థులకు వేర్వేరుగా ఉంటుంది.

తొలిదశ పరీక్షలు వేర్వేరుగా

ఆయా పోస్టులకు సరితూగేలా అభ్యర్థుల పరిజ్ఞానాన్ని పరిశీలించేందుకు తొలిదశ ఆన్‌లైన్ టెస్ట్‌ను మూడు విధానాల్లో నిర్వహిస్తారు. టెక్నికల్ విభాగాల్లో చేరాలనుకునే వారు సైన్స్ సబ్జెక్ట్స్ పరీక్షకు, నాన్–టెక్నికల్ విభాగాల్లో చేరాలనుకునే అభ్యర్థులు సైన్సేతర సబ్జెక్ట్ పరీక్షకు, ఈ రెండు విభాగాల్లోనూ చేరాలనుకుని,సంబంధిత అర్హతలున్న వారు సైన్స్, సైన్సేతర సబ్జెక్ట్ పరీక్షలకు హాజరవ్వాల్సి ఉంటుంది.

సైన్స్ సబ్జెక్ట్స్‌కు టెస్ట్ ఇలా

సైన్స్ సబ్జెక్ట్స్‌లో నిర్వహించే పరీక్ష.. 60 నిమిషాల వ్యవధిలో 70 మార్కులకు ఉంటుంది. ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలు; మ్యాథమెటిక్స్ నుంచి 25 ప్రశ్నలు, ఫిజిక్స్ నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.

సైన్సేతర సబ్జెక్ట్స్‌కు పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన పరీక్ష 45 నిమిషాల వ్యవధిలో 50 మార్కులకు ఉంటుంది. రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ నుంచి 30 ప్రశ్నలు, ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు.

సైన్స్, సైన్సేతర సబ్జెక్ట్స్ పరీక్ష

ఈ విభాగం పరీక్ష 85 నిమిషాల వ్యవధిలో 100 మార్కులకు ఉంటుంది. ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలు; రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ నుంచి 30 ప్రశ్నలు; మ్యాథమెటిక్స్ నుంచి 25, ఫిజిక్స్ నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 నెగెటివ్ మార్క్ నిబంధన విధించారు.

రెండో దశ.. పీఎఫ్‌టీ-1

ఎంపిక ప్రక్రియ రెండో దశలో భాగంగా.. ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్–1 పేరుతో శారీరక ధ్రుఢత్వ పరీక్ష నిర్వహిస్తారు. 1.6 కిలోమీటర్ల దూరాన్ని పురుష అభ్యర్థులు ఏడు నిమిషాల్లో; మహిళా అభ్యర్థులు ఎనిమిది నిమిషాల్లో చేరుకోవాల్సి ఉంటుంది.

మూడో దశ.. పీఎఫ్‌టీ-2

ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్–1లో ఉత్తీర్ణత సాధించిన వారికి.. మూడో దశలో ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్–2 పేరుతో పలు ఫిజికల్ ఈవెంట్స్‌లో పరీక్ష నిర్వహిస్తారు. పురుష అభ్యర్థులు 10 పుష్–అప్స్(1 నిమిషం); 10 సిట్–అప్స్(1 నిమిషం); 20 స్క్వాట్స్ (1 నిమిషం) చేయాల్సి ఉంటుంది. మహిళా అభ్యర్థులు 10 పుష్–అప్స్(1:30 నిమిషాలు వ్యవధి); 15 స్క్వాట్స్ (1 నిమిషం) తీయాల్సి ఉంటుంది.

చివరగా అడాప్టబిలిటీ టెస్ట్

తొలిదశలో ఆన్‌లైన్ టెస్ట్, తర్వాత పీఎఫ్‌టీ-1, 2లలో ప్రతిభ చూపిన వారికి చివరగా అడాప్టబిలిటీ టెస్ట్ ఉంటుంది. ఇందులో భాగంగా సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్ నిర్వహిస్తారు. అడాప్టబిలిటీ టెస్ట్–1లో అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తారు. అడాప్టబిలిటీ టెస్ట్–2లో గ్రూప్ డిస్కషన్ ఉంటుంది.



వైద్య పరీక్షలు

అడాప్టబిలిటీ టెస్ట్‌లోనూ విజయం సాధించిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి.. అగ్నివీర్ వాయుగా నియామకం ఖరారు చేస్తారు.

నాలుగేళ్లు విధులు

ఎంపికైన అభ్యర్థులకు నాలుగేళ్ల పాటు విధులు నిర్వర్తించే అవకాశం కల్పిస్తారు. వీరికి మొదటి ఏడాది నెలకు రూ.30 వేలు, రెండో ఏడాది రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40 వేలు చొప్పున వేతనం లభిస్తుంది. వేతనంలోంచి ప్రతి నెల 30 శాతం చొప్పున అగ్నివీర్ కార్పస్ ఫండ్‌కు జమ చేస్తారు. ఈ 30 శాతానికి సమానమైన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా జమ చేస్తుంది. ఇలా నాలుగేళ్లు పూర్తయ్యే సరికి అభ్యర్థుల కార్పస్ ఫండ్‌లో రూ.10.04 లక్షలు జమ అవుతాయి. వేతనంతోపాటు రిస్క్ అండ్ హార్డ్‌షిప్ అలవెన్స్, ట్రావెల్ అలవెన్స్‌లను కూడా అందిస్తారు. దీంతోపాటు నాన్–కంట్రిబ్యూటరీ జీవిత బీమా పేరుతో రూ.48 లక్షల మొత్తానికి బీమా కల్పిస్తారు. అదేవిధంగా విధి నిర్వహణ సమయంలో ప్రమాదవశాత్తు మరణిస్తే మరో రూ.44 లక్షల పరిహారం అందిస్తారు.

స్కిల్ సర్టిఫికెట్

నాలుగేళ్లపాటు విధులు పూర్తి చేసుకున్న వారికి అగ్నివీర్ స్కిల్ సర్టిఫికెట్ పేరుతో ధ్రువ పత్రం అందజేస్తారు. ఫలితంగా అభ్యర్థులు ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో సెక్యూరిటీ విభాగాల్లో ఉద్యోగాలు సొంతం చేసుకునేందుకు వీలుంటుంది.

టెక్నికల్, నాన్-టెక్నికల్ విధులు

- అగ్నివీర్–వాయుగా నియమితులైన వారు టెక్నికల్, నాన్–టెక్నికల్ విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- ఎయిర్‌మెన్‌గా ఎంపికైన వారు ఎయిర్‌మెన్ గ్రూప్–ఎక్స్ పరిధిలో ఎయిర్‌ఫోర్స్‌లోని టెక్నికల్ విభాగాల్లో పని చేయాల్సి ఉంటుంది. గ్రూప్–వై పరిధిలో నాన్–టెక్నికల్ విభాగాల్లో పనిచేస్తారు.
- నేవిగేటర్‌గా ఎంపికైన వారు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, ఫ్లయింగ్ విభాగం, గ్రౌండ్ డ్యూటీ విభాగాల మధ్య సమన్వయం చేస్తూ విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- పైలట్‌గా నియమితులైన వారు యుద్ధ విమానాలు, వైమానిక దళానికి చెందిన ఇతర ఎయిర్ క్రాఫ్ట్‌ను నడపాల్సి ఉంటుంది.
- కమిషన్డ్ ఆఫీసర్ హోదాలో నియమితులైన వారికి.. ఫ్లయింగ్ ఆఫీసర్, ఫ్లయిట్ లెఫ్టినెంట్, వింగ్ కమాండర్, స్క్వాడ్రన్ లీడర్, గ్రూప్ కెప్టెన్ వంటి హోదాలు లభిస్తాయి.

రాత పరీక్షలో రాణించేలా

- రాత పరీక్షలో రాణించేందుకు అభ్యర్థులు దృష్టి పెట్టాల్సిన అంశాలు..
- **ఇంగ్లిష్:** బేసిక్ గ్రామర్ నైపుణ్యాలు పరీక్షించే విభాగం ఇది. ఇందులో ప్రిపొజిషన్స్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, యాక్టివ్, ప్యాసివ్ వాయిస్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్, డైరెక్ట్–ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వెర్బ్స్, టెన్సెస్, పంక్చుయేషన్స్, యాంటానిమ్స్, సినానిమ్స్‌లపై పట్టు సాధించాలి.
- **సైన్స్:** ఇంటర్మీడియెట్ స్థాయిలోని కైనమాటిక్స్, వర్క్, ఎనర్జీ చలన నియమాలు, మెకానిక్స్, హీట్, థర్మో డైనమిక్స్, ఎలక్ట్రోస్టాటిస్టిక్స్, వేవ్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ,మ్యాగ్నటిజం,సెమీ కండక్టర్స్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- **మ్యాథమెటిక్స్:** క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, కాంప్లెక్స్ నెంబర్స్, సమితులు,ప్రమేయాలు,ట్రిగ్నోమెట్రీ, స్ట్రెయిట్ లైన్స్, పెర్ముటేషన్స్–కాంబినేషన్స్, వెక్టార్స్, స్టాటిస్టిక్స్, 3–డి జామెట్రీ, డిఫరెన్షియేషన్స్, డెరివేటివ్స్, అల్జీబ్రా వంటి ఇంటర్మీడియెట్ స్థాయి గణిత అంశాలపై పట్టు సాధించాలి.
- **జనరల్ అవేర్‌నెస్:** ఈ విభాగంలో రాణించడానికి కరెంట్ అఫైర్స్‌తోపాటు భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, పోర్టులు, తీర ప్రాంతాలు, ముఖ్యమైన వ్యక్తులు, సదస్సులు, క్రీడలు–విజేతలు, రక్షణ రంగానికి సంబంధించి తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 17 – ఫిబ్రవరి 6, 2024
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:** మార్చి 17 నుంచి..
- **వెబ్‌సైట్:**https://agnipathvayu.cdac.in



ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీకి సాత్విక్ జోడీ దూరం

జకార్తాలో నేటి నుంచి జరిగే ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ వైదొలిగింది. ఈ టోర్నీలో సాత్విక్-చిరాగ్‌లకు టాప్ సీడింగ్ దక్కింది. ఈ నెలలో ఆడిన రెండు టోర్నీల్లోనూ (మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్) సాత్విక్-చిరాగ్ జంట రన్నరప్‌గా నిలిచింది. ఇండోనేసియా ఓపెన్‌లో పురుషుల సింగిల్స్ విభాగంలో భారత అగ్రశ్రేణి ఆటగాళ్లు ప్రణయ్, శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్ బరిలో ఉన్నారు.

విజయమే లక్ష్యంగా సిరియాతో బరిలోకి...



ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన భారత జట్టు నేడు జరిగే గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో సిరియా జట్టుతో ఆడుతుంది. సాయంత్రం 5 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌ను జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. నాకౌట్ దశకు అర్హత సాధించాలంటే సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత జట్టు ఈ మ్యాచ్‌లో సిరియాపై తప్పనిసరిగా నెగ్గాలి. ఇతర గ్రూప్‌ల ఫలితాలు కూడా తమకు అనుకూలించాలని ఆశించాలి.

ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీకి హుసాముద్దీన్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ తొలి క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత పురుషుల, మహిళల జట్లను ప్రకటించారు. ఈ టోర్నీ ఫిబ్రవరి 29 నుంచి మార్చి 12 వరకు ఇటలీలో జరుగుతుంది. తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ 57 కేజీల విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడు. 29 ఏళ్ల హుసాముద్దీన్ గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని సాధించాడు. 2018, 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో, 2022 ఆసియా చాంపియన్‌షిప్ లోనూ కాంస్య పతకాలను సొంతం చేసుకున్నాడు.

భారత పురుషుల జట్టు: దీపక్ (51 కేజీలు), హుసాముద్దీన్ (57 కేజీలు), శివ థాపా (63.5 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు), లక్ష్య చహర్ (80 కేజీలు), సంజీత్ (92 కేజీలు), నరేందర్ (ప్లస్ 92 కేజీలు). **మహిళల జట్టు:** జాస్మిన్ (60 కేజీలు), అంకుశిత బోరో (66 కేజీలు).

టైటాన్స్‌కు 13వ ఓటమి

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ ఖాతాలో 13వ పరాజయం చేరింది. హరియాణా స్టీలర్స్‌తో సోమవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 30-37తో ఓడిపోయింది. టైటాన్స్ తరఫున సంజీవి, ప్రఫుల్ 6 పాయింట్ల చొప్పున స్కోరు చేశారు. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 42-25తో బెంగాల్ వారియర్స్‌పై గెలిచింది.


పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
జైపూర్ పింక్ పాంథర్స్	15	11	2	2	63
పుణేరి పల్టన్	13	11	2	0	57
దబంగ్ ఢిల్లీ	14	8	4	2	49
గుజరాత్ జెయింట్స్	14	8	6	0	44
హరియాణా స్టీలర్స్	14	8	5	1	44
బెంగాల్ వారియర్స్	14	6	6	2	38
యు ముంబా	13	6	6	1	37
పట్నా పైరేట్స్	14	6	7	1	37
బెంగళూరు బుల్స్	15	6	9	0	37
తమిళ్ తలైవాస్	14	5	9	0	30
యూపీ యోధాస్	15	3	11	1	23
తెలుగు టైటాన్స్	15	2	13	0	16

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

తొలి రెండు టెస్టులకు కోహ్లి దూరం

వ్యక్తిగత కారణాలతో వైదొలిగిన భారత స్టార్ క్రికెటర్



న్యూఢిల్లీ: తెలుగు క్రికెట్ అభిమానులకు ఇది కచ్చితంగా నిరాశపరిచే వార్తే! భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి హైదరాబాద్, విశాఖపట్నంలలో ఇంగ్లండ్ జట్టుతో జరిగే తొలి రెండు టెస్టు మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. వ్యక్తిగత కారణాలతోనే ఈ టాపార్డర్ బ్యాటర్ తప్పుకున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తెలిపింది. భారత పర్యటన కోసం ఇంగ్లండ్ ఆటగాళ్లు ఆదివారమే హైదరాబాద్ చేరుకున్నారు. ఈ టూర్‌లో బెన్ స్టోక్స్ బృందం ఐదు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్‌లో పాల్గొంటుంది. ఈ నెల 25 నుంచి ఉప్పల్ స్టేడియంలో తొలి టెస్టును, ఫిబ్రవరి 2 నుంచి విశాఖపట్నంలోని వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో రెండో టెస్టును ఆడుతుంది. సీనియర్ స్టార్లంతా ఉంటారని తెలుగు ప్రేక్షకులు టికెట్లు కొనుగోలు చేశారు. అయితే అనూహ్యంగా కోహ్లి ఈ రెండు మ్యాచ్‌లకు గైర్హాజరు కానున్నాడు. 'కోహ్లి కోరిక మేరకే ఆడటం లేదు. ఈ మేరకు బోర్డుతో ముందుగానే అనుమతి తీసుకున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మతో ఈ విషయమై మాట్లాడాడు. టీమ్ మేనేజ్‌మెంట్‌తోనూ కోహ్లి చర్చించాడు. అతను లేకపోవడం జట్టుకు ఇబ్బందికరమే అయితే వ్యక్తిగత కారణాల వల్లే దూరమవుతున్నాడు' అని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. అతని నిర్ణయాన్ని బీసీసీఐ గౌరవిస్తుందని, అతనికి మద్దతుగా నిలుస్తుందని జై షా చెప్పారు. అఫ్గానిస్తాన్‌తో ఇటీవల జరిగిన టి20 సిరీస్‌లోనూ కోహ్లి తొలి మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు. దక్షిణాఫ్రికా పర్యటనలోనూ భారత్ అంతర్గత జట్ల మధ్య జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్ నుంచి విశ్రాంతి తీసుకొని లండన్ వెళ్లొచ్చాడు. టెస్టులకు సంబంధించి 2021లో విరాట్ కోహ్లి ఆస్ట్రేలియా పర్యటనలో తొలి టెస్టు ఆడి తర్వాతి మూడు టెస్టులకు గైర్హాజరయ్యాడు. తన భార్య, బాలీవుడ్ నటి అనుష్క శర్మ ప్రసవం కోసం అతను స్వదేశానికి వచ్చాడు. తాజా ఇంగ్లండ్ సిరీస్ కోసం కోహ్లి స్థానాన్ని రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్‌లలో ఒకరితో భర్తీ చేసే అవకాశముంది.

ఐసీసీ టి20 జట్టు కెప్టెన్‌గా సూర్యకుమార్



దుబాయ్: భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ 2023 సంవత్సరానికి ఐసీసీ టి20 టీమ్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 2023 క్యాలెండర్ ఇయర్‌లో టి20 ఫార్మాట్‌లో కనబరిచిన ప్రదర్శన ఆధారంగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) జట్టును ఎంపిక చేయగా... ఇందులో మరో ముగ్గురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. ఓపెనర్ యశస్వి జైస్వాల్, స్పిన్నర్ రవి బిష్ణోయ్, లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌లు ఐసీసీ టి20 టీమ్‌లో ఉన్నారు. గతేడాది సూర్య టి20 ఫార్మాట్‌లో అసాధారణ ఫామ్‌లో ఉన్నాడు. 18 మ్యాచ్‌లు ఆడిన అతను 2 సెంచరీలు, 4 అర్ధ సెంచరీలతో కలిపి మొత్తం 733 పరుగులు చేశాడు. ఐసీసీ మహిళల టి20 జట్టులో భారత్ నుంచి ఒక్క దీప్తి శర్మకే చోటుదక్కింది.

గిల్‌కు బీసీసీఐ అవార్డు



సాక్షి, హైదరాబాద్: ఓపెనర్ శుబ్‌మన్ గిల్‌ను బీసీసీఐ 2023 సంవత్సరానికి 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపిక చేసింది. గిల్ గతేడాది వన్డేల్లో విశేషంగా రాణించి ఐదు సెంచరీలు చేయడంతోపాటు వేగంగా 2000 పరుగుల్ని పూర్తి చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. మరోవైపు మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి సేవలకు గుర్తింపుగా ఆయనకు 'లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును అందజేయనుంది.

భారత జట్టుకు క్లిష్టమైన డ్రా

లుసానే: ఈ ఏడాది జూలై-ఆగస్టులలో జరిగే పారిస్ ఒలింపిక్స్‌కు సంబంధించిన హాకీ ఈవెంట్ 'డ్రా'ను సోమవారం తీశారు. భారత పురుషుల జట్టుకు క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. ప్రస్తుత ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్ బెల్జియం, రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్జెంటీనా, ప్రపంచ మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఐర్లాండ్‌లతో కలిసి భారత్‌కు పూల్ 'బి'లో చోటు కల్పించారు. పూల్ 'ఎ'లో నెదర్లాండ్స్, జర్మనీ, బ్రిటన్, స్పెయిన్, ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా జట్లు ఉన్నాయి.

ఆంధ్ర ఘన విజయం

- రాణించిన లలిత్ మోహన్, మనీశ్



లలిత్

డిబ్రూగఢ్: రంజీ ట్రోఫీ తాజా సీజన్‌లో ఆంధ్ర జట్టు తొలి విజయాన్ని అందుకుంది. అస్సాం జట్టుతో జరిగిన ఎలైట్ గ్రూప్ 'బి' మూడో మ్యాచ్‌లో రికీ భుయ్ నాయకత్వంలోని ఆంధ్ర జట్టు 172 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 363 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన అస్సాం జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 48.2 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటైంది. చివరిరోజు ఓవర్‌నైట్ స్కోరు 81/5తో ఆట కొనసాగించిన అస్సాం మరో 101 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లను కోల్పోయింది. ఆంధ్ర బౌలర్లు లలిత్ మోహన్ (4/81), గిరినాథ్ రెడ్డి (3/57), గొలమరు మనీశ్ (3/19) అస్సాం జట్టును కట్టడి చేశారు. బెంగాల్‌తో జరిగిన తొలి మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న ఆంధ్ర జట్టు రెండో మ్యాచ్‌లో ముంబై చేతిలో ఓడిపోయింది. ఈనెల 26 నుంచి జరిగే నాలుగో మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్‌తో ఆంధ్ర ఆడుతుంది.

అల్‌కరాజ్ అలవోకగా...

- తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన స్పెయిన్ స్టార్
- మెద్వెదెవ్, జ్వెరెవ్ కూడా ముందుకు



అల్‌కరాజ్

మెల్‌బోర్న్: గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు దూరంగా ఉన్న ప్రపంచ రెండో ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్ ఈ ఏడాది మాత్రం జోరు మీదున్నాడు. మరో అలవోక విజయంతో ఈ స్పెయిన్ స్టార్ తొలిసారి ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 20 ఏళ్ల అల్‌కరాజ్ 6-4, 6-4, 6-0తో మియోమిర్ కెచ్‌మనోవిచ్ (సెర్బియా)పై గెలిచాడు. గంటా 49 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ఐదు ఏస్‌లు సంధించాడు. 43 విన్నర్స్ కొట్టిన ఈ మాజీ నంబర్‌వన్ 19 అనవసర తప్పిదాలు చేశాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన అల్‌కరాజ్ తన సర్వీస్‌లో మాత్రం ఒక్కసారి కూడా బ్రేక్ పాయింట్ అవకాశం ఇవ్వలేదు. క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)తో అల్‌కరాజ్ తలపడతాడు. హోరాహోరీగా సాగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో జ్వెరెవ్ 4 గంటల 5 నిమిషాల్లో 7-5, 3-6, 6-3, 4-6, 7-6 (10/3)తో 19వ సీడ్ కామెరాన్ నోరీ (బ్రిటన్)ను ఓడించి ఊపిరి పీల్చుకున్నాడు. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6-3, 7-6 (7/4), 5-7, 6-1తో నునో బోర్జెస్ (పోర్చుగల్)పై, తొమ్మిదో సీడ్ హుర్కాజ్ (పోలాండ్) 7-6 (8/6), 7-6 (7/3), 6-4తో ఆర్థర్ కాజుక్స్ (ఫ్రాన్స్)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యారు.

దయానా సంచలనం

మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ 93వ ర్యాంకర్, క్వాలిఫయర్ దయానా యాస్‌ట్రెమ్‌స్కా సంచలన విజయంతో తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. కెరీర్‌లో 16వసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతున్న ఈ ఉక్రెయిన్ క్రీడాకారిణి ప్రిక్వార్టర్ ఫైనల్లో 7-6 (8/6), 6-4తో రెండుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ప్రపంచ మాజీ నంబర్‌వన్, 18వ సీడ్ అజరెంకా (బెలారస్)ను బోల్తా కొట్టించింది. లిండా నొస్కోవా (చెక్ రిపబ్లిక్), అనా కలిన్‌స్కాయ (రష్యా) కూడా తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరగా... చైనా అమ్మాయి, 12వ సీడ్ కిన్‌వెన్ జెంగ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తొలిసారి క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కించుకుంది. నొస్కోవా 3-0తో ఆధిక్యంలో ఉన్నప్పుడు ఆమె ప్రత్యర్థి స్వితోలినా (ఉక్రెయిన్) గాయంతో వైదొలిగింది. కిన్‌వెన్ జెంగ్ 6-0, 6-3తో ఒసీన్ డోడిన్ (ఫ్రాన్స్)పై, కలిన్‌స్కాయ 6-4, 6-2తో జాస్మిన్ పావోలిని (ఇటలీ)పై విజయం సాధించారు.

క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ



పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం 7-6 (10/8), 7-6 (7/4)తో కూలాఫ్ (నెదర్లాండ్స్)-మెక్‌టిక్ (క్రొయేషియా) జంటను ఓడించింది. బుధవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో మోల్టెని-మాక్సిమో గొంజాలెజ్ (అర్జెంటీనా) ద్వయంతో బోపన్న-ఎబ్డెన్ జోడీ తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే 43 ఏళ్ల బోపన్న ఈనెల 29న విడుదలయ్యే ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకుంటాడు.

సినిమా

ఓ సినిమా ప్రేక్షకులకు కనెక్ట్ అయితే ఆ కథకు సీక్వెల్ తీసే పనిలో ఉంటారు. అయితే కొనసాగించాలంటే కథలో స్కోప్ ఉండాలి. పైగా 'అసలు కథ ఇప్పుడే మొదలైంది' అన్నట్లుగా ఉండాలి. అలా కొన్ని చిత్రాలకు స్కోప్ దొరికింది. 'అసలు కథ ఇప్పుడే మొదలైంది' అన్నట్లు తొలి భాగం చివర్లో ట్విస్ట్ ఇచ్చి, మలి భాగం రూపొందించే పనిలో ఉన్నారు. ఈ ఏడాది అరడజనుకు పైగా సీక్వెల్ చిత్రాలు రానున్నాయి. ఈ రెండు భాగాల చిత్రాల గురించి తెలుసుకుందాం...

అసలు కథ ఇప్పుడే మొదలైంది!



స్వాతంత్య్రం రాక ముందు...

సేనాపతి వీరశేఖరన్, అతని కొడుకు చంద్రబోస్ సేనాపతిల కథలను 'ఇండియన్' (1996) సినిమాలో చూశాం. ఈ రెండు పాత్రల్లోనూ కమల్‌హాసన్ నటించారు. శంకర్ దర్శకత్వం వహించారు. పాతికేళ్ల తర్వాత 'ఇండియన్'కు సీక్వెల్‌గా కమల్‌హాసన్, శంకర్ కాంబినేషన్‌లోనే 'ఇండియన్ 2' రూపొందుతోంది. ఇందులోనూ కమల్‌ది ద్విపాత్రాభినయం. ఈ చిత్రంలో సేనాపతికి, అతని తండ్రికి మధ్య జరిగే కథను చూపిస్తారట శంకర్. అంటే.. కథ దేశ స్వాతంత్య్రానికి పూర్వం ఉంటుందని తెలుస్తోంది. అలాగే ప్రస్తుత కాలాన్ని కూడా కనెక్ట్ చేశారట. 'ఇండియన్ 2' ఏప్రిల్‌లో విడుదల కానుందని తెలిసింది.



మిత్రులే

గృహిణి, యూట్యూబర్ అనుపమా మోహన్‌గా 'భామా కలాపం'లో మెప్పించారు ప్రియమణి. డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలైన ఈ సినిమాకు వ్యూయర్స్ నుంచి మంచి స్పందన లభించింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'భామాకలాపం 2'ను రెడీ చేస్తున్నారు. బాపినీడు, సుధీర్ ఈదర నిర్మిస్తున్న ఈ సినిమాకు అభిమన్యు దర్శకుడు. అలాగే అంజలి నటించిన తొలి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'గీతాంజలి'. రాజ్‌కిరణ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 2014లో విడుదలై, మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' తెరకెక్కుతోంది. రచయిత, నిర్మాత కోన వెంకట్ సమర్పణలో ఎంవీవీ సత్యనారాయణ, జీవీ నిర్మిస్తున్న ఈ సీక్వెల్‌కు శివ తుర్లపాటి దర్శకుడు. అలాగే అనుష్కా శెట్టి హిట్ ఫిల్మ్ 'భాగమతి'కు సీక్వెల్‌గా 'భాగమతి 2' తెరకెక్కనుంది.



శత్రువులు

ఎంతోమంది జీవితాలను మార్చిన ఖాన్సార్ ('సలార్' చిత్రం కోసం క్రియేట్ చేసిన ప్రాంతం) ఇద్దరు మిత్రులు దేవరథ, వరదరాజ మన్నార్‌లను మాత్రం శత్రువులుగా చేసింది. మరి... ఈ మిత్రులు ఎందుకు శత్రువులు కావాల్సి వచ్చిందనే కథను 'సలార్' మలి భాగం 'సలార్: శౌర్యాంగ పర్వం'లో చూడాలంటున్నారు ఈ చిత్ర దర్శకుడు ప్రశాంత్ నీల్. ప్రభాస్ హీరోగా దేవరథ పాత్రలో నటిస్తుండగా, దేవ మిత్రుడు వరదరాజ మన్నార్‌గా పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న 'సలార్: శౌర్యాంగపర్వం' చిత్రం ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో రిలీజయ్యే చాన్స్ ఉంది. ఇక హీరో ప్రభాస్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లోని 'సలార్'లోని తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'సలార్: శౌర్యాంగ పర్వం' రానుంది.

పుష్పగాడి రూల్

'పుష్ప' సినిమాలో సిండికేట్ రూల్స్‌ను దాటి హెడ్ అయ్యాడు పుష్పరాజ్. మరి.. సిండికేట్ మెంబర్స్‌కు పుష్పరాజ్ ఎలాంటి రూల్స్ పాస్ చేశాడు? ఈ రూల్స్‌ను ఎవరైనా బ్రేక్ చేయాలనుకుంటే పుష్పరాజ్ ఏం చేసాడనేది 'పుష్ప: ది రూల్' చిత్రంలో చూడొచ్చు. పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ నటిస్తున్నారు. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌లు నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న రిలీజ్ కానుంది. 'పుష్ప: ది రైజ్'కు సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్' రూపొందుతోంది.

డబుల్ ఇస్మార్ట్

కిరాయి రౌడీ ఇస్మార్ట్ శంకర్‌కు సీబీఐ ఆఫీసర్ అరుణ్ మెమొరీని సైంటిఫిక్‌గా ఇంజెక్ట్ చేసి, చిప్ పెడితే ఏం జరుగుతుంది? అనేది 'ఇస్మార్ట్ శంకర్' సినిమా కథ. ఈ చిత్రానికి పూరి జగన్నాథ్ దర్శకుడు. రామ్ టైటిల్ రోల్ చేయగా, సీబీఐ ఆఫీసర్ అరుణ్‌గా సత్యదేవ్ నటించారు. 2019లో విడుదలైన 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' చేస్తున్నారు రామ్, పూరి. కాగా అరుణ్ జ్ఞాపకశక్తి పూర్తిగా శంకర్‌కు వచ్చేస్తే ఏం జరుగుతుంది? ఓ కిరాయి రౌడీ సీబీఐ ఆఫీసర్ అయితే ఏం చేస్తాడు? శంకర్ నిజంగానే గతం మర్చిపోతాడా? ఈ ప్రశ్నలకు సమాధానం మార్చి 18న రిలీజయ్యే 'డబుల్ ఇస్మార్ట్' చూస్తే తెలుస్తుంది.

'బింబిసార 2', 'డెవిల్ 2' ఉంటాయన్నట్లుగా కల్యాణ్ రామ్ పేర్కొన్నారు. 'మ్యాడ్ 2' మత్తు వదలరా 2' చిత్రాల స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. 'హను-మాన్'కు సీక్వెల్‌గా 'జై హను-మాన్'ను ప్రశాంత్ వర్మ ప్రకటించారు. 'రాక్షసుడు 2'ని దర్శకుడు రమేశ్ వర్మ అఫీషియల్‌గా ప్రకటించారు. ఇంకొన్ని సీక్వెల్ చిత్రాలున్నాయి.

యాత్ర 2

ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జీవితంలోని కొన్ని ఘటనలు, ఆయన పాద యాత్ర నేపథ్యంలో రూపొందిన హిట్ ఫిల్మ్ 'యాత్ర'. మహి వి. రాఘవ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. తాజాగా 'యాత్ర' సినిమాకు సీక్వెల్‌గా 'యాత్ర 2' తెరకెక్కించారు మహి వి. రాఘవ్. వైఎస్ రాజశేఖర రెడ్డి తనయుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా నేతగా ఎదిగిన తీరు, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనల ఆధారంగా 'యాత్ర 2' రూపొందింది. ఈ చిత్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి పాత్రలో మమ్ముట్టి నటించగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో తమిళ నటుడు జీవా నటించారు. శివ మేక నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదల కానుంది.

రెట్టింపు వినోదం

డీజే టిల్లుగానితో ఎట్లుంటదో 'డీజే టిల్లు' సినిమాలో చూశారు ఆడియన్స్. 2022లో విడుదలైన ఈ సినిమా బంపర్ హిట్ సాధించింది. దీంతో ఈ సినిమాకు సీక్వెల్‌గా 'డీజే టిల్లు స్క్వేర్' రానుంది. 'డీజే టిల్లు'లో టైటిల్ రోల్‌ని సిద్ధు జొన్నలగడ్డ చేయగా, విమల్ కృష్ణ దర్శకత్వం వహించారు. సీక్వెల్‌లో సిద్ధూనే హీరో. అయితే మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదల కావాల్సింది. కానీ వాయిదా పడిందని తెలుస్తోంది.

గూఢచారి 2

ఏజెంట్ గోపీ 116 అనగానే తెలుగు ప్రేక్షకులకు అడివి శేష్ స్పై థ్రిల్లర్ 'గూఢచారి' సినిమా గుర్తుకు వస్తుంది. 2018లో విడుదలైన ఈ సినిమా బంపర్ హిట్. శశికిరణ్ తిక్క దర్శకుడు. ప్రస్తుతం 'గూఢచారి 2'తో బిజీగా ఉన్నారు అడివి శేష్. వినయ్ కుమార్ ఈ సినిమాకు దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తున్న 'గూఢచారి 2' ఈ ఏడాది చివర్లో విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

రీల్స్

విశ్వనేత



- అభయ్ డియోల్

భారత ప్రధాని నరేంద్ర మోదీ జీవితం ఆధారంగా 'విశ్వనేత' చిత్రం తెరకెక్కనుంది. అభయ్ డియోల్ టైటిల్ రోల్‌లో నీనా గుప్తా, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి ముఖ్య పాత్రలు చేయనున్నారు. ''ఆర్టికల్ 370 రద్దు, డిమానిటైజేషన్, జీఎస్‌టీ, రామమందిర నిర్మాణాలతో భారతీయుల గుండెల్లో కొలువు దీరారు నరేంద్ర మోది. చాయ్‌వాలా నుంచి విశ్వనేతగా ఎదిగిన ఆయన జీవిత ప్రస్థానానికి దృశ్యరూపం ఇవ్వనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. సీహెచ్ క్రాంతికుమార్ దర్శకత్వంలో కాశీరెడ్డి శరత్‌రెడ్డి నిర్మించనున్న ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి.

మస్తు షేడ్స్ ఉన్నాయ్



- అభినవ్ గోమఠం

'ఈ నగరానికి ఏమైంది, ఫలక్‌నుమా దాస్, మీకు మాత్రమే చెబుతా' తదితర చిత్రాలతో కామెడీ, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు అభినవ్ గోమఠం. అభినవ్ హీరోగా తొలి చిత్రం 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా' చిత్రం రూపొందుతోంది. తిరుపతి రావు ఇండ్ల దర్శకత్వంలో భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్ .వి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''అభినవ్ గోమఠంలోని కొత్త కోణాన్ని ఈ చిత్రంలో చూస్తారు. అన్ని భావోద్వేగాలతో లవ్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాను. ఫిబ్రవరి ద్వితీయార్థంలో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు తిరుపతి రావు. 'పొలిమేర-2' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసిన నిర్మాత, పంపిణీదారుడు వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

హను-మాన్‌లో అదే పెద్ద సవాల్



- ఉదయ్ కృష్ణ

ఆంజనేయుడు భూమి నుంచి ఆకాశానికి ఎదిగే సీన్ 'హను-మాన్'లో మేజర్ హైలైట్. క్లైమాక్స్‌లో వచ్చే ఈ సీన్ ప్రేక్షకుల ఒళ్లు పులకరించేలా చేస్తుంది. విజువల్ ఎఫెక్ట్స్‌తో మేజిక్ చేసిన ఇలాంటి సన్నివేశాలు ఈ చిత్రంలో చాలానే ఉన్నాయి. అయితే క్లైమాక్స్‌లో భూమ్యాకాశాలకు విస్తరించే హనుమాన్‌కు జీవం పోయడం ఈ చిత్రం పరంగా తాను ఫేస్ చేసిన పెద్ద సవాల్ అంటున్నారు వీఎఫ్ఎక్స్ నిపుణుడు ఉదయ్ కృష్ణ. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన చిత్రం 'హను-మాన్'. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ చిత్రం ఇప్పటికి రూ. 200 కోట్ల గ్రాస్‌ని రాబట్టింది. ఈ చిత్రానికి వీఎఫ్ఎక్స్ చేసిన ఉదయ్ కృష్ణ మాట్లాడుతూ – ''విజువల్ ఎఫెక్ట్స్‌లో దాదాపు 25 ఏళ్ల అనుభవం ఉన్న నాకు 'హను-మాన్' చిత్రం చేసే చాన్స్ రావడం పూర్వజన్మ సుకృతం. వీఎఫ్ఎక్స్‌ని అద్భుతంగా వినియోగించుకునే ప్రతిభ ప్రశాంత్ వర్మలో ఉంది. ఎన్నో ప్రతికూలతలు, పరిమిత వనరులతో ఈ సినిమా చేశాం. ఈ సినిమా విజయం మా కష్టం మరచిపోయేలా చేసింది. వీఎఫ్ఎక్స్ నిపుణుడిగా అంతర్జాతీయ ప్రమాణాలతో హైదరాబాద్‌లో ఓ సంస్థను నెలకొల్పాలన్న నా కలను 'బీస్ట్ బెల్స్'తో నెరవేర్చుకుంటున్నాను'' అన్నారు. 'బాహుబలి'కి సంబంధించిన కొంత వీఎఫ్ఎక్స్ వర్క్ చేశానని, హిందీలో 'జోథా అక్బర్', 'పద్మావత్' వంటి చిత్రాలు, త్రీడీ యానిమేషన్ ఫిల్మ్ 'అర్జున్: ది వారియర్ ప్రిన్స్', పూర్తి స్థాయి వీఎఫ్ఎక్స్ మూవీ 'అల్లాదీన్' వంటివి చేశానని ఉదయ్‌కృష్ణ తెలిపారు.

వినోదాల బాలరాజు



- మేఘా లేఖ, సోహైల్

సోహైల్ టైటిల్ రోల్ చేసిన సినిమా 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో ఎండీ పాషా నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 2న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సోహైల్ మాట్లాడుతూ– ''నేను షార్ట్‌ఫిల్మ్ నుంచి ఒక్కో మెట్టు ఎదుగుతూ ఈ స్థాయికి వచ్చాను. హీరో వెంకటేశ్‌గారికి మా సినిమా గురించి మెసేజ్ చేశాను. ఆల్ ది బెస్ట్ చెబుతూ, వాయిస్ మెసేజ్ పంపారు. అంత పెద్ద హీరో రిప్లయ్ ఇవ్వడం ధైర్యాన్నిచ్చింది. నాలాంటి యంగ్ స్టర్స్ ఇలాంటి సపోర్ట్ ఆశిస్తారు. పాషాగారు హార్డ్‌వర్క్ చేసి, ఈ సినిమా తీశారు'' అన్నారు. ''వినోదాత్మక చిత్రమిది'' అన్నారు శ్రీ కోనేటి.